భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

సెప్టెంబరు 1956

సంపుటము 33 : : సంచిక 9

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1956

ఆశలు

శ్రీ సి. నారాయణరెడ్డి

ఆశలు మరాళగరుదంచలములై —
అవనిపై జారిపడినట్టి శక్రాప్సరల
అలసిపోవని కటాక్షాంచలములై —
నను ఎగురవేసి వెంటనె క్రిందబడద్రోసె.

పొడమె నొక వింత అనుభూతి; నాతనువెల్ల
యెడదగా రూపొందురీతి.
కడకొక్క విరినైన గాకయే ననునేనె
విడిపోయి పరిమళమునైతి.

దెసల నాసికలందు ప్రసరింతునా, లేక
దివిగుండెలోన గొండిలిసేతునా
కసిదీర అప్సరోగజగామినుల యెదల
మసలి ఉన్మాదాన్ని మండింతునా

అదలింపబడితినే నాశానువర్ణశై
లారోహణము సేయునపుడు.
ఈహాపరాఙ్ముఖుడ నూహాంగనాసఖుడ
నేమందురో చూతునిపుడు.

తొలిమబ్బు రాచకన్నెల కొప్పులూపి రా
త్రిను చుక్కలనెడు మల్లెలను
మెఱపు దొరసానులను వెఱపింతు దోతునని
మేని బంగారు బొల్లెలను.

పారిజాతాంగనల పట్టితెచ్చి పలాశ
వీరులకు పెండ్లిసేయింతు.
పెలమేటి సొగసుకత్తెలు మేరుగిరిపతికి
గిలిగింతలిడ సంతసింతు.

ఆశలను దిగద్రావినట్టి వాడే తావి
యంత స్వేచ్ఛగ ఎగిసిపోవు.
బ్రతుకును పరిమళ ప్రతిగా మలచుకొన్న
వాని కేపరిధులను లేవు.



రష్యా బలం ఏమిటి?

ఆల్‌సాప్ సోదరులు

గత వేసవిలో, టూషినో విమానకేంద్రంలో, సోవియట్ విమాన విన్యాస మహోత్సవం జరిగింది. ఆ తరుణంలో, ఈ రచయితలలో ఒకరు మాస్కోలో వుండి, ఆ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా చూడటం తటస్థించింది ప్రదర్శనం యేర్పాట్లు చాలా ఆటోపంగానూ, పల్లెటిదిక్కు సంతలాగా వినోదకరంగానూ వున్నా, సోవియెట్ 'మీడియం రేంజి', 'లాంగ్ రేంజి' జెట్ బాంబర్లూ, పెద్ద పెద్ద 'బాడ్జర్ విమానాలూ' 'బైసన్ విమానాలు' సంరంభంగా గగనపథాన సంభ్రమించుకున్నా, ఆ విన్యాసాలు మాత్రం ఏమంత చెప్పుకోదగ్గవిగా లేవు. 'బాడ్జర్లూ' 'బైసన్‌లూ' మొదలైన ఈ బృహద్యంత్రాలు ప్రజల నెత్తిమీద గగనపథాన రొంకుతున్నప్పుడు, అమెరికా రాయబారవర్గంలోని సైనికశాఖ ఉద్యోగి ఒకరికి, ఒక విచిత్రమైన సర్దా కలిగింది. చేతిలో ఉన్న దుర్భిణిని సోవియట్ అగ్రనాయకులున్న వేదిక వైపు తిప్పి వారి చర్యలు గమనించాడు. క్రుశ్చేవ్, బుల్గానిన్, మొదలైన ప్రముఖులంతా ఆ వేదికమీద వున్నారు ఆ దుర్భిణిలో కనుపించిన రంగం, చాలా చిత్రమైంది ఫ్రాన్సు పతనమై పోయిందన్న ఆనందోత్సాహంలో హిట్లర్ ప్రదర్శించిన ఆనందతాండవం ఛాయాచిత్రాన్ని మీరు చూసే వుంటారు ఆ చిత్రం ఎలాటి అభిప్రాయాలను మనకు కలిగించుకుందో దుర్భిణిలో ఆ తరుణలో ద్యోతమానమైన ఆ రంగం అదే అభిప్రాయాన్ని రేకెత్తించుతుంది. ఆ కొత్తరకం బాంబర్లు అలా ఒక్కసారి పైన ఎగిరేసరికి, ఇక అగ్రనాయకులు ఆ మహానందాన్ని అణచుకోలేకపోయారు. చిరునవ్వుల చిద్విలాసాలతో వారి ముఖాలు మెలికలు తిరిగిపోతున్నాయి ఆనందావేశవివశుడై పోయిన క్రుశ్చేవ్, ఒక్కొక్క విమానం అలా ఎగిరినప్పుడల్లా, ఒక్కొక్క ఎగిరెగిరి కల్లోలమైపోతున్నారు ఆయన కంటే నిగ్రహంగల ఆయన సహచరులుకూడా ఉల్లాసంగా ఒకరితో ఒకరు కరచాలనం చేస్తూ, ఒకరి వీపు ఒకరు తట్టి పరస్పరం అభినందించుకుంటూ పట్టపగ్గాలు లేకుండా వున్నారు

బహిరంగంగా కాకపోయినా నిగూఢంగానూ తీవ్రతరంగానూ సాగుతున్న ద్వంద్వంలో, అమెరికాను ఓడించివేశామనే తమ ఆనందాన్ని సోవియట్ అగ్రనాయకులు ఇలా బడిపిల్లల తంతులో ప్రదర్శించారు.

అసలు ఈ ద్వంద్వం యెప్పుడు ప్రారంభమైంది? జపానుమీద తుదియుద్ధం జరుగుతున్న తరుణంలో అమెరికా బి-29 రకం విమానమొకటి త్రోవతప్పి, తప్పనిసరై, సైబీరియాలో దిగిపోవలసి వచ్చింది. దాన్ని చూసి రష్యావాళ్ళు ఒక నమూనా తయారు చేసుకున్నారు. అమెరికా అంతవరకూ విమాననిర్మాణంలో ఎంతో త్వరితగతిని ముందుకుగా పురోగమించుతోంది. రష్యా, ప్రథమదశలో, ఈ పోటీని అధిగమించింది. అనంతరదశలో, ఖండాంతరాలకు మహాయానం చేయగల భారీరకం జెట్ బాంబర్ల నిర్మాణానికి ఉపక్రమించి ఈ 'బైసన్' విమానాన్ని రూపొందించింది. వాటితో సరిపోల్చదగిన అమెరికన్ బి-52 విమానాన్ని రూపొందించడానికి అమెరికా వ్యయం చేసిన కాలంలో సగంకాలంకూడా అక్కర్లేకుండానే అమెరికా దీన్ని నిర్మాణం చేసింది. ఇప్పుడు అమెరికా బి-52 విమానాలను ఏ అవధిని ఉత్పత్తి చేస్తున్నదో అంతకు మూడురెట్లు రష్యా "బైసన్" ఉత్పత్తులు సాగుతున్నయ్. నెలకు 17 బి-52 లను తయారుచేసే ఆదర్శస్థాయిని అందుకోవటానికి అమెరికా ప్రయత్నించుచున్నది. రష్యా నెలకు 20 బైసన్‌లను తయారు చేసే స్థాయిని అందుకోవటానికి ప్రయత్నించుచున్నది అమెరికా తన ఆదర్శాన్ని అందుకోగలగటానికి ఎంతో ముందుగానే రష్యా తన ఆదర్శాన్ని అందుకోబోతున్నది. క్రుశ్చేవ్

ఆనందంతో చిందులు త్రొక్కడంటే ఆశ్చర్యపడ వలసిందేమీ లేదు.

ఈ జెట్ విమానాల ఉత్పత్తిలో అమెరికా పురోగతిని త్రోసిరాజనట మొక్కటేగాదు. ఈ మహాయంత్రాల నిర్మాణం మరొక మహత్తర విషయాన్ని కూడా వ్యక్తం చేస్తున్నది సోవియట్ యుద్ధ పరిశ్రమ, అత్యంత నవీనమైన ఒక మహాశక్తిగా పరిణామం చెందిందనే విషయం విస్పష్టమైపోతోంది.

సోవియట్ యుద్ధ పరిశ్రమ యిలాంటి మహాశక్తిగా ఎలా రూపొందింది అనే విషయాన్నే ఈ వ్యాసంలో వివేచన చేస్తున్నాం. ఇది సర్వులూ తీక్షణం పరిగణింపతగిన సమస్య కావటమేగాక అనేక విభ్రాంతులు కలుగటానికి సావకాశంగా వుంది. పశ్చిమదేశాలవారందరికి ఇది ఎలా సాధ్యమైందా అని ఆశ్చర్యంగా వుంది. ఈ ఆశ్చర్యాన్నే, ఆనాడు టూషినోలో వున్న అమెరికా రాయబారవర్గ యుద్ధ శాఖకు చెందిన మరొక పెద్దమనిషి ఇలా వెల్లడించారు:

'అత్తేరీ! పింగాణీ బొచ్చెలు కూడా తయారు చేసుకోటం చేతగానివాళ్లు ఈ బైసన్లెలా తయారు చేశారు!'—

'నిజానికి రష్యా జనానికి సరియైన పింగాణీ బొచ్చెలుకూడా లేవన్నమాట వాస్తవమే. ఈరకం వస్తువుల అభావంవల్ల వాళ్ళ జీవనస్థితి ఎంతకనిష్ఠ ప్రమాణంలో వుందో మనకు బోధపడుతుంది. రష్యాప్రజల జీవనప్రమాణం కనిష్ఠావధిలో వున్నదనే విషయం జగమెరిగిన విషయం. ఉదాహరణకు: గత 25 సంవత్సరాల యీమధ్య రష్యన్లు గరిష్ఠ సుఖశాంతులనుభవించిన సంవత్సరం 1955. అయినా ఆ సంవత్సరంలో కూడా రష్యాపౌరుని జీవనభృతి, అమెరికన్ పౌరుని జీవనభృతిలో అయిదోవంతుకూడా లేదు.

పశ్చిమరాజ్యాల ప్రజల జీవనప్రమాణానికి రష్యాప్రజల జీవనప్రమాణానికి వున్న ఈ వ్యత్యాసాన్ని గమనించే, ఊహాగానంచేసే పశ్చిమరాజ్యాలవారు కొందరు, రష్యా ఇలాగే సర్వరంగాల్లోనూ చాలా బలహీనంగా వున్నదని అపోహపడుతున్నారు. ఈ కారణంచేతనే రష్యా అణువుబాంబు తయారు చేయటం మొదలుగా అడుగడుగునా విభ్రాంతులవుతున్నారు.

నిజానికి రష్యాప్రజానీకం అంత దరిద్రస్థితిలో వున్నారు కాబట్టే సోవియట్ ప్రభుత్వం ఇంతబలంగా వుంది.

సోవియట్ ప్రభుత్వం ఒక బ్రహ్మాండమైన పారిశ్రామిక వ్యవస్థ ఇదీ అదీ అని లేకుండా అది సర్వ వస్తువులనూ ఉత్పత్తి చేస్తుంది. ఏ విషయానికీ యితరులమీద ఆధారపడేది లేదు కార్మికసంఘాలకు కావలసిన ఆహారపదార్థాలను సహితం తానే ఉత్పత్తిచేసి నిలువ చేస్తుంది. ఇవన్నీ చేస్తున్నమాట నిజమే, కాని జాతీయసైనికశక్తిని పెంపొందచేయగల యుద్ధసామగ్రిని తయారుచేయటం దాని ప్రధానాశయం 'జనరల్ మోటార్స్' కంపెనీకి 'బ్యూయిక్స్' "చివర్లెట్లు" "కాడిలాక్స్" తయారుచేయటం ఎలా ప్రధానాశయమో, బైసన్, బాడ్జర్ జట్ బాంబర్లు తయారుచేయటం సోవియట్ యూనియన్‌కు అలాంటి ప్రధానాశయం

"సోవియట్ యూనియన్ కంపెనీ లిమిటెడ్" యజమానులు, ప్రతిభావంతులేకాక, దాక్షిణ్య రహితులు. సోవియట్‌కు వున్న కార్మిక సందోహం అనంతమైంది. వారి క్రమశిక్షణ తీవ్రతరమైంది. అందుచేత సమ్మెలు వగైరాల ఆలోచనకే ఆస్కారంలేదు. ముడి సరుకులు పుష్కలంగా వున్నాయి ఇప్పటికే దాని పారిశ్రామిక కర్మాగారం విస్తృతతరమైంది. అయినా సోవియట్ యజమానులు దీన్ని యింకా బ్రహ్మాండ వ్యాపిగా తయారుచెయ్యటానికి బద్ధకంకణులై వున్నారు. ప్రపంచంలో తమకు పోటీఅంటూ లేకుండా పోయే అవధిని అందుకునేవరకూ వీరు ఇలా పారిశ్రామికరంగాన్ని పెంచుకుపోతూనే వుంటారు. ఈ పారిశ్రామికాభివృద్ధికి కావలసిన పెట్టుబడిని ఎవరి దగ్గిరా అప్పుతెచ్చి యిబ్బందులలో చిక్కుకోరు. ఈ పెట్టుబడిని సేకరించటానికి, యితరులు యాజమాన్యంలో జోక్యం కలుగజేసుకునేందుకు ఆస్కారంగా కంపెనీ వాటాలను యితరులకు అమ్మరు. బలవంతాన ప్రజల నందరిని దరిద్రస్థితిలో వుంచేసి కావలసిన పెట్టుబడినంతా సేకరిస్తారు

పెట్టుబడిని సేకరించటానికి యీ కంపెనీకి తేలిక మార్గాలున్నాయి. కార్మికుల కూలీని తగ్గించివేయటం, వారి కుటుంబవ్యయాన్ని పరిమితం చెయ్యటం ఇత్యాది చర్యలతో నిర్వహణ వ్యయాన్ని నేలమట్టానికి తగ్గించి

వేయవచ్చు. కార్మిక సంఘాలకు అందజేసే పదార్థాలధరలను రెట్టింపు చేయవచ్చు. కార్మికుల వినిమయానికి ఖర్చు చేసే సాలుసరి వ్యయపట్టీలో మరికొంత కర్తనం చేయవచ్చు. ఈ చర్యల ద్వారా పనివాళ్ల భాగాలకు లోనైనా, ఈ "సోవియట్ కంపెనీ" తన అభివృద్ధి పథకాలకు కావలసిన ధనాన్నంతా సేకరించుకూ వుండగలదు

సోవియట్ పారిశ్రామికవ్యవస్థ సాగుతున్న యీ పద్ధతిని దృష్టిపథంలో వుంచుకుంటే సోవియట్ ఆర్థిక వ్యవస్థయొక్క పరిస్థితియావత్తూ మనకు తేట తెల్లమౌతుంది. మన పశ్చిమ రాజ్యాలవారు, ఉత్పత్తులను లెక్క వేసేటప్పుడు వెయ్యి పౌనుల విలువగల ఉక్కుకూ, వెయ్యి పౌనుల విలువగల ముఖంమెరుగు డబ్బాలకూ, వెయ్యి పౌనుల విలువగల పెట్రోలుకూ వెయ్యి పౌనుల విలువగల అలీవునూనెకూ, వెయ్యి పౌనుల విలువగల విమానాలకూ, వెయ్యి పౌనుల విలువగల గ్రామీణవసతి నిర్మాణాలకూ ఒకే ప్రాధాన్యత నిస్తారు. ఇటీవల ఎన్‌కౌంటర్ పత్రికలో జరిగిన వాదప్రతివాదాలలో, కాలిన్ క్లార్కు, విమానాల ఉత్పత్తికంటే గృహవసతుల నిర్మాణానికే యెక్కువ ప్రాధాన్యతవుండాలని వాదించారు. ఆయన ప్రత్యర్థి పీటర్ వైల్సు కూడా యీ వాదాన్ని సవాలు చేయలేరు. సోవియట్ ఆర్థికాభివృద్ధిని గోరంతలు కొండంతలు చేసి చెబుతున్నారని క్లార్కు నిసితంగా విమర్శించిన అమెరికన్ ప్రవీణులు కూడా యిదే పద్ధతిని లెక్కలు కట్టి మాట్లాడుతూ వుంటారు.

కాని పైన వివరించిన పరిస్థితులు దృష్టిలో వుంచుకుని ఆలోచించితే సోవియట్ పారిశ్రామిక వృద్ధి ఫలితాలు ప్రజల స్థితిగతులమీద ఆధారపడి వుండలేదని విస్పష్టంగా తేలుతోంది. అందుచేత ప్రజల స్థితిగతులను దృష్టిలో వుంచుకుని సోవియట్ పరిశ్రమను గురించి ఆలోచించితే ఎట్టి ప్రయోజనమూ వుండదు. జీవనపరిస్థితులు బాగాలేవని కార్మికులు యజమానులకు ఎదురుతిరగటంగాని, బైఠాయింపు సమ్మెలు చేయటంగాని, యితరత్రా ఉత్పత్తి కార్యక్రమాలకు విఘాతం కలిగించి యజమానులకు కనువిప్పు కలిగించటానికి గాని అక్కడ అవకాశం లేదు. ఉదాహరణకు ఫిరంగులు తయారుచేసే ఉత్పత్తిదారు కార్మికుల వేతనాలు సగానికి తగ్గించి పరిశ్రమను రెట్టింపు పెద్దది చేశాననుకోండి. ఈ అభివృద్ధి విధానాన్ని క్లార్కు వంటివారు కంటగించుకున్నా, ఉత్పత్తులు నాటికి నూరుపాళ్లు పెరుగుతాయనే విషయాన్ని మటుకు కాదనలేరు.

సోవియట్ యూనియన్ పరిస్థితులను గురించి అందుతున్న భోగట్టా పైన మేము వివరించిన విషయం యథార్థమని రూఢి చేస్తున్నది. కార్మికుల దైనందిన వినిమయంకోసం కార్మిక సంఘాలకు సరఫరా చేసే సరుకులమీద నాటికి 60 వంతుల చొప్పున ఉత్పత్తి పన్నును విధించుకున్నారు. విచిత్రమైన ఈ ఉత్పత్తి పన్ను ద్వారా, సాలుసరి కార్మిక వేతనాల ఖర్చు పట్టీలో అధికభాగం తిరిగి రాబట్టుకుంటున్నారు. ఇంతే గాదు; ఈ రకం పరోక్షమైన ఆదాయపు పన్ను మూలంగా ప్రత్యక్షాదాయపు పన్నును 19వ శతాబ్దపు స్థాయిలో అలాగే వుంచేసి పెద్ద జీతాలందీసే పారిశ్రామిక నిర్వాహకవర్గానికి ప్రోత్సాహ మిస్తున్నారు

ఇంకా యీ విధానంలో వుండే లోటుపాటులన్నీ మాకు సమగ్రంగా తెలుసునని చెప్పటానికి సందేహంగానే వుంది. కారణం ఏమిటంటే, మేము రష్యా విషయాన్నంతా ఎరిగిన విజ్ఞానవేత్తలం గాని, ఆరితేరిన ఆర్థికశాస్త్రవేత్తలం గాని కాము; సామాన్య రాజకీయ పరిశీలకులం; చరిత్రలోని ఉల్లేఖించే చరిత్రకారులలో కూడా చెయ్యితిరిగిన వాళ్లంకాము. కాని మాకు లభించిన వివరాలనుబట్టి, తన సైనికశక్తిని పెంపొందచేసుకోవటానికి సోవియట్ ప్రభుత్వం అనుసరించుతున్న ఈ పెట్టుబడిసేకరణ విధానం నగ్గిపన్నులా పైకి విస్పష్టంగానూ అసహ్యంగానూ కూడా కనుపించుతోంది. అత్యంత కనిష్ఠప్రమాణంలో వున్న సోవియట్ పౌరుని జీవనప్రమాణానికీ, సోవియట్ యుద్ధపరిశ్రమయొక్క తీవ్రాభివృద్ధికీ ఎట్టి సంబంధమూ కనుపించటం లేదు. ఈ సర్వతోముఖాభివృద్ధికి కేంద్రీకృత ప్రణాళికా నిర్వహణ కొంత కారణమనే విషయం నిజమే. రష్యాకుగల ఖనిజసంపదా, యుక్తి పనుల బాహుళ్యం కూడా లెక్కలోకి తీసుకోదగ్గవే. కాని వీటన్నిటినీమించి మాకు విస్పష్టంగా కనుపించుతున్నది రష్యన్ ప్రజల కనిష్ఠ జీవనప్రమాణం. ఇది ఒక కారణమాత్రమే కాదు మాకు లభించుతున్న వివరాలనుబట్టి ప్రధానకారణంగా కనుపించుతున్నది. అయితే ఆ వివరాలేవిటి?

స్టాలిన్ నూతన పారిశ్రామిక విధానానికి ఉపక్రమించి, 1928 లో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టటంతో అసలు ఈ 'ఆర్థిక విజయచరిత్ర' అంటూ ఒకటి ప్రారంభమైంది. అదృష్టవశాత్తూ, అప్పటికే, విప్లవంతో ప్రారంభమయిన పోరు పంతన్నరాలు అంతమయినాయి ఈ నూతన ఆర్థిక విధానం ప్రజల జీవనస్థితిని, చెప్పుకోదగినంత కాకపోయినా భరించటానికి తగిన అవధికి తేగలిగింది. కాని యీ నూతనవిధానంవల్ల పారిశ్రామికరంగంలో పెద్దఅభివృద్ధి కనుపించలేదు. 1928 లో కూడా పారిశ్రామికోత్పత్తులు 1913 జార్ ప్రభుత్వ దినాల అవధికి వెనకలగానే వున్నాయి అందుచేత ప్రథమ పంచవర్ష ప్రణాళిక అమలు జరుపవలసి వచ్చింది. దాంతో ప్రజల జీవన ప్రమాణం అర్థాంతం దిగజారిపోయింది.

ఈ దారిద్ర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ సహింపచేట్లు చేయటానికి సోవియట్ ప్రభుత్వం ప్రజలమీద ఇంచుమించు ప్రత్యక్షయుద్ధాన్నే ప్రకటించవలసి వచ్చింది. ప్రాచీన కాలంలో స్పార్టన్ అధికారులు వ్యవసాయ బానిసలమీద ఎలా వార్షికంగా దాడులు జరిపేవారో ఆ పద్ధతి అమలు జరిపారు. రైతుల హత్యలతో ప్రారంభమైన సమష్టి వ్యవసాయోద్యమం, ఈ విధంగా, జాతీయ వ్యవసాయోత్పత్తుల్లో అధిక భాగం బంజి ప్రభుత్వ పెట్టుబడులను సేకరించటానికి ఉద్దేశించి కావాలని బలవంతాన అమలు జరిపింది. ఈ విధానం ద్వారానూ, ఇతర త్రోవనూ కూడా ఎక్కువ భాగం సంక్రమింప జేసుకున్న కారణంగా ప్రజలకు మిగిలేది బహు స్వల్పమైపోయింది.

ప్రభుత్వం ప్రజలమీద సాగించిన ఈ యుద్ధకాలంలో ఎందరో నశించిపోయారు. ఆర్థికంగా జరిగిన దుబారా కూడా ఇంతింత కాదు. దుబారా జరిగితే ఆ అనర్థాన్ని ప్రజలు భరించారు. కాని ప్రభుత్వం ఆ యుద్ధంలో విజయం సాధించింది. పంచవర్ష ప్రణాళికల పరంపరలో ఉద్దేశించిన పారిశ్రామిక యుద్ధశకటులు రెండూ, ద్వితీయ ప్రపంచ యుద్ధ ప్రారంభంవరకూ (1938-39) నిరాటంకంగా సాగిపోయినై. మొరటుగా వున్నా రాక్షసాకృతి సంపాదించిన ఈ పరిశ్రమలు చాలా తేలికగా యుద్ధావసరాలను తీర్చగలిగాయి. తుపాకులూ, ఫిరంగులూ, టాంకులూ ఇతర ఆయుధసామగ్రీ కోట్లకొల్లలుగా తయారుచేసి పోశారు. యుద్ధకాలం మొత్తంమీద అమెరికా బ్రిటన్ దేశాలు రెండూ కలిసి ఎంత మందుగుండు సామగ్రిని తయారు చేయగలిగాయో అంత మొత్తం మందుగుండుసామగ్రిని ఎర్రసైన్యం ఒక్క జర్మనీ మీదనే ప్రయోగించింది. హిట్లరు పతనంతో అక్కడి కథ ఆగలేదు. అనంతరదశలో కూడా రష్యా నాయకులు, ఇదే విధానాన్ని అనుసరించి, ఇంకా తీవ్రతరమైన పద్ధతిలో ఈ పారిశ్రామికాభివృద్ధిని నేటివరకూ సాగించుతూ వచ్చారు; సాగించుకుపోతున్నారు.

ఈ సైనిక పారిశ్రామికశక్తులను అభివృద్ధి చేయటానికి తన ప్రజలమీద అలా దాడిచేయవలసి వస్తుందని స్టాలిన్ మొదట ఊహించగలిగాడో లేదో మనకు తెలియదు. కేవలం "బోల్షివిక్ ప్రణాళికా రచనతోనూ, బోల్షివిక్ సాహసోత్సాహాల"తోనూ, ఈ కార్యాన్ని సాధించవచ్చునని ఆయన అనుకుని ఉండవచ్చు. రాజకీయరంగంలో ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క కొత్త విధానం పుట్టుకు రావటముంటే, ఒక్కొక్క బుర్రలో కార్యకారణజ్ఞానానికి అతీతమైన సహజజ్ఞానంగా అలా ఒక్కొక్క భావం హఠాత్తుగా పుట్టుకువస్తూ వుంటుంది.

ఇలాంటి సహజజ్ఞానంతో కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చినవారిని అందుకు అభినందించి తీరవలసి ఉంటుంది మనమిప్పుడు పరిశీలన చేస్తున్నది సోవియట్ సైనికసూత్రాల విషయం కాదనీ, సోవియట్ యుద్ధశక్తి విషయం అని అంగీకరించినట్లయితే— "ప్రజల దారిద్ర్యాన్ని ప్రభుత్వశక్తిగా పరిణమింపచేయవచ్చు" అనే అత్యద్భుతమైన రాజకీయమంత్రాన్ని ప్రవచించిన మహాప్రవక్తగా స్టాలిన్ను మనం అభినందించితీరవలసివుంది.

స్టాలిన్ ఈ మహామంత్రాన్ని బహిరంగంగా వెల్లడించకపోయినా, యుద్ధానంతరవిధానాన్ని వ్యక్తంచేస్తూ 1946 లో ఆయన చేసిన చారిత్రాత్మక ప్రసంగం ఈ విషయాన్ని సుస్పష్టంగా వెల్లడించుతూనే ఉంది. ఒకవైపు రష్యన్ ప్రజలు అప్పటికి ఇంచుమించు ఆకలితో అలమటించే పరిస్థితిలో వున్నా, స్టాలిన్ ఆ విషయాన్ని ఖాతరు చెయ్యలేదు. ప్రజల స్థితిగతులను బాగుచెయ్యటానికి ఉపకరించే కార్యక్రమానికి కాకుండా, రష్యాకున్న అవకాశాల నన్నిటినీ, తిరిగి యుద్ధపరిశ్రమల శక్తిని ముమ్మరంగా అభివృద్ధి చెయ్యటానికి ఉపయోగించాలని ఆదేశించాడు. ఒక్క పంచవర్ష ప్రణాళికకు కాదు— వరుసని మూడు పంచవర్ష ప్రణాళికలకు ఉత్పత్తి లక్ష్యాలు నిర్ణయించబడినై. ఆ లక్ష్యాలను అందుకోగల స్థాయికి వచ్చేవరకూ ప్రజల జీవనప్రమాణాన్ని యుద్ధం పరిసమాప్తమైన నాటిస్థితిలోనే ఉంచివేశారు.

రష్యా పరిపాలకులు లక్ష్యశూన్యంగా ప్రవర్తించే ఉన్మాదులుగారు. స్టాలిన్ చివరిదశలో దౌర్జన్యంకోసం దౌర్జన్యం అనే ఉన్మాదస్థితిగా వ్యవహరించి వుండవచ్చు. కాని అతనుకూడా రష్యన్ ప్రజలను అంతకాలం దారిద్ర్యంలో అట్టిపెట్టింది కేవలం లక్ష్యశూన్యమైన కసిచేతగాని ఉన్మాదంచేతగాని కాదు. రష్యా మొత్తం ఉత్పత్తులు త్వరితగతిని అభివృద్ధి చెందినకొద్దీ ప్రజల జీవనప్రమాణాన్ని కూడా క్రమేపీ వృద్ధిచేశారు. జీవనప్రమాణాన్ని పెంచటమంటే మొత్తం ఉత్పత్తులు ఏ శాతంలో పెరిగాయో ఆ శాతంలో పెంచటంగాదు. ఉత్పత్తులు ఎంత పెరిగినా దాంతో నిమిత్తం లేకుండా, అందులో ఏదో స్వల్పభాగం తీసి ప్రజలకు పంచారు. మామూలుకన్నా ఏదో మరికొంత లభించిందన్న సంతృప్తి కార్మికులకు కూడా ఏర్పడ్డది. ఈ సంతృప్తిని రష్యా పరిపాలకులు చక్కగా వాడుకున్నారు. జనంచేత బండచాకిరీ చేయించటమెలాగో వాళ్లకు బాగా తెలుసు: 'అదనపుపని అదనపు బహుమానం— పని ఎగవేస్తే మక్కెలిరగదీయటం'—నవుడుతీస్తే దాణా

దొరకుతుండిన్న ఆశిపున్న కష్టం మొరాయించి మోటుకంచీ పరాచికాలకిందకు పాల్పడుతుంది.

ఇంతకూ పర్యవసానమేమిటంటే, సోవియట్ యూనియన్‌లో ప్రజాస్థితి 1930 ల దశలోనవలెనూ, యుద్ధానంతర ప్రథమ సంవత్సరాలలోనవలెనూ అంత హీనంగా లేదు. మొరటుతిండైనా పుష్కలంగా దొరుకుతోంది. చలికాలంలో శరీరరక్షణ చేసుకోవటానికి కావలసినంత మాత్రం గుడ్డలు దొరుకుతున్నాయి. తలదాచుకోవటానికి తగిన వసతులు యేర్పడినాయి — నాటి విస్తీర్ణం, బాగా అభివృద్ధి చెందిన అమెరికన్ కైగుగల మేరకు లేకపోయినా. అగ్రవర్గాలు — పరిపాలనాధికారులూ, సైనికాధికారులూ, పారిశ్రామిక నిర్వాహకులూ, శాస్త్రవిజ్ఞానవేత్తలూ, సాంకేతిక నిపుణులూ, విజ్ఞానవేత్తలూ, కార్మిక ప్రోత్సాహకవర్గాలూ, ఈ మొత్తం కోటియండీ, తమ స్థితిగతులు తమకు బాగానే వున్నాయనే ఆత్మవిశ్వాసంతోనే వున్నారు. ఈ వర్గాలను తృప్తిపరచివుంచటం ఆర్థికరంగంలో ఎంతో ప్రయోజనకరం. అందుచేత ఈ వర్గాలకు రిఫ్రిజిరేటర్లు వగైరా విలాసభోగాలు విరివిగా అందజేయబడుతూనే వున్నాయి. ఇంకా మరీ తలకట్లుగా వుండేవారికి కార్లు కలామతోకూడా అందుతున్నాయి

ప్రజాజీవన ప్రమాణంలో స్థూలంగా ఇలాంటి అభివృద్ధి కనుపించుతున్నా, యిది నామమాత్రమైనదే. ప్రభుత్వ పెట్టుబడులకు కావలసిన పెట్టుబడినంతా సేకరించగా మిగిలిన లేశమాత్రం ఇలా ఖర్చు చేస్తున్నారు. అనగా ఇప్పుడుకూడా స్టాలిన్ రూపొందించిన మహా సిద్ధాంతం యెట్టి మార్పూ లేకుండా యథాతథంగా సాగిపోతోంది. నేడు రష్యను పాలించుతున్నవారు కూడా ఇదే పంథాలో దేశాన్ని నడుపుతున్నారు. తినహామాసులో మాలెంకోవు, సైనికపరిశ్రమలకంటే వినిమయవస్తువుల పరిశ్రమలకు యెక్కువ ప్రాధాన్యత వుండాలని వాదించాడు. దాంతోనే అతను తలక్రిందులై క్రుశ్చేవ్‌పై చెయ్యి అయ్యే పావకాశం కలిగింది. ఈ దృష్ట్యా చూస్తే యిటీవల జరిగిన కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెస్ వ్యవహారం ఒక మహా ప్రహసనంలా కనుపించుతుంది. సోవియట్ పారిశ్రామికోత్పత్తులు బాగా పెరిగివుంటటం చేత, పని గంటలను, వారానికి 48 గంటలనుంచి 42 గంటలకు తగ్గించటానికి వీలు కలిగింది. కార్మికోత్సాహాన్ని మారగొనటానికి వీలుగా వున్న ఈ ప్రకటనను చేసే అవకాశం క్రుశ్చేవ్ స్వయంగా అందించుకున్నాడు. పాపం! పరాజితుడైన మాలెంకోవ్ తన పూర్వపు తప్పిదాన్ని సవరించుకుని, 'ప్రజాసౌఖ్యంకంటే ప్రభుత్వ బలానికి ప్రాధాన్యత వుండాలి' అనే నినాదాన్ని స్వయంగా ప్రచారం చేస్తూ వుండవలసిన పరిస్థితికి వచ్చేశాడు.

సోవియట్ జాతీయ ప్రణాళిక ఉత్పత్తులను మూడు భాగాలుగా విభజించుకున్నది. మొదటి భాగం పెట్టుబడి అభివృద్ధులకు వినియోగించుతారు. అంటే స్థూలంగా యంత్రపరిశ్రమల అభివృద్ధి; రెండవ భాగం యుద్ధశక్తిని పెంపొందజేయటానికి వినియోగించుతారు. అంటే దీంట్లో అమెరికా రక్షణ వ్యయంలో వుండే అన్ని అంశాలూ — అణుశక్తి దగ్గర నుంచి ఆర్థిక సహాయందాకా అన్నీ చేరివుంటాయి. మిగతా భుక్తశేషం జనానికి వదులుతున్నారు. ఈ మూడు భాగాలూ యేయే నిష్పత్తిలో వుంటాయనేది వైజ్ఞానిక నిపుణుల వాదప్రతివాదాలకు తేలకుండా వున్న విషయం. తనకున్న అవకాశాలలో పారిశ్రామిక యుద్ధశక్తుల అభివృద్ధికి ఎంత భాగం వినియోగించుతున్నారో ఈ నిపుణులలో చాలామంది సరిగా అంచనా వేయలేకపోతున్నారని మా అభిప్రాయం. అందుచేతనే యీ రంగంలో రష్యా సాధించిన అభివృద్ధిని చూసి వీరు విభ్రాంతులౌతూ వుండటం తటస్థించుతూ వున్నది. అందుచేత బాగా తెలిసినవారి భోగట్టానే మనం సేకరించవలసివుంది. అలాంటివారిలో ఒకరు ఇలా చెబుతున్నారు: సోవియట్ ప్రభుత్వం తన మొత్తం ఆదాయంలో నూటికి 25 వంతులు పారిశ్రామిక పెట్టుబడులకు వినియోగించుతోంది. మరొక 25 వంతులు యుద్ధోత్పత్తులకు ఉపయోగించుతోంది మిగతా 50 వంతులు మాత్రం ప్రజావినియోగానికి ఉపయోగించుకున్నారు. రష్యా సాంకేతిక నిపుణులు ఈ విషయాన్ని విస్పష్టంగా చెబుతూనే వున్నారు. జాతీయాదాయంలో, సోవియట్ ప్రభుత్వం రణపారిశ్రామిక రంగాల పెట్టుబడులకు వినియోగించే భాగం పాశ్చాత్య దేశాలు తమ జాతీయాదాయాలలో ఈ రంగాలకు వినియోగించే భాగంకంటే ఎక్కువ నిష్పత్తిలో వున్నదని చెబుతూనే వున్నారు. ఇంతింత మొత్తాలను ఈ రంగాలకు వినియోగించాలంటే ప్రజల జీవనప్రమాణాన్ని కృత్రిమంగా కనిష్ఠప్రమాణంలో వుంచితే తప్ప సాధ్యం కాదు. ఇల్లా సేకరించిన అంతులేని మొత్తాలను కుప్పచేస్తున్నారు. గనుకనే సోవియట్ యుద్ధ పరిశ్రమ ఇంత త్వరితగతిని ఇట్టి మహాశక్తిగా అభివృద్ధి కాగలిగింది.

[సశేషము.]

ఆత్మలోని అరుణరేఖ

శ్రీమతి ఉన్నవ విజయలక్ష్మి

డిసెంబరు ఆఖరు. కాలేజి సెలవ లిచ్చారు.

సాయంత్రం 'లాన్'లో కూర్చుని పేపర్లు దిద్దుకుంటున్నాను. ఇంతలో రెండో 'పోస్టు' వచ్చింది. ఒకే ఒక కవరు వచ్చింది. బరువుగా వుంది పేపర్లు ప్రక్కకు నెట్టి కవరు చింపాను. విశ్వనాథరావు వ్రాశాడు. నాకు ఉత్తరాలు చదవటంలో వున్న ఓపిక వ్రాయటంలో వుండదు. విశ్వనాథరావు అదో రకం మనిషి. ప్రత్యుత్తరాలకు నిరీక్షించకుండా నే పదేసి పేజీల వుత్తరాలు వ్రాయగలడు. సావకాశంగా చదివాను. అతనీ మధ్య రఘునాథరావు దగ్గరకు వెళ్లాడట. ఆ విశేషాలన్నీ వ్రాశాడు. మేము ముగ్గురం బి యే లో సహాధ్యాయులం. రఘునాథరావు, నేను యం. ఏ. కూడ కలిసే చదివాము ఇంగ్లీషులో యం. ఏ. పూర్తి అయాక రఘునాథరావు 'లా' కూడా చదివాడు. నా జీవితం సగం గడిచిపోయింది' రాఘునాథరావు జీవితంలో ప్రవేశించి రెండేళ్లే అయింది. అతడు చదువు ముగించాక 'సిలోన్' వెళ్లాడు. జాఫ్నాలో ఏదో ఉద్యోగం వచ్చిందంటూ! అందరికీ ఆశ్చర్యం వేసింది. కలవారిబిడ్డ ఉద్యోగాని కని కాలక్షేపం పోయాడేమో అని! ఎంచేతో నాలుగేళ్లయాక తిరిగి వచ్చేశాడు. ఆ తర్వాత నాలుగు నెలలకే అతని పెళ్లయింది ఇప్పుడు కాకినాడలో న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఇదివర కొకసారి వ్రాశాను నన్ను రమ్మని! నాకూ తీరికా, ఓపికా లేకపోయాయి! యీ మధ్య భార్యతోపాటు దేశమంతా తిరిగి వచ్చాడుట. విశ్వనాథరావు వ్రాశాడు. "వాళ్లిదరా! సంసారమంటే! ఎంత అన్యోన్యమను కున్నావు" అని. నవ్వు వచ్చింది. వెళ్లి చూడాలనిపించింది. మరునాడే ప్రయాణమై వెళ్ళాను.

రైలుస్టేషన్నుంచి జట్కాలో వెళ్తున్నాను. దారిలో మెడికల్ షాప్ కనపడింది. గొంతులో ఏదో గరగరగా వుంటే 'లాజెంజెస్' కొనుక్కుందామని దిగి వెళ్ళాను. అక్కడె ఎవరో ఒకమ్మాయి మందులు కొంటోంది సన్నగా, తెల్లగా వుండి చాలా నాజూగ్గా, అందంగా కనపడింది. కట్టు, బొట్టు తీరు చాలా అధునాతనంగా కనుపించింది. బిలు చూసి డబ్బిచ్చేసి వెళ్ళి బైటవున్న కారులోకి ఎక్కింది వెళ్తూ వెళ్తూ నన్ను చూసింది 'చాల చురుకుచూపు' అనుకున్నాను. తరువాత రఘునాథరావు ఇంటికెళ్లేసరికి బైట, మెడికల్ షాప్ దగ్గర కనపడిన కారు కనపడింది. అనుమానిస్తూ లోపలికి వెళ్లాను 'రఘునాథం' అన్న నా పిలుపుతో వాకిట్లోకి వచ్చాడు రఘునాథరావు. నన్ను చూడగానే బలంగా నా భుజాలు, చేతులు నొక్కివేస్తూ 'అరిసీ! ఇదేమిటిరా! ఎట్లా వచ్చావు? గాలితో నైనా కబురంపలేక! ఇల్లెలా తెలుసుకున్నావ్' అంటూ ఆప్యాయంగా పలకరించాడు. "ఏమిటి యిలా వున్నావేం! ఒంట్లో బాగా లేదా" అన్నాను. 'ఊ! మొదలెట్టావూ! ఇంత వల్లబడ్డావేం! వత్తె పట్టలేక పోయాను. అయ్యో! ఎలావుండే వాడివి! అవరా—అను. సందేహ మెందుకు?—పరామర్శిస్తు న్నావే యూత్య పరమమిత్రుడా!" అని పకపక నవ్వుతూ చెయ్యి పట్టుకుని లోపలికి తీసికెళ్లాడు! లోపలనుంచి హిందుస్థానీ కూనిరాగ మొకటి సన్నగా వినవచ్చింది. "మా అరుణ బాత్ రూమ్ సింగర్ లే—అన్నట్లు నీ వసలు చూడనే లేదుకదూ" అన్నాడు రఘునాథరావు ఇంతలోనే అతని భార్య వచ్చిందక్కడకు. మెడికల్ షాప్‌లో కనపడిన అమ్మాయే! అప్పుడే స్నానం చేసిందేమో, చాల శుచిగా కనపడింది. లేత మబ్బురంగు స్విట్జర్లెండు వాయిల్ చీర కట్టుకుంది. తెల్లని సిల్కు 'బ్లౌజు' వేసుకుంది. వెన్నెల రాత్రి లాగ కళ్ళకు చల్లగా వుంది ఆమె వస్త్రధారణ! ఆమె నావంక తెల్లపోయి చూచింది మా యిద్దరి తొట్రుపాటూ గమనించిన రఘునాథం 'అరుణా, యీయన నీకిదివరకు తెలుసేమిటి? "అన్నాడు. 'ఊహూ' అన్నట్టు తలపంకించింది. 'ఇందాక మెడికల్ షాప్‌లో కనపడ్డారు' అన్నాను. 'అదా! అరుణా—

వీరే ప్రభాకర్ అంటే నేను చెప్పానుగా నీకు ఇప్పటికి తీరింది వీరికి మనింటికి రావడానికి' అని నన్ను పరిచయం చేశాడు భార్యకు. ఆమె చిన్నగా నవ్వి నమస్కారం చేసింది నాకు. నేను తిరిగి నమస్కారం చేశాను. 'మీరు రాలేదని చాలా సార్లు నొచ్చుకున్నారు వారు' అన్నది నాతో! తీగ మీటినట్లుంది కంఠం. "అనుభవాలతో మనిషిలోని సరిక్రొత్త జీవితంమీది. అందుకని మీ వద్దకు త్వరగా రావటానికి మనసొప్పలేదు" అన్నాను నవ్వుతూ! నా తెలిపినట్టు మరింత తెల్లవయినట్లు విచిత్రమైన అనుభూతి పొందాను. "అబ్బాయీ! అది మనుష్యుల్నే మీ అభినందించటం కాదు అవకాశాలు లభించనంతవరకూ అనుభవమెలా కల్గుతుంది" అన్నాడు రఘునాథరావు.

ఆ డ్రాయింగ్ రూమ్, ఆ ఫర్నిచర్, వాటిమీద పరచిన ఎంబ్రాయిడరీ వగైరా- అంతా అరుణ కళాకౌశలాన్ని తెల్పుతున్నాయి 'ఫ్లవర్ వేస్'లో రకరకాల పూలు, రంగు రంగుల పట్టుచీరలు కట్టుకుని పేరంటానికి వచ్చి, దగ్గరచేరి కబుర్లాడుతూ నవ్వుతున్న ఆడవాళ్ళలా వున్నాయి. మధ్యాహ్నం భోజనాలయాక, అరుణ 'ఫోటోల ఆల్బమ్' తెచ్చిచూపించింది. నా ప్రక్కనే కుర్చీలాక్కుని కూర్చుంది. అరుణ వస్తుతః ముగ్ధరాలై యుండికూడ, కాలేజీ చదువు ఇత్యాది సంస్కార విశేషాలవల్ల మగవాళ్ళంటే బెరుకుపోయిందో లేక, ఏవిధమైన కృత్రిమ నాగరికత వాసన సోకని అడవి మల్లెలాంటి అచ్చమైన ప్రకృతి కలదో తెలియలేదు. నాకు పకపకా నవ్వే ఆడవాళ్ళంటే- మందహాసాలు చేసే ముగుదలంటే నే ఇష్టం! పూర్తిగా వికసించిన గులాబిపువ్వుకన్న అరవిచ్చిన గులాబులే అందమైన వంటాను. అందుకే, మన ఆడపిల్లలు కోయిలకూతల్లాగ నోరువిప్పి నవ్వరు. మనం పెంచే గులాబులు అరవిచ్చి అలానే కొన్నాళ్ళుండి మన్ని మురిపిస్తాయి'. అడవిపూలకు 'మొగ్గతనం' పోయి 'పూవుతనం' రాగానే పూర్తిగా విచ్చుకుని పకపకా నవ్వుతాయి బహుశః అరుణ ప్రకృతి ఇటువంటిదేమోనని తోచింది. వాళ్ళిద్దరూ ఆ మధ్య దేశమంతా తిరిగి వచ్చినప్పటి విశేషాల ఫోటోలు చూపుతోంది. తాజ్ మహలు చూపించినప్పుడు అరుణ భర్తకేసి చూచి 'చెప్పనా' అని నవ్వింది. తలెత్తి రఘునాథాన్ని చూచాను, 'చెప్పు' అని నవ్వినట్టే నవ్వాడు. అందమైన అతని కళ్లు, పెదవులు నిజంగా నవ్వాయనే ఆమె అనుకుంది. ఆ కళ్ళ అడుగులోతుల్లో, ఆ పెదవుల వంపులలో నిగూఢంగా సుడితిరిగిపోయిన విచారరేఖలను గుర్తించటానికి అరుణ సంస్కారం చిన్నదైపోయింది నాకాశ్చర్యం వేసింది. ఆ నవ్వు, నవ్వే కాదనిపించింది. నేను నవ్వేసి 'ఏమిటో చెప్పండి అనుజ్ఞ తీసుకున్నారుగా' అన్నాను. 'అనుజ్ఞ' అనే మాట రుచించనట్టుగా అరుణ ఒకసారి కనుబొమలు దగ్గరగాతీసి ముడివేసి మళ్ళా విడదీసింది "వీరు... తాజ్ మహల్ చూచి బైటనే నిలబడిపోయారు లోపలికి రానన్నారు. బలవంతంగా లాక్కెళ్ళాను. ఎక్కువసేపుండలేక పోయారక్కడ పైగా ఏడ్చేశారు. నిజంగా! కావాలంటే అడగండి అబద్ధమేమో! ఎందుకూ అంటే 'ఊరికే ఏడుపు వచ్చింది' అన్నారు. ఆరాత్రి మళ్లీ వెన్నెల్లో తాజ్ ను చూడటానికి రమ్మన్నాను రానన్నారు. నేనొక్కతెనే ఇంకెవరినో తోడుతీసుకొని వెళ్లాను. మళ్లీ వచ్చిచూద్దును గదా, 'రూమ్'లో ఏడుస్తున్నారు. మగవాళ్ళట పైగా మీరు అడగండి పోనీ!" అంటూ పకపక నవ్వింది పసిపిల్లలాగ! నేనూ నవ్వేశాను. రఘునాథం నవ్వాడు.

ఆ తర్వాత రఘునాథం 'సొంత' ఆల్బమ్ అంటూ తీసుకొచ్చింది అంటే పెండ్లికిముందు రఘునాథరావు సేకరించిన ఆల్బమ్ అని ఆమెభావం. పెళ్లయ్యాక 'స్వంతం' అనేది అందరికీ నశిస్తుందా? వీడికేనా? అనుకున్నాను. మొదటి పేజీలు చాలా దాటేశాను. అవన్నీ నాకు తెలిసినవే! ఆ పేజీలనిండా మేమే! తరువాత జాఫ్నాలో అతని జీవితం ఎలావుండేదో చూడాలని పేజీలు నెమ్మదిగా తిప్పుతున్నాను. ఏవో ఫోటోలు. ఆడవాళ్ళవి, మగవాళ్ళవి చాలా కనుపించాయి. కాని అందరూ చాలా పెద్దమనిషి 'పోజ్' ఇచ్చినవారే! వెనుక పేజీల్లో వున్న మాలాగా, జంతువులలాగా స్వేచ్ఛగా వున్న ముఖం ఒకటే కనపడలేదు. ఒక పేజీలో ఏకోఒక 'ఫామిలీఫోటో' చూపింది అరుణ. అందులో ఒకమ్మాయిని చూపి యీమె వీరి 'కొలీగ్' అట. 'పొయిట్రీ' లెక్చరర్ అని కదండీ చెప్పారు అని భర్తకేసి చూసింది. 'ఊఁ' అన్నాడు రఘునాథం. 'వీరు వాళ్ళ అమ్మా నాన్న, చెల్లెలూ, తమ్ముడూనట' అని పరిచయం చేసింది. 'ఇంగ్లీషు

డిపార్ట్‌మెంటే' నన్నమాట? ఎవరేమిటి వీళ్ళు?' అన్నా. 'మళయాళీలు. అసలువూరు కాలికట్' అన్నాడు రఘునాథం-అతనిముఖం చాలా తమాషాగా మారింది.

'మీరు చెప్పండి యీమె బాగుందా, యీమె చెల్లెలు బాగుందా' అని అరుణ నన్నడిగింది ఫోటో తీసి చూపిస్తూ! ఒకమ్మాయి, అమ్మాయిల అందం గురించి అంతగా పరిచయంలేని నాతో ప్రస్తావించటం క్రొత్త అనుభవం! సందేహంలేదు. అరుణ అడవి మల్లెలాంటిదే! నే నేమీ చెప్పకముందే "నేను చెల్లెలే బాగుంటుం దంటాను. మీరు ఒప్పుకోరు" అన్నది. "అంటే అక్క బాగుంటుందనే గా అర్థం! ఏరా?" అని రఘునాథాన్ని పరాచిక మాడాను. వాడు నవ్వాడు. ఇందాకటినవ్వే! అది నవ్వుకాదు. నాకు తెలుసు.

మరునాడు ప్రొద్దెక్కి లేచాను. ఇంట్లో ఎవరూ కనపడలేదు. 'గెస్ట్‌రూమ్'లో నే వున్న 'బేసిన్'లో ముఖం కడుక్కొని బైట తోటలోకి వచ్చాను. దూరంగా రఘునాథం పచార్లుచేస్తూ, సిగరెట్ కాలుస్తూ, పత్రిక చూస్తున్నాడు 'స్లిప్పర్లు' తొడుక్కొని తోటలోకి వెళ్తున్నాను ఒకప్రక్కన పన్నజాజి పందిరిదగ్గర అరుణ నిలబడి పూలు కోస్తోంది! తలంటి పోసికున్నట్లుంది. జుట్టు వీపుమీద పరచుకుని వుంది. పొడుగ్గాలేవు వెంట్రుకలు! చివర్లు మెలికలు తిరిగి నీరు కారుతున్నాయి! సన్న జరీఅంచు పట్టుచీర కట్టుకుంది. చేతిలో పూలసజ్జ కనపడింది. నా నడక అలికిడికి వెనుతిరిగి నన్ను చూచి నవ్వింది. ఎఱ్ఱటి బొట్టు, నల్లటి కాటుక కొట్టొచ్చినట్టు కనబడ్డాయి! అలలుతిరిన ఆమెజుట్టు ముఖాన్ని సగం కప్పి, సగం కప్పనట్లున్నది. అప్పటి అరుణముఖం కంటే, రఘునాథానికి వార్తాపత్రిక ఎలానచ్చిందో ననుకున్నాను. రఘునాథం నన్ను జూచి 'పద, కాఫీ తీసుకుందాం' అన్నాడు. ఇద్దరం వస్తున్నాం. అరుణ మమ్మల్ని చూచింది. 'మీరు కూడా రండి', అన్నాను. 'నా కాలస్యముంది-మీరు వెళ్లి తీసుకోండి' అన్నది.

"ఇవాళ శుక్రవారం గా! ప్రొద్దున్నే తలస్నానం ఆపైన పూజ! ఆ వ్యవహారం తొమ్మి, తొమ్మిదిన్నరయితేగాని తెములదు లే" అన్నాడు రఘు. ఆ మాటల్లో ఏమీ విసుగు ధ్వనించలేదు. నా స్నేహితుడుగా వాడించే 'పాతి' రఘు గుర్తుకచ్చి ఆశ్చర్యమయింది. అరుణ ఇంట్లోకి వచ్చింది. పూలసెజ్జ నిండివుంది. పూజ గదికాబోలు చిన్నరూమ్ కేసి వెళ్ళింది పసుపు రాసుకుందేమో, కాళ్లు పచ్చగా కనపించాయి. 'స్లిప్పర్లు' లేకుండా తోటలో తిరిగిందేమో—గులకరాళ్లు గుచ్చుకొని కందిపోయి కొంత, ఎఱ్ఱమట్టి తొలూకు ఎఱ్ఱదనం కొంత కారణాలుగా ఆమె పాదాలఅంచులు ఎఱుపెక్కినాయి.

ఆరోజు ఊరిలో అక్కడిక్కడ తిరిగివచ్చాం ముగురమూ! ఆ మధ్యాహ్నం రఘునాథం భార్యను చూచి 'యీరోజు, నీవెళ్లి మీపార్వతిని చూచి రారాదూ! ప్రభాకర్ వున్నాడుగా నాకుతోడు" అన్నాడు "నిజమే నేవెళ్ళివస్తా! పాపం దానికి జ్వరం తగ్గిందోలేదో, అప్పుడు టైఫాయిడ్ అనుకుంటున్నారు వాళ్లు" అన్నది. చీరేఅదీమార్చుకుని వాళ్లింటికిపోతూ నాతో చెప్పింది. "వీరిని చల్లగాలికి తిరుగనీకండి" అని ఆమె మాపేక్షకు నాఒళ్ళు గగుర్పొడిచింది. అప్పుడు గుర్తొచ్చింది. నిన్న ఉదయం మెడికల్ షాపులో అరుణను చూచినమాట! "ఈమధ్య ఏమైనా మందమెక్కా వేమిటి?" అన్నాను. "అ! ఏంలేదు నాలుగురోజుల జ్వరం. ఊరికే ఆర్భాటం చేస్తుంది" అన్నాడు రఘు

అరుణ వెళ్లగానే, ఇద్దరమూ తోటలోకి వెళ్లాం! చాలారకాల పూలు. ఢాలియాలు, పాపీస్, డైయాంథస్‌లు, యాస్టర్లూ, తమోలాలు, కనకాంబరాలు! నేల కానుకున్నట్లున్న చిన్న మొక్కలకూ పూలే! మనిషి ఎత్తున వున్న పెద్ద మొక్కలకు పూలే! వేరే పనేమీ లేనట్టు పంతాలేసుకుని, విరబూసి నుంతనాలాడుతున్నాయి ఇక గులాబులు, మల్లెలు, జాజులు-వీనికి లెక్కలేదు "ఆమెకు మొక్కలంటే చాల శ్రద్ధనుకుంటా నే" అన్నాను "శ్రద్ధేమిటి? పిచ్చి! నాకీతోటలో తిరగటమంటే తలనొప్పి తిరిగినా వీటికేసి చూడను ఇన్ని రకాల పూలు, ఇన్ని రకాల అందాలు, దేన్ని మెచ్చుకోలేం!" అన్నాను. నేను ఆశ్చర్యంగా చూశాను. ప్రక్కనే నాభుజానికి తాకిన ఢాలియా కొమ్మ పట్టుకుని, ఎఱ్ఱగా విచ్చిన ఆ పువ్వు జూపి "దీన్ని చూడు ఎలా వుంది?" అన్నాను. పట్టలేనంత అందంగావుంది. అది వాడిపోకముందే, గుండె చీల్చుకుని లోపల దాచుకోవాలని వుంది" అన్నాడు.

భార్య లేనప్పుడు ఇంత ఉద్రేకంగా మాట్లాడుతున్నాడే అనుకున్నాను. అయినా, అందమూ, అనురాగమూ తనలో నింపుకున్న 'అరుణ' అందులోనే వున్నప్పుడు, ఇంకా 'అందం దాచుకోటం' (అవధిచెందటం కాదు), "పంచి పుచ్చుకోటం"- అనటం చూస్తే, "ఎందుకు వీడు పరితపిస్తున్నాడా" అనుకున్నాను. ఇంతకు మించిన వారిపైన వీడికి వాంఛ వున్నదా ఏమో! అమావాస్యరోజున చంద్రుడు కనపడలేదని విచారించేవారు, నీలాకాశమూ, రోజుకన్న ప్రస్ఫుటంగా మెరిసే చుక్కలూ- వీటి అందాన్ని ఆస్వాదించలేరు. ఆలోచనలు తెముల్చుకుని "ఏమిట్రా అలా వున్నావు? చాల మారిపోయావ్. అసలు సంగతేంటిది?" అన్నాను.

ఏదో— చెప్పబోయేదానికి నాంది అన్నట్టుగా, నా చేతులు తన చేతుల్లోకి తీసుకొని మెల్లిగా నొక్కాడు, అక్కడే పచ్చిక పైన కూలబడ్డాం!

"నేను జాఫ్నాలో వుండగా మా డిపార్ట్‌మెంట్‌లోనే, ఒకమ్మాయి వుండేది పేరు రంజని "పొయిట్రీ" లెక్చరర్ అంటూ మొదలెట్టాడు. నేనిట్లాంటిదేదో వుంటుందని వూహించాను.

"ఇందాక నీ భార్య చూపించవే, ఆ ఫోటో యేదీ?" అన్నాను. అప్పటి రఘు ముఖకవళికలు గుర్తుకువచ్చి! "ఆ!— ఆమె అంటే మొదటినుంచి నా కదోరకం విధమైన......" మాట దొరక లేదతనికి. అతను నవ్వి. "ప్రేమా, గీమా" అనకు సుమా! ఏదో చెప్పలేను గాని" అన్నాడు. అతను చెప్పలేకపోయింది నేను చెప్పలేనుగాని, వూహించ గలిగాను. "అందమైన దేనా?" అడిగాను. మనుష్యుల వర్ణన— పుస్తకాల్లో, కథల్లో అంటే ఏదో వ్రాసేయ వచ్చుకాని, ఒక స్నేహితుడి దగ్గర అమ్మాయిల అందం గురించి నిజం "నిజం" గా నే చెప్పాల్సివస్తే కష్టమే! వాడు ఆలోచించినట్లాలోచించి "రంజని అందం గురించి నీకు చెప్పాలంటే నాకేమీ స్వంతమాటలు లేవురా! ఎప్పుడో చదివాము గుర్తుందా!..." "పది నిముషాలామె వంక తేరిపార చూచినా, ఆమె అందగత్తె ఔనో, కాదో తేల్చుకో లేకపోయాను. ఎందుకో ఆమె నన్ను చూచి నవ్వింది. వెంటనే అనిపించింది— ఆమె చాల అందమైనదని ఇదే నా ప్రథమానుభవం సుమా!" అని క్లుప్తంగా ముగించాడు. "తర్వాత?" అన్నాను. చిన్నప్పుడు దయ్యాల కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు విన్నప్పుడుండే ఉత్సాహం, తొందర మళ్ళీ కనబర్చాను.

"మొదట్లో నేను ఎక్కువగానే మాట్లాడే వాడిని రంజనితో! ఆమె చాలా ముక్తసరిగా జవాబులు చెప్పేది. ఒక ఏడాది గడిచాక, నా మనస్సు ఆమెను మరీ దగ్గరవాళ్ళనుకోటం మొదలెట్టింది. ఆలోచనల తర్వాత బుద్ధితో మనస్సుకు కళ్లెం వేశాను. మాట్లాడటం చాలా తగ్గించేశాను. సాధ్యమైనంతవరకు ఆమెను కలుసుకోటం మానేశాను! క్లాసు లైపోగానే 'రూమ్' కెళ్ళిపోయేవాడిని. కొన్నాళ్ళ తర్వాత ఒకనాడు ఆ అమ్మాయి, చెల్లెల్ని వెంటబెట్టుకు నా 'రూమ్'కు వచ్చింది. ఆశ్చర్యపోయాను అక్కడింకెవరియింటికో వచ్చినట్లు, దారిలో వుంది కనుక నా రూమ్ కేసి తొంగిచూసినట్లు చెప్పింది. కాని అంతా అబద్ధం నిజమేమిటో తెలిసింది నాకు. తేలిపోని అభిమానంతో నిజాన్ని దాచివేసింది. కావాలనే నా రూముకు వచ్చిందారోజు. లోకంకోసం చెల్లెల్ని వెంట తీసికొచ్చింది. చాలా స్వేచ్ఛగా మాట్లాడింది నా మనస్సు మళ్ళీ కొంచెం పట్టుతప్పింది. ఆ తర్వాత ఆ అమ్మాయి రోజూ కొంత సేపైనా నాతో మాట్లాడేది. బాగా నవ్వేది. ఆమె మాట్లాడే మాటల్లో, చాల వాటికి ఏమీ అర్థం వుండేది కాదనే గుర్తు. నాలోపల 'వాంఛ' విజృంభిస్తుంటే, దాన్ని జయించి నిర్వికారంగా ఆమెతో మాట్లాడాలంటే చాల కష్టమయ్యేది. ఆమె నా శీల ప్రవర్తనలపై సవాలు చేస్తోందా— అనుకుని చిరాకుపడేవాడిని చాలా సార్లు. కాని రంజనిపైన ఎప్పుడూ కోపం వచ్చినట్లు జ్ఞాపకం లేదు. ఆశ్చర్యమేమిటంటే, నేను మాట్లాడటం తగ్గించిన కొద్దీ, ఆమె మరింత పలుకరించేది. ఇలా కత్తిమీద సాముగా ఇంకో ఏడాది గడిపాను. నాకు పిచ్చెక్కినంత పని అయింది. పోనీ అడిగేద్దామా అంటే భయం! లోకువవుతానేమోనని! ఇక ఆ వాతావరణం భరించలేక వేసవి సెలవల కింటి కొచ్చిన వాడిని మళ్ళీ తిరిగి వెళ్ళకుండా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. ఆ తర్వాత నాల్గు నెలలకి అరుణను పెళ్లి చేసుకున్నాను. జాఫ్నాలో నా 'కొలీగ్స్' అందరికి ఆహ్వానాలు పంపాను. చాలమంది దగ్గర నుంచి వుత్తరాలు, వైర్‌లూ వచ్చాయి రంజనివద్ద నుండి ఏమీ ప్రత్యుత్తరం రాకపోయేప్పటికి ఆశ్చర్య పోయాను. కాని, క్రమంగా ఆమెను మర్చిపొమ్మని

ప్రోత్సహించే 'బుద్ధి' ఇదీ మంచికే లెమ్మంది— మనస్సు ఎవ్వంత బాధపడినా! ఆతర్వాత అరుణ మంచితనాన్ని చాలా అనుభవించాను. ఇప్పటివరకూ నేనుకూడా ఆమెకేటువంటి అసంతృప్తినీ కలిగించలేదనే అనుకుంటున్నాను. ఒకఏడాది ఏ చింతా లేకుండా వున్నాను. తర్వాత ఒకనాడు జాఫ్నానుంచి ఒక కవరు వచ్చింది. అదృష్టం! అరుణ ఆవాడింట్లో లేదు. చింపి చదివితే రంజని వుత్తరమయింది.

"నీవు అరుణను ప్రేమించావన్నావుగదా, రంజని సంగతి ఆమెవద్ద ఎందుకు దాచావు" అని అడిగాను.

రఘునాథం ఆశ్చర్యంగా "మన కష్టాలూ, మనం ప్రేమించేవాళ్ళకైనాసరే చెప్పకూడదప్పుడు. ఎక్కువగా ఆలోచించాల్సింది వాళ్ళ మంచితనం కాదురా, కావల్సింది గుండెనిబ్బరం. విని భరించగలరా! అని-అందుకనే అరుణకు చెప్పలేదు" అన్నాడు. వాడు తన కథంతా నాకెందుకు చెప్తున్నాడో అర్థమైంది. నా మంచితనంమీద నాకు ఒకవిధమైన నమ్మకం తగ్గింది. "సరే-రంజని ఏం వ్రాసింది" అన్నా. "నేను ఆమెకు పంపిన ఆహ్వానపత్రిక చేరలేదు కాబోలు! "నా ప్రేమ నీవు తెలుసుకున్నావు కనుకనే, నీ పెండ్లికి నన్ను పిలవ సాహసింపలేకపోయావు! ఈ వార్త యితరులవల్ల తెలిసినప్పుడు నేనెంత క్రుంగిపోయానో-ఎలా వ్రాయను? ఏడాది ఓర్చుకున్నా నీలాగ ఒంటరిగా. ఉపశాంతికోరకు యిలా వ్రాస్తున్నా నీకు. నీకుంగు పూర్తినమ్మకము లేనందువల్లే, నేను నా ప్రేమ బాహాటంచేసి భిక్షకోరలేదు. కాని దురదృష్టం! నామనస్సు నీవుగ్రహించావు నా అభిమానం దెబ్బతిన్నది. నేను ఓడిపోయాను. అందుకేమీ ప్రతిఫలం లేదు నాకు. నీ మనస్సులో నన్నెంత తేలిక చేసినా, కనీసం నాపై, నీ సుఖాన్ని కోరే వ్యక్తిగా పూర్తి నమ్మకముంచు" అని వ్రాసింది. "ఇంతే! మేఘాలను దూసుకొనిపోయే విమానం హఠాత్తుగ నేలకూలడం లాంటి అనుభూతి యిది" అన్నాడు రఘునాథం.

"నీవు జవాబు వ్రాయలేదా" అన్నా!

"ఆహ్వాన పత్రిక తనకుకూడ పంపినట్లు వ్రాశాను. నాపై తన కున్న కోరిక నా కీమధ్యమాత్రమైనా తెలిసిందని చెప్పాను. ఆశలూ, అనురాగాలూ అంత గోప్యంగా గుండెల్లోనే దాచుకుని అణగారి పోవటానికి నేనేమైనా ఆకాశ కుసుమాన్ననుకున్నానా?' అని ముగించాను. అంతకంటే ఏం వ్రాయను?" అతని గొంతే కాదు—శరీరముకూడ కొంచెం కంపించినట్లు సంధ్యవెలుగుల్లో గుర్తించగల్గాను.

"ఆ తర్వాత మళ్ళీ ఆమె వ్రాయలేదా" అన్నాను.

"ఊహూ! ఏమీ వ్రాయలేదు. కాని నా ప్రేమ ప్రతిబింబాన్ని నేను గుర్తించలేదని తెలిశాక, ఎండిపోయిందనుకున్న ఆమెపై నాకున్న ప్రేమ క్రొత్త చిగురేసింది! ఏమీ చేసేస్థితిలో లేను నేను నా కాలు చేతులు నేనే విరగ్గొట్టుకున్నా ననిపిస్తుంది అరుణ అమాయకురాలు మరీ సుకుమారమైన జాజిపువ్వు లాంటిది. జాగ్రత్తగా చూసుకోవాలి! ప్రేమ ఒకచోట, దాని ప్రకటన మరొకచోటగా బ్రతుకుతున్నాను" అన్నాడు. ఇప్పుడర్థమైంది నాకు! రఘునాథం అరుణపై చూపేది ప్రేమకాదు,—అది లాలన, దయ, ఆదరణలాంటిది! ఇంతలోనే కారు చప్పుడైంది! అరుణ వచ్చింది!

"చీకటయిపోయింది ఇంకా తోటలోనే వున్నారేం? ఇంట్లోకి పదండి మంచుకురుస్తోంది" అన్నది. రఘునాథం నవ్వు తెచ్చుకొని లోపలికి వచ్చాడు. చాలా ఆప్యాయంగా అరుణను, ఆమె స్నేహితురాలి ఆరోగ్యవిషయం విచారించాడు. నిజమే! అలా బ్రదకటం రఘునాథానికే చేతనయింది!

మరునాడు ప్రయాణం కట్టాను స్టేషన్‌కు వచ్చారిద్దరూ; రైలు కదలబోతుంటే రఘు నాచేయి నొక్కుతూ "ఎవ్వరితో అనకేం!" అన్నాడు. నాకంటే రాతిగుండె కలవాళ్లు మా మిత్రబృందంలో మరెవ్వరూ లేరని రఘునాథం అభిప్రాయం కాబోలు!

రైలూ, రైలుతోపాటు చెట్లూ, చేలూ, పైన మబ్బులూ, నా ఆలోచనలూ, అతి వేగంగా పరిగెత్తుతున్నాయి. అన్నింటికీ ఒక్కసారే 'బ్రేకు' పడినట్లు మావూరి స్టేషన్ వచ్చింది. ఆ రాత్రి పడుకున్నాను. రఘునాథమే మెదులుతున్నాడు మనస్సులో! ప్రపంచంలో అక్కడక్కడ నిర్లిప్తమైయున్న కరుణ, సహనము, అభిమానము ఇత్యాది ఉత్తమ భావాలకు అందమైన శరీరం కల్పించగానే, దానిలో లీనమైపోవాలనే కోరిక కలుగుతుంది కాబోలు. లేకపోతే, రఘువంటి వ్యక్తిని మనం కలుసుకోలేము!

కొన్ని ధ్వనులు

అమృత్

ధ్వనులు అన్నీ ఆనందవర్ధనాచార్యులవారే సమగ్రంగా దుర్వార సుస్థిరంగా నిరూపించి స్థాపించారు. ఇప్పుడు ప్రత్యేకంగా కొన్ని ధ్వనులంటూ ఎవరూ కనిపెట్టలేరు. ఐతే ఈమధ్య ప్రబలంగా అందర్నీ గాకపోయినా, కొందరినైనా మోహపరచిన కొన్ని శబ్దవిలాసాల్ని — (శబ్దవిలాసం అనటం అశాస్త్రీయమే; సంఘటనా నైపుణీవైవిధ్యం వల్ల సిద్ధించే శబ్ద సౌందర్యాన్ని, ఇట్లా పిలవదలుచుకొన్నాను; లాటానుప్రాసం, వికటతి మొదలైన ఆలంకారిక పారిభాషికపదాలచేత వ్యక్తమయే భావమే గాక ఇంకా కొన్ని భావాల్ని కూడా చెప్పటానికీ, సుబోధంగా ఉండొచ్చునని పై శబ్దాన్ని ఎంచుకొన్నందుకు పాఠకులు తప్పుగా భావించరని ఆశ)-ఈ మోహగ్రస్తులు ధ్వనులుగా గ్రహించి ఆ పేరుతోనే పిలిచి, ఆ ధ్వనులే పారవశ్యాన్ని కలిగిస్తున్నట్లు ఆనందించటంవల్ల—వాటిని "కొన్ని ధ్వనులు"గా పేర్కొనవలసివచ్చింది.

సంస్కృతాంధ్రభాషల్లో కవులు, అనేక సందర్భాల్లో అనేక విధాలైన సమాసాలు చిన్నవి, పెద్దవి వాడారు.

ప్రతి పదానికి అర్థం ఉంటుంది గాబట్టి, పదసముదాయాలైన సమాసాలకీ అర్థం ఉంటుంది—కొంచెం పెద్దగా. ఐతే, ఈ పెద్ద అర్థం అంతా, వేరువేరుగానే పదాలు రచిస్తే రాదా? సరదాగా చదివేవాణ్ణి ఊపిరి బిగపట్టించాలని కాకపోతే, దేనికా హడావుడి? వేరు వేరు పదాలుగా వ్రాసేదానిలోకంటె సమాసంగా రచించటంలో సంక్షిప్తత సిద్ధించవచ్చు సిద్ధిస్తుందికూడా. ఆ భాషల్లో ఆ సౌలభ్యం ఉంది గాబట్టి, ఆ అడ్డదారిన పరుగెత్తారందామా? అట్లాగే అనుకొందా మనుకొంటే, వాల్మీకివంటి సర్వకవి లోకపూజ్యుడు, సమాసాలజోలికి పోలేదు. పోయినా, చిన్న చిన్న సమాసాలే గాని, దీర్ఘసమాసాలు లేవు. వీలైన అడ్డదారి ఉంటే, చుట్టూదూరం సమాసరచన సాగించినవారు, కథమీద దృష్టిలేక, అసహజంగా కాలహరణంచేసి శ్రమపడినవాళ్లు కావాలి. ఇప్పుడు మనం ఏం అనుకొన్నా, వాళ్ళుమాత్రం కాలం సద్వినియోగం చేస్తున్నామనే విశ్వాసంతోనే శ్రమపడి ఉంటారు. ఆ సమాసరచన శ్రమాపాదకం అని వాటిని చూస్తేనే తెలుస్తుంది. దీన్ని నిరూపించటానికి వితర్కబుద్ధో అవసరంలేదు. సాధారణ అనుభవమే స్పష్టీకరిస్తుంది ఎందుకు ఆ శ్రమ?

సమాసరచన అంతగా చేయని మహాకవులూ ఉన్నారు. చేసినవాళ్లలోనూ మహాకవులు ఉన్నారు. కొంతమంది సమాసరచన చేసినా, ఇష్టం ఉండి కావాలని చేసినట్లు కనబడదు. కొంతమంది ఎంతో మోజుపడి జిగిబిగీలు చేసి తెచ్చి ముందు పెట్టినట్లు తోస్తుంది. దీర్ఘ సమాసరచన అసహజం అని అసహ్యించుకొన్న వాళ్ళు కూడా పాల్గొరికి పోయిన మాదిరిగా, దానికే పాల్పడినట్లు తోస్తుంది. మొత్తం మీద సమాసాలు వాడనివాళ్ళు లేరు. ఇష్టం ఉన్నవాళ్లు, లేని వాళ్లు అంటూ కనబడుతున్నారేగాని ఇది వాల్మీకి మొదలైన ఆద్యకవులను వదిలేస్తే మిగిలినవాళ్ళ సంగతి ఆ ఆద్యకవుల అభిప్రాయం యేమిటో తెలీదు.

ఈ సమాసరచనమీద అందులో జిగిబిగీలమీద ఇష్టం ఉన్నవాళ్ళు—ఆ దీర్ఘసమాసాలకోసం పూర్వకవులు పడిన శ్రమను చూపించే కారణమే ప్రస్తుతం ఈ వ్యాసంయొక్క చర్చనీయాంశం. ఆ సమాసరచనలోనే ధ్వని ఉందంటారు. ఆ ధ్వనికోసమే ఆ మహాకవులు ఆ శబ్దవిలాసాల్ని చూపారంటారు. ఒక దీర్ఘ సమాసం వాడితే, అక్కడి సందర్భం ఏదో దీర్ఘత్వాన్ని, ఏదో గాఢత్వాన్ని ప్రదర్శిస్తున్నదంటారు. వాడిన సమాసం కఠినపదాలతో ఉంటే, ఏదో కాఠిన్యం, లలితపదాలతో ఉంటే, ఏదో లాలిత్యం ఉన్నట్లు చెబుతారు. సమాసరచన వికృతంగా ఉంటే అక్కడేదో వికారం, పేలవంగా ఉన్నట్లుంటే, ఏదో

మేలకళత్వం, ఇంకా ఎన్నిరకాలో, తోచినవన్నీ — ఇవి ధ్వనులంటారు. ఇవి నిజంగా ధ్వనులేనా అని విచారించటమే ఈ వ్యాస ప్రయోజనం.

ఈ "ధ్వనుల్ని" కొన్ని వర్గాలుగా విభజించవచ్చు.

(1) ఇప్పటికే అనుకొన్న రకం — సమాసం చెవికి తగిలే తీరునిబట్టి ధ్వని చెప్పటం. "జలధి విలోల వీచివిలత్కలకాంచిసముంచితావనీతిలకహాస తమంబయిన దక్షిణహస్తమునన్ ..." అని దీర్ఘదీర్ఘంగా చెవికి తగులుతున్నది గాబట్టి, ఆ చేయి అంత దీర్ఘమని, మహారాజ లక్షణమైన అజానుబాహుత్వం, చెప్పకుండానే ఉన్నట్లు, వాచ్యం చేయకుండానే ధ్వనిస్తున్న దనటం. ఇందులో రెండు విషయాలు గుర్తించవచ్చు. మహారాజుకి అజానుబాహుత్వం శాస్త్రసిద్ధం, కవిసంప్రదాయం అనేది ఒకటి. ఆ బాహువుని వర్ణించే సమాసం దీర్ఘంగా ఉండటంవలన ఈ ధ్వనిని ఊహించే వారి మనస్సులో ఉండే రాజుగారి అజానుబాహువు, దీర్ఘత్వ సామ్యంవల్ల — స్ఫురించటం — రెండో విషయం. తెలిసినదానిలో (సమాసం) తెలీనిదానిలో (బాహువు) ఒకే గుణం (దీర్ఘత్వం) కనిపించటంవల్ల — ఈ తెలిసినదానివల్ల తెలియనిది తెలిసింది అనుకోటం — సారాంశం. అలా అనుకోటాని కవసరం — దానివల్ల కలిగే ఆనందం; ప్రయోజనమూ అదే

(2) ఉచ్చరించటంలో కలిగే ఆయాస, సౌలభ్యాలవల్ల ఆయా సందర్భాల్లో ఏదో కష్టమో, సుఖమో ధ్వనిస్తున్న దనటం. ఉచ్చరించింది చెవికి తగలకుండా ఊరుకోదు. చెవికి తగిలేవన్నీ కూడా ఉచ్చరించినవే కాబట్టి ఈ వర్గాన్ని కూడా పై దాంట్లోనో, దాన్ని కూడా దీంట్లోనో చేర్చవచ్చు. ఐతే, పై వర్గంవి ఎట్లా ఉచ్చరించినా వాటి దీర్ఘత్వాది పరిమాణాలు స్పష్టమౌతుంటయ్. ఈ వర్గంలో ఏదో ధోరణిగా ఉచ్చరిస్తే, విషయం బోధపడదు మామూలుగా ఆ పారాయణచేసేవాళ్లు ఆ ధ్వనిని కనిపెటలేక పోవచ్చు. అవసరమైనవిధంగా ఉచ్చరించి, ఇదిగో ఎట్లా ఆ భావం స్ఫురిస్తున్నదో చూడమని, ఎవరో వచ్చి చెప్పవచ్చు. "అడిగెదనని కడువడి జను..." అన్న పద్యం గజేంద్రమోక్షం ప్రతిదినమూ, పారాయణ చేసేవారికి సాధారణంగానే ఉండొచ్చు చదివే వాడు చదివి "ఆహా, లక్ష్మీదేవి తడబాటు అంతా, పద్యం నడకలోనే తెలుస్తున్నది" అంటే అందరి ముఖాలూ ఆ కాసేపు విప్పారుతయ్. ఇక్కడకూడా ఒక సామ్యమే పనిచేస్తున్నది

(3) పై రెండువర్గాల్నీ అవి 'ధ్వనించే' వస్తువునుబట్టి ఒక్కొక్కటి, రెండు రెండు వర్గాలుగా తిరిగి విభజించవచ్చు ధ్వనించే విషయం ఆ శబ్దాలే వాచ్యంచేసి ఉండటం ఒకటి "పరిష్వనిష్ఠురకుచద్విష్ఠాంగుఁ జేసెం దుదన్" అన్నప్పుడు, ఆ స్తన కాఠిన్యం "నిష్ఠురకుచ" అనటంలో స్పష్టంచేసినప్పటికీ, ఆ సమాస గతిలోకూడా ధ్వనించటం. సందర్భోచితమైన అభిప్రాయాల్నీ, సమాసాన్నిబట్టి దీర్ఘబాహువును చెప్పినట్లుగా, చెప్పటం రెండు.

(4) పై విధాల 'ధ్వనులన్నీ' కేవలం సమాసాలకి. ఎక్కువపదాలకి కాకుండా, ఒక్కపదం ఉన్న దాన్ని ఉచ్చారణనిబట్టి చెప్పటం "దేవయాని, శర్మిష్ఠలు వలువలు విస్వడె" ధరించిరి అంటే ఆ 'ష' కారం (కింద వకారం వలన వస్త్రాలు, చుట్టలు చుట్టుకుపోయినయ్, మెలికలు వేసుకుపోయినయ్ అనటం.

(5) ఛందస్సులోఉన్న విషయాలవల్ల విశేషాల్ని ఊహించటం. ప్రాస అక్షరం మార్చరానిది గాబట్టి, ప్రాసలో ఏదైనా ఒక పదంఉంటే ఆ అభిప్రాయం మార్చరానిదిగా, వదలలేనిదిగా ఏదో చెప్పటం "విప్రుడై నున్నవాడు.. కీర్తిప్రియుడు..." అన్నప్పుడు కీర్తిని ఏ పరిస్థితుల్లోనూ వదలలేనివాడని గాబట్టి, నన్ను రక్షించి కీర్తి పొందమని 'ధ్వని'. అట్లాగే యతిస్థానం దగ్గర ఆగటం, విరవటం "పాతిర లాడు... చేతము తాంపెదింప మరచెన్......" అన్నచోట 'మరచెన్' అనేది యతిస్థానంలో ఆగటంవలన యతి అంటే విశ్రాంతి కాబట్టి, నిజంగా, ఎంతో ఎక్కువగా, స్పష్టంగా మరిచిపోయాడని 'ధ్వని'. ఈ విధంగా ఇంకా కొన్ని విభాగాలు చేసినా చేయొచ్చు. ఏదో కొంత స్పష్టతకోసంగాని, లేకపోతే, ఏవిభాగమూ అవసరములేదు. సరే, ఈ 'ధ్వను'లన్నీ నిజంగా ధ్వనులేనా ? అన్నదే మొదటిది, చివరిది — ప్రశ్న.

ధ్వని అంటే ? వాచ్యార్థం కుదిరినతర్వాత, ఆ వాచ్యార్థంకంటె విలక్షణమైన అర్థం, ఆ వక్తనిబట్టి, సందర్భాన్నిబట్టి పుట్టేది. వివరించాలంటే ధ్వన్యా

లోకం అంతా, వ్రాయవలసివస్తుంది. పైన ధ్వనులను కొన్నిటి సందర్భంలో — అక్కడి శబ్దాలకి అర్థం కుదురుతూనే ఉంది. వేరే అర్థంకూడా చెబుతున్నారు. కాబట్టి ధ్వని అనొచ్చా? అనకూడదు. ఎందుచేత? ధ్వని ఎప్పుడూ వాచ్యంలోనించి పుడుతుంది. అది అవలిప్తమై ఉండికూడా, భిన్నమూ, అతిరిక్తము అయిన లావణ్యం మాదిరిగా, వాచ్యార్థం (లేక లక్ష్యార్థం) వల్ల, పుడుతూకూడా దానికి అతీతమై ఉంటుందని ధ్వన్యాలోకం. ఇక్కడ వాచ్యార్థం నుంచి పుట్టటం అనే ప్రసక్తే లేదు గాబట్టి ఇది ధ్వని కాదు. అక్కడ శబ్దాల ధ్వనివల్ల (మోత) ఈ ధ్వని స్ఫురిస్తున్నదని, ఇది శబ్దశక్తిమూలక ధ్వని అని ఎవరూ అనబోరు. శబ్దానికి రెండు అర్థాలు ఉండటం వంటి సందర్భాల్లో ఆ శబ్దమే ప్రాముఖ్యం వహించి, ధ్వనికి హేతువైతే అప్పుడు — శబ్దశక్తిమూలక ధ్వని అవుతుంది. ధ్వనిసిద్ధాంతంతో పరిచయం ఉన్నవారికి ఈ విషయం వివరించవలసిన అవసరం లేదు.

ఈ 'ధ్వను' లను ధ్వన్యాలోకంలో ఎక్కడా చెప్పలేదు. ఐతే రసధ్వనిని గూర్చి చెబుతూ, ఒక్కొక్క రసాన్ని అభివ్యక్తం చేయటానికి, కొన్ని వర్ణాలు బాగా ఉపయోగిస్తయ్ అన్నారు. శ, ష, ర మొదలైనవి, శృంగార రసాభివ్యక్తికి ఎక్కువ అనుకూలం. అట్లాగే, మాధుర్యగుణం కలిగిన శృంగార, విప్రలంభ, కరుణ రసాలలో, దీర్ఘసమాసాలు ఉండకూడదని, అక్కడ వైదర్భీరీతినే అనుసరించాలని — ఈ విధంగా ధ్వన్యాలోకం కొన్ని నిర్ణయాలు చేసింది. రసస్ఫురణకు అనుసరించవలసిన రచనావిధానాన్ని అక్కడ నిర్దేశించారే గాని, ఆ శబ్దంలో ఆ విరుపువలన, ఈ ములుపువలన ఇంత అర్థం వస్తుంది, అంత అర్థం బయలుదేరుతుంది — అని ఎక్కడా చెప్పలేదు

పోతే, రసధ్వని కొన్ని కేవలం ఏ అర్థంలేని శబ్దాలవల్లకూడా ఒక్కొక్కసారి కలుగుతూంటుం దన్నారు. దీనికి ఆంధ్ర ధ్వన్యాలోకంలో ఇచ్చిన ఉదాహరణ, ఆంధ్రపాఠకులకు అనుకూలంగా ఉంటుం దనుకొంటాను — "తెలియునివన్ని తప్పులని......... సరసా విరసా తుసా బుసా" ఇందులో తుసా, బుసా లకు ఏ అర్థమూ లేదు. కాని అది విన్నప్పుడు ముఖ్యంగా వాటివల్లనే హాస్యరసస్ఫురణ కలుగుతున్నది. బహుశః ధ్వన్యాలోకంలో చెప్పిన ఈ అంశం మన ప్రస్తుత "ధ్వని" వాదులకి కొంత ఆధారంగా కనిపించవచ్చు. కాని, ఇక్కడ విషయం — కేవలం అర్థశూన్యమైన శబ్దాలను గూర్చి. మన ధ్వని వాదులు" చెప్పే శబ్దాలు అర్థశూన్యమైనవి కావు: వాటి అర్థం వాటికుండగా, వాటి ధ్వని (మోత)ని బట్టి ఏకో ఊహించటం. ఇక రెండోది ధ్వన్యాలోకంలో చెప్పింది రసధ్వని విషయం వీరు చెప్పేది — ఏవో అలంకార వస్తువ్యక్తులు కాబట్టి వస్తువులోను ప్రయోజనంలోను రెంటికీ సంబంధమే లేదు ధ్వన్యాలోకం ఈ వాదానికి ఏ సపోర్టీ పోయదు.

పోతే, అలంకారికులు కొందరు శబ్దనికటత, వాట్యానుమానతి అని ఒక లక్షణం చెప్పారు. శబ్దాలు తమ అర్థాన్ని, కేవలం శ్రవణతాడనం చేతనే స్ఫురింపచేసేటట్లు ఉంటే — అది రికలబ్ధ్యం. దీన్ని ఇంగ్లీషులో 'సౌండ్ ఇకోయింగ్ సెన్స్' అని అంటారు. ఈ లక్షణం మన 'ధ్వని' వాదులకు ఆనందదాయకం కావచ్చు.

"పరిష్వ నిష్ఠుర కుచ క్లిష్టాంశుక బేసిం దురన్" మొదలైన సందర్భాలుగా మనం పైన విభాగించుకొన్న వీరు చెప్పే రెండవ రకం 'ధ్వను' లన్నీ ఈ జాతివి. ఇవొక్కటే అలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు కూడా అంగీకరించిన విషయం.

ఐతే ఒకటే దురదృష్టం — ఇది అసలు ధ్వనే కాకపోవటం (ధ్వని అనే మాట కొంత స్థూలార్థంలో వాడుతున్నాను. వ్యంగ్యం వాచ్యాతిశాయి ఐ ప్రాధాన్యత వహిస్తే ధ్వని అవుతుంది కాని ప్రస్తుతం ఏకో పీలుగా ఉంటుందని, వ్యంగ్యం మొత్తానికి ధ్వని అని వాడుతున్నాను.) వాచ్యార్థానికి వేరైన అర్థం ఉంటే ధ్వని. ఇక్కడ ఆ వాచ్యార్థమే, వేరే అర్థప్రయోజన అవసరం లేకుండా, కేవల శ్రవణతాడన వల్లనే స్ఫురిస్తున్నట్లుంటుందని చెప్పారు. కాబట్టి అది ధ్వని కాదు.

పూర్వ అలంకారికులు అంగీకరించవచ్చు, లేకపోవచ్చు మనమే ఇందులో వున్న సత్యాన్ని చూసి, ధ్వనులుగా ఇప్పుడు విస్తరించుకోకూడదా? విస్తరించుకోవచ్చు. కానీ అందులో సత్యం ఎంతవరకు వుంది? సత్యం ఏమిటి? సాహిత్యంలో సహృదయ హృదయమే ప్రమాణము సహృదయుడైనవాడు ఈ ధ్వనుల్ని

అనుభూతిలోకి తెచ్చుకోగలను. సహృదయుడు త్రికరణశుద్ధిగా వీటి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు, కాదని అనటం ఎట్లా?

కాదనటం కష్టమే. ఈ రకమయితే కొన్ని అటువంటి 'ధ్వనుల్ని' కనిపెట్టి, మనస్సులో వెన్నెల విరిసినట్లు ఆనందపారవశ్యం అనుభవించాను. ఆ ఆనందం నిజంగా ఆనందమూ కాదా అనేది వేరే ప్రశ్న. ఏదో మనస్సు తేలికైనట్లు, తేలిపోయినట్లు ప్రత్యక్షంగా అనుభూతిని పొందిన పిమ్మట కాదనటం ఎట్లా? "ఉన్నతిపద సనుదెంచె పదవినందను డాయెన్" అని హిడింబను నన్నయగారు వర్ణించినప్పుడు "ఉన్నతి"లోని నకారద్విత్వంవల్ల రొమ్ము విరిచి ఏదో చిత్రంగా, ఏదో పొగరుగా నడిచినట్లు కొంతమంది యువతులు కనబడుతుంటారే, అట్లా హిడింబ వచ్చిందన్నమాట, అనుకొని ఆనందించాను. చాలామందికి, ఇటువంటివి చాలా అనిపించవచ్చు.

ఏ అనుభూతి తప్పో, ఏది ఒప్పో నిర్ణయించటం కష్టం. ఎవరు చెప్పేది వాళ్లకు నిజం అని అన్నింటికీ తలవంచుకు ఊరుకొంటే ఏ ఇబ్బందిలేదు కాని ఇటువంటి ఇబ్బందులకు భయపడితే విజ్ఞానమే లేదు. నిర్భయంగా నిష్పక్షపాతంగా సాధ్యమైనంతవరకు సత్యాన్వేషణ సాగించాలి

ఈ ధ్వనుల్ని అంగీకరించవచ్చు అనటానికి చెప్పదగినవాదాల్ని వరుసగా పరిశీలిద్దాం.

1. అది ప్రత్యక్షంగా అనుభూయమాన మౌతున్నది. దీనికిఖండన—ఆ అనుభవం అంతా భ్రమ; ఇక్కడ ఇద్దరి వాదాల్లోనూ నిజం కనిపిస్తుంది. అవి ధ్వనులో, ఊహలో, పిచ్చిలో, ఏమిటో అనుభవంలో ఉన్నమాట మాత్రం నిజం ఏ భ్రమ అయినా అనుభవిస్తున్నంతకాలం నిజంగా భాసించటమూ నిజమే.

2 ఏవో ఊహలైతే నిజమైన ఆనందం కలగదు. కానీ ఈ ధ్వనులవల్ల పట్టలేని సంతోషం కలుగుతున్నది.

ఖం|| కావచ్చు ఊహలైతే నిజమైన ఆనందం కలగకపోవటానికి కారణం అవి ఊహలని అబద్ధాలని మనస్సులో జ్ఞానం ఉండటమే కాని ఇక్కడ ఊహని పూర్తిగా నిజం అనుకొంటూ ఊహించటంవల్ల, అది నిజం మాదిరి అనుభవాన్నే ఇస్తున్నది. ఒక డోలు 'ఢాం' అని మోగితే, అందులో దయ్యం ఉండి అరుస్తున్నదనీ పసిపిల్లవాడు భయపడతాడు. ఆ భయం అబద్ధమా? కళ్ళున్న ప్రతివాడికీ కనపడుతుందే వాడు వణికిపోవటం అది అబద్ధమా? అంతమాత్రాన డోలులో దయ్యం నిజమా?

3 పసివాడి భయానికి ఈ అనుభూతికి పోలికే లేదు పసివాడికి ఏదో కారణంచేత మనస్సులో ఏర్పడిన భావాలు, అప్రయత్నంగా భయోత్పాతాన్ని కల్గిస్తయ్ ఇక్కడ జ్ఞానవంతులైన పెద్దలు ప్రయత్నపూర్వకంగా గ్రహించి ఆనందిస్తారు.

ఖం|| అదే వచ్చిపడింది ఇబ్బంది ఈ పెద్దలకి కూడా, మనస్సులో ఏర్పడిన భావాలవల్లే, ఈ ఊహలన్నీ కలుగుతున్నయ్ ప్రయత్నపూర్వకంగా గ్రహించటం" వల్ల మరింత ఆనందభ్రమ కలుగుతున్నది. చీకటిలో పోతూ ఏ తాటిచెట్టునో చూసి, పెద్దవాళ్ళు కూడా భయపడతారు చెట్టుఆకులు కదుల్తుంటే, దయ్యం 'దొరికావురా' అని వికారంగా తలకాయ ఆడిస్తున్నట్లు ఏవేవో ఊహించుకొని, చెట్టులాంటి మనిషికూడా మూర్ఛపోవచ్చు. అతని మూర్ఛకి దయ్యాలమీద అతని కేర్పడిన నమ్మకమే మొదటి కారణం. ఊరికే ఉండక కొట్టుకోటంతో ఆగకుండా మూర్ఛదాకా రావటానికి, ఒకదాని కొకటి అతడు కల్పించుకోవటం హేతువు.

4 అట్లా అనుకొంటే అంతా కల్పనే అవుతుంది మనస్సుకు ఏదినిజమో, ఏది అబద్ధమో తెలుసుకొనే శక్తి ఉంటుంది. లేకపోతే ఒకటి నిజం ఒకటి అబద్ధం అవటం అంతా మిథ్య అవుతుంది. మొట్టమొదట తప్పుగా ఏదో అభిప్రాయం ఏర్పడినా, ఆ అభిప్రాయం మీదనే, ఫలానా శబ్దసంఘటనకి ఎలాంటి 'ధ్వని' అనుకొంటూ ఆలోచిస్తుంటే. ఏదో ఒకభావం స్పష్టంగా ఎందుకు తోస్తుంది? అక్కడ ఏమీ లేకపోతే ఆలోచించినకొద్దీ అస్పష్టమై అయోమయం కావద్దా?

ఖం|| మనస్సుకి ఏదినిజమో ఏది అబద్ధమో నిర్ణయించగలిగే శక్తి ఉంటే, మానవజాతి వందల వేల సంవత్సరాల పురోగమనం తర్వాత ఏదినిజం, ఏదిబద్ధం అంటూ ఈ నాటికి ఎటుమాచినా ప్రశ్నార్థకాలు ఎందుకు కనిపిస్తయ్? సత్యనిర్ణయతృష్ణ, సత్యనిర్ణయశక్తికన్న ఎక్కువగా ఉంది. ఎక్కడికక్కడ

మనస్సు నిర్ణయాలు చేస్తుంటుంది. అందుకనే ఎవరి ఊహాలు, అభిప్రాయాలు వారికి పరమసత్యాలుగా కనబడటం. ఒక అభిప్రాయం మార్చుకోవాలంటే వ్యక్తిగాని, జాతిగాని ఎంతో కష్టపడటం అందుచేతనే. కాని అభిప్రాయాలు మారుతుంటయ్ కొత్త భావాల్ని గ్రహించే శక్తివుంది మనస్సుకు. ఏదో ఒక నూతనాభిప్రాయం రాగానే, అంతకు ముందున్న నిర్ణయాల్ని దాంతో సమన్వయపరిచి, అవసరానికి వీలైన మరో నిర్ణయాన్ని చేసి కూర్చుంటుంది మనస్సు. ఎప్పటి కప్పుడు, ఒక్కొక్క, విషయంలో ఉన్న భావ సంఘాతంతో సామరస్యపూర్వకంగా సానుకూల నిర్ణయాలు తయారుచేసి పడేస్తుంటుంది మనస్సు. ప్రస్తుతవిషయంలోను ఏదో ఉంటుందని మనస్సుని ఆలోచిస్తే, మనస్సులోపలి ఒక భావానికి ఒక భావానికి ఉన్న చిత్రమైన సంబంధాల్ని (ఎసోసియేషన్ అఫ్ ఐడియాస్) పురస్కరించుకొని, ఇదిగో ఉన్నదని చెబుతుంది. ఈ పనిఅంతకి నరాలుపడే బాధ ఆ నిర్ణయం చూడగానే వదిలిపోతుంది గాబట్టి, ఎంతో హాయి, ఏదో లీల అనిపిస్తుంది. అంతేగాని ఇవేవీ ధ్వనులు కావు.

5. చాలా బాగుంది. ఇవి ధ్వనులే అనటానికి అవసరమైన వాదసామగ్రి అంతా కొదవే చేత్తోనే అందించినట్టయింది. ఏ ధ్వనివిషయంలోనైనా జరిగేది అదేగా. అప్పటికిఉన్న భావసంఘాతం ఆధారంగానేగా ఆ వివిధ ధ్వనులు పుట్టేది. అక్కడకూడా నరాలబిగువు వదలటంవల్ల, భావనాశక్తి సంతృప్తమవటంవల్లనేగా ఆనందం. అందుకనేగదా అలంకారవస్తుధ్వనుల్లో వ్యుత్పత్తి అవసరం అవటం. సరే రసానికి వాద్యనికి అంటూ లేనేలేదు. ఆ ఆనంద విచారం ప్రస్తుత దర్శనీయాంశానికి అతీతం పోనీండి. ఏదైనా ఈ "ధ్వనులు" ధ్వనులేనని మీరే నిరూపించారు.

ఖం॥ భలే మొదటికి దిగజారి ఏదో శిఖరం ఎక్కామనుకొంటున్నారే. ధ్వన్యాలోకంలో ధ్వనులన్నీ అర్థం మీదనించి వచ్చేవి. కావ్యానికి అర్థమే ప్రధానం. సర్వం మీరుచెప్పేది కేవలశబ్దం-నాదం. దాని వ్యవహారం అంతా సంగీతశాస్త్రానికి సంబంధించింది.

6. కావ్యానికి నాదంకూడా ముఖ్యమే. కేవల అర్థరహితమైన "రుసా, బుసా"లకు ధ్వని ఒప్పుకొన్నారు. శబ్దనికటత అనేది ఒకటితెచ్చి ఉత్త ధ్వనులే (మోతలు) అర్థాన్ని సూచిస్తున్నట్లుంటయ్ అన్నారు. వీటినిబట్టి ఉత్తధ్వనులకు (మోతలు) ధ్వనుల్ని చెప్పుకోవచ్చని పరోక్షంగా ఒప్పుకొన్నట్లు కాలేదా. కావ్యానికి అర్థమే ముఖ్యమేమిటి? శబ్దం అర్థం విడదీయరానివిగదా. "వాగర్థావివ సంపృక్తౌ" అవటం అందరికీ తెలిసిందే కాగా, రమణీయార్థ ప్రతిపాదకశబ్దమే కావ్యమనిగదా ఆలంకారికమూలిభూతమతం. అటువంటప్పుడు శబ్దంవల్ల ఆవిర్భవించే సొగసుల్నికూడా పుణికిపుచ్చుకొన్నవాడు కావ్యం నిలువు నిలువునా మెరుగుల మొలకలై మురుపుసల కదా! కాదనటం ఎంతవిరసం. ధ్వన్యాలోకం చెప్పినా లేకపోయినా, మనం చెప్పుకొందాం. ఒప్పుకొందాం.

ఖం॥ సరి. నాదం వదిలేసి కవిత్వంలో పడ్డారు. కావ్యానికి అర్థమే ముఖ్యం శబ్దంకూడా ముఖ్యమే అవటం, దానివల్ల వచ్చే మెరుగుల్ని పుణికిపుచ్చుకోవాలనటం - అంతా అవిచారితరమణీయం. శబ్దము అర్థము విడదీయరానివి కాబట్టి, ఏ అర్థంకావాలన్నా శబ్దరూపంగానే మనస్సులో గాని, వ్యవహారంలో గాని మనం చూస్తున్నాం గాబట్టి- అంతవరకు శబ్దంకూడా ముఖ్యమే అనొచ్చు. ఇటువంటి వ్యవహారాన్ని పురస్కరించుకొని శాస్త్రనైశిత్యంకోసం రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యం అన్నాడు జగన్నాథుడు. ఉత్తశబ్దం అనలేదు. అక్కడ ఆ రమణీయార్థమే ముఖ్యం. "వాగర్థావివ సంపృక్తౌ" అనేది మీకే గండకత్తెర అవుతుందని గ్రహించలేకపోతున్నారు. వాక్కు అంటే శబ్దము, అర్థము, ఏవిధంగాను విడదీయలేమని గదా దాని అర్థం. అటువంటప్పుడు ఈ 'ధ్వను'లంటూ ఎట్లాపుట్టేటయ్? ఆ శబ్దానికి ఆ అర్థం నియతం మళ్ళీ ఈ అర్థం, ఈ ధ్వనికాని ధ్వని వీటన్నిటికి ఆస్కారం ఎక్కడ? ఆస్కారం ఉంటే వాగర్థాలు విడదీయరానివి అవటం అబద్ధం కదా, ఇక రుసా, బుసాల విషయం వినకనే మానాం. వాటికే అర్థం లేదు. మీరు చెప్పేదానికి నియతమైన అర్థంఉన్నది. ఉంపెగా పైన ఏదో చెప్పటం అశాస్త్రీయం. ఇక శబ్దనికటత అంటారా? దానిసంగతీ వినకనే మానాం. ఐనా అనేక పెద్ద కావ్యాంశంగా ప్రత్యేకించి చెప్పలేదు. శబ్దాలు అట్లా కనబడు

తున్నాయ్ అన్నారు. అంతకన్న దాన్ని గురించి ఆలోచించవలసింది లేదు గాబట్టి ఆమాట అని వదిలేశారు.

7 ఎందుకో ఒకదానికి వదిలేశారు ఆలోచించవలసింది లేక నే వదిలేశారని ఎట్లా అంటాం? అది ఏమైనా కాని. ఇప్పుడు మనం గ్రహిస్తే కవిత్వానికి ఏం అపచారం? స్పష్టంగా అపచారమంటూ లేకపోతే, దానివల్ల వచ్చే సౌందర్యాన్ని కొంతకు కొంత అందరూ ఒప్పుకుంటున్నారు గాబట్టి, గ్రహిద్దాం.

స్పష్టంగా అపచారంగా కూడా కొంత జరుగుతుంది. చూడండి:—

ఇటువంటి 'ధ్వనుల్ని' కొంతమంది కవుల రచనలలో ఎక్కువగా చూపించవచ్చు. వారు ఇతరత్రా మహాకవులైతే, వారు కవిత్వతత్వానికి ఇది కూడా ఒక గుణంగా చెప్పుకోవచ్చు. చెప్పుకొంటే పెద్దగా ఇబ్బంది లేదు. కాని ఈ ధ్వనులు గాని ధ్వనులమీద దృష్టి ఎక్కువైతే ఏది విన్నా, ఏం చూసినా, వీటి కోసమే వెతుకులాడటం అలవాటైపోతుంది. అప్పుడు కవులకు, కవిత్వానికి తనకు కూడా అపచారం చేసుకొంటాడు.

కవుల్లో ఇటువంటి 'ధ్వనుల'కు అవకాశమైన రచన చేసినవాళ్లు, చేయనివాళ్లు ఉన్నారు. ఆ యిద్దరిలోను మహాకవులూ, ఒకపాటి కవులూ ఉన్నారు. ఈ నాలుగు రకాల కవుల్ని నాలుగువిధాల అపార్థం చేసుకొంటారు.

1. మహాకవులై ఇటువంటి 'ధ్వనుల'కావకాశం కలిగించే రచన చేసినవాళ్లను—వారి మహాకవిత్వానికంతకూ ఈ 'ధ్వనులే' మూలంగా, అదే కవిత్వతత్త్వం, సర్వంగా భావించి, వారిలో ఉండే, నిజమైన రససృష్టి చాతుర్యాన్ని గ్రహించలేకపోవచ్చు

2 మహాకవులై, రసభరితంగా కావ్యరచనచేసిన వాళ్లు, ఇటువంటి ధ్వనుల కావకాశం కలిగించే రచన చేయనివారు — మహాకవులు కాకుండా పోవచ్చు. వారిని అందరూ నెత్తిన పెట్టుకొంటుంటే, కాదంటే బాగుండదని వినేవాడుండడని, ఏదో పక్క దెబ్బలో, వెనకపోటులో పాడిచేరకంగా తయారు కావచ్చు ఇది అన్నింటికన్న దుస్సహమైన ఘోరాపచారం. ఉదాహరణకు తిక్కన మహాకవిని తీసుకొందాం. ఆయన్ని కేవలం అవతారపురుషుడుగా పూజించేవాళ్లున్నారు. ఆయన కూడా ఒక మహాకవి అనేవాళ్ళు ఉన్నారు. ఆయన మహాకవి కాడనేవాడు పిచ్చివాడికింద లెక్క. అయితే ఆ మహాకవి, ఈ విచిత్ర ధ్వనులకు అవకాశమైన రచన చేయలేదు. ఆయన దృష్టి రససృష్టి. సరే ఈ 'ధ్వని'వాదులకి ఆయన కవిత్వం సారవంతంగా కనిపించదు. ఆయన్ని ప్రత్యక్షంగా తిట్టలేక, తిక్కన పలుకుబడిక వాడితనం లేదనో, ఆయనకు శబ్దబ్రహ్మ వశం కాలేదనో—ఏవో మాట్లాడుతారు.

3 సాధారణ కవులై ఈ 'ధ్వనుల'కు అవకాశమైన రచన చేసినవాళ్లను, ఈ 'ధ్వనుల్ని' మాత్రమే చూసి మహాకవుల క్రింద జమచేసి, వారికి ఈయరాని లేనిపోని గౌరవాన్ని ఇచ్చి కూర్చోపెడతారు

4 సాధారణ కవులై ఈ 'ధ్వనుల'కు అవకాశమైన రచన చేయనివాళ్లను, జాతిగా తోటకూరలో పురుగు చేరినట్టు ఏరి పారేస్తారు. వారికి రావలసిన న్యాయమైన గౌరవాన్ని కూడా దక్కనీరు

ఈవిధంగా కవులందరికీ అపచారం జరుగుతుంది. ఈయరాని గౌరవం ఈయటం కూడా నైతికంగా అపచారమే. మహాకవులకు అపచారం జరగటానికి కవిత్వానికి ద్రోహం జరగటానికి భేదం లేదు. నిజమైన రసమయ కావ్యాన్ని ఆస్వాదించే యోగ్యతను, ఈ 'ధ్వని' వ్యామోహం చేతకులా గొంతు నులిమేస్తుంది. ఆవిధంగా వీరు తమకు తామే ద్రోహం చేసుకొంటారు

ఈ 'ధ్వనికి' అనుకూల ప్రతికూల వాదాల్ని చూశాం. ఎంత నిష్పక్షపాతంగా ఎంతసానుభూతితో ఆలోచించినా వీటిని అంగీకరించలేం. ఇవి ధ్వనులవటం అశాస్త్రీయం. ఇందులో ఆనందం ఉన్నదనటం ఆలోచనారహితం. భ్రమమాత్రమైన ఆ ఆనందం కూడా కావ్యజగత్తుకి అసంబద్ధమైంది. ఇది కొలతబద్దలుగా కవుల తారతమ్యం ఎంచబోవటం అవివేకం. ఆ పని కవిత్వానికి అన్యాయం, తనకే అపచారం.

ఈ శబ్దవిలాసాల మోహంలో పడి తాము తప్పుదారిని పోవటమే గాక, ఎన్ని లేతమనస్సులో తప్పుదారులకు కొంతమంది పెద్దలే ఈమధ్య ఈడ్చారు. సాహిత్యవిమర్శ శాస్త్రంలో వెలిసిన ఈ మాయాద్వారంగుండా పోబోయి, మయసభలో దుర్యోధనుడి మాదిరిగా, తల బొప్పి కట్టించుకోక, ముందుగానే సహృదయులు మేల్కొనటం శ్రేయస్కరం.

సీరియల్:

విచిత్ర జీవులు

హితశ్రీ

పాత్రలు: విద్యాపతి, సుందర్రావు, సీతారామారావు, సన్యాసిరాజు, ధర్మారావు, కూర్మావతారం, లక్ష్మీపతి, ఇన్‌స్పెక్టర్ దండయ్యానాయుడు, వరహాలు, కళ్యాణి, మల్లిక

రంగము : 1

** అంతగా జనసంచారం లేని ఒకవీధి. సమయం సాయంకాలం. తెర లేచే సరికి రంగం మీద ఎవరూ ఉండరు. ఆ వీధికి దగ్గరగా ఉన్న మైదానములో బహిరంగసభ జరుగుతున్నట్లు కోలాహలం వినిపిస్తూంటుంది. పట్నంనించి మైదానానికి వెళ్ళేదారుల్లో ఆ వీధి ఒకటి. సభ జరిగే స్థలం అక్కడికి చేరువగానే ఉండటం వల్లా లౌడ్ స్పీకర్లు పని చేస్తూ ఉండటం వల్లా ఉపన్యాసం స్పష్టంగానే వినిపిస్తూంటుంది. రంగస్థలానికి ఎడమవైపు మైదానానికి వెళ్ళేదారి.

అధ్యక్షుడు: అయ్యా, అందరూ నిశ్శబ్దంగా ఉండాలి. ఇందాకటినుంచీ మీరు యెంతో ఓపికతో ఎదురుచూస్తున్న అంశం ఇప్పుడు ప్రారంభము కాబోతోంది. శ్రీ కోటి సూర్య ప్రకాశ రావుగారు ఉపన్యసించబోతున్నారు. వారినిగురించి నేనుమీకు కొత్తగా చెప్పాలిసింది ఏమీ లేదు. వారు సాక్షాత్తూ కోటి సూర్యుల ప్రకాశాన్ని మూర్తీభవింపచేసుకున్న వారు. వారినిగురించి ఏమైనా చెప్పటమంటే సూర్యుణ్ని దివిటీతో చూపించటమే. జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్యమెందుకు, చెప్పండి. వారు అతిరథ మహారథుల కోవకి చెందినవారు. స్వాతంత్ర్య యోధులు. రాజకీయ బాధితుడు—పోరపాటు—నాయకుడు. రాజనీతిశాస్త్ర పారంగతులు. ఆదర్శవాది. విప్లవమూర్తి. వివేకశీలి. వినయ వినమిత గాత్రులు. సంఘసేవకులు, సంఘమిత్రులు. వారిని గురించి చెప్పాలంటే మాటలు దొరకటం లేదు. అన్నట్టు వారినిగురించి చెప్పటం అనవసరం అంటూనే చెబుతూ ఉన్నట్టున్నాను. (సభలో నవ్వులు) వారి ప్రసన్న వదనం చూస్తుంటే ఏకో అలా మాట్లాడేయాలనిపిస్తూంది. సరే, ఇక ఆపేస్తాను. అయ్యా, అందరూ నిశ్శబ్దంగా ఉండాలి. మన ప్రఖ్యాత నాయకుడు శ్రీ కోటి సూర్య ప్రకాశరావుగారు ఇప్పుడు మాట్లాడబోతున్నారు. వారి ఉపన్యాసం మనం శ్రద్ధగా వినటమే వారిపట్ల మనకి గల గౌరవాదరాలకి నిదర్శనం. దేశసేవలో, సంఘసేవలో వారి తల నెరిసింది.

["అబ్బే, ఇంకా నా తల నెరవలేదం"డి అన్న కోటి సూర్యప్రకాశరావు మాటలు అస్పష్టంగా వినిపిస్తాయి.]

ఏమిటీ ?... (నవ్వి) రావుగారు ఇంకా తిరుతిల సెరవలేదంటున్నారు. ఇంత చిన్న వయసులోనే ఎంతో సేవ చెయ్యగలిగినందుకు వారిని మీ అందరి తరఫున నే నభినందిస్తున్నాను వారి అమోఘమైన సేవ మీ రందరూ ఎరిగినదే ఈ మధ్యనే బీదలకి వారు చేసిన వస్త్రదానం—

[అస్పష్టంగా కేకలు : "రుమాళ్ల దానం"]

వారం వారం వారుచేసే ధాన్య దానం—

[అస్పష్టంగా కేకలు: గుప్పిట్లో సగం - గుప్పిట్లో సగం]

నెల నెలా వారుచేసే ధనదానం—

[అస్పష్టంగా కేకలు : దమ్మిడీ, దమ్మిడీ]

వీటన్నిటిని గురించీ ఎరగనివా రెవరు ? త్యాగమో, ధనమో-భక్తితో పెట్టినది పట్టెడైన నేమి? హృదయం ప్రధానం గాని పరిమాణం ప్రధానం గాదు సరే, కాలాతీతమై పోతోంది. మీ అమూల్యమైన కాలం వృథా చేయటం నా కిష్టం లేదు. అదుగో—మన కోటిసూర్య ప్రకాశరావుగారు మైక్ దగ్గిరికి వొస్తున్నారు - సెలవు.

కోటిసూర్యప్రకాశరావు: అధ్యక్ష మహాశయా, సోదర సోదరీ మణులారా! ఈరోజు ఇలా మీముందు నిలబడే అవకాశం దొరకటం నిజంగా నా అదృష్టం. నన్ను గురించి అధ్యక్షులవారు చాలా చెప్పారు. (నవ్వుతూ) ఆయన మాటలు మీరు నమ్మకండి... అంటే, అధ్యక్షులవారు అబద్ధాలకోరని నా అభిప్రాయంకాదు సుమండీ! ఏదో అభిమానంకొద్దీ వా రలా అన్నారు మీరందరూ కూడా నామీద అభిమానంతో అలాగే అనుకుంటారని నాకు తెలుసు. పోతే, ఇవాళ మాట్లాడాలిసిన విషయం గురించి.

సోదర సోదరీమణులారా! ఒక్కసారి మన ఆర్థిక, సాంఘిక రాజకీయ వ్యవస్థల్ని గమనించండి. అన్ని రంగాల్లో మనిషిని మనిషి పీడిస్తున్నాడు. విలువలన్నీ నశిస్తున్నాయి మనిషిని మనిషి అనుక్కుంటున్నాడు 'భిక్షాం దేహి' యాచనే యుగధర్మం ఐపోయింది. "రెండురోజుల్నించీ తిండిలేదు దొరా, ఒక్క కానీ ఇప్పించండి మహారాజా"; "ఇల్లూ వాకిలీ లేనోళ్ళం, తల దాచుకోనియ్యండి బాబూ", "తిండి గింజలకి చాలటం లేదు మరో నాలుగురాళ్లు జీతం పెంచండి స్వామీ"; "స్కూల్లో పేరు కొట్టేశారు, ఏమైనా సహాయం చేస్తారా ?" "అంత కట్నం ఇచ్చుకోలేను, దయవుంచి తగ్గించండి బాబుగారూ" — మహా జనులారా! ఇదీ వరస. అయినా మనం ఇంకా మనల్ని నాగరికులమనే పిలుచుకుంటున్నాం రకరకాల కుక్కమూతిపిందెల్ని వేస్తోంది మన సమాజవృక్షం. 'చెట్టు చెడు కాలమునకు కుక్కమూతి పిందెలు పుట్టును' అని సెలవిచ్చారు పెద్దలు

[హేళనగా కేకలు : కుక్కమూతి పిందెలు! కుక్కమూతి పిందెలు హ.హ.హ. కుక్కమూతి పిందెలు! వీథిలోని మునిసిపల్ విద్యుద్దీపం వెలుగుతుంది]

స్వార్థమనే వేరుపురుగుపట్టి మన ప్రస్తుత సమాజం అనే చెట్టు అతిచిత్ర విచిత్రమైన కుక్కమూతి పిందెల్ని వేస్తోంది. ఈ వేరుపురుగుని సమూలంగా నాశనం చెయ్యటం...

[మైక్ ఫెయిలవుతుంది]

మన అందరి విధ్యుక్త ధర్మం ఇందుకు మీ రందరూ నడుం కట్టాలి.

['మైక్ - మైక్ 'అని కేకలు]

అధ్యక్షుడు: (గట్టిగా) సోదర సోదరీమణులారా! దురదృష్టవశాత్తూ మైక్ చెడిపోయింది. బాగు చేస్తున్నారు. అది బాగుపడేవరకూ ఓపికతో నిశ్శబ్దంగా ఉండాలని ప్రార్థన

[రంగం ఎడమవైపునించి పోలీస్ ఇన్స్పెక్టర్ ప్రవేశం. యూనిఫారంలో వుంటాడు. ఓ చేతిలో లాఠీ ఉంటుంది. రెండో చేతిలో ఓ 'ప్లాకార్డ్' ఉంటుంది చిన్న తడికకి కర్ర తగిలించబడి పోస్టర్ అంటించబడ్డది. ఇన్స్పెక్టర్ రంగంమధ్యకివొచ్చి 'ప్లాకార్డ్'

విద్యుద్దీప స్తంభానికి చేరవేసి దానివైపు చూస్తూవుంటాడు. అదే సమయంలో సీతారామారావు రంగం కుడివైపునించి ప్రవేశిస్తాడు. ఇరవైయేళ్ల యువకుడు. ఖరీదైన పాంట్, అమెరికన్ జాకెట్, దళసరి కళ్ళజోడు ధరిస్తాడు. కెమెరా బెల్టు భుజానికి తగిలించుకొని ఉంటాడు]

సీత : (చదువుతూ) "నేటి సాయంత్రం ఆరుగంటలకు మైదానంలో బహిరంగసభ. శ్రీ కోటి సూర్యప్రకాశరావుగారు ఉపన్యసిస్తారు. శ్రీసన్యాసిరాజుగారు అధ్యక్షత వహిస్తారు." ఈయనకి అధ్యక్షపీఠాలమీద మోజు ఇంకా తగ్గలేదన్నమాట (ఇన్‌స్పెక్టర్‌తో) చూస్తే మీరు పోలీసు ఇన్‌స్పెక్టరల్లే వున్నారు.

ఇన్ : అల్లే ఉండటమేమిటి? నేనేమైనా ఫాన్సీ డ్రెస్ వేశాననా మీ అభిప్రాయం? ముమ్మూర్తులా, సాక్షాత్తూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ని నేను.

సీత : ఇన్‌స్పెక్టర్ గారూ, ఇలాంటి మీటింగులు జరక్కుండా మీరేమీ చెయ్యలేరూ?

ఇన్ : మీ అభిప్రాయం?

సీత : ఈ డబ్బాదప్పళ్లు వినలేక చెవులు దిబ్బెళ్లు కడుతున్నాయి

ఇన్ : డబ్బా దప్పళ్లా? అంటే మీ అభిప్రాయం?

సీత : ఏదో లెండి చూడండి, మీ పేరేమిటి?

ఇన్ : ఎందుకూ? ఇన్‌స్పెక్టర్ దండయ్యనాయుడు.

సీత : ఓ! ఇన్‌స్పెక్టర్ దండయ్యనాయుడు! సాక్షాత్తూ ఇన్‌స్పెక్టర్ దండయ్యనాయుడుగారే. మెగాడ్!

ఇన్ : ఏం? మీరేమీ నేరం చెయ్యలేదుగదా? అలా దిగ్భ్రాంతులౌతున్నారు!

సీత : ఎంత అదృష్టం ఇవ్వాళున్నూ మీ పేరు వినటమేగాని మిమ్మల్నెప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు. మీరీవూరు వచ్చినప్పటినించీ చిన్న చిన్న దొంగల దగ్గర్నించి పెద్ద పెద్ద దొంగతనాల దాకా అన్నీ బంద్ అని అందరూ చెప్పుకోవటమేగదండీ. ఇన్‌స్పెక్టర్ దండయ్య నాయుడంటే కొంతా హడల్ హడల్. సామర్థ్యమంటే అలా ఉండాలి. అసలు మీ కీర్తి, మీ విగ్రహం చూస్తే మీరిలా ఉంటారనుకున్నాలెండి.

ఇన్ : (పొంగిపోతూ) ఇంతకీ తమరెవరో సెలవిచ్చారు కాదు బహుశా కరస్పాండెంటయి ఉంటారు.

సీత : ఎవర్నయితే ఏం లెండి మీలాంటి వ్యక్తిత్వం కలవాణ్ణి కాను.

ఇన్ : మిమ్మల్ని చూస్తుంటే చాలా తీక్షబుద్ధి కలవారని తోస్తోంది

సీత : హ! హ! ఏదో అభిమానంకొద్దీ అంటున్నారు.

ఇన్ : ఎంతమాట! ఒక్క క్షణం కిందట రాకపోతూరా సార్! మిమ్మల్ని సాక్షిగా వేసుకుని వాడిపని పట్టేవాడిని.

సీత : వాడంటే ఎవరు?

ఇన్ : వాడే ఆ ఉప్పరపోలాయ్.

సీత : వాణ్ణి గురించి నేనెప్పుడూ వినలేదే.

ఇన్ : నేను మాత్రం విన్నానేమిటి!

సీత : అయితే వాడేం చేశాడు?

ఇన్ : నన్ను చూసిలేదు కాబోలు ఇందాకో, ఈ బోర్డు చేతపట్టుకుని పరుగెత్తాడు 'ఎవడ్రా!' అని ఒక్క పొలికేక పెట్టేటప్పటికి వెనక్కి తిరిగి నన్ను చూసి హడలిపోయి కూలబడిపోయాడు.

సీత : అరెరె!

ఇన్ : దగ్గరికెళ్లి 'ఏమిట్రా ఆ పని?' అని అరిచేటప్పటికి 'దండం బాబూ, మీ పాదాలట్టుకుంటాను' అని నెమ్మదిగా జారుకున్నాడు. 'పోనీలే, సాక్ష్యం కూడా లేదు గదా' అని వొదిలేశాను.

సీత : కాని ఇది వాడికేం ఉపయోగం?

ఇన్ : ఏది కనిపిస్తే అదే, వెధవ కక్కుర్తి పుల్ల లేరుకోటానికి బద్ధకించి ఉంటాడు.

సీత : పొయ్యికిందకన్నమాట

ఇన్ : మరే. చదువుగాని మూర్ఖుడు. వాడికేం తెలుసు దీని ఉపయోగం.

సీత : వాడికే బాగా తెలుసేమో!

ఇన్ : (ముఖం చిట్లించి) మీ అభిప్రాయం?

సీతా : ఏదైతే ఏం లెండి!

ఇన్ : (కొంచెం ఆలోచించి) ఓ! మీ కరెస్పాండెంటున్నారే, మహా అసాధ్యులండి చూస్తే మీరు నా పేరు పేపర్లోకి ఎక్కించేసేటట్టున్నారే! 'విధ్వంసకుల చర్యలు అరికట్టటంలో పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ దండయ్య నాయుడి ప్రతిభా విశేషాలు' అని పత్రికల్లో రాసెయ్యగూడదు!

సీతా : ఒక వేళ నేను రాస్తే మాత్రం ఎవరు వేసుకుంటారండీ?

ఇన్ : కరెస్పాండెంట్ రాస్తే వేసుకోరా?

సీతా : నేను కరెస్పాండెంటునని ఎవరు చెప్పారు మీకు?

ఇన్ : (ఆశ్చర్యంగా) కాదా?

సీతా : ఎబ్బె కాదు నా వేషభాషల్ని బట్టి ఈ పాటికే మీరు గ్రహించి ఉండాలిసింది. నా కున్నంత తీక్షబుద్ధి మీకు లేనట్టుందే!

ఇన్ : (కోపంగా) ఏమిటీ?

సీతా : అహాఁ! ఊరికే, మాటవరసకి అంటున్నాను.

ఇన్ : ఆ కెమెరా చూసి మీరు విలేకరి అనుకున్నాను. ఇందులో నా తప్పేముందీ?

సీతా : మిమ్మల్ని మోసగించటం నాదే తప్పులెండి. కాని నేను మోసపోలేదు, చూశారూ!

ఇన్ : యూనిఫారంచూసి ఎవరైనా ఊహించగలరు

సీతా : మరి నేను తీక్ష్ణబుద్ధినని మీరే అన్నారే.

ఇన్ : ఏదో అనుకున్నాను. అదంతా పైపటారమే కాగూడదూ?

సీతా : మీకు బాగా కోపం వచ్చినట్టుంది.

ఇన్ : అందుకు నేను బాధ్యుణ్ణి కాను. మీరేదో పెద్దమనిషనుకున్నాను. ఇంకా సాక్షిగా కూడా వేసుకుందామనుకున్నాను

సీతా : మీరు వేసుకుంటే మాత్రం నేను ఒప్పుకోవద్దూ?

ఇన్ : రూల్ ప్రకారం ఒప్పుకోవాలిసిందే.

సీతా : అయితే అబద్ధం ఆడేస్తాను.

ఇన్ : ఏమిటీ!

సీతా : సరదాగా అబద్ధాలాడేవాడికి ఓ ఇల్లు నిలపటంకోసం అబద్ధమాడటం ఓ లెక్కా?

ఇన్ : చిత్రంగా మాట్లాడుతున్నారే.

సీతా : ప్రపంచం చిత్రంగా లేదూ? ఇప్పటికిప్పుడే ఓ చిత్రం చూశారుగా.

ఇన్ : మీ అభిప్రాయం?

సీతా : ఆలోచిస్తే మీకే తెలుస్తుంది:

ఇన్ : మిమ్మల్ని చూస్తుంటే కోర్టుకి రప్పించాలని సరదాగా ఉంది. కేవలం మీ కోసమైనా ఆ ఉప్పర పోలాయ్‌మీద కేసు పెడతాను. ఊఁ-మీ పేరు? (నోట్ బుక్ తీసి రాయటానికి సిద్ధమౌతాడు.)

సీతా : సీతారామారావు.

ఇన్ : వయస్సు?

సీతా : ఇరవై.

ఇన్ : తండ్రి పేరు?

సీతా : లాండ్‌లార్డ్ అండ్ బ్యాంకర్ సన్యాసి రాజుగారు.

ఇన్ : (ఆశ్చర్యంగా) ఏమిటీ! మీరు సన్యాసి రాజుగారి కుమారులా?

సీతా : స్వయానా!

[ఇన్స్పెక్టర్ నోట్ బుక్ జేబులో పెట్టేస్తాడు] అదేమిటి? పుస్తకం మూసేస్తారేం? రాసుకోండి.

ఇన్ : వద్దులెండి.

సీతా : ఏం? తరవాతెలాగూ కొట్టేసుకోవాలనా?

ఇన్ : (నవ్వి) మొదటే గ్రహించి ఉండాలిసింది. ఇంకొకరైతే అసలు ఇలా మాట్లాడగలరా! ఇంతకీ, మీ వృత్తిఏమిటో చెప్పారుకాదే!

సీతా : సౌందర్యాన్వేషణ.

ఇన్ : (తెల్లబోయి) అంటే?

సీతా : అందంకోసం వెతకటం.

ఇన్ : (కొంచెం హేళనగా) అదిఎక్కడ దొరుకుతుందో!

సీతా : నవనవోన్మేష సౌందర్యాన్ని పుణికి పుచ్చుకున్న పుత్తడిబొమ్మల్ని ఎప్పుడూ చూడలేదా మీరు?

ఇన్ : బొమ్మలు చూసేం!

సీతా : బొమ్మలు కావయ్యా స్వామీ బంగారు బొమ్మల్లాంటి మరువాన్నకిశోరరత్నాలు

ఇన్ : రత్నాలు చూసే భాగ్యమే ఉంటే ఈ ఉద్యోగంలో ఎందుకుంటాను?

సీతా : రత్నాలంటే రత్నాలు కావయ్యా, మహానుభావా! రత్నాల్లా రాణించే రాజీవనేత్రులు చిరునవ్వుల వెన్నెలలు వెదజల్లే పదారుకళల చంద్రబింబసమాన వదనలు. తెలిమబ్బుల్లో తేలిపోయే హంసగమనల తలదన్నే భూలోక సుందరీమణులు.

ఇన్ : ఓహో! అలా చెప్పండి. ఆ చివరిమాట ముందే చెబితే సరిపోయేదిగా. అలాంటి వాళ్లని చాలామందిని చూశానుగాని, అంత మూర్ఛపోవాలిసిన అవసరం నా కెప్పుడూ కలగలేదు.

సీతా : దురదృష్టం. పరమ దౌర్భాగ్యం. తుంటరి చెరకు విలుకాని కుసుమశరాలు మీ ఎదలో ఎప్పుడూ నాటుకోలేదన్నమాట. వలపు తలపులు మీలో మొలకలెత్తనే లేదన్నమాట. మీ హృదయం వట్టి బీడు, ఇసకపర్ర, చౌడు క్షేత్రం. అందుకే సౌందర్యమంటే ఏమిటో మీకు తెలీదు. అతృప్తి మీలో లేనే లేదు.

ఇన్ : అదంతా మృగతృష్ణ సీతారామారావుగారూ

సీతా : ఏమిటీ!

ఇన్ : ఎండమావుల్లో ఎవరైనా నీళ్లు తాగుతారా?

సీతా : ఓ! అదా! హృదయం వట్టి ఎడారైతే కనిపించేవి ఎండమావులే. ఓ వసంతోదయ శుభసమయంలో శుకపిక శారికా గీతికా సంగీతంతో శ్రుతికలుపుతూ మీ హృదయవీణని మోగించండి. ప్రేమించండి. ఇన్స్పెక్టరుగారూ, ప్రేమించండి. అందం, ప్రేమ—ఇవి రెండే ఈ అశాశ్వత ప్రపంచంలో శాశ్వతాలు. అందాన్ని ఆరాధించండి, ప్రేమించండి, ప్రేమ! (ఆకాశం వైపు చూస్తూ, సర్వం మరిచి) ప్రేమ! ఆ మాటలోనే ఎంత అందం ఉంది! ప్రేమకి అందం ఆలంబనమైతే అందానికి ప్రేమ ఆభరణం. ఓహో! (తన్మయుడౌతాడు.)

[ఇన్స్పెక్టర్ అతనివైపు విచిత్రంగా చూసి, ఒకటి రెండుసార్లు పిలిచి ప్రత్యుత్తరం రాక బుర్రగోక్కుని రంగం ఎడమవైపుకి నిష్క్రమిస్తాడు. ఇంచు మించు అదే సమయంలో ఆ వైపునించే విద్యాపతి ప్రవేశం. ఇరవై ఏళ్ల యువకుడు ఇన్షర్టు వేసుకునివుంటాడు. చౌకదుస్తులు, బీదరికం అతని ముఖంలోంచి తొంగిచూస్తూంటుంది. అందమైన విగ్రహం. జుట్టు దువ్వుకోడు. అతని కదలికల్లో, మాటల్లోకూడా ఓ విధమైన వైరాగ్యం ప్రస్ఫుటమౌతుంది. ఏదో వస్తువు పోగొట్టుకున్నట్టు, ఆశగా దానికోసం వెతుకుతున్నట్టుగా ఉంటాయి అతని చూపులు. సీతారామారావు ధోరణి చూసి ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ సమీపిస్తాడు విద్యాపతి]

ప్రేమా! నువ్వు నిజంగా అందాల పాలవెల్లివే! కాని నీకు ప్రేమ అనే ఆభరణం లేదు. అయినా నీ అందం ప్రకాశిస్తూనే ఉంది. కాని... కాని నువ్వు ఎడారిపువ్వువి. వర్షించని మేఘానివి. నీకు హృదయసౌందర్యం లేదు. ప్రేమా! ఊ హూ.

[అతని భుజంమీద చెయ్యేస్తాడు విద్యాపతి. సీతారామారావు ఉలిక్కి పడతాడు]

ఓ! నువ్వా! విద్యాపతీ! ఎవరో అనుకుని ఉలిక్కి పడ్డాను.

విద్యా : ఛీ ఛీ! ఏమిటి నీలో నువ్వు మాటాడుకుంటున్నావు?

సీతా : లేకపోతే నామాట ఎవరు వింటారు? (చుట్టూ చూసి) ఇన్స్పెక్టర్ గారు ఎప్పుడో జారుకున్నారే!

విద్యా : ఇన్స్పెక్టరెవరు?

సీతా : పోలీసు ఇన్స్పెక్టర్ దండయ్యనాయుడు.

విద్యా : పరిచయస్థుడా?

సీతా : ఇప్పుడే పరిచయం అయింది పాపం, అతనికి లాఠీభాష తప్పితే ఇంకేమీ తెలియదు.

విద్యా : అంటే నీ ఉద్దేశం నీలా కనుసైగలతో మాటాడ్డం చేతకాదనేనా?

సీతా : ఏమాత్రం రసపిపాస లేదోయ్.

విద్యా : తీరిక లేదేమోలే.

సీత : తీరిక చూచుకుని అలవాటు చేసుకుంటే అక్కర్లేదా కళాహృదయం? పిచ్చివాడా!

విద్యా : పోనీలే ఏదో ఉద్యోగం చేసుకుంటూ నిట్టూర్పులు లేకుండా హాయిగా బతుకుతున్నాను.

సీత : నిట్టూర్పులు లేని జీవితంకూడా ఓ జీవితమేనా? ఎప్పటి నిట్టూర్పులే అప్పటి జీవితానికి నాంది. విద్యాపతీ, చీకటి పడితే కదూటోయ్ చంద్రబింబం కనిపించేది?

విద్యా : ఔనౌను. అయితే, నిన్ను తప్పక అభినందించాలిసిందే!

సీత : ఎందుకూ?

విద్యా : ఇంతకి ముందే కదూ నువ్వు నిట్టూర్పులు విడిచావు!

సీత : ఓ ఔనౌను. (జాలిగా) నిట్టూర్చాను.

విద్యా : కారణం తెలుసుకోవచ్చా?

సీత : నీకు తెలీదూ?

విద్యా : తెలిస్తే ఎందుకడుగుతాను?

సీత : నా నోటివెంట వినాలని—

విద్యా : ఎబ్బే! నా కటువంటి సరదాలు లేవు.

సీత : నిజంగా నీకు తెలియదా?

విద్యా : ఊఁహూఁ.

సీత : (కొంచెం ఆశాభంగం చెంది) ఆశ్చర్యంగా ఉందే!

విద్యా : ఏం?

సీత : అందరికీ తెలుసు నన్నెరిగినవాళ్ళకి కూడా.

విద్యా : వింతగా ఉందే.

సీత : ముఖ్యంగా మన కాలేజీలో—

విద్యా : మన కాలేజీ కాదు నే నీమధ్య కాలేజీ మానేశానుగా.

సీత : (ఆశ్చర్యంగా) మానేశావా? ఎప్పటినించీ?

విద్యా : ఈటరమ్ మొదటినించీ.

సీత : ఎందుకూ?

విద్యా : సరదా పోయి.

సీత : సరదా?

విద్యా : ఊఁహూఁ—విసుగు పుట్టి—

సీత : విసుగా?

విద్యా : అహఁ—కోపం వచ్చి.

సీత : కోపమా?

విద్యా : కాదులే. తెలివిమీరి.

సీత : ఏమిటి నీ గొడవ?

విద్యా : ఏముంది? డబ్బెక్కువైందిలే.

సీత : (విద్యాపతిని ఎగాదిగా చూసి) అంత డబ్బు—(దప్పున స్ఫురించి) ఓ—డబ్బు లేక మానేశానంటావేం? (నవ్వి) డొంక దారి పట్టించి దుంప తెంపేశావే.

విద్యా : నీవంత బహుపరాక్ చిత్తగిస్తుంటే నే నేం చెయ్యమను?

సీత : పరాకు కాకేమిటి, సర్వస్వం పోయింతరవాత?

విద్యా : ఏమిటీ!

సీత : నా సర్వస్వం పోయిందోయ్ విద్యాపతీ!

విద్యా : సరిగా చెప్పు.

సీత : నా ఆస్తిని కోల్పోయాను.

విద్యా : ఎలా?

సీత : దొంగతనం. ఎలా ఏమిటి!

విద్యా : ఎక్కడ?

సీత : కాలేజీలో.

విద్యా : కాలేజీలో దొంగతనమా?

సీత : తొంగలి రెప్పలు తొలగించి ఆ చెలి తొలిసారి చూచిన వాలుచూపులే నా మనసునీ, హృదయాన్నీ—సర్వస్వాన్నీ దోచుకున్నాయి.

విద్యా : (నవ్వి) ఓహో పుష్పబాణవిలాసమా! మరేమిటో అనుకున్నాను

సీత : అంతులేదోయ్ ఆ అందానికి. హద్దు లేదోయ్ ఆ విలాసానికి. నా మనసులో వెన్నెలజల్లులు కురిశాయి. కోరికల పంటలు పండాయి. హృదయంలో ప్రణయ ఝరులు పొంగి పొర్లుతూ పారాయి.

విద్యా : ఐతే నిట్టూర్పులెందుకు?

సీత : స్వేచ్ఛగా జలజలా సాగిపోయేనదికి ఆనకట్ట కడితే ఏమౌతుంది?

విద్యా : ప్రజలు బాగుపడిపోతారు.

సీత : విద్యాపతీ మనసారా ప్రేమించాను. కాని ప్రేమ అది అర్థంచేసుకోలేదు. వింటున్నావా?

విద్యా : ఎవరూ అర్థం చేసుకోలేనిది ?

సీతా : ప్రేమ.

విద్యా : (సీతారామారావువైపు నఖశిఖ పర్యంతం చూసి) ప్రేమా ?

సీతా : అవును ప్రేమ. అదే ఆ అమ్మాయి పేరు.

విద్యా : ఓ. ఆ అమ్మాయి పేరా !

సీతా : మూడు రాత్రులు ఏకధాటిగా ఆలోచించి ముచ్చటగా మూడు పంక్తులలో నా మనసంతా ఇమిడ్చి లేఖ రాశానోయ్.

విద్యా : పోస్ట్ చేసి కొంపతీశావా ?—సారీ—కొంపతీసి పోస్టు చేశావా ?

సీతా : ఆహా. రెండూ జరిగాయి.

విద్యా : అయిందీ !

సీతా : నిర్మల ప్రేమ ఓటమి ఎరగదోయ్. ప్రేమ నన్ను కాలేజీనించి సస్పెండు చేయించినా, డిబార్ చేయించినా నేనామెని ప్రేమిస్తూనే ఉంటాను.

విద్యా : ఇంతకీ సస్పెండు చేశారా నిన్ను ?

సీతా : ఆ

విద్యా : పోనీలే. అంతటితో ఆగింది శిక్ష.

సీతా : డిబార్ చేస్తానని బెదిరిస్తున్నాడు ప్రిన్సిపాల్.

విద్యా : మరయితే ఏం చేసేట్టు ?

సీతా : ప్రేమకంటే ఎక్కువటోయ్ కాలేజీ ?

విద్యా : పోనీ, ఆ ప్రేమేమిటో కొంచెం వాయిదా వెయ్యకపోయావా సీతారామారావ్ ?

సీతా : (విద్యాపతిని తీక్ష్ణంగా చూసి) ఎంతరవ హీనంగా మాట్లాడావు! నువ్వు నిజంగా పేదవాడివోయ్ విద్యాపతీ.

విద్యా : అది నా ముఖం చూస్తేనే తెలుస్తోందిగా.

సీతా : ప్రేమ! ఆ మాట తలుచుకుంటేనే ఎంత ఆనందంగా ఉంటుంది. మహోన్నతము, మహోదాత్తము, మహాద్భుతము, ప్రేమ. అది అంచులులేని ఆకాశమంత, పరిహద్దులు లేని సాగరమంత, లోతులు తెలియని అగాధమంత. ప్రేమించటంలోనే దైవత్వం సిద్ధించి మానవత్వం ఆఖరిదాకా అందుకుంటుంది. తెలుసుకోవోయ్, విద్యాపతీ, ప్రేమతత్వం.

విద్యా : నిన్ను చూస్తే తెలుస్తూనే ఉందిలే.

సీతా : భగ్నహృదయుడనైనా ప్రేమిస్తూనే ఉన్నాను. ఆ అందాలరాణి నన్ను నిరసించినా, విసిరికొట్టినా, కసురుకున్నా నవనవోన్మేషంగా నా ప్రేమలత చిగురిస్తూనే ఉంది. ప్రేమ నిర్మలం, నిశ్చలం, అజరం, అమరం, అవ్యాజం, అవ్యయం.

విద్యా : నిష్ఫలం నిరర్థకం—

[రంగం కుడివైపునుంచి ధర్మారావు ప్రవేశం. నడివయస్సు మనిషి. నల్లటి విగ్రహం. కొంచెం ముతకదుస్తులు. బుజంమీద జరీ కండువా ఉంటుంది. ధర్మారావు సమీపిస్తుండగా చూసి తటాలున వెనక్కి తిరిగి మాటలు మధ్యలోనే ఆపేసి విద్యాపతి గభాలున సీతారామారావు చలువకళ్ళజోడు లాక్కొని పెట్టుకుంటాడు. అతను తెల్లబోయిచూసి ఏదో అనబోతుంటే సంజ్ఞతో మాట్లాడవద్దని సూచిస్తాడు విద్యాపతి. ధర్మారావు ఇదంతా చూస్తూనే ఉంటాడు.]

ధర్మా : కళ్ళజోడు పెట్టుకుని కళ్లు కప్పుదామని చూస్తున్నావా? ఏమిటయ్యా ఈ వద్వేషం!

విద్యా : అబ్బెబ్బె! వేషం ఏముందీ?

ధర్మా : వేషం కాకపోతే మరేమిటీ?

[కళ్ళజోడు లాక్కుంటాడు.]

విద్యా : ధర్మారావుగారూ! కొంచెం మర్యాదగా ప్రవర్తించండి.

ధర్మా : చెప్పొచ్చావు లేవయ్యా మహా, మర్యాదట—మర్యాద! మర్యాదగల మనిషివైతే ముప్ఫై రూపాయల బాకీకి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తావా?

విద్యా : ముప్ఫైయా? పాతిక రూపాయలే గదండి మీ కివ్వాలిసింది?

ధర్మా : వడ్డీ ఏ గంగలో కలుపుతావు?

విద్యా : అంత వడ్డీనా?

ధర్మా : అంత గడువా అని అడగవేం? సంవత్సరం నించీ తిప్పుతున్నావు, ముష్టి ముప్ఫై రూపాయలకి.

సీత : ముష్టి ముప్ఫై రూపాయలేగా. పోనీ వదులుకోకూడదూ అంత అవస్థపడకపోతే!

ధర్మా : వదులుకోవాలీ? ఎవరి తాత సొమ్మనీ?

విద్యా : ఎవరిదో అయితే మీరు తిప్పకుండా వదులుకునేవారే, పాపం.

సీత : ముష్టి ముప్ఫై రూపాయలు!

విద్యా : ఓ రోజు మీరు ముష్టి వేసినంత లేదండీ, ధర్మారావుగారూ.

సీత : పోనీ, చందా ఇచ్చినంత

విద్యా : ఎవరికీ?

సీత : వరద బాధితులకి, తుపాను బాధితులకి, కూడూ గుడ్డా లేని దీనజనులకి, దరిద్ర నారాయణులకి.

విద్యా : ఛ ఛ ధర్మారావుగార్ని తక్కువ చేసి మాట్లాడుతున్నావు. ముప్పై-కేవలం-ముప్ఫై రూపాయలా వారు చందా ఇచ్చేది!

సీత : పోనీ, బెనిఫిట్ డ్రామా టిక్కెట్టు కొన్నంత

విద్యా : కొంటే వందరూపాయల టిక్కెట్టుకి తక్కువ టిక్కెట్ కొంటారనుకున్నావా ధర్మారావుగారు!

సీత : ఐతే ఓ నెల మామూళ్ళిచ్చినంత.

విద్యా : ధర్మారావుగారి ఆశ్రితుల సంఖ్య నీకు తెలీదన్నమాట!

సీత : అంత గొప్పవారా ధర్మారావుగారు?

విద్యా : వేరే చెప్పాలా; అరడజను దుకాణాల్ని వారు అవలీలగా పరిపాలిస్తున్నారు.

ధర్మా : చాలించండయ్యా మీ భట్రాజు పొగడ్తలు నాకు తెలుసు వాటి అర్థం ఏమిటో. అసలు సంగతేమిటో చెప్పవయ్యా, విద్యాపతి! అలా గుడ్లు మిటకరించి చూస్తావేం?

విద్యా : నే చెప్పడైనా ఇవ్వనన్నావా?

ధర్మా : ఎందుకంటావూ! ఇచ్చేదుంటేగా! ఇక ఈ ఆటలు సాగవు. ఆదేదో ఇవాళ తేల్చి పారెయ్యి.

విద్యా : రోడ్డుమీద ఇలా నిలదీస్తే ఎలాగండీ?

ధర్మా : నిలదీస్తావా, చెవులు మెలేస్తావా? నీ బతుకేమిటో నలుగురిలో పడెయ్యకుండా ఉంటానా ఇవాళ.

విద్యా : మా కెలాగూ మర్యాద, గౌరవం లేవు. మీ గౌరవం అయినా దక్కించుకోండి. నలుగురిలో అల్లరిపడటం మీకే నష్టం. నవ్వుల పాలౌతారు.

ధర్మా : నవ్వేవాళ్ళిస్తారా ముప్ఫై రూపాయలు? చూస్తా—ఆ నవ్వేవాళ్ళెవరో చూస్తా.

విద్యా : ముప్ఫైరూపాయలపాటి చెయ్యదా మీ గౌరవం?

సీత : ముష్టి ముప్ఫైరూపాయలు!

ధర్మా : ఇదిగో ఆఖరిసారి చెబుతున్నా — ఈ ఆటలు నాదగ్గిర సాగవు. ఉఫ్ ఉఫ్ మని సిగరెట్ మీద సిగరెట్ ఊదేసినవా [illegible] ఈ తెలివి? సిగరెట్లు నాకేం ఊరికే వొచ్చాయా? దమ్మిడీకి గతిలేదుగాని ఏగాని తక్కువరంట. మింగ మెతుకు లేదుగాని మీసాలకి సంపెంగనూనె. స్టూడెంటుట పైగా స్టూడెంట్. ఇంటిపేరు కస్తూరివారూ ఇంట్లో గబ్బిలాల కంపూ. నాకదంతా ఎందుకు? ఇస్తావో, ఇవ్వవో చెప్పు. అడుక్కు తెస్తావో, అప్పు తెచ్చుకుంటావో, దొంగలిస్తావో నాకనవసరం. నా ముప్ఫై రూపాయలూ నాక్కావాలి... ఏం మాట్లాడవేం?

[విద్యాపతి షర్టు కాలర్ పట్టుకుంటాడు. కుడిపైపునుంచి అడ్వొకేట్ కూర్మావతారం వడివడిగా ప్రవేశం—ముప్ఫయి ముప్ఫయి రెండు మధ్యవయస్సు. గ్లాస్కో పంచె, కాలర్ లేని షర్టు, కళ్ళజోడు ధరిస్తాడు. హాఫ్‌బూట్ వేసుకుంటాడు.]

కూర్మా : ఏమిటేమిటి? ఏంజరిగింది? ఆగండి. ఆగండి. (విద్యాపతిని విడిపిస్తాడు) ఏమిటిదంతా?

ధర్మా : (కోపంగా) మధ్యన మీరెవరు?

కూర్మా : నేనా? నేను అడ్వకేట్ కూర్మావతారాన్ని. కె. కె. అవతారం, ఎం. ఏ ఎల్. ఎల్. బి. నంబర్ టెన్, కాలనీ.

ధర్మా : మీ జోక్యం మాకక్కర్లేదు

కూర్మా : అక్కర్లేకపోవచ్చు. కాని పబ్లిక్ రోడ్ మీద గలాటా చేస్తే ప్రాసిక్యూట్ చేస్తారని తెలియ చెప్పటం నావిధ్యుక్తధర్మం.

ధర్మా : సరే, ఇహ మీరు వెళ్లొచ్చు.

శర్మా : పదండి, అందరం కలిసేవెళ్దాం. అక్కడల మీటింగు జరుగుతోంది.

[సీతారామారావు, విద్యాపతి కదులుతారు]

ధర్మా : ఏమయ్యోయ్ విద్యాపతీ, ఆగు, ఆగు! నా ముఫైరూపాయల సంగతి తేల్చి మరీపో.

శర్మా : ముఫైరూపాయలేమిటి?

సీతా : (వెటకారంగా) ముఫ్ఫై ముప్ఫయి రూపాయలు!

ధర్మా : ఇతను నాకు ముఫైరూపాయలు బాకీ ఉన్నాడండి.

శర్మా : ఏమండీ, నిజమేనా?

విద్యా : నిజమే.

ధర్మా : ఆ బాకీ సంవత్సరంనించీ ఎగొయ్యాలని చూస్తున్నాడండి.

విద్యా : అబద్ధం.

శర్మా : ఏమిటి అబద్ధం?

సీతా : సంవత్సరంనించీ కాదండి!

విద్యా : అసలు ఎగొయ్యాలని నాకు ఏకోశానా లేదండి.

శర్మా : మరయితే ఎందుకివ్వలేదు?

విద్యా : డబ్బు లేక నేనండి. గడువు ఇవ్వమంటే గొడవ చేస్తున్నాడాయన.

శర్మా : పోనీ, గడువిచ్చిచూడండి.

ధర్మా : బాగా సెలవిచ్చారు సిఫారసు ఎన్నాళ్లియ్య గడువిచ్చేది?

శర్మా : అతనిదగ్గిర లేకపోతే ఏంచేస్తాడు?

ధర్మా : ఇటువంటి వ్యవహారాలు చాలా చూశాం

శర్మా : అందరూ మీకు డబ్బు ఎగ్గొడుతుంటారా?

ధర్మా : చెముడా లెక్కచేయరూ!

శర్మా : ఇంతకీ, ఇప్పుడేం చేస్తారు?

ధర్మా : మీదారిన మీరుపొండి మేమేదో చూసుకొంటాం.

శర్మా : (విద్యాపతితో) మీ పేరేమిటన్నారు?

విద్యా : విద్యాపతి.

శర్మా : ఈ వివాదానికి పరిష్కారం ఒక్కటే కనిపిస్తోంది. విద్యాపతిగారూ, మీ బాకీ మొత్తానికి ప్రామిసరీనోటు వ్రాసివ్వండి. ఏం?

విద్యా : అలాగే.

ధర్మా : నా కెందుకయ్యా నోటు?

శర్మా : మరేం కావాలి?

ధర్మా : డబ్బు. రొక్కం!

శర్మా : చిక్కొచ్చిందే

విద్యా : నించున్నపాళాన డబ్బెక్కడినించి వొస్తుందండీ?

శర్మా : అవును. సరి. (ఆలోచించి) చూడండి ఈ డబ్బు తీసుకుని ఎన్నాళ్లయిందీ?

విద్యా : ఓ సంవత్సరం.

శర్మా : అంతేనా! లిమిటేషన్ పట్టలేదన్నమాట!

[ధర్మారావు అతనివైపు కొరకొర చూస్తాడు.]

చూడండి! ఈ బాకీ స్వభావం ఎలాంటిది? చేబదులా?

విద్యా : కాదండి (నసుగుతూ) సిగరెట్ల... తాలూకుబాకీ.

శర్మా : ఓ కాతాబాకీ అన్నమాట తీసుకున్నప్పుడల్లా సంతకం పెట్టారా?

విద్యా : లేదండి

శర్మా : మొత్తానికి ఒక్కసారే సంతకం పెట్టారా?

విద్యా : అసలు సంతకం ఎప్పుడూ పెట్టలేదండి.

[ధర్మారావు కొంచెం బెరుగ్గా చూస్తాడు]

శర్మా : సంతకం లేదూ! మైగాడ్!!

ధర్మా : (కొంచెం భయంగా) ఏం లేకపోతే, కాతా బాకీయేగా!

శర్మా : సాక్షులుందా?

ధర్మా : మా కొట్టుగుమాస్తా, పనికుర్రాడు, కాతా పుస్తకం చాలు.

శర్మా : వాళ్లంతా మీవాళ్లేగా?

ధర్మా : అయితే.

శర్మా : ఏంలేదు. సాక్ష్యం బలంగా లేదు. సంతకం అంతకంటే లేదు.

ధర్మా : (కోపంగా) ఆయనే ఒప్పుకుంటుంటే ఇంకా సాక్ష్యమేం కావాలండీ?

శర్మా : ఆయన ఒప్పుకోకపోతే?

ధర్మా : ఎందుకొప్పుకోడు? (తిగ్గి) ఏం, విద్యాపతిగారూ?

విద్యా : ఊఁ

సీతా : నువ్వొప్పుకోకు విద్యాపతీ.

[విద్యాపతి అతనివైపు చూస్తాడు].

కూర్మ : ఒప్పుకుంటే బాకీ ఉంటుంది. లేకపోతే లేదు.

[విద్యాపతి అతనివైపు చూస్తాడు]

విద్య : తరవాత మాట్లాడాం లెండి పదండి ధర్మారావు గారూ

ధర్మ : తరవాత చూసేదేమిటండీ? ఇప్పుడే వలు కుర్లో బాకీ ఉన్నానని చెప్పండి

సీతా : నువ్వు చెప్పొద్దు విద్యాపతి.

ధర్మ : విద్యాపతి గారు అబద్ధమాడతారా? అసలా మాట ఆయన నోటంట వొస్తుందా? తిండికి పేదవైతే గుణానికి పేదా వారు! నేను నమ్మను

కూర్మ : పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందో మనం చెప్పలేం లెండి.

సీతా : బాకీ లేదనవోయ్ విద్యాపతి రోడ్డుమీద ఈ పీడ వొదులుతుంది

విద్య : (మెల్లిగా) అబద్ధమా!

సీతా : మరేం ఫరవాలేదు. వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణవిత్తమానభంగము లందు బొంకవచ్చు!

కూర్మ : చెప్పండి, విద్యాపతిగారూ, మీరు ఈయనకి బాకీ ఉన్నారా?

విద్య : (నవ్వుతూ) లేదని సాక్ష్యం నిరూపిస్తోంది.

ధర్మ : అన్యాయం. అన్యాయం నీ మనస్సే నీకు సాక్షి.

కూర్మ : హుఁ! గొడవ చెయ్యకండి. మనస్సాక్షి కోర్టు వారి సమన్లు జారీకావు పరిస్థితి మీకు ఎదురు తిరిగింది.

ధర్మ : మీలాంటి వాళ్లుంటే తిరక్కేం చేస్తుందీ? ఘోరం, దుర్మార్గం. ప్రోనోట్ ప్రామిసరీ నోటయినా రాయించి ఇప్పించండి

కూర్మ : సమయం మించిపోయింది.

ధర్మ : మించిపోయిందీ! కలికాలం! విద్యాపతీ, నువ్వెలా బాగుపడతావో నేను చూస్తా. అబద్ధాలాడతావూ! కళ్ళల్లో దుమ్ముకొడతావూ! నా ముఖాన మీ పాపాలు కొడతావూ!

(గభాలున విద్యాపతి షర్ట్ కాలర్ పట్టుకుంటాడు. కొంచెం గలభా జరుగుతుంది. ఎడమవైపునించి పోలీస్ ఇన్‌స్పెక్టర్ దండయ్యనాయుడు దడదడా ప్రవేశించి విజిల్ ఊదుతూ, లాఠీ ఊపుతూ.)

ఇన్ : డిస్‌పర్స్, డిస్‌పర్స్. ఏమిటీ గలటా? రోడ్ మీద న్యూసెన్స్, పక్కకిపోండి... ఓ! అపాల్! (గబగబవొచ్చి ధర్మారావుని రెక్కపట్టుకుని లాగేస్తాడు.) అంతా పెద్ద మనుషుల్లే ఉన్నారు. జుట్టూ జుట్టూ పట్టుకుంటారేమండీ? పదండి, పదండి.

(ధర్మారావుని తీసుకుని కుడివైపుకి నిష్క్రమణ)

సీతా : హమ్మయ్య పీడ వొదిలింది.

విద్య : కృతజ్ఞులం, కూర్మావతారం గారూ!

కూర్మ : హాఁ హాఁ దటీజ్ ఆల్ రైట్...దటీజ్ ఆల్ రైట్.

సీతా : (కళ్ళజోడు సవరించుకోబోయి) అరె - నా కళ్ళజోడు...

విద్య : అరెరె. ఆ ధర్మారావు చేతిలోనే ఉంది. కొట్టేశాడు. పరిగెత్తు.

(సీతారామారావు కుడివైపుకి పోతాడు)

కూర్మ : అప్పిచ్చినవాడిని తిప్పించుకు తిరగటం ఓ పెద్ద కళ. ఎగ్గొట్టే ధైర్యం లేకపోతే అసలు అప్పే తీసుకోకూడదు.

విద్య : ఎగ్గొట్టే అలవాటు నాకు లేదండీ.

కూర్మ : లేకపోతే నేర్చుకోండి.

విద్య : నేను దరిద్రుడినే అయినా, నాకు నిజాయితీ ఉంది.

కూర్మ : నిజాయితీ! అంటే?

విద్య : న్యాయం.

కూర్మ : దృక్పథాన్ని బట్టి న్యాయం మారుతూ ఉంటుంది. మీకు న్యాయం అనిపించేది నాకు కాకపోవచ్చు.

విద్య : శాస్త్రసమ్మతమైన న్యాయం అని నా అభిప్రాయం.

కూర్మ : శాస్త్రాలు మారవూ?

విద్య : మార్పు అన్నిటికీ సహజమే.

కూర్మ : అదే - అదే నేను చెప్పేది. కాలానుగుణంగా మనుషులూ, వాళ్ల భావాలూ

కూడా మారిపోవాలి. అందరూ కాల చక్రముతో పాటు గిర్రున తిరగాలిసిందే.

విద్యా : తిరుగుతారు కూడా.

కూర్మా : అప్పుడు అందరికీ సమ్మతిమైందే ప్రపంచంలో నిలుస్తుంది.

విద్యా : (కొంచెం అనుమానంగా) అవును.

కూర్మా : అది ఎలా జరుగుతుందో అడక్కండి. ఎలాగైనా జరగొచ్చు. ఈలోపల మాత్రం ఎవరికి వారే జనాన్ని నెట్టుకొని, తోసుకుని ముందుకు పోవాలిసిందే.

విద్యా : (అంతగా అర్థంకాక) నిజమే.

కూర్మా : విలువల్ని గురించి ఆలోచిస్తుంటే పుణ్య కాలం దాటిపోవొచ్చు. బతుకు సౌఖ్యం ముందు ముఖ్యం!

విద్యా : బాగా చెప్పారు... బతుకు సౌఖ్యం ముందు ముఖ్యం.

కూర్మా : వెధవ ముప్ఫై రూపాయలకి అతనెంత గొడవ చేశాడో చూడండి.

విద్యా : చాలా తలవంపులుగా ఉంది.

కూర్మా : అసలే చిక్కుల్లో ఉన్నట్టున్నారు.

విద్యా : చాలా చిక్కుల్లో ఉన్నాను.

కూర్మా : చదువుకుంటున్నారా?

విద్యా : ప్రస్తుతం మానేశానండీ.

కూర్మా : ఏం చదివారు?

విద్యా : బి. ఏ. మొదటి సంవత్సరం అయింది. రెండో సంవత్సరం చదువుతూ మానేశాను, డబ్బు లేక.

కూర్మా : ఉద్యోగం చేస్తున్నారా?

విద్యా : లేదు. ప్రయత్నించాను. కాని ఎక్కడా దొరక లేదు.

కూర్మా : ఏం? ఖాళీలు లేవా?

విద్యా : ఉన్నాయి కొన్ని. కాని వాళ్ళివ్వనన్నారు.

కూర్మా : ఏం?

విద్యా : నే నెవర్నీ ఎరగను.

కూర్మా : ఎరిక్కపోతే ఉద్యోగ మివ్వటానికేం?

విద్యా : సిఫారసు ఎవరు చేస్తారు?

కూర్మా : లేకపోతే ఏం? క్వాలిఫికేషనుందిగా.

విద్యా : (ఆశ్చర్యంగా) సిఫారసు లేకుండా ఉద్యోగమా!

కూర్మా : ఓహో! పోనీ, కొన్నాళ్లు నా దగ్గిరే ఉద్యోగం ఉంది, చేస్తారూ?

విద్యా : (సంతోషంగా) అంతకంటేనా!

కూర్మా : కాని మీరు చెయ్యలేరేమో.

విద్యా : మీ కా సందేహం వొద్దు. తప్పకుండా చెయ్యగలను. కావాలంటే ఏమైనా ప్రశ్నలడగండి. సమాధానాలు చెబుతాను.

కూర్మా : ఏ సందర్భంలోనైనా చక్కగా అతికేటు నిమిషాలమీద కథ అల్లగలరూ?

విద్యా : (కొంచెం నిరుత్సాహంగా) నేను రచయితని కానండి.

కూర్మా : కనక దండక వాఙ్మయమూ, సహస్రనామావళీ వొచ్చా?

విద్యా : నేర్చుకోలేదండీ.

కూర్మా : అవసరం వొస్తే శిఖాగోపురం పెట్టటం చేతనవునా?

విద్యా : ఉహుఁ! (అనుమానంగా చూసి.)

కూర్మా : తివిరి ఇసుమంబున తైలంబు తీయగలరా?

విద్యా : (అర్థమై, నవ్వుతూ) ఆ అర్హతలు నాకు లేవండీ.

కూర్మా : మరి మీకెలా వొస్తాయూ? పోన్లెండి. అయినా మీకు ఉద్యోగం ఇస్తున్నాను. నెలకి ముప్పై రూపాయలు.

విద్యా : కృతజ్ఞుణ్ణి.

కూర్మా : ఏం ఉద్యోగం చేస్తావయ్యా నువ్వు? పైన ఎంతొస్తుందని కూడా అడగవేం? సరే, రేపటినుంచీ ప్రవేశించు. ఏం?

విద్యా : అలాగేనండి.

కూర్మా : వొస్తా, మరి.

(విద్యాపతి బుజంతట్టి ఎడమవైపుకి నిష్క్రమిస్తాడు. చీకటి ముసుగులోలంవల్ల విద్యుద్దీప కాంతి మాత్రమే రంగంమీద ప్రసరిస్తుంటుంది. విద్యాపతి ఆలోచనగా అటూ ఇటూ పచార్లు చేస్తుంటాడు. సీతారామారావు కుడివైపునించి ప్రవేశం.)

విద్యా : ఏమైందోయ్?

సీతా : ఏముందండీ! కళ్ళజోడు నీదేనని సాక్ష్యం ఎక్కడుందయ్యా అని పొమ్మన్నాడు.

విద్యా : అంత మాటన్నాడూ! అయితే ఏం చేద్దాం?

సీతా : ఏంచేస్తాం! పోతే పోయిందిలే. అడ్వకేట్ అవతారంగారు నేర్పిన పాఠం ఫలితం.

విద్య : ఆయన నాకు ఉద్యోగం ఇవ్వాడోయ్, పాపం.

సీతా : ఓ! అందుకో, ఇవే నా అభినందనలు.

విద్య : కాని నాకా ఉద్యోగం చెయ్యాలని లేదోయ్.

సీతా : ఏం?

విద్య : దరిద్రుడికి కోరిక లెక్కువట. ఎంతో పెద్ద చదువు చదువుకోవాలని నాకు చిన్నప్పటి నించీ ఎంతో ఉబలాటం. కనీసం బి. ఏ. పూర్తిచెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్నానోయ్.

సీతా : మంచిదే.

విద్య : కాని నా ప్రయత్నాలేవీ ఫలించలేదు.

సీతా : ప్రయత్నించవోయ్. కృషితో నాస్తి దుర్భిక్షమ్.

విద్య : అడుగలేక అడుగుతున్నాను. నువ్వేమైనా అప్పివ్వగలవా?

సీతా : ఉన్న సంగతి నీతో చెబుతున్నాను, విద్యాపతీ! మా నాన్నకి నేను చెడిపోతానని చెడ్డభయం. దమ్మిడీదగ్గర్నించి లెక్క చూసి ఇస్తాడు. ఇహ నేనేం ఇవ్వగలను నీకు.

విద్య : నువ్వంటే నువ్వు కాదు. మీ నాన్నగారితో సిఫారసు చేసి అప్పు ఇప్పించలేవూ? ఎంత! ఓ వెయ్యి రూపాయలలోపు చాలు. వాయిదాలమీద తీర్చుకుంటాను.

సీతా : నేను సిఫారస్ చేస్తే అది వ్యతిరేకంగా పని చెయ్యటం నిస్సంశయం. నువ్వే అడుగు.

విద్య : లాభం ఉంటుందా?

సీతా : అడిగితే నష్టమేముంది? ... (అకస్మాత్తుగా విద్యాపతి భుజంతట్టి) అటు చూడు—అటు చూడు, విద్యాపతీ.

[ఎడమవైపునించి కల్యాణి ప్రవేశం. నాజూకు విగ్రహం. అందమైన ముఖం. వాయిల్ చీర కట్టుకుని ఎర్రచోళీ వేసుకుంది. ఎడమచేతికి బంగారు రిస్టువాచీ ఉంది. చేతిలో ఓ చిన్న నోట్ బుక్ ఉంది. తల కొంచెం వాల్చి నడుస్తూ ఉంటుంది]

రంభ! ఊర్వశి! మేనక! తిలోత్తమ! కాదు. సౌందర్యమే నడిచివొస్తోంది. సౌందర్యం!

[కల్యాణి సమీపిస్తుండగా గభాలున కెమెరా తీసి 'క్లిక్' చేస్తాడు. ఆ 'ఫ్లాష్' వెలుగులో కల్యాణి మెరుపులా మెరుస్తుంది. ఒక్క క్షణం ఆమె బిత్తరపోయి, తేరుకుని సీతారామారావువైపు నిప్పులు కురిసేట్టు చూస్తుంది. అతను గబగబ ఆమె దగ్గిరికి పోతాడు. విద్యాపతి మాత్రం దూరంలో నిలుచుని చూస్తూ ఉంటాడు.]

క్షమించండి....ఓహ్! పద్మాలయలలో కాంతి ధిక్కరించే అపురూపసౌందర్యం! మేఘసంఘర్షణలో భూమికి జారిన విద్యుల్లతో, ఆకాశంనించి రాలిన నక్షత్రమో, ప్రకృతిని మురిపించి వచ్చే వసంతలక్ష్మో అనిపిస్తున్నారు. ఓహ్!

[కల్యాణి ముఖం చిట్లించుకుని ముందుకు పోతోంది]

క్షమించండి. నన్నపార్థం చేసుకోకండి. ఆ సౌందర్యం కనుమరుగౌతుందని భయపడి అలాచేశాను. సౌందర్యారాధనే నా జీవిత లక్ష్యం. చంద్రుణ్ణిచూసి పొంగే సముద్రంలా అందాన్ని చూసి ఉప్పొంగి పరవశించిపోతాను. ఆ ఉన్మత్తతలో ఏంచేస్తానో, ఏం మాట్లాడుతానో కూడా నాకు తెలీదు. నా జీవితంలో ఎప్పుడూ ఇంత అందం చూడలేదు.

[కల్యాణి తప్పించుకుపోవాలని చూస్తుంది. కాని దారికడ్డం నిలబడతాడు సీతారామారావు. ఆమె కోపంతో ఇక చుట్టూ చూసి విద్యాపతిని గమనిస్తుంది. మరో వ్యక్తి ఇదంతా చూస్తున్నాడని తెలియటంతో ఆమె ముఖం మరీ జేవురిస్తుంది.]

కాళిదాస మహాకవి రూపకల్పన కళ్లముందు గోచరిస్తోంది. (ఆమె కళ్లలోకి చూస్తూ) ముఖాంభోజంలోని ఆ ఇందీవరద్వయం!-

కల్యాణి : (కోపంగా) ఇడియట్!

[ఛెళ్ళున అతని చెంపమీద దెబ్బ వేసి దరదర వెళ్ళిపోతుంది కల్యాణి. చెంపమీద చెయ్యి వేసుకుని ఆమె వెళ్ళినవైపే చూస్తూంటాడు సీతారామారావు. విద్యాపతి అతన్ని సమీపిస్తాడు]

విద్యా : (కొంచెం అవహేళనగా) గట్టిగా తగలేదు కద!

సీత : (సిగ్గుపడక) "పేరలుకన్ చెందిన యట్టి కాంత లుచితవ్యాపారముల్ చేర్తురే!"

విద్యా : దిగులుపడకు. "తుణతుణముల్ జవరాండ్ర చిత్తముల్!"

సీత : అబ్బ సౌందర్యమంతా మూర్తీభవించిందోయ్ ఆమెలో.

విద్యా : పెంకెతనం కూడా.

సీత : ఒక్క చూపులోనే నా సర్వస్వం అపహరించిందోయ్.

విద్యా : నీ సర్వస్వం ఇదివరకే పోయిందిగా.

సీత : అది భ్రమ. ఇది నిజం. సందేహంలేదు. ఆమెని మళ్ళీ చూసేదాకా నిద్రపట్టదు. ఆమె ఎవరో తెలుసుకోవాలోయ్.

[కుడివైపుకి పోతాడు. అతడు నిష్క్రమిస్తుంటే విద్యాపతి కాసేపు అలాగే జాలిగా చూసి, ఏదో ఆలోచిస్తూ, ఎడమవైపు చీకట్లో ఓమూలకి పోతూఉంటాడు. అదేసమయంలో ఎడమవైపునించి లక్ష్మీపతి ప్రవేశిస్తాడు. లక్ష్మీపతి యాభైఏళ్ల మనిషి. సన్నగా పొడుగ్గా ఉంటాడు. దళసరం ధోవతీ, షరూ, కండువా ధరిస్తాడు. అలిసిపోయిన ముఖం. కష్టాల బరువు మొయ్యలేక కొంచెం వంగినట్లుగా ఉంటుంది నడుము; ఆ చీకట్లో సరిగా కనిపించక విద్యాపతిని ఢీకొని కింద పడతాడు. వెంటనే విద్యాపతి వొంగి అతన్ని లేవదీస్తాడు. ఆ చీకటిలో ముఖాలు సరిగా కనిపించవు]

విద్యా : ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాను. చూడలేదు. క్షమించండి.

లక్ష్మి : పరవాలేదులెండి. (నెమ్మదిగా నిష్క్రమిస్తాడు)

[విద్యాపతి ఆగి, జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి ఓ సిగరెట్ తీసుకొని, పెట్టె జేబులో పెట్టి నిప్పుపుల్ల వెలిగించి సిగరెట్ ముట్టించి, నిప్పుపుల్ల కిందికి పారేసి అకస్మాత్తుగా ఉలిక్కి పడతాడు. మరో నిప్పుపుల్ల వెలిగించి కిందికి చూసి నేలమీదనించి ఓ పర్సు తీస్తాడు. రంగం మధ్యకివొచ్చి పర్సు తెరిచిచూస్తాడు. వందరూపాయల నోట్లుంటాయి లెక్కపెడతాడు, పది ఉంటాయి.]

విద్యా : (కుడివైపుకి చూస్తూ చెయ్యెత్తి) ఏమండోయ్.

[హీనస్వరంతో కేకేస్తాడు విద్యాపతి. కాసేపు అలాగే చూసి ఇంకోసారి కేక వెయ్యబోయి ఏదో తలచి మనసు మార్చుకుని చుట్టూచూసి పర్సు జేబులో పెట్టుకొని గబగబ ఎడమవైపుకి నిష్క్రమిస్తాడు. కొంచెంసేపాగి కుడివైపునుంచి లక్ష్మీపతీ ఇన్‌స్పెక్టర్ దండపాణినాయుడూ ప్రవేశం]

లక్ష్మి : (తను పడీచోటు చూపిస్తూ) ఇక్కడే, ఇక్కడేనండీ ఇన్‌స్పెక్టర్ గారూ!

ఇన్ : పబ్లిక్ రోడ్ మీద పర్సు పారేసుకుని మళ్ళీ వెతకటానికొచ్చేవాడే పిసలైన అకావాడి

[ఇన్‌స్పెక్టర్ టార్చిలైట్ వేసి చుట్టూ చూస్తాడు]

లక్ష్మి : ఇంకెక్కడ దొరుకుతుందండీ? కావాలనే ఢీకొట్టి పర్సు కొట్టేశాడండీ పరమలుచ్చా! మర్యాదగా లేవదీస్తే ఎంత మంచివాడో అనుకున్నాను. ఇంత దగుల్బాజీ అనుకోలేదు. ఎంత ఎత్తువేశాడండీ ఇన్‌స్పెక్టరుగారూ! నన్ను రక్షించండి దేవుడల్లే సమయానికి కనిపించారు. నా డబ్బు కొట్టేసినవాడిని పట్టుకొని జైల్లో తోక్కి నా డబ్బు నాకిప్పించండి. ఒకటా, రెండా! వెయ్యి. వెయ్యి రూపాయలండీ!

ఇన్ : చోరీ జరిగినట్టు స్టేషన్లో రిపోర్టివ్వండి. అదృష్టం బావుంటే దొరకొచ్చు.

లక్ష్మి : దొరక్కపోతే ఎలాగండీ! సర్వనాశనమై పోయినట్టే. ఇల్లు తాకట్టుపెట్టి తీసుకున్న డబ్బండీ. అమ్మాయి పెళ్లి చేద్దామని గంపెడాశతో ఉన్నాను. కట్నం ఇహ ఎక్కడినించి తెచ్చేదండీ.

ఇన్ : మీ పేరేమిటి?

లక్ష్మి : లక్ష్మీపతి.

ఇన్ : లక్ష్మీపతిగారూ, అధైర్యపడకండి. దండయ్యనాయుడు ఇలాంటి కేసులెన్నో పట్టుకున్నాడు.

లక్ష్మి : ఎవరండీ వారు?

ఇన్ : ఇన్‌స్పెక్టర్ దండయ్యనాయుడి నే ఎరగరూ?

లక్ష్మి : చిత్తం, ఎరగనండి.

ఇన్ : ఈ లాఠీ ఆయనదే.

లక్ష్మి : అయితే తమరికెలా వొచ్చిందండి?

ఇన్ : ఈ టోపీ ఆయనదే.

లక్ష్మి : తమరే ఆయనకారుగదా!

ఇన్ : వాడే వీడు.

లక్ష్మి : ఓహో! ఎంతఅదృష్టం. (చేతులు జోడించి) నన్ను రక్షించండి ఇన్‌స్పెక్టర్ గారూ, భారమంతా మీమీదే వేశాను.

ఇన్ : మరేం ఫరవాలేదు, పదండి.

[ఇద్దరూ కుడివైపుకి నిష్క్రమిస్తారు. మైక్ బాగుపడుతుంది]

కోటి : సోదర సోదరీమణులారా! అదృష్టవశాత్తూ ఇప్పటికైనా మైక్ బాగుపడ్డది. ఇప్పటికే కాలాతీతమైపోయింది. నా ఉపన్యాసం త్వరగా ముగించేస్తాను. నే చెప్పే దేమిటంటే, రావలసిన సాంఘిక, ఆర్థిక విప్లవాలకిముందు భావవిప్లవం రావాలి, అది రావాలంటే ఎంతో ప్రచారం జరగాలి. యువకులు ముందుకు రావాలి. అందర్నీ ఒక్క తాటిమీద నడిపించే నాయకుడు కావాలి. అతను మంచి అనుభవజ్ఞుడై ఉండాలి. "సర్వేషాం సమస్త సన్మంగళాని భవంతు" అని మనస్ఫూర్తిగా కోరుకుని స్వార్థ రహితుడై ఉండాలి. అంతో ఇంతో దేశానికి మేలుచేస్తున్నవాడై ఉండాలి. అందుకే మీరేపని చేసినా స్వార్థం విడిచి ఆలోచించి మరీ చెయ్యాలని మనవి. కాలాతీతమై పోయింది. ఇక నేను విరమిస్తాను. లోకాస్సమస్తా స్సుఖినోభవంతు. సర్వేషాం సమస్త సన్మంగళానిభవంతు! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

[చివరిమాటలు వినిపిస్తుండగా తెర]

[సశేషం]

శ్రీహర్షుడు

శ్రీ చదలువాడ జయరామశాస్త్రి

ఈ మహాకవి, శ్రీహీరుఁడను పండితుని పుత్రుఁడు. ఈయన తల్లి మామల్లదేవి యను సాధ్వీమతల్లి. జితేంద్రియుఁడీ మహనీయుఁడు. ఈయన చింతామణి సరస్వతీమంత్రము నుపాసించి ఆమంత్రసిద్ధికి ఫలముగ నైషధీయచరిత మను మహాకావ్యమును శృంగార రసోజ్జ్వలముగ రచించిన వాక్సిద్ధుఁడు. తనతండ్రి కవిరాజని నైతము చెప్పికొనియున్నాఁడు. చూడుఁడు. నైషధ కావ్య ప్రతిసర్గాంతమునఁ గల శ్లోక మిది :

శ్రీహర్షం కవిరాజ రాజ
 ముకుటాలంకార హీరః సుతం
శ్రీహీరః సుషువే జితేం
 ద్రియ చయం మామల్ల దేవీ చ యం
తచ్చింతామణి మంత్రచింతన
 ఫలే శృంగారభంగ్యా మహా
కావ్యే చారుణి నైషధీయ
 చరితే సర్గోఽయ మాదిర్గతః.

మఱియు నీ సారస్వత సామ్రాజ్య దీక్షా ధురంధరుఁడు, కవితార్కిక చూడామణి ఖండనఖండ ఖాద్యమను గ్రంథమును సర్వశాస్త్రసిద్ధాంతముల ఖండించుదాని అద్వైతసిద్ధాంతము గావించుదాని రచించిన సర్వజ్ఞుఁడు ఇంకను ఈ కవీంద్రుఁడు కాన్యకుబ్జేశ్వరుఁడైన జయంతచంద్రునివలన తాంబూల ద్వయమును బడయుచు ఉన్నతపీఠ మధిష్ఠించి ఆస్థాన సభాభవనమునకు శోభ గూర్చుచుండినవాఁడు వెండియు సమాధినిష్ఠయందు బ్రహ్మమును సాక్షాత్కరించుకొన్నవాఁడు ఈ వాగ్మివరుని వాక్కు తార్కికుల నొంచుచుండెడిది ఈయన నైషధ కావ్యము మధువర్షి యని చెప్పియున్నాఁడు. ఈ వివరమును గనఁబఱచు శ్లోక మెందును ఖండనఖండఖాద్యము, నైషధము అను గ్రంథములఁ గడపటఁ గన్పట్టుచున్నది :

"తాంబూల ద్వయ మాసనం
 చ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్
యః సాక్షాత్కురుతే సమాధిషు
 పరబ్రహ్మ ప్రమోదార్ణవమ్
యత్కావ్యం మధువర్షి
 ధర్షిత పరా స్తర్కేషు యస్యోక్తయః.
శ్రీశ్రీహర్ష కవేః కృతిః కృతి
 ముదే తస్యాభ్యుదీయా దియమ్ "

ఇంకను ఈ కవిప్రభువు, పైని పేర్కొన్న నైషధము, ఖండనఖండఖాద్యము అను గ్రంథములు రెండును సామాన్యులకు అభేద్యములనియు, తాను గావలెయు ననియే ధీశాలురకే సూక్ష్మ నికషోపలములుగ (కఠినముగ) వాని రచించితి ననియు, ఇవి నారికేళపాకమున నొప్పు కవులో మాత్రము గన్పట్టెను దక్కినచోట్ల సారస్యము గ్రహించుచున్న దనియు ప్రాజ్ఞంమన్యులగు దుష్టులీ గ్రంథముల హరించిఁ జదువఁ గూడదనియు శ్రద్ధతో గురుల నారాధించి గ్రంథముల దృఢగ్రంథు లన్నియు సడలించుకొన్న సజ్జనుఁడు మాత్రమే ఈ కావ్యగాంభీర్యము నోలలాడుచు సుఖింప నర్హుఁడనియు అట్టివాఁడే ఖండనగ్రంథమును బోధపఱచుకొనుటకు యోగ్యుఁడనియు ఖండితముగ ఆ గ్రంథాంతములఁ జెప్పియున్నాఁడు. చూడుఁడు:

"గ్రంథగ్రంథి రిహ క్వచి
 త్క్వచి దపి న్యాసి ప్రయత్నాన్మయా
ప్రాజ్ఞంమన్యమనా హఠేన
 పఠతీ మాస్మిన్ ఖలః ఖేలతు
శ్రద్ధారాద్ధగురుః శ్లథీకృత
 దృఢగ్రంథిః సమాసాదయ
త్వేత త్తర్కరసోర్మి
 మజ్జన సుఖ వ్యాసజ్జనం సజ్జనః"

ఇట్టి కవితల్లజుని దేశకాల జీవితముల నెఱుంగుట పురోభివృద్ధికి సోపానము గావున నిటఁ గొంత వీరిని గూర్చి ముచ్చటింతును.

శ్రీ హ ర్షు ని జ న్మ ము

పూర్వము గోవిందచంద్రుఁడను రాజు కాన్యకుబ్జము నేలుచు వారాణసీ లోనగు పుణ్యక్షేత్రములకు సైత మధిపతియై యుండెను. ఈ నృపాలుని పుత్రుఁడు విజయచంద్రుఁడు. ఈ విజయచంద్రుని తనూజుఁడు జయంతచంద్రుఁడు. ఈయనకు జయచంద్రుఁడను సంగ్రహనామము గలదు. ఈజయచంద్రుని కుమారుఁడు మేఘచంద్రుఁడు. ఇతఁడు తాను సింహాకారమును గాంచి సింగముల డీకొని వాని ఖండించునంతటి ధైర్య శౌర్య సాహసోపేతుఁడు. మదపుటేనుంగుల మసివడించువాఁడు జయచంద్రుఁ డేడువందల యోజనముల మేరగల పృథివీసామ్రాజ్యమున కేలికయై యుండెను. ఈరాజుయొక్క సైన్యము గంగాయమునల జలములఁ గ్రోలుచు నుండెడిది. ఈ ప్రభువరిసేనము దాసీ గోమతి ఆఱువదివేల గుఱ్ఱపుదౌజు వెడసి మూరుర గడ గడ లాడించినది. ఇటువంటి విక్రముల కొఱంతలేని ఈ జయంతచంద్రునికి మొదటునకు పూర్ణత ఆకహింతైవని చెప్పవలయును. ఇతని కాలము క్రీ శ. 12 వ శతాబ్దమని ఈయన దానశాసనములవలనఁ దెలియుచున్నది

ఈ ప్రభువు వారాణసి యందు నివసించుచుండెను. ఈయన ఆస్థానిఁ బలువురు విద్వాంసులు, కవులు నుండిరి. వారిలో శ్రీహర్షుని తండ్రియైన శ్రీహీరుఁ డొకఁడు.

ఈరాజు కొలువున నొకప్పుడు శ్రీహీరునికి రాజపత్నీమువాఁడను నొక గొప్పపండితునితో వాదము ఘటిల్లెను. (ఇతఁడు వ్యాయకుసుమాంజలి కర్త ఉదయనాచార్యుఁడని కొందఱు. దానిని పైన విమర్శింతము) ఆ పండితుఁడు రాజసమక్షమున వాదమున శ్రీహీరు నోడించి యవమతికి లోనుజేసెను. అంత శ్రీహీరుఁడు నోరు మెదల్పనేరక లజ్జాపంకమున దిగఁబడి వైరభారము తన్ను క్రుంగఁదీయ, మనశ్శల్యము గ్రుచ్చుచుండ బాధపడుచుండెను.

ఇట్లు సంతాపమున నేమియుఁ దోఁపక శ్రీహీరుఁడొంటి దీనజనశరణ్య, కరుణామయి యగు దుర్గ నుపాస్తి యుంచెను. ఆ పండితునిభక్తికి మెచ్చి కొంతకాలమునకు భగవతి దుర్గాదేవి కనఁబడి "ఓయి విప్రవరా! నీయెడఁ గరుణగలదాననై నిన్ననుగ్రహింప నేతెంచితి. నీకోర్కె నేనెఱింగితి. ఇఁకఁ గొంత కాలము నకు నీధర్మపత్నియగు మామల్లదేవియం దొక పుత్రుఁడు జనించును. అతఁడు పాల దుర్వాదిమతముల ఖండించి నీమనశ్శల్యముఁ బాపువాఁడు. విశ్వవిఖ్యాతి వహించువాఁడు కాఁగలఁడని వరమిచ్చి దేవి యంతర్హితయయ్యెను.

అయ్యంబ చెప్పినట్లు మామల్లదేవికి సుతుఁ డుద్భవిలెను. అతనికి శ్రీహర్షుఁడని పేరుగలిగెను. బాల్యమునందె శ్రీహర్షుఁడు మహామేధావి కాఁగలఁడన్న సూచనలు గన్పట్టుచుండెను. తండ్రి శ్రీహీరుఁడు ఆ పరాజయము హేతువుగ నానాటికిఁ జిక్కి వ్యాధికి లోనై కడకు మరణశయ్య నుండెను. అప్పుడొకనాఁడు శ్రీహీరుఁడు తనపుత్రుని శ్రీహర్షుని దగ్గఱకుఁ బిలిచి తనప్రక్కఁ గూర్చుండఁబెట్టుకొని యిట్లనియెను:

"నాయనా నేనెందుల కీ యవస్థపాలఁ బడియున్నానో నీకుఁ దెలిపెదను. నన్నొకఁడా పండితుఁడు వాదమున నోడించి పరాభవించుటయే దీనికిఁ గారణము. దానికతఁచి నలుగురిలోఁ దలయెత్తలేక లోలోఁ గుమిలికుమిలి దుఃఖమున నేను పరలోకమునకుఁ బోవుచున్నాను. నాకు నీవు పుత్రుఁడవైనందులకు నిన్నొకటి చేయ నాజ్ఞాపించుచున్నాను. అది యేమంటివేని నిజముగా నీవు నా పుత్రుఁడవై తేని నన్ను వాదమున నోడించి యవమానించిన యాపండితుని రాజసమ్ముఖముననే వాదమున నోడించి నీవు జయముగొంటివేని అదియే స్వర్గముననున్న నాకు ఆత్మశాంతి గూర్పఁ గలదు. ఏమి తండ్రీ ఈపని నాకై చేయఁగలవా చెప్పు మనవుడు శ్రీహర్షుఁడు, తండ్రీ! నేను తప్పక నీయాజ్ఞ నెరవేర్తును. నిన్నా నాఁడు జయించిన పండితుని జయించి కాని ఇప్పటివారి మొగమింకఁ జూడను. నాయనా! ఇదే నా ప్రతిన. నీపాదములంటి ఇదే ప్రమాణము చేయుచున్నాను, అని దృఢముగఁ జెప్పినంతనే శ్రీహీరుఁడు కుమారుని మాటలకు తనవైరి నిర్జితుఁడైనట్లు భావించి కొంత సుమనశ్శాంతి నొంది కొంతతడవునకు కాలధర్మము నొంది స్వర్గ మలంకరించెను

శ్రీహర్షుఁడిప్పుడు తండ్రివియోగమునఁ బెల్లుకుందెను దిక్కులేనివాఁ డయ్యెను. బంధువులు సైతము ఈబాలునికి సాయపడ వెంటనే రారైరి. ఏడ్చినఁ గష్టములు దిక్కునా. కర్తవ్య మాలోచింపవలెఁ గావి.

కావున శ్రీహర్షుఁడు తండ్రికిఁ బారలౌకికము ప్రతీకార్య మెట్లో యొకవిధముగ కష్టముమీఁద నెఱవేర్చి తనకు మిక్కిలి సన్నిహితులగు బంధువులఁ బ్రార్థించి తన కుటుంబభారమును వారి కొప్పఁజెప్పి తాను తపము సేయ నిశ్చయించుకొనెను. ఏలయన తపముగదా అఘటనఘటనా చణము కాని పితృవియోగజము దుఃఖమెంతటిదో ఆయన యవమానంపుదుఃఖమెంత ప్రక్కఁ బట్టి లాగుచుండ నొక కొంతతడవేమియు చేయ నేరక నిర్విణ్ణుఁడైయుండి కని కొంతవంతయు డించుకొనెను. తండ్రిమాట నెఱవేర్పవలసిన విద్య సభ సింపఁ దొడంగెను. కొన్ని శాస్త్రముల నెఱుము అభ్యసనము చేసెను. ఇంతలో నొకగురువు తటస్థపడి యీ బాలుఁ జింతామణి మంత్రముపదేశించెను. అంత శ్రీహర్షుఁడతి నియమనిష్ఠలతో ఆమంత్రానుష్ఠాన మొక యేటిదరిం జేరి యచ్చోనున్న త్రిభువనజనని, భగవతియగు శ్రీగౌరికిని కేవాలయము నందంతటను వసించి యేకాగ్రతా బద్ధాసనుఁడై యొక్క సంవత్సరకాలము దీక్షతో సాగించెను.

ఇట్లెట్టితెలుపి లేక మంత్రమునుష్ఠించి చివరియుఁ దపోనిష్ఠ సాగింప మొదలిడి వారిని [illegible] లక్షేడు గడిచిపోయెను. అంత గౌరీదేవి శ్రీహర్షుని దృఢ భక్తికి మెచ్చుకొని ప్రసన్నురాలై కన్పట్టి, వత్సా నీ తపస్సునకు ఉపాసనకు సంతసిల్లి నిన్ననుగ్రహింప వచ్చితిని. వరము వేఁడుమన, తల్లీ నాకు నీవు వరమిచ్చుటకు ప్రసన్నవైతేని నాకు సంపూర్ణమగు విద్యా ప్రదానముతో నన్ననుగ్రహింపు మనియె. భగవతి సంతుష్టయై యాతఁడర్థించిన కోర్కెయట్ల వరమను గ్రహించి పోయెను.

అంత దుష్ప్రాప్యమైన వరముఁ బ్రాపించి శ్రీహర్షుఁడచిరకాలమునందే తర్కాలంకారములందును వేదవేదాంగములందును సంగీతజ్యోతిషములందును మణిమంత్రాగములందును చక్కని విజ్ఞానము సంపాదించెను. ఈయన వైదుష్య మసామాన్యమైన దియ్యెను ఆ పాండిత్యగరిమ ప్రభావముచే దిక్కు సంబంధమైన జ్యోతిషయందు ఈయనవాణి సర్వత్ర వ్యాప్తమై స్ఫురించెను. రాజాస్థానములందీ మహనీయుని యెదుట బడి పండితవరులు సైతము మెఱుంగ సమర్థులు కాలేరు.

పదంపడి శ్రీహర్షుఁడు లోకోత్తరమగునట్టి విద్యా ప్రాభవమున నలంకృతుఁడయ్యె తనవాణి లోకుల కర్ణాతిథియై పోనీక రాకపోగా ఈ అతివిద్య అవిద్య యయ్యెనని మరల భారతి నుపాసించెను. తర్వాత వాగ్దేవి ప్రత్యక్షమై వత్సా! అతిప్రజ్ఞ నీకు దోషమే యైనది. కావున నీవు నిశీథవేళ శిరముఁ జన్నీటఁ దడిపి తడిసిన తలతోఁ బెఱుగుదాని నిద్రింపుము దాన నీకుఁ గొంత కఫప్రకోప మావహిల్లి కొంత బుద్ధిమాంద్య మేర్పడును. పండితులు నీవాక్కు నంగీకరింతురనెను.

అట్లెట్టులుగావించి పూర్ణమనోరథుఁడై కాశీ పట్టణమున కేతెంచి ఆపురివెలుపలి గణేశువందు నిలిచి రాజును ఆ జయంతచంద్రునికి నేవచ్చి విద్వాంసులఁ గెలిచి గడిదీజేతనని చెప్పిపంపెను. కాన్యకుబ్జేశ్వరుఁ డామాట విన్నంతనే తాను గుణైకపక్షపాతి యగుట శ్రీహీర పండితుని నోడించిన పండితుని వెంటబెట్టుకొని నాలుగు వర్ణములవారును పరివారము దన్నుఁ బరివేష్టింప శ్రీహర్షుఁ డున్న తావుఁ కేతెంచి అటఁ గొంతసేపు సభఁ గావించి శ్రీహర్షు గౌరవపురస్సరముగ నాదరించి సుఖాసీనుం జేసెను.

అప్పుడు శ్రీహర్షుఁడు జయంతచంద్రునిట్లు వర్ణించెను.

"గోవింద నందన తయా చ వపుః శ్రియా చ
మాస్మిన్ నృపే కురుత కామధియం తరుణ్యః
అస్త్రీకరోతి జగతాం విజయే స్మరః స్త్రీ
రస్త్రీ జనః పునరనేన విధీయతే స్త్రీ

ఓ తరుణులారా! ఈ జయచంద్ర నృపాలుఁడు గోవింద నందనుఁడనియును సాగసైన మేని సిరి గలవాఁడనియును నను కొని యీ నృపుంగుఁ గాముఁడను బుద్ధి నుంపకుఁడు. ఏలయన జగముల గెల్చు విజయము నొనట యందు స్మరుఁడు (మన్మథుఁడు) స్త్రీలను అస్త్రీల నుగా (అస్త్రములుగా) చేయుచున్నాఁడు. అనఁగా యువతుల మోహింపఁజేయుటకై యువతుల నస్త్రములుగాఁ జేసి వారిని మోహపెట్టుచున్నాఁడు. ఈ నృపతియన్ననో జగములు జయించుటకు, అస్త్రీజనమును స్త్రీలు గానివారిని (అస్త్రములుగల వీరుల నయిట) స్త్రీజనముగా అబలలుగాఁ జేయుచున్నాఁడు. అనఁగా ఓడించుచున్నాఁడు.

అనునర్థముగల యీ శ్లోకము మహైశ్వర్యమున గంభీరముగ వ్రాక్కుచ్చి వివరించెను. అప్పుడు ప్రభువు, పరివారము ఆ పండితుఁడు (తండ్రివైరి) ఆ శ్లోకార

మునకు మిగుల సంతసించిరి. శ్రీహర్షు నెల్లరు మిక్కిలి శ్లాఘించిరి.

తర్వాత శ్రీహర్షుఁడు తనతండ్రి నవమానించిన పండితు నోరగంటఁ గాంచుచు నీక్రింది శ్లోకము చెప్పెను.

సాహిత్యే సుకుమారవస్తుని
  దృఢన్యాయగ్రహగ్రంథిలే
తర్కే వా మయి సంవిధాతరి
  సమం లీలాయతే భారతీ
శయ్యా వాస్తు మృదూత్తర
  చ్ఛదవతీ దర్భాంకురై రాస్తృతా
భూమిర్వా హృదయంగమో
  యది పతిస్తుల్యా రతిర్యోషితాన్.

మృదుమధురమైన కథావస్తువుగల కావ్య సాహిత్య రసవిచారమునందుఁ గాని చొరవలేనివారికిఁ దుర్గ్రాహ్యములుగాక ప్రమాణాదివాద కర్కశమైన న్యాయవిద్యనము తర్కించుటయందుఁ గాని సన్నద్ధుఁడనై ప్రవర్తించు తఱి నాయొక్క భారతి లీలావిలాసముననే చరింపఁగలదు (అనఁగా సాహిత్య తర్కములరెంటను దాను నిరాఘాటముగ వాదము చేయఁగలననుట.) ఎట్లనఁగా మెత్తని లేఁత చిగురుటాకుల దర్భమొలకలలో మృదువుగ నుండునట్టు పఱచినశయ్య గాని కఠినమైన నేలగాని యేది పతికి మనోజ్ఞమౌనో అదియె కదా అంగనకు రతికూర్చునది.

ఈ శ్లోకము విన్నంతనే శ్రీహర్షుని తండ్రివైరి నెఱఁగంచి శ్రీహర్షుఁ డజేయుఁడని యెఱింగి ఓ వాగీంద్రా నీవు భారతీసిద్ధుఁడవు. నీకు సముఁ డెవఁడు గలఁడన్న నిఁక నీకంటె నధికుఁ డెవఁడున్నాఁడు.

హింస్రాః సంతి సహస్రశోఽపి
  విపినే శౌండీర్య వీర్యోద్ధతా
స్తస్యైకస్య పునః స్తువీమహి
  మహః సింహస్య విశ్వోత్తరమ్
కేళిః కోలకులైర్మదో మదకలైః
  కోలాహలం నాహలైః
సంహర్షో మహిషైశ్చ యస్య
  ముముచే సాహంకృతే హుంకృతే.

కాననమందు మిగులబల్లిదములైన ఘాతుకమృగములు వేనవేలుగలవు గాని లోకోత్తరమైన పరాక్రమముగల సింహము నొక్కదానినే మనము స్తుతించెదము. మృగరాజ మెంతయునుక అహంకారముతోడ తన హుంకారము గావింపఁగా వరాహములక్రీడ మదగజముల మదము ఎలుఁగుబంట్ల కలకలము కొలుగున్నల సంతోష మంతరించెకే.

అని పిత్రువైరి నిన్ను శ్లాఘించి తన తక్కువఁదనము ప్రకటించుకొనుసరికి శ్రీహర్షునికా పండితు నెడఁ గ్రోధము శమిల్లెను. పగవీడెను.

తర్వాత జయచంద్రుఁడు శ్రీహర్షుం గాంచి పండితోత్తమా మీరెవరైనఁ బ్రతివాదులు చెప్పఁదగిన మాట ఇదియే అంత నితనిం గాంచి ఓ శ్రీహీరవైరీ నీవంత చక్కని సమయోచిత మెఱింగితివి. ఎంత ప్రయోజనము సాధించితివోయి. యన్నంత శ్రీహర్షుఁడు తండ్రి విరోధిపై నిసుపూరిగ కినుకొనెను పండితు లిరువురు గాఢాలింగనము చేసికొని నెయ్యులైరి అట్లు ప్రభువు వారి నిరువురఁ గలిపి తోడ్కొనిపోయెను. పిదప శ్రీహర్షునకు సుధాంశునామకమగు సౌధమొండు మంగళప్రదములగు శ్రుతిమంత్రములతో దానమిచ్చెను. శ్రీహర్షుఁడు దానిం బ్రతిగ్రహించెను. మఱియు భూపాలుఁడు మహామేధావికి లక్షదీనారములఁ గూడ నొసంగెను శ్రీహర్షుఁ డంతట నా మేడనివసించుచు మనశ్శల్యము విడిపోవ శాంతచిత్తుఁడై సుఖజీవనము గడుపసాగెను.

ఒకనాఁడు జయంతచంద్రుఁడు శ్రీహర్షుం గని కవిచంద్రా! వాదీంద్రా! నీ వేదైన నొక యపూర్వ ప్రబంధమును రచింపుమా అనెను. శ్రీహర్షుఁడు రాజ ప్రార్థనము మేరకు నైషధమను మహాకావ్యమును (నిషధ దేశపు రాజగు నలమహారాజు చరిత్రమును) కల్యాణాంతముగను, శృంగారాద్యనేకరసోల్బణముగను, మహాగూఢార్థముల ననేకవ్యంగ్యభావముల ప్రకటించునదిగను, సారతరముగను ప్రభువునకుఁ జూపెను. రాజా నైషధీయ చరితమును జూచి సంతసించి కవి సార్వభౌమా యీ కావ్యము లోకోత్తరము, అపూర్వమనుటలో సందియము లేదు. కాని దీని నిరసింపఁ బలువురు ప్రతిపక్షులు నెందుముందురు కావున నట్టి యాదరకొఱకుట్టి పురోభాగులకుఁ గలుగనీక తాను మనోజ్ఞముగ తను యీ కావ్యమును కాశ్మీరమునందలి శారదాపీఠమునఁ బండితుల ప్రోల విన్పించి చూపి వారి మెప్పు వడసి ఆసిమతు మా రాజాముఖమున లేఖ వ్రాయించు.

కొని రంకు, పోంకు అనెను. మఱియు నెవ్వరే నే గ్రంథమేని తాము రచించినచో నున్న నది, లెస్సగనున్న దనుటకుఁ దార్కాణముగ ఆ శారదాపీఠమునందు వెలసి యున్న భారతీమూర్తి హస్తమునందు తమ గ్రంథము నుంతురు. ఆ విగ్రహమున సరస్వతీదేవి సాక్షాత్తుగ మూర్తీభవించి యుండుటచే నటులంజేసి ఆ గ్రంథము సత్ప్రబంధమైనచోఁ దేయూపుట ద్వారా బాగుగ నున్నదని సూచించును. అది యసత్ప్రబంధమైనచోఁ దక్షిణము హస్తమునుండి విసరిపారవేయును. కవుల కావ్యముల బాగోగుల కిది యొకపరీక్ష. కాన తప్పులు చేయుట తమకు, వారికి, లోకమునకు శ్రేయముగాదని పాలింపబడెను.

శ్రీహర్షుఁ డిందులకు సమ్మతించి రాజు తనకు దారిబత్తెమునకుఁ గావలసిన వస్తుసామగ్రి, రెండెడ్ల బండి నొకటియు వలయు సహాయులను సిద్ధము చేసి యీయ వారితో వెళ్లిపోయి కాశ్మీరముం జేరెను. మఱి యా శారదాపీఠమునుం జేరి యచ్చటి పండితులకుఁ దన ప్రబంధము గనఁబఱచి వారు సమ్మతింప ఆ పీఠమున నిత్యసన్నిహితయై తేజోమూర్తియై వెలుఁగుచున్న సరస్వతీదేవి హస్తమునఁ దన ప్రబంధము నుంచెను. ఉంచియుంచకమునుపే సరస్వతి యా కావ్యమును విసరికొట్టెను.

శ్రీహర్షుఁ డదిగని ఏమి దేవీ, నీవు ముగుదవై నందువలనా ఏమి? నీకు మనస్సు చలించినట్లున్నది. నేను రచించిన ప్రబంధమునా నీవు పాఱవైచుట, ఏమి ఈ విచిత్రపరణి? ఏల నన్నిట్లవమానపఱచెదవు? అని యంత ఓయీ! పరుల మర్మములఁ బ్రకటించి భాషించువాఁడా! నీకుఁ దలంపునకు రాలేదా! నీ కావించిన పని. విచిత్రమైన యీ కావ్యమునఁ బదునొకండవ సర్గమున నన్నుఁ గూర్చి యేమి చెప్పితివి. అదియదియని శ్లోకము జ్ఞప్తికిఁ దెచ్చికొమ్ము, దమయంతీ స్వయంవరమునకు వచ్చి ముచ్చటించుచున్న నన్ను:

"దేవీ పవిత్రిత చతుర్భుజ వామభాగా
వాగాలపత్పునరిమాం గరిమాభిరామాం
అస్యారి నిష్కృప కృపాణ సనాథపాణేః
పాణిగ్రహాదనుగృహాణ గుణం గుణానాం"

చతుర్భుజు వామభాగమును బవిత్రము చేసిన వాగ్దేవి యని వర్ణించి నన్ను విష్ణుపత్నిగఁ బ్రకటన చేసి లోకమునందు నిరూఢమైన నా కన్యాత్వమునకు భంగము గావించితివి.

యాచకో వంచకో వ్యాధిః
పండితం మర్మభాషకః
రోగిణా మప్యమీ పంచ
ప్రాయే లోద్వేగకారకాః॥

యాచకుఁడు, వంచకుఁడు, వ్యాధి, మరణము, మర్మములంట భాషించువాఁడు అను నైదుగురు రోగులకు సైతము ఉద్వేజకారకములు అన్నదాని ననుసరించి నన్ను మర్మభేదకముగ మాటాడి యవమానించితివి గదా. అందువలనఁ బాఱవైచితి ననెను.

అప్పుడు శ్రీహర్షుఁడు వాగ్దేవి వాకొన్న మాట విని దేవీ! నీ వొక యవతారమునందు నారాయణుని పతిఁ జేసికొంటివి ఇట్లే పురాణములందు నీవు విష్ణుపత్నివిగ తెలియఁబడుచున్నావు కావున నేనున్న సత్యముఁ దెలిపితిని. నిజము చెప్పిన నన్ను నీవేల కోపించెదవు నీ కోపించినంతమాత్రమున నీకలంకము వైదొలఁగునా ఏమమ్మా! అనెను.

అంత శారదాదేవి శ్రీహర్షు ధీరతకు మెచ్చుకొని యతని గ్రంథమును తాను స్వయముగ గ్రహించి యా సభామధ్యమున ఆ మహాకావ్యము సర్వాంగసుందర మని శ్లాఘించెను శ్రీహర్షుఁ డామాటపై ఆ పండిత బృందము గాంచి అయ్యలారా! ఈ శారదాంగీకారము మీ రాజునకుఁ దెలుపుటకుఁ జెప్పి యీ గ్రంథమును జూపింపుఁడు. మఱియు మీరు నీ గ్రంథము బాగుగ నున్నదని రాజునకుఁ జెప్పి యిది నిర్దుష్టము సత్కావ్య మన్న భావముతో నొక లేఖ మా జయంతచంద్రునకు మీ రాజుచే యిప్పింపుఁడని వారిని గోరెను.

భారతీదేవి కభిమతమైన దా కావ్యమని తెలిసినను నిజముగ సరస మా కావ్యమని తమకు నచ్చియున్నను ఆ పండితులు ఈసుగొన్నవారై కావ్యము లెస్సగ నున్నదని తమ రాజుతో జెప్పరు; లేఖ నిప్పింపరు సరిగదా రాజును సైతము దప్పింపఁజేయుదురు.

ఇఁక నేమిచేయుటకు శ్రీహర్షునకుఁ దోఁచలేదు. ఇంకను జాఁతముగదా యని కొన్నిమాసము లచ్చటనే యుండెను. తాఁదెచ్చుకొన్న బత్తెమంతయు వ్యయమాయెను. సహాయులు ముందుగనే మరలి పోయిరి. బండిని, ఎడ్లను గూడ విక్రయించి ఆ విత్తమున

కొంతకాలము గడపెను. ఇంకఁ గొన్ని దినములకు మాత్రమే భుక్తి జరుగునంత రొక్కము మిగిలి యుండెను. ఎంత గొప్పవాఁడైనను గాలము గానప్పు డేమి చేయఁగలఁడు. కుజనుఁడు కుందును. సజ్జనుఁడు విధివైపరీత్యమని ధీరవంతుని స్మరించును గాదే.

అట్లుండ నొకనాఁడా కవితల్లజుఁ డచ్చటి నదీతీరమును జేరి యచ్చట నొక దేవాలయము సమీపమున గూర్చుండి రుద్రజపము చేసికొనుచుండెను. ఆచెంత నొక బావియుండ దాన నీరు తోడికొనుటకు ఊరినుండి యిరువురు చేటికలు (పరిచారికలు) మిగుల త్వరతో వచ్చిరి. నీరు చేఁదుకొనుటలో నేముందు నేముందని వంతులు వేసికొనిరి. అందుపై వారికి వాదులాట యేర్పడెను. అది కొనకు ముదిరి తిట్లాటకునై పండి కొట్లాటయైనది. వారొకరొకరి శిరోజములఁ బట్టికొని చేఁతులతో బాదుకొనిరి బాహుప్రేటులు దిని కినుక హెచ్చి రోషముతోఁ బోయి రాజకులమున నభియోగము గావించిరి.

రాజు మాధవదేవుఁడు వారిం గని మీరు కలహించు నప్పుడట సాక్షి యెవఁడైన నున్నాఁడా అని ప్రశ్నించెను. వారు విప్రుఁడొకఁడు జపతత్పరుం డచ్చట నుండుట యెఱిగించిరి. రాజుద్యోగులఁ బంపి వానిఁ దోడితెమ్మన వారుపోయి శ్రీహర్షునిఁ గొనితెచ్చిరి. నృపాలుఁడా మహామేధావిం గాంచి ఆర్యా వీరితగవు తీర్పవలసియున్నది. వీరిలో నెవరిది తప్పు, ఎవరిది యొప్పు అను విషయము మీరు దయచేసి చెప్పవలెనా అని కోరెను.

అంత శ్రీహర్షుఁడు గీర్వాణభాషలో భాషించుచు ప్రభూ, నేను వైదేశికుఁడను. నాకు ఈ దేశభాష రాదు. కాన వీరి నయానయముల నేర్పరించి చెప్పవలంతిని గాను. కాని ఈ చేటిక లిరువురు వివాదపడి మాట్లాడుకొన్న ప్రాకృతభాషాశబ్దము లెట్లట్లు మీకు నివేదింతును. దానిపై మీరు తీర్పు చెప్పవలెనని, ఆ పరిచారికల కలహభాషణమును, ఆ శబ్దములఁ గొన్ని వందల సంఖ్య వాని వెంనేలుతునల క్రమము దప్పక యొప్పగించెను. దానికి రాజచ్ఛ్రుఁగెడి ఎవరవయ్యా నీవు యింత మేధావివి? ఏమి నీ ప్రజ్ఞ! అని శ్లాఘించి ఆదాసీద్వయమును దప్పొప్పుల నిర్ణయించి వారికిఁ దగుశిక్ష విధించి వారిఁ బంపివైచెను.

తర్వాత ఈయన యుదంతమంతయు నెఱుంగఁజేసి మరల శ్రీహర్షుం గాంచి మహానుభావా నీవెవఁడవు. పండితశిరోమణివిగ నున్నావన శ్రీహర్షుఁడు తన కథయంతయుఁ బూసగ్రుచ్చినట్లు రాజునకు నివేదించి, ప్రభూ! మీ శారదాపీఠ పండితు లాదరించిన దౌర్జన్యమునంజేసి యీ పురమున నిట్లు దుఃఖ మనుభవించు చున్నా ననెను. ఆ క్రమమంతయు నెఱింగి రాజా పండితుల రప్పించి మీరేమి మిక్కిలి మూఢులుగ నున్నారు. ఇట్టి పండితచంద్రుఁడు గన్పట్టినంత నే స్నేహము చూపకున్నారు?

వరం ప్రజ్వలితే వహ్నౌ వహ్నౌయానే హితం వపుః
న పున ర్గుణసంపన్నే కృతః స్వల్పోఽపి మత్సరః
వరం సా నిర్గుణావస్థా యస్యాం కోఽపి న మత్సరో
గుణయోగేతు వైముఖ్యం ప్రాయః సుమనసామపి.

గుణవంతునెడ స్వల్పముగఁ గావించు మత్సరము కంటె మండుచున్న నగ్గిలోబడి శరీరము దొలంగుట మేలు. మంచి మనస్సుగలవారికి లెఅదుగా గుణముగల వానిపై వైముఖ్యము చూపుటకంటె మంచి చెడ్డ లంటని నిర్గుణావస్థ లగ్గుగాదా. కావున మీరెల్లరు నిజముగ దుష్టులు. ఇఁకనైన మీ దౌష్ట్యమువీడి పశ్చాత్తాప మొంది ఈ మహనీయునిఁ గవిచక్రవర్తిని మీ గృహములకుఁ బిల్చుకొనిపోయి యొక్కొకరును సత్కరింపుఁడని యానతిచ్చెను. అంత మన శ్రీహర్షుఁడు.

"యథా యూనా స్తద్వ త్పరమ రమణీయాఽపి రమణీ
కుమారాణా మంతఃకరణహరణం నైవ కురుతే
మదుక్తి శ్చేత శ్చే న్మదయతి సుధీభూయ సుధియః
కిమస్యా నామ స్యా దరసపురుషారాధనరతైః"

యువకుని కంటికి మిగుల సొంపుగూర్చు చెలువ బాలిక డెందమెట్లానందపఱపఁగలదు. నా వాణి మంచి బుద్ధికలవారి కమృతమై మనస్సు మత్తిలఁ జేయును. ఆ నా వాణి అరసికులగు పురుషుల నారాధింప నాసక్తులైన వీరి నెట్లు సంతోషపెట్టఁ గలుగును?

అని అను శ్రీహర్షవాక్యములు విని వానియందు లక్ష్యముంచి రాజు నానతి శిరసావహించి మహాకవిని తమ గృహములకుఁ గొంపోయి యొక్కొక్కరును చక్కగ సత్కరించి తమ చెట్లనేఁతకు సైరింపుఁడని కవీంద్రునిఁ బ్రార్థించి యాయన సంతసింపఁజేసి రాజసమ్ముఖమునకుఁ దోడుకొని వచ్చి నిల్పిరి.

మాధవదేవుఁడును శ్రీహర్షుని ప్రబంధము చక్కగ నున్నదని జయంతచంద్రునికి లేఖ వ్రాసియిచ్చుచు

మహాకవినిఁ బూజించి ధనాదికమున గౌరవించి పంపెను. శ్రీహర్షుఁ డాథంగి తనకోర్కె నెరవేరవచ్చి తనరాజును జయచంద్రుని గాంచి లేఖ యొసంగెను. ఆ నృపుఁడు కవివలన సంగతియంతయు విని మిక్కిలి సంతసిల్లెను. అది మొదలు నైషధీయచరితము లోకము నందు ప్రచారము పొందెను.

శ్రీహర్ష కవిచంద్రుఁ డా జయచంద్రుకడనే యుండి ఖండనఖండఖాద్యాది గ్రంథముల రచించుచుండెను. అట్టితఱి యొకప్పుడు జయంతచంద్రుని ప్రధానులలో నొకఁడు పద్మాకరుఁడను వాఁడు బుద్ధిశాలి శ్రీ అణహిల్లపురమునకుఁ బోయియుండెను. పురము వెలుపల నొకసరస్తీరమున బట్టలుదికి చాకివాండ్రు అట వేసియుండిరి. వానిలో నొకపట్టుపుటంచుపైఁ గుమ్మెపలు మొగలిపూవువంటిది వలె వ్రాలియుండుటం జూచి యా దుకూలము పద్మసుగంధ పుచుట యెఱింగి దీని ధరించు చేడియ తప్పక పద్మినీజాతిదై యుండునని యూహించి యాచాకలిం గొంత ధనాదికమున నలరించి యావలువ ధరించు నింతిని వారుఁ జూపుమని యడిగెను. రజకుఁ డందుకు సమ్మతించి నాటిసంజవేళ నామంత్రిం దోడుకొనిపోయి యొక హర్మ్యమున వసించు శాలాపతిపత్నిని (పాలెకవిత) పతివియుక్తను ఎలజవ్వనమున వెలయుదాని నంచిచంపముల మేలైనదాని సూహవదేవి యను పేరుగలదానిఁ జూపి చనెను. పద్మాకరుఁ డా సురూపతోఁ గొంత ముచ్చటించి యిట్టి వనితామణి తనికొంతిగ నున్నఁ జాల మేలుగ నుండు నని తలంచి యామెను సమ్మతింపఁజేసి యాప్రోలి నేలు దొర కుమారపాలునిని కొసంగతిఁ జెప్పి యాతని యనుమతింపఁ దాను సోమనాథపురయాత్ర పూర్తి చేసి కొని వచ్చువాఁ డామెం దోడ్కొని వచ్చి జయంతచంద్రునకు భోగకాంతఁ గావించెను. రాజా సూహవదేవియం దుద్వేలమగు ననురాగమున వర్తిలు చుండెను.

ఆ సూహవదేవి సకలశాస్త్రములందు విజ్ఞానము గడించి చక్కని వైదుష్యము సంపాదించి కలాభారతి యన్న బిరుదమున జగత్ప్రసిద్ధిఁ జెందియుండెను. మఱియు నా విదుషీమణి మిక్కిలి గర్వితయై యుండెను. మన శ్రీహర్షకవి నైతము నరభారతి యన్న పేరు వహించియుండెను. ఈ మహనీయుని కా బిరుదముండుట సూహవదేవికి సహింప రాని దయ్యెను. ఒక్కనాఁ డామె శ్రీహర్షుని పిలిపించి తెప్పగ సత్కరించి సంతుష్టుంజేసి నీవెంతటివాఁడ వనెను. నేను కళాసర్వజ్ఞుఁడ ననెను. అంత నాభామిని నీవట్లు సర్వజ్ఞుఁడ వైనచో నాకు కాలిజోడు కుట్టి తెమ్ము, చూతముగా నీప్రజ్ఞ యనెను. కాలిజోడు కుట్టుట తెలియదన్నచో తనసర్వజ్ఞత్వమునకు భంగము వచ్చి అజ్ఞతాదోషము తన్నంటుకొనును. వాని నిర్మాణ మెవనివన్న బ్రాహ్మణసర్వజ్ఞుని నీచత ప్రాపింపును. తన్నిట్టి నీచంపుఁబనికి నాపె వినియోగించుచున్నదియానని తలంచిగూడ నెఱుంగఁడు. సరి కావచ్చునని యా చెలి యానతి నంగీకరించి శ్రీహర్షుఁడు చెట్టుపట్టెలతోను నారలతోను ఒక చక్కని పాదరక్షలజత సిద్ధము చేసి చేతఁబట్టుకొని యా సూహవదేవి నగరివాకిటికి వచ్చి యామెకుఁ జెప్పిపంపెను. ఆమె నిజాయితితో వచ్చి నిలువంబడుడు శ్రీహర్షుఁడు తనకన్నులు నలువంకల బెదరుచూపులు చూచుచు చలించుచుండ జేసి నీకిద చెప్పులజత కుట్టితెచ్చితిని. కాళ్లందొడిగికొనుము, అని వాని నట నుంచి ఇట్టి పనిసేఁతకు నేను మాదిగవాఁడ నైతిని, నేను నిల్చినచోట నీవు చల్లింపు డని చెప్పుచు మరలిపోవుచు జయంతచంద్రు దివాణమున కేఁగి రాజా నీప్రియురాలి కొంటిచేష్ట యిట్టిదని నాపైఁదగిలెను. నేనిక నిటనుండ మరవుగాదు. సెలవు జ్ఞప్తిఁ దెచ్చితినని చెప్పి పోయి గంగయొడ్డు సేరి సన్యాసము గ్రహించెను.

సూహవదేవి పగసాధింపు

జయంతచంద్రుడు రాజ్యభ్రష్టుఁడగుట

రాజశేఖరుఁడను మహాకవి (క్రీ. శ. 1348) పదునాల్గవ శతాబ్దమున నున్నవాఁడు. తన ప్రబంధ కోశమున వైవృత్తమేగాక. ఈక్రిందఁజెప్పు విషయ మును గూడ వ్రాసియున్నాడు.

ఆ సూహవదేవి జయచంద్రుని తనవశము చేసి తా నేమహారాజ్ఞియై రాజ్యవ్యవహారములందుఁ దాలాను చుండెను. ఆమెకు కాలక్రమమున నొకకుమారుఁడు గలిగి వర్ధిల్లి యౌవనముం బ్రాపించి దుర్నయపరుఁడై యుండెను. ఈ జయంతచంద్రునికి విద్యాధరుఁడని మంత్రియొకఁడు గలఁడు. అతఁడు చింతామణి, విద్యాయక్షుల నుపాసించి వారియనుగ్రహమున స్పర్శవేధి (అన్నిలోహముల బంగారుచేయునది) యను నొకశిలను ప్రసాదముగఁ బడసియుండెను. దాని ప్రభావమున

నాఁడొక్కపట్టి 8800 మంది విప్రులకన్న ప్రదానము గావించి అపరయుధిష్ఠిరుఁడన్న ప్రఖ్యాతి నొందెను. ఇట్టి యాతఁడు జీవితకాలమున అన్నదానము నిరంతరము చేయువాఁడు. ధర్మపరుఁడు గావున రాజునకతని యెడ గౌరవము మెండు. ఒకనాఁడు రాజు తనరాజ్యమెవ్వరికిఁ బట్టము గట్టవలెనని యీ విద్యాధరుని సలహా అడిగెను. ఆ మంత్రి రాజుతో రాజా ఎవరికిత్తునని నీవేల సంశయింపక? నీపుత్రుఁడైన మేఘచంద్రునకు రాజ్యముపట్టము గట్టుమనెను రాజందులకు సమ్మతించి మేఘచంద్రుని సామ్రాజ్యమునకధిపతిం జేయఁ బ్రయత్నించుచుండెను

ఈ యుదంతము సూహవదేవి చెవికెక్కెను. ఆమెంగడుక్రుద్ధయై తనకొమరునికి రాజపట్టము గట్టక పోయెను గదా యని యీసు వహించి యెట్లయిన మేఘచంద్రునికిఁ బట్టము గట్టనీకుండ చేయవలెను, రాజును పదభ్రష్టుని జేయవలెనని సంకల్పించుకొనెను. తాను మహారాజ్ఞి, ధనాఢ్య, స్వతంత్రస్వేచ్ఛాప్రవర్తనరాలైయున్నందువలన కోపమినుమడింపఁ దన ప్రధానులఁ బిలిచి తక్షశిలాధిపతి యగు సురత్రాణుని కాశిపై దండెత్తి రావలసినట్లు చెప్పఁబంపినది. అతనికి ప్రతి మజిలీకి సపాదలక్ష (లక్షయిరువదియైదు వేలు) దీనారములఁ జెల్లింతు మని చెప్పి దండయాత్ర దరలి రమ్మని చెప్పిపంపెను వారట్లుపోయి యా సురత్రాణు యుద్ధసన్నద్ధుం జేసికొని కతిపయ ప్రయాణములఁ గాశి ముట్టడింపఁ జనుదెంచుచుండెను. ఈసంగతి యెట్లో విద్యాధరునకుఁ జారుల మూలమున దెలియరాగా రాజుంగని యాతఁడు సూహవదేవి నిన్ను నీకుమారుని పాలిమార్చ పన్నుగడ పన్నినది. అది క్రియోన్ముఖమై సురత్రాణుఁడు నీపై దండెత్తి వచ్చుచున్నాఁడు. నీవు జాగరూకుఁడవు వలెనని ప్రబోధించెను. రాజు, దేవి సాధువల్లభ, అట్లెన్నటికిఁ జేయదనియు నీవువిన్నది అసత్యమని కూడ ననెను. పైగా తన్ను తిరస్కరించెను. ఎంతఁ జెప్పినను రాజు వినఁడయ్యెను. అప్పుడు, మంత్రి విద్యాధరుఁడు చేయునదిలేక అక్కటా రాజింత మూఢుఁడయ్యెనే. రాణిని జాతమా బలవతి, అది వేసిని, పలుకుబడిగలది. ఈ కుట్ర చేయునపుడు రాజు మరణము తప్పదు రాజుమృతికన్న నేను ముందుగనే ఈ శరీరమువిడుచుట మేలుగదా యని వచ్చి యారాత్రి వింటనెట్లో గడపి మరుసటిదినమునఁ బ్రొద్దుటివేళ రాజవీధి యందుఁ జనుచుండెను. ఆ విద్యాధరమంత్రికి ఎదుర నొకపిండియుప్పెను జేపట్టినవాఁడు వచ్చెను. ఆ పిణ్యాకము దినఁగోర్కె కలిగి కొంతదాని గ్రహించెను. మఱికొంతదూరము పోవునరికి చీలిన సెనగల గంప నుండి సెనగలు రాలుచుండెను. వానిం జూచి దినవలెనని మంత్రికి నోరూరెను. ఈ రెండు గోర్కెలను దినకు జెలుపుమార్పునని నిశ్చయించుకొని రాజుంజేరి రాజా నాకీజీవితముపై వాంఛ వీడినది. నేను గంగాజలములఁ బడి చత్తును, నీసెలవుగోరి వచ్చితినెను. అంతనోయీ మంత్రి నీవు చత్తువేని మేము హాయిగ సుఖపడెదము మా చెవులు చిల్లులుపోవకుండును పోపొమ్మ అనెను. హితవచనము వినమి, చెడుదారి పోక, మంచివారిఁ జెట్టఁగాంచుట, గురుజనుల నవమానించుట అనునవి కదా మృత్యువుయొక్క పూర్వరూపములని రాజు నెడ ప్రీతివదలుకొని మంత్రి విద్యాధరుఁడు గంగాజలములందు దిగి నిలువంబడి తనకులపురోహితుం బిలిచి దానమిత్తునమ్మనెను. అతఁడు చేయిఁజాపినంత అస్పర్శవేధి పాషాణమును (రాతిని) పురోహితుచేత నిడి మంత్రి జలముల మునింగి మృతిజెందెను పురోహితుఁడా శిలాతత్త్వ మెఱుంగక మంత్రి యీరాయి దానము చేసినాఁడేమి యని విసుగుకొని అరాతిని ఆ గంగాంబువుల బారవైచి యేఁగెను.

తర్వాత సురత్రాణుఁడు చండప్రచండభేరీధ్వానములతో కాశీనగరము ముట్టడించి జయచంద్రుని జెరవట్టెను కాశీనగరము యవనుల వశమయ్యెను. తర్వాత జయచంద్రుఁడు హతుఁడయ్యెనో మృతిచెందెనో మనకు దెలియరాదు. ఇది జయచంద్రుని తప్పుగాదు. "వినాశకాలే విపరీతబుద్ధిః" అనికదా ఆర్యులంద్రు. అందుచే పరిగనే ఈతఁడు ప్రవర్తించెను.

శ్రీ హర్షుని కాలము

ఈ జయంతచంద్రుఁడు. విక్రమశకము 1243 వ సంవత్సరమున ఆషాఢశుద్ధ సప్తమి భానువాసరము నాఁడు వారణాసియందు గంగలోఁ గ్రుంకులిడి హరిహరుఁల బూజించి దేవర్షిపితృతర్పణములఁ జేసి తన పెద్దలు కృతార్థులగుటకు, కామౌలియను గ్రామమును, భారద్వాజగోత్రుఁడైన, రాహుత ఆడలే పౌత్రుఁడు రాహుత శ్రీ ఘుండా పుత్రుఁడు నగు దోడా రాహుత అరణుఁడను విప్రునకు దానము చేసి యున్నాఁడు.

కాబట్టి ఈ ప్రభుని కాలమే శ్రీహర్షుని కాలమగుచున్నది. కాబట్టి శ్రీ హర్షుడు క్రీస్తుశకము (1187 వత్సరము) పన్నెండవ శతాబ్దము ఉత్తరార్థమున నుండెననుట స్పష్టమగుచున్నది.

ఇది యిట్లుండగ పలువురు విమర్శకులు శ్రీ హర్షుడు 8 వ శతాబ్దమువాడగు శంకరభగవత్పాదులకు వారి శిష్యులకు సమకాలికుడని సమర్థింపజూచు చున్నారు. మరికొందరు వాచస్పతిమిశ్రుడు, ఉదయనాచార్యుడు, మమ్మటభట్టు, లోనగువారికి సమకాలికుడనియు వ్రాయుచున్నారు. వారి సత్యాసత్యము లెట్లుండె వారు చెప్పినట్టి యుక్తులు చదువరులకు వినోదముగ నుండునని యిట వ్రాయు చున్నాను—

వీరిలో ఆదిశంకరుల కాలము క్రీ॥ శ॥ 8 వ శతాబ్దమని పెక్కురు సిద్ధాంతము చేసియున్నారు.

శ్రీ శంకరాచార్యులవారు భారతదేశము సంచారముచేసి దుర్మతముల ఖండించి అద్వైతమతస్థాపనము చేసిరి. ఇది జగద్విదితము. వీరి చరిత్రమును ఆనందగిరి, మాధవవిద్యారణ్యులు లోనగువారు శ్రీశంకరవిజయమను పేర వ్రాసియున్నారు. ఈ మాధవవిద్యారణ్యులు శంకరవిజయము వ్రాయలేదనియు, ఇప్పుడు వారి పేర గనబడు శంకరవిజయము వ్యాసాచలకవి యను ఉద్దండపండితుడు వ్రాసెననియు నిట్లు మన కుదాహరణీయమగు శంకరవిజయ కర్తృత్వమునకే తగాదా యున్నది. అది యటుండనిండు. ప్రస్తుతము మనకు ఆ శంకరవిజయములో శంకరాచార్యులు శ్రీహర్షుని వాదమున నోడించెనని తెల్పు నొక శ్లోకము గలదు. చూడుడు:

> పటుయుక్తి నికృత్త సర్వశాస్త్రం
> కుమరభట్టోదయనాదికై రజయ్యం
> సహి ఖండనకార మాత్తదర్పం
> బహుధా వ్యస్య వశంవదం చకార॥
>
> (శంకరవిజయం సర్గ 15. శ్లో 157)

తనయుక్తిపాటవమున సర్వశాస్త్రముల సిద్ధాంతముల ఖండించినవాడును, పూర్వమీమాంసాప్రవర్తకులగు కుమారిలభట్టు, ప్రభాకరుడు లోనగువారికిని న్యాయదర్శన పారంగతుడగు ఉదయనాచార్యులకును అజయ్యుడును(జయింపరానివాడనుట)(మీమాంసా దర్శనమును, న్యాయదర్శనమును ఈ శ్రీహర్షుడు ఖండించియున్నాడు అని భావము) ఖండనఖండ ఖాద్యమను గ్రంథమును రచించినందున మెండుకొన్న గర్వముగలవాడును నగువానిని (శ్రీ హర్షుని అధ్యాహార్యము, అనగా వ్యాఖ్యాతలు) మిక్కిలి వాదమున వాదించి వశపఱచుకొనెను. (ఆదిశంకరులు కర్త), ఇది ఆ శంకరవిజయకర్త కావ్యవినోదమునకై వ్రాసినట్లే కన్పట్టుచున్నది. ఇట్లే పెక్కుమతస్థులను (అనేక మతముల వారిని) జయించినట్లు చెప్పినారు. కాని యది ఆయా మతప్రవర్తకులగువారి శిష్యప్రశిష్యులను శంకరులు జయించి వారి మతముల ఖండించి తమ మతముల నెలకొన్న విషయమే ఇట ప్రధానముగాని వేరుగాదు. కావున నట్లా సందర్భమున సరిపెట్టుకొన్న దోషము లేదు.

శంకరుల శిష్యులు శ్రీహర్షుని సమకాలమువారినిగా జేసి కొందరీ యుక్తి నొకదానిజెప్పుచు న్నారు.

ఒకప్పుడు శ్రీ శంకరుల శిష్యులు శ్రీహర్షునితో వాదము సల్పబోయిరి. వారు పోయిన సమయమున శ్రీహర్షు డెత్తైన మేడపై నొక తూగుటుయ్యెలలో నుండి యూగుచు వారిజూచి లేచి వారిని గౌరవింపనయ్యెను. అట్లు శ్రీహర్షుడు తమ్ము మర్యాదతో జూడకుండుటజూచి శంకరుల శిష్యులు గినుకజెంది "అత్యుచ్ఛ్రితిః పతనహేతుః" (పైనుండుట క్రిందపడుటకే) అనిరట. అందులకు శ్రీహర్షుడు, "ధ్రువే అవ్యాప్తిః (కారణము మీరన్నది ధ్రువునందు అన్వయించదు. అనగా ధ్రువుడు (ధ్రువనక్షత్రము) సూర్యచంద్రాది సప్తనక్షత్రమండలముల కన్నింటికి పైనుండునది.) అట్లు మీరల నెత్తినున్నను క్రిందబడను గదా అని అనెనట అందులకు వారు "ప్రళయే తిప్యాప్తి పతనసంభవః" ప్రళయమునందు అతనికి (ధ్రువునికి) గూడ పతనము సంభవించును అనిరట. అందుమీద శ్రీహర్షుడు "తదా సర్వేషాం పతనమేవ" అప్పు డన్నింటికి (ఉద్యసీధలులేకనుట) పతనమే కదా అని వారి నిరుత్తరుల జేసెనట ఇది వారికి సమకాలము అనుట మరి వాచస్పతిమిశ్రునకు శ్రీహర్షుడు సమకాలమువాడనువారు కొందరు

ఈ వాచస్పతిమిశ్రుడు ఘనపండితుడు. ఈతడు షడ్దర్శనములందును ముఖ్యగ్రంథముల వ్రాసియు

న్నాఁడు. శంకరాచార్యులవారు వ్రాసిన బ్రహ్మసూత్ర భాష్యమునకు భామతి యను పేరఁ బ్రసిద్ధమైన కూలంకషమగు స్వతంత్ర వ్యాఖ్య వ్రాసిన మహనీయుఁ డితఁడు. ఈయన భామతీ వ్యాఖ్యకు, కల్పతరు, పరిమళాది వ్యాఖ్యానము లేర్పడియున్నవి. ఈయన, గౌతముని న్యాయదర్శనమునకు (సూత్రములు) ఉద్యోతకరుఁడను పండితుఁడు వ్రాసిన వార్తికములకు న్యాయవార్తిక తాత్పర్య టీక అను వివరణ గ్రంథమును విస్పష్టముగ వ్రాసియున్నాఁడు. ఈ గ్రంథమునకే ఈయన కించుక యావలివారగు ఉదయనాచార్యులవారు తాత్పర్యపరిశుద్ధియను వివరణ గ్రంథము వ్రాసియున్నారు. ఈ వాచస్పతిమిశ్రుఁడు, న్యాయసూత్రములకు న్యాయసూత్ర సూచీనిబంధనము అనుదాని రచించెను. దాని రచనాకాలమును, దాని కడపట:

న్యాయసూచీనిబంధోయమకారి సుధియాం ముదే
శ్రీవాచస్పతిమిశ్రేణ వస్వంక వసువత్సరే.

అను శ్లోకమునఁ దెల్పియున్నాఁడు. కాఁగా ఈయన కాలము శాలివాహనశకము 898 వ సంవత్సరమగు చున్నది. దీనింబట్టి ఈయన కాలము క్రీ. శ. పదియవ శతాబ్దము (976) అగుచున్నది. ఇంకను మఱియొక విశేషమేమనఁగా శ్రీ వాచస్పతిమిశ్రుఁడు శ్రీహర్ష రచితమగు ఖండనఖండఖాద్యమును ఖండించి నట్లు చెప్పుచున్నారు. కావున శ్రీహర్షుఁడు శ్రీ వాచస్పతిమిశ్రునికి సమకాలమువాఁ డెంచురు. ఇది పొసఁగుటలేదు. ఏలనఁగా: శ్రీహర్షుఁడే తన ఖండనఖండ ఖాద్యము చతుర్థపరిచ్ఛేదమున వాచస్పతిమిశ్రుల మతము నుద్ఘాటించి విమర్శించియున్నాఁడు. కావున 10 వ శతాబ్దమువారగు వాచస్పతిమిశ్రునకు శ్రీహర్షుఁడు 12 వ శతాబ్దమువాఁడు సమకాలీనుఁడగు నట్లు లేదు.

పైగా ఉదయనాచార్యులకు శ్రీహర్షుఁడు సమకాలమువాఁడని కొందఱు చెప్పుదురు. ఈ ఉదయనాచార్యులవారు వాచస్పతిమిశ్రులకు కొంచెము ఈవలి వారని ముందే చెప్పియున్నాను. ఈ మహనీయుఁడు న్యాయదర్శన పారంగతుఁడు. ఆ కాలమున నింతటి పండితుఁడు లేఁడన్న నది అతిశయోక్తి కాదు. ఈయన న్యాయకుసుమాంజలి యను చార్వాకాది దుర్మతముల ఖండించు గ్రంథమును రచియించియున్నారు. ఇంతియగాక లక్షణావళి లోనగు పెక్కు గ్రంథముల రచించిరి. వీరు తమ లక్షణావళియను గ్రంథమున దాని రచనాకాలము విస్పష్టము గావించి యున్నాఁడు. కనుఁడు:

తర్కాంబరాంక ప్రమితే
ష్వతీతేషు శకాంతతః।
వర్షేషూదయనశ్చక్రే
సుబోధాం లక్షణావళీం॥

దీనింబట్టి వీరి కాలము శాలివాహనశకము 906 వ సంవత్సరమగుచున్నది. కావున క్రీస్తుశకము 10 వ శతాబ్దము కడపట (984) వీరి యునికియని తెలియుచున్నది. ఈ యుదయనాచార్యులవారే శ్రీహర్షుని తండ్రియగు శ్రీహీరపండితుని వాదమున నోడించి యవమానించినవాఁడని చెప్పుచున్నారు. అట్లయిన యొప్పుకొందమన్న శ్రీహర్షుఁడు ఉదయనాచార్యుల న్యాయకుసుమాంజలిని తన ఖండనఖండఖాద్యమున బహుధా ఖండించియున్నాఁడు. ప్రథమ పరిచ్ఛేదమున ఉదయనకృతలక్షణఖండనము పేరు గలవాని దగు దీనింబట్టి శ్రీహర్షునికిఁ బూర్వుఁడే ఉదయనాచార్యుఁడని తెలియఁగలదు. సమకాలమునఁ బే ఖండనాదులు గ్రంథముల కెక్కుటయుఁ గలదన్నను సరిపడదు

ఇంకను శ్రీహర్షుఁ డుదయనుని గలిసికొన్నప్పుడు వారికిరువురకు జరిగిన సంవాద మీ శ్లోకమని యొక శ్లోకము నుదాహరించుచున్నారు

కింగవి గోత్వ ముతాగవి గోత్వం
యది గవిగోత్వం నహిమయి తత్త్వం
అగవిద గోత్వం తదయది సామ్యం
భవతు భవత్యపి సమ్మతి గోత్వమ్॥

ఓ యీ గోవునందు గోత్వము (గోవుధర్మము) గలదా. అగోవునందు (గోవుగాని దానియందు) గోత్వముగలదా? గోత్వము గోవునందున్న దంటివేని ఇఁక నీయం దేతత్త్వము నందెను. మఱి అగోవునందు గోత్వమున్న దంటివేని నీయందు సైతము గోత్వము సిద్ధమగుచున్నది.

ఇట్లు చెప్పి యుదయనాచార్యులకు శ్రీహర్షుఁడు సమకాలమువాఁడని నిరూపింతురు. కొందఱు కావ్యప్రకాశిక వ్రాసిన మమ్మటభట్టునకు శ్రీహర్షుఁడు సమ

కాలీనుఁడనుచున్నారు. ఈ మమ్మటభట్టు క్రీ. శ. పది నొకండవ శతాబ్దము పూర్వభాగమునందుండిన భోజరాజునకు సమకాలీనుఁడు (1020). ఒకప్పుడు శ్రీహర్షుఁడు తన నైషధీయచరితము తీసుకొని పోయి అలంకారికులలో నుత్తమశ్రేణికిఁ జెందినవాఁడైన యీ మమ్మటభట్టునకుఁ జూపెననియు, అతఁడంతగుమీఁద శ్రీహర్షా కొంతముందుగ ఈ నీ కావ్యమును నాకుఁ గనఁబడి యుండిన నా కావ్యప్రకాశయందలి దోష ప్రకరణములోని లక్ష్యములకుఁ బ్రబంధములను వెదుక వలసినంత శ్రమయుండెడిది కాదుగదా అని నైషధము మీఁదఁ దన అభిప్రాయమును వెలిఁబుచ్చెనట. అనఁగా శ్రీహర్ష నైషధమంతయు దాదాపు తప్పులతడకలతో నిండియున్నదని చెప్పెనని భావము. ఇది ఎంతవఱకు నమ్మఁదగినదో! శ్రీహర్ష నైషధ మామూలాగ్రముగఁ జదివిన పండితులు పై మమ్మటుని వాక్యము విశ్వసింతురా? ఇది యొక కల్పితగాథ యనిపింపకపోదు.

మఱియు అహమదాబాదుసమీపమునందలి ధోలక గ్రామనివాసి చాండూపండితుఁ డొక్కఁడు నైషధమునకు మొదట వ్యాఖ్యవ్రాసినవాఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. ఆతని వ్యాఖ్యారచనాకాలము విక్రమశకము 1353 వ వత్సరమని తెలిపియున్నాఁడు. మఱియును నైషధకావ్యము నవ్యమనియు వక్కాణించి యున్నాఁడు. దీనిఁబట్టి ఈయన కాలము క్రీ. శ 1275 వ సంవత్సరముగ నున్నది. కాఁబట్టి శ్రీహర్షుఁడు 12 వ శతాబ్దము చివరనున్నాఁడని తలంచుటకుఁ దగియున్నది. ఈయన రచించిన శ్లోకము:

శ్రీ విక్రమార్క సమయాద్వత్సరదా
మను త్రిపంచాశతిసమధికే...ష్వితేషు
శేషు త్రయోదశసు భాద్రపదే చ శుక్లే
పక్షే త్రయోదశతిథౌ రవివాసరే చ.
శ్రీమాన్ధోలికపండితః స్వపదమ
ధ్యాదిష్ట్యాతిసర్వాశ్రమ
శ్చాండూపండిత సంజ్ఞితం
ప్రసుమహో శ్రీగౌరికేవిదయుష్
బుద్ధ్యా శ్రీమునిదేవసంజ్ఞ విబుధా
లొక్కవ్యం నవం నైషధం
ద్వావింశేద సవర్ణే నివరణం
సర్గేద దక్షే క్రమాత్.

కొందఱు ఆదిశూరుఁడు పిలువఁబంపిన నాలుగు బ్రాహ్మణ కుటుంబములలో శ్రీహర్షుడొక కుటుంబము వాఁడని చెప్పి వంగదేశమువాఁడని, నిర్ధారింప జూచుచున్నారు. వంగదేశమునుగూర్చి కాని ఆ దేశాధిపతి ఆదిశూరునిగూర్చి శ్రీహర్షుఁడెచ్చటను బ్రస్తావించి యుండకపోవుటవలన వారియుక్తి విలువ నేరదు. ఇంతకు శ్రీహర్షుఁడు 12 వ శతాబ్దము ఉత్తరార్ధమువాఁడనుటయే, తేలిన సారాంశము—

శ్రీ హర్షుని గ్రంథములు

(1) నైషధము, (2) ఖండనఖండఖాద్యము అను గ్రంథములే గాక శ్రీహర్షుఁడు, (3) అర్ణవ వర్ణనము, (4) శివశక్తిసిద్ధి, (5) నవసాహసాంకచంపువు, (6) ఛందఃప్రశస్తి, (7) విజయప్రశస్తి, (8) గౌడోర్వీశకుల ప్రశస్తి. (9) ఈశ్వరాభిసంధి, (10) స్థైర్యవిచారణ ప్రకరణము, అను గ్రంథములు గూడ రచించినట్లు తన నైషధకావ్యమునందలి సర్గాంతముల వెల్లడించి యున్నాఁడు. పై నైషధ ఖండనఖండఖాద్య గ్రంథములు రెండుతప్ప తక్కినవి యేవియు నిప్పటికిఁ గానరావు. అట్టి మహాకవి తాను వ్రాయకయే వ్రాసితినని అసత్యమేల చెప్పియుండును. ఆ గ్రంథములు కాలగర్భమున నడఁగిపోయినవేమో కొందఱిట్లనియు నైషధము విశేషవర్ణనములఁబట్టి యేర్పడియుండు నందురు. అది చింత్యము.

చూడుఁడు.

నైషధము 4 వ సర్గము చివర. స్థైర్యవిచారణ ప్రకరణభ్రాతరి అనియు

5 వ సర్గాంతమున. తస్య శ్రీవిజయప్రశస్తి"
6.........షష్ఠః ఖండనఖండతో ఽపి......
7.........గౌడోర్వీశకులప్రశస్తి ?"

9 వ సర్గాంతమున "సంధ్యబ్ధార్ణవ వర్ణనమ్ అనియు
17 ,, "సుసదృశి ఛందఃప్రశస్తే ,,
18 ,, యాతో ఽస్మిన్ శివశక్తిసిద్ధిభగినీ,,

మఱి ఖండనఖండఖాద్యము ప్రథమపరిచ్ఛేదమునందు 102 వ విషయమున, శ్రుతిప్రమాణమందు

శ్రుతిప్రామాణ్యం సిద్ధాన్తప్రామాణ్య శ్చేశ్వరాభిసంధౌ సాధయిష్యే అని యిట్లు చెప్పియున్నాఁడు.

శ్రీ హర్షుఁడు తన్నుగూర్చి

1 కవికులాదృష్టాధ్వ పాంథుఁడు, = కవులెవ్వరు గానని దారిని నడచిన బాటసారి,

2. తర్కములం దినమ్ము శేముఁడు,

3. మాతృచరణాంభోజాళిమాళి = వాగ్దేవి యుపాసకుఁడు.

4. పదార్థ ఘటనా పటిష్ఠుఁడు = క్రొంగ్రొత్త యర్థములఁ గూర్చువాఁడు,

5. సత్కవి క్రతుల గర్వించువాక్కులు గలవాఁడు.

అని చెప్పికొనియున్నాఁడు.

మఱి తన నైషధ మహాకావ్యము

1. శృంగారామృత శీతగువు = శృంగారరస మను అమృతము నొసంగుటలో చందమామవంటిది.

2. స్వాదూత్పాదభృతము = సహృదయ హృదయాహ్లాదదాయి :

3. శరదిజ జ్యోత్స్నాచ్ఛసూక్తి = శరత్కాలము నందలి వెన్నెలవలెఁ గోటగు నుంచిమాటలు గలది.

4. కృతేతరరసాస్వాదము = అల్పము గాని (బహుళమైన) రసముల నాస్వాదింపఁ జేయునది.

5. చతుర్దశవిద్యలం దాటితేలిన కాశ్మీరపండితు లచేఁ బూజింపఁబడినది.

6 అవ్యాఖ్యాతరసప్రమేయభణితి = ఇతరకవు లెవ్వరు చెప్పని శృంగారాది రసములు, సమాసములు, శబ్దములు, ఉత్ప్రేక్ష లోనగు అలంకారములు గలది.

7. అతినవ్యము.

8 మధువర్షి = తేనియ జాలువార్చునది.

అని చెప్పియున్నాఁడు.

నైషధకావ్య వ్యాఖ్యలు

ఈ నైషధమహాకావ్యమునకు వ్యాఖ్యలు వ్రాసిన వ్యాఖ్యాతలు 23 గురు అని తెలియవచ్చెను.

వారాణసీయవ్యాఖ్య మల్లినాథవ్యాఖ్యలోనగు వ్యాఖ్యలు కొన్ని లభ్యము లగుచున్నవి.

ఇట్టి మహాకావ్యము విమర్శించి విస్తరించి చూపుట సామాన్యజిజ్ఞాసువులకు లోకమునకు శ్రేయము.

ఖండనఖండఖాద్యము

ఈ గ్రంథమునకు ఖండనఖండఖాద్యము, ఖండనఖండము, ఖండనఖాద్యము, ఖాద్యఖండనము, ఖండనము అని పేరులు పెక్కులు లోకమునఁ బ్రసిద్ధి కెక్కియున్నవి. అవి సంగ్రహమునకై యేర్పఱుపఁబడినవి. కాని దీనిసంపూర్ణ నామము ఖండనఖండఖాద్యమనియే.

ఖండనఖండఖాద్యమనఁగా : ఖండన = పదార్థ ఖండన రూపమైన, ఖండ=శర్కరా ఖండము యొక్క (ఖండముతోఁ గూడిన) ఖాద్యము=ఒకానొక భక్ష్య విశేషము - అని యొక అర్థము

ఖండన=పదార్థఖండన రూపమైన లక్షణముచే ఖండ=ఖండితములైన ఖ + అద్యము=ఆకాశములోనగు పదార్థములు గలది అని రెండవ అర్థము.

ఖండనఖండఖాద్యము = ఖండన రూపమైన ఖండఖాద్యము. (వైద్యశాస్త్రమునందు) రసాయన విశేషము గలదు.

మొత్తముమీద మీమాంసాతర్కాది దర్శనములఁ బండితులైనవారికి ఈ గ్రంథము చాలా సాంప్రదాయిక సిద్ధాంతము దెలుపునది అని భావము.

దీనిలోని విషయము :— ఈ ఖండనఖండ ఖాద్యమునందు గౌతమ వ్యాసదర్శనమునందుఁ గనఁబడుచున్న ప్రమాణము లోనగు షోడశపదార్థముల ఖండించి మీమాంసాప్రవర్తకులగు కుమారిలభట్టు, ప్రభాకరుఁడు, లోనగువారి మతముల ఖండించుటయు ముఖ్యముగా ఉదయనాచార్యుల న్యాయకుసుమాంజలి విమర్శ ఖండనములును, చార్వాకాదిమతముల ఖండనములు అను విషయములు గలవు ఇట్టిన్ని శాస్త్రముల సిద్ధాంతముల ఖండించుటవలననే ఈ గ్రంథమునకు ఖండనఖండఖాద్యమను పేరు వచ్చినది. పేరు పెట్టఁబడినది కూడ.

మఱి యిందు అన్నీ ఖండనములే కాదు. శ్రుతి ప్రామాణ్యముతో అద్వైత సిద్ధాంతము చేయఁబడినది.

ఇట్టి యపూర్వ గ్రంథ విమర్శనము జరుగవలసియున్నది దీని సారముఁగూడ లోకమెఱుంగుట మంచిది.

ఈ వ్యాసరచనమునకుఁ దోడ్పడినవి (ముఖ్య గ్రంథములను)

(1) ఖండనఖండఖాద్యమునకు - శ్రీ ద్రావిడ లక్ష్మణశాస్త్రిగారు వ్రాసిన భూమిక, (చౌఖాంబా ప్రెస్, కాశీ)

(2) శ్రీహర్ష నైషధమునకు శ్రీ శివదత్త శర్మగారు వ్రాసిన ప్రస్తావన - నిర్ణయసాగర ప్రెస్, బొంబాయి.

(3) ప్రబంధకోశము. రాజశేఖర సూరి విరచితము. -చౌఖాంబా ప్రెస్, కాశీ.

(4) శృంగారనైషధమునకు కీ. శే. కళాప్రపూర్ణులు శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారు వ్రాసిన యవతారిక.

(5) శ్రీ విద్యారణ్యుల శంకరవిజయము.

పై రచయితలకెల్ల కడుంగడు కృతజ్ఞుఁడను.

చీకటి తెర

శ్రీ ఆర్. యం. చిదంబరం

ఆకాశం మబ్బులముసుగు కప్పుకుంది. కత్తులు ఝుళిపిస్తున్నట్లు మెరుపులు. మధ్యమధ్య గుండె అదిరేటట్టు ఉరుములు. మూడురోజులుగా వర్షం నిరంతర వాహినిగా కురుస్తోంది. రేడియో సరిగ్గా పలకటం లేదు. గడబిడ తగ్గిద్దామని వాల్యూం తగ్గించాను. చలిగాలి జివ్వున వీస్తుంటే తలుపులు వేసేద్దామని కిటికీ దగ్గరకు వెళ్లాను. పక్క వేపున్న శాంతాక్రూజ్ లో దిగటానికి, శత్రుసైన్యాన్ని చీల్చుకుపోతున్న వీరుడిలా, ఎదురు తిరుగుతున్న ప్రకృతిని చీల్చుకుంటూ వెళుతోంది ఒక విమానం.

రోడ్డుకు వారగా పసుప్పచ్చటాక్సీ ఆగింది.

కిటికీతలుపులు వేయటం మానేసి ఎవరు దిగుతున్నారా అని చూస్తున్నాను. అమ్మాయేఅయుండాలి. మొహానికడ్డంగా తెరచిన గొడుగుండటంవలన గుర్తు తెలియటంలేదు. కాళ్ళకు ఎర్రటి స్లిప్పర్సున్నాయి. చీర కుచ్చెళ్లు ఎత్తిపట్టుకుని నడుస్తోంది. వెనకాల డ్రైవరు సామాను తెస్తున్నాడు.

ఒకనిమిషం గడిచాక కాని ఆమె ఫస్టుఫ్లోరుకే వస్తోందని, అందులోనూ నాగదిలోకే వస్తోందని నాకు తెలియలేదు.

'నమస్కారమండి! నేను గుర్తున్నానే అనుకుంటా' అంటూ డ్రైవరుకు డబ్బిచ్చి పంపింది.

'జ్ఞాపకంలేకేం శారదా!' అంటూ రేడియో వాల్యూం పూర్తిగా తగ్గించాను. హాండ్ బాగ్ లోంచి టవల్ తీసి ముఖంమీదున్న నీటిబిందువుల్ని తుడుచుకుంది. మూడురోజుల ప్రయాణంతాలూకు బడలిక ముఖంమీద స్పష్టంగా కనిపిస్తోంది. సరిగ్గా పదమూడు సం॥ల క్రితం చూసిన శారదకూ—ఈ శారదకూ—చాలా వ్యత్యాసాలు కనిపించాయి. చిదిపితే ప్రణయరసం చిమ్మే చెక్కిళ్లు—అరిసెజారుతుంది సంతానాన్ని కన్న తల్లిలా తయారయ్యాయి. రెండుజడలు వేసుకుంది. నుదుటిమీద అర్థచంద్రాకారపు బొట్టు—బొంబాయివస్తోందని తనకుమాత్రం తెలియకా ఏమిటి? ముఖంలో ఇదివరకున్న కాంతీ—మమకారం—కామం—ఇప్పుడు దర్శనమివ్వటం లేదు. గుర ముల్లో—పెదవుల్లో వర్ణంకరిగి వెలిసినట్టుగా వుంది.

'చాలా పామానువుందే!' అంటూ నవ్వటానికి ప్రయత్నించాను. కాని శారదరాక నాలో భయాన్ని రేకెత్తించింది. నలుగురిలో చెప్పుకునేందుకు సరోజ నాకు దూరపుచుట్టమైనా కాదు—

'అబ్బబ్బ!...ఏం వర్షం!...నాకు ప్రకృతి కూడా చక్కటి స్వాగతం పలికింది.' శారద నవ్వు కుప్పెట విప్పి లోకానికి చూపుతూ అందులో ఏంవున్నదీ కనుక్కోమన్నట్టుగా వుంది.

'చాలా అలిసి పోయుంటావు. స్నానం చేస్తావా? అదే బాత్ రూం.' ఆమెకు టవలు యిద్దామనుకుంటుంటే ట్రంకులోంచి తువాలు తీసుకుంది. చీర - జాకెట్టూ తీసుకుంది.

రేడియో వాల్యూం కొద్దిగా హెచ్చించాను. ఏదో హిందీ రికార్డు - సగం చదువుతూ వదిలేసిన 'రెబెకా' తీశాను కొత్తగా వచ్చిన మిసెస్ డీవింటర్ పరిస్థితుల్ని చూసి జడుసుకుంటోంది కిటికీలోంచి జల్లు కొట్టింది - ఆకాశవర్షం కూడా.

శారదకూ నాకూ వున్న పరిచయం నాలుగేళ్ళ కాలపరిమితిలోకి వస్తుంది. కాలేజిలో శారద చదివేటప్పుడు ఆమెకు ఉపాధ్యాయుణ్ణి - ఆమె బి. ఏ. పూర్తవగానే నేనిక్కడకు రావటం తటస్థించింది. ఆమె ప్యాసయిందీ లేనిదీ కూడా నాకు తెలియదు. 'అంతకంటె ఎక్కువ పరిచయం వుందా?' అనే ప్రశ్న వేస్తే నలుగురికీ తెలియకుండా వుంచటంకోసం అవునని తలవూపక తప్పదు. ఆ ప్రశ్నకు నిజమైన సమాధానం కావాలంటే నా అంతరాత్మను విమర్శించుకోవాలి. అందుకు నాకే యిష్టం వుండదు. ఆ ప్రశ్న స్ఫురించగానే దాన్ని బయటకు నెట్టివేస్తాను

గడచినదానికీ - ప్రస్తుతానికీ మధ్య అగాధాన్ని సృష్టించుకుంటేనే కాని సుఖపడలేను. అదంత తేలిగ్గా జరిగేదీ కాదు. జరిగిన ప్రతీక్షణం మర్చిపోయే సహజ తత్వం మనకుంటే అసూయలు - వైషమ్యాలు - ప్రతీకారాలు వుండవు. అయినా శారద ప్రతీకారం చేయడంకోసమే వచ్చిందని ఎందుకనుకోవాలి!

శారద స్నానం చేసి వచ్చింది. బోర్డర్ లేని గులాబీరంగు చీర - తెల్లటి వాయిల్ జాకెట్టు - కడిగిన ఆణిముత్యంలా వుంది.

'చాలా ఆకలిగా వుంటావనుకుంటాను. నేను హోటలు పక్షిని' అంటూ రెండురోజుల క్రితం కొన్న షాంగ్రిలా బిస్కట్లు ప్లాస్టిక్ ప్లేట్‌లో వుంచి ఆమె ముందు వుంచాను. అదృష్టవశాత్తూ అరగంట తరువాత రుచిమార్చా మనుకున్న అరటిపళ్లు కూడా అవసరానికి ఆదుకున్నాయి. ఫ్లాస్కులో వున్న పాలుకూడా ఆమెముందు వుంచాను.

'ఇదే భోజన మనుకోవాలి.'

'థాంక్స్. మీకు చాలా శ్రమకలిగిస్తున్నాను. అసలు మీకు శ్రమకలిగించటానికే ఇక్కడి కొచ్చాననుకోండి' అంటూ నిర్లక్ష్యంగా నవ్వింది.

'బెజవాడ నుంచేనా?'

'ఆ... నేను ఆర్నెల్ల క్రితం పంపిన శుభలేఖ మీకు అందేవుంటుంది. కాని మీరుమాత్రం ఆశీస్సులు పంపలేదు. మీరు దీవించివుంటే నాజీవితం మరోలా వుండేది.'

శారద ఆరోపణలో నిజం లేకపోయినా ఆమె మనసులో ఏదో వుంచుకుని మాట్లాడుతోందని నాకు అర్థమయింది.

'నిజానికి నీ శుభలేఖ అందేసరికి నే నిక్కడ లేను. నేను తిరిగివచ్చి చూసుకున్నాను. అప్పటికి మీ పెళ్ళై ఆరురోజులయింటుంది.'

తుపానుకు ముందు సముద్రం ప్రశాంతంగా వుంటుందట!

'శంకరం బాగున్నాడా? ... అతన్నికూడా లాక్కు రాలేకపోయావా?'

'మేష్టారూ!...మీ హృదయంలో వుండే ఆరాటం నాకుతెలుసు— నే నెందుకువచ్చానని!— ఎల్లా అడగాలో మీకు తెలియటంలేదు—మనసులో గుర్తులా దెందుకు? నేను శంకరాన్ని వదిలివచ్చాను— పెళ్ళై ఆర్నెల్లవగానే ఏమిటీ అఘాయిత్యమని మీ రడుగుతారు. నా తత్వం మీకు కొత్తకాదు.'

బయట ఆకాశం ఉరిమింది. ఆ పిడుగు నా నెత్తిన పడ్డట్టే వుంది. రేడియో సంగీతం కర్ణకఠోరంగా వినిపించింది. కట్టేశాను. అయితే ప్రతీకారం ఆరంభ మైందన్నమాట!

'శంకరంలో నా కేలాంటి లోపాలూ కనపడ లేదు. అతన్తో నీకు మనస్పర్థ ఎల్లా ఏర్పడిందా అని నేను ఆశ్చర్యపోతున్నా. ఇంతకీ కారణం?'

శారద తలవంచుకుని సమాధానం చెప్పింది.

'క్షమించండి మాష్టారూ!... నేను చెప్పలేను. శంకరంమీద మీకున్న సదభిప్రాయాన్ని మార్చుకో వద్దు.'

'పొరబడ్డావేమోనని- మళ్ళీ ఆలోచించుకో—'

ఈ మాటకు శారద ఆకులు రాలినట్టు నవ్వింది.

'కళ్ళనూ — చెవుల్నీ నమ్మకూడదనుకుంటే పొరపాటే అవుతుంది. శంకరానికీ—నాకూ మధ్య తర్కం జరిగింది. ఆర్థికపుటిబ్బందుల్లో వున్నా మన వుకు కొంతవరకు నైతికజీవితాన్ని గౌరవించాలి. నా ఆత్మను చంపుకోలేను—ప్రపంచం నాకు అర్థ మవుతూంది.'

'శారదా!...ను వ్వేపరిస్థితుల్లో అతన్ని వద లించుకువచ్చావో నాకు తెలియదు. అటువంటప్పుడు నువ్వు డొంకతిరుగుడుగా ఎన్ని చెప్పినా జరిగింది వూహించుకునే శక్తిగాని—విమర్శించి నిజానిజాలు నిర్ణయించే అర్హతకాని నాకులేవు.'

మరో విమానం దగ్గరగా ఎగిరిపోయింది.

'పోనీండి—నా కీలోకంలో మీరు తప్పించి మరెవరూ లేరు. నన్ను మీరు కేవలం విద్యార్థినిగా భావించి మాట్లాడుతున్నారు కాని మనకున్న పూర్వ పరిచయాన్ని మర్చిపోతున్నారు. నేను కొత్తజీవితం మొదలు పెట్ట దల్చుకున్నాను. జరిగినదంతా పీడకల— దాంతో నాకు ప్రమేయంలేదు. ఇక్కడ నాకేదైనా ఉద్యోగ మిప్పిస్తే మీకు బోలెడు పుణ్యం. నాకు టైప్ రైటింగు తెలుసును. హయ్యర్ గ్రేడు పరీక్షకు వెళ్ళాను కాని ప్యాసుకాలేదు. రెండోది—ఉండ టానికి క్వార్టర్సు.'

'అమ్మశారోయ్!... శ్రీమన్నారాయణమూర్తిని ప్రత్యక్షం చేయిస్తానుకాని అద్దెకు ఆవగింజంత పోర్షనైనా సంపాదించటం నావల్ల కాదు. ఉద్యోగం మాటంటావా? ఆడవాళ్లకి లోటేమిటి? కళ్లకద్దుకు విస్తారు. నువ్వు కొత్తజీవితం ప్రారంభించదల్చుకుంటే ఇదే అనుకూల వాతావరణం. ఇక్కడ ఒకరి గొడవ మరొకరి కనవసరం—ఎవరికివారే యమునాతీరే! నీ కభ్యంతరం లేకపోతే నువ్విక్కడే వుండొచ్చు. ఆఖరుసారిగా నే నడుగునేది—నువ్వు శంకరాన్ని అపార్థం చేసుకున్నావేమో నని.'

శారద జవాబు చెప్పలేదు. తెల్లగావున్న గోడ కేసి చూసింది.

టైప్ రైటింగ్ తెలియకపోతే శారద కింత త్వరగా వుద్యోగం దొరక్కపోను. అందులోనూ జీవితాన్ని కొద్దిగా అర్థం చేసుకున్నదేమో, ఇంటర్వ్యూలో బాస్ ని మెప్పించేసింది. జీతం మాటపాటి కైనా విరాళపడే నవసరంలేదు. గుడ్డిలో మెల్ల—నా వాటాకు ఇరుప్రక్కలా వున్నవారు మా యిద్దరి అనుబంధం గురించి ప్రశ్నించారు. దూరపు బంధువని, వరసకు చెల్లెలవుతుందని చెప్పాను. నేనేమీ తప్పు చేయనప్పుడు నిజం ఎందుకు చెప్పలేకపోతున్నానో అర్థం కాలేదు. వాళ్లు ఏమైనా అనుకుంటారు—నాలోని బలహీనతకు నవ్వొచ్చింది.

శారద వచ్చిన నాలుగు రోజులకే చాలా మారింది. మొహంలో ఏదో కొత్త కళ వచ్చినట్లైంది. తనకు వివాహమే అవనట్లు ప్రవర్తించింది. చుట్టుపక్కల వారితో స్నేహం కుదుర్చుకుంది. తనూ శంకరం పెళ్లి అయిన కొత్తలో తీయించుకున్న ఫోటో దాచిపెట్టింది. వాళ్ల మొహాల్లో వుండే చిరునవ్వు—స్వచ్ఛత ఇట్లా విషాదాంతమవుతాయని ఎవరూ వూహించలేదు.

'ఆ ఫోటో గోడకి తగిలించకూడదూ?' అనడిగాను.

'వద్దని' పెట్టె అడుగున దాచేసి తతిమ్మా సామానుతో పెట్టె బిగించేసింది. పొరపాటునైనా ఆ ఫోటో తనకు కనపడకూడదని ఆమె అభిప్రాయం.

శారద వచ్చి వారంరోజులు దాటింది. ఈ ఏడు రోజుల్లో ఆమె గతాన్ని త్రవ్వటానికి ప్రయత్నించలేదు. భగవంతునికి నమస్కారమనుకున్నాను. కాని ఎనిమిదోనాడు రాత్రి నాకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. గడియారం పన్నెండు కొట్టింది. యథాలాపంగా నాకు మూడుగజాల దూరంలోవుండే శారద పక్కకేసి చూశాను. అది ఖాళీగావుంది. నా తలవైపునున్న కిటికీదగ్గర ఎవరో వున్నట్టు అనుమానం కలిగింది. చప్పుడు కాకుండా తిరిగిచూశాను. శారద! కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమె తల్లోవున్న మల్లెపూలు పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. శారద నాలుగైదుసార్లు నన్ను పూలు తెమ్మంది.

'నువ్వే తెచ్చుకోకూడదా?' అనడిగాను. నాకు లోపల బాధగా నేవుంది. భర్తను వదిలేసింది. ఇంకా పూలకోసం పాకులాటెందుకు?

'ఫోర్టులో మంచివి దొరకవు. మీ కాలేజీకి దగ్గరున్న మార్కెట్టులో అప్పుడు కోసినపూలు దొరుకుతాయి' అని సమాధానం ఇచ్చింది.

ఈ మాటలంటూ శారద విసిరిన చిరునవ్వు నేను ఎనలైజ్ చేసుకుంటే నాకు భయం వేసింది. నా నిర్ణయం సరైంది కాకపోవచ్చు. అయినా శారద తన భావిజీవితాన్ని గురించి ఏమని నిర్ణయించుకున్నట్టు? ఆ ప్రశ్న అడగాలనుకున్నప్పుడు నాలుక చివరదాకా వచ్చి ఆగిపోయేది. ఆఖరుకు మా బిల్డింగులో వున్న వాళ్ళందరికీ పూలు తెచ్చేవాడితో తనక్కూడా తెచ్చేట్టు ఏర్పాటు చేసుకుంది.

శారద లైటు వేసింది.

'మీకు నిద్ర పట్టలేదని నాకు తెలుసు...అంతా నటన! చిత్రం! గంటక్రితం గుర్రు కూడా పెట్టారు!' అంటూ నో జడను ముందుకు లాక్కుంది.

'ఆ బాధ అనుభవించేది నువ్వు! నా కలాంటి మానసిక బాధలూ లేవు...వెళ్లి పడుకోరాదూ! నిశిరాత్రి దాటింది. రేపు టైపుమిషనుముందు కునికిపాట్లు పడతావు'

ఈమాట లంటున్నానుకానీ నా దృష్టి శారద చీరమీద వుండిపోయింది. సాయంత్రం సాదా రంగు నేతచీర కట్టుకున్నట్టు జ్ఞాపకం. ఇంతట్లో గులాబీరంగు వాయిల్ లోకి ఎప్పుడు మార్చిందీ ఎందుకు మార్చిందీ అర్థంకాలేదు. 'మగవారంతా స్వార్థపరులు. అవసరం తీరాక మర్చిపోతారు. క్షణానికో బుద్ధి.

అయినా నేను పునర్విగ్రహం మా చేసినా మీరు పొమ్మంటారేమిటి?' ఈసారి నాముందుకచ్చి నిలబడి తన ప్రశ్నకు సమాధాన మిమ్మన్నట్టుగా చూసింది.

శారద ఎందుకీమాట లంటున్నదీ నాకు కొద్దిగా అవగాహనైంది. అయినా ముందే చెప్పాను గడచిన జీవితంగురించి తల్చుకోటమంటే నాకు చాలా భయం. ఎవరితోనూ చెప్పను. దీని పర్యవసానం మంచిగా పరిణమించదనీ తెలుసు. అయినా పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోలేను. పిరికివానిలా వెనక్కి పారిపోనూలేను. అది హృదయ దౌర్బల్యం కావచ్చు. బాణాల్లా దూసుకుపోతున్న శారద మాటలు—

అయినా ఒకటిమాత్రం అందరూ అంగీకరిస్తారు అభిప్రాయాలు, నమ్మకాలు స్థిరంగా ఉండవు పరిస్థితుల కనుగుణంగా మారిపోతాయి పదమూడు నెలల క్రితం నాకు స్త్రీ మీద గౌరవం లేకపోవచ్చు ఆట వస్తువుగా భావించి అందిన అవకాశాన్ని జారవిడువక పోవచ్చు—కాని అభిప్రాయాలు—జీవితంమీదుండే దృక్పథం మారటానికి పదమూడు నెలల కాలవ్యవధి చాలదా అని నా అనుమానం.

'అయినా ఆ చీకట్లో అర్ధరాత్రి చూడవలసిన సౌందర్యమేముంది?'

'మీకు పాతబడిపోవచ్చు. కాని నాకుమాత్రం కొత్తే!' అంటూ శారద లైటుఆర్పేసి పడుకుంది. శారదచెయ్యి నాముఖానికి తగిలింది. అది అనుకోకుండా నే - పొరపాటున జరిగుండాలని నన్ను నేను తృప్తిపర్చుకున్నాను.

ఆ మర్నాడు శారద యథాలాపంగా నే వుంది చిత్రమేమిటంటే మా ఇద్దరి హృదయాల్లో రహస్యాలు బోలెడున్నాయి. అవి ఎవ్వరికీ చెప్పలేం సరికదా- మాలో మేమే అనుకోలేం - పక్కనేవున్న జూహూ బీచ్‌కి వెళదామని శారద వారంరోజులుగా పోరు పెడుతోంది. ఆదివారం కావటంమూలాన సరేనని బయలుదేరాం.

ప్రపంచంలోవున్న అశాంతిని వెలిగక్కుతున్నట్టు సముద్రపుటలలు ఎగిరిపడుతున్నాయి కొందరు ఆంగ్లో ఇండియన్ అమ్మాయిలు జలక్రీడ లాడుతున్నారు. 'వీళ్ళెప్పుడూ ఆనందంగా వుంటారుకదా!... వీళ్ళకు మానసికబాధలుండవా?' అనేది నా అనుమానం. నిజానికి కొందరిజీవితాల్ని మాత్రంగా పరిశీలించాలనివున్నా అవకాశం చిక్కటంలేదు. శారద ముందుకు నడుస్తోంది. ఓచేత్తో చీరతడవకుండా కుచ్చెళ్ళు ఎత్తిపట్టుకుంది కెరటాలు కాళ్ళను చుట్టి వేస్తున్నాయి అంతూ - దరీ లేకుండా పొంగి పొరలి పోతూన్న సముద్రాన్ని చూసేసరికి నాకు భయం వేసిందికూడా! వెనక్కి తిరిగి ఇసకలోకి నడిచిపోయాను. మోచెయ్యి తలగడగావుంచుకుని పడుకుంది.

'మేమైరా!....నాకు జీవితంమీద ఎలాంటి అభిప్రాయంవున్నదీ చెప్పనా?...మీరు నవ్వుకోరను కోండి. ఉండేది నాలుగురోజులని పెద్దలే అన్నారు కదా! చేతికందినంతవరకూ ఆనందమనుభవించటమే ఉత్తమ మార్గం అంతేకాని ఆచారాలు - అర్థంకాని పట్టింపులూ - నీతి న్యాయం - అంటూ గోడలుకట్టు కూర్చుంటే అనోవిహాసగిరి మవుతుంది. ఒమర్ ఖయ్యాం తత్వం మీరు చదువలేదూ!... మంచనుది. బి. ఏ. లో పొయిట్రీకి మీరేగా వస్త! కొన్ని సవర ణలుచేస్తే అదే వుత్తమమైనదంటాను. సవ్యాప సవ్యాలు విచారిస్తూ కూర్చుంటే ఆవులించినట్టు కాలం తుర్రుమంటుంది. ఏమంటారు?'

శారదకు చెప్పవలసిన సమాధానంగురించి నేను ఆలోచించలేదు ఈమాటలు బ్రౌనింగ్ వింటే ఏం చేస్తాడని. విపరీతపు టాలోచన మెదడులు పెట్టాను నెత్తీ నోరూ బాదుకుంటాడా? అమాంతం ఆ మాటలన్నవాడి మీద విరుచుకుపడతాడా?...... లేక ఆ వాదాన్ని ఖండిస్తూ మరో వంద పేజీలు రాస్తాడా?......

'మాట్లాడరేం?...ఆలోచన తెమిలిందా?' అంటూ లేచికూర్చుని బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంది తల్లో వున్న ఎర్రరిబ్బను గాలికెగురుతోంది. పసిఫిక్ మహా సముద్రం ఎంతలోతు వుంటుందో మర్చిపోయాను.

'నన్నడిగితే జీవితంమీద దృక్పథం ఏర్పరచు కోవటం అనేది అర్థంలేని వాక్యం. క్షణక్షణానికి అభిప్రాయలు-నమ్మకాలు మారుతూంటాయి. ఇవేళ నీకు దేవుడిమీద నమ్మకం లేకపోవచ్చును. పరిస్థితులు రేపు నిన్ను నమ్మించవొచ్చు 'విహేవియరిజం' అంటూ ఓసైకాలజీ వుందన్న సంగతి నువ్వు మర్చిపోయావు'

శారద కలుక్కుమంది.

'డొంకతిరుగుడుగా వున్నా చక్కగా సెల విచ్చారు. బసవయ్యగారి బండి సమయానుకూలంగా నడుస్తూంటుందని వెనక ఎక్కడో విన్నాను. మరోటి చెప్పనా?...సమయానుకూలముగా రూల్సు మార్చ బడును. కాంప్లిమెంటరీలు చెల్లవు' అంటూ విరగబడి నవ్వింది. కళ్ళు సగం మూతపడి ముఖాని కింకా అందం చేకూరింది సూర్యకిరణాలను పంచరంగులుగా విభజిస్తున్న నీటితుంపరల కేసి చూస్తూవుండిపోయాను. ఎక్కడో గనివుందని నలుగురూ అనగానే తవ్వటం మొదలుపెట్టారు కాని అంతు చిక్కటంలేదు.

'నాలో వున్న లోపం చెప్పమంటారా? నాకు బాధ కలిగించినవాళ్లను కాదు. నాకు ద్రోహం చేయదల్చుకున్నవాళ్లనుకాని, వదిలేసి ఆపలేను శంకరం విషయంలో అంతే. ఇద్దరిమధ్యా అభిప్రాయభేదం ఏర్పడగానే అతనన్నాడు: 'అయితే నువ్వు వెళ్ళొచ్చు అదైనా నీనిర్ణయంమీద ఆధారపడి వుంటుంది' అని. నేను వదిలేసి జీవితధిరణం పుచ్చుకోవలసింది.'

'నమస్కారం మేష్టారూ!' అన్నమాటలు విని వెనక్కి తిరిగి చూశాను. శారద మాటల్లో వున్న లోతుపాతుల్ని గురించి ఆలోచిస్తూ సతమతమవుతున్న నాకు శంకరంరాక మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. అతను వస్తాడని నేనెప్పుడూ వూహించలేదు:

'హలో శంకరం!' అన్నాను 'బాగున్నావా?' అనడుగుదా మనుకున్నా పక్కన శారదవుంది. అలా గడుగుతే అతనెలా ఫీలవుతాడో యేమో! పక్కన కూర్చున్నాడు. శారద ఎటోచూస్తూ దోసిలితో ఇసిక ఎగరబోస్తోంది. శంకరం రాకను గమనించిందా లేదా? అన్న అనుమానం కూడా కలిగింది ఆమె పరధ్యానం చూస్తే.

'ఎప్పుడు వచ్చావ్ బొంబాయి!?'

'వారంరోజు లయిందండి. పోర్టులో మా వేలు విడిచిన మేనమామవున్నాడు. అతను కబురంపితే వచ్చాను. నాకిక్కడ వుద్యోగం కూడా దొరికిందండోయ్!'

శంకరం నేనిదివరకు చూసినట్టే వున్నాడు. ఎటొచ్చీ ఈమధ్య హైరోడ్డు క్రాఫింగు మొదలు పెట్టినట్టున్నాడు. మెడ చుట్టూ సిల్కు మఫ్లరు చుట్టాడు. అతని డ్రెస్సింగులో అది ప్రధానాంశం. తరవాత ఎన్నో విశేషాలు చెప్పుకుపోయాడు. బొంబాయిలో తనకు నచ్చినవీ నచ్చనవీ- గుజరాతీ అమ్మాయిలు బాగున్నారా? మరాఠీ అమ్మాయిలు బాగున్నారా? సబర్బన్ ట్రెయిన్సులో ప్రయాణం చేసేదానికంటే తెల్లవారుజామున బయలుదేరి నడిచి వెళ్ళటం మెరుగన్నాడు.

'శారద వచ్చి రెండు వారాలు కావస్తోంది.' అని అతని సమాధానంకోసం చూశాను అతనది విని వినిపించనట్టు తన ధోరణిలో సాగిపోయాడు. ఈ మాటలు శారద ముఖంమీద ఎలాంటి మార్పు తీసుకువస్తాయో చూద్దామనుకున్నాను కాని ధైర్యం చాలింది కాదు.

'నాకు తలకాయ నొప్పిగా వుంది. పోదాం పదండి' అంది శారదలేచి నిలబడి

'మరి నేను సెలవు తీసుకుంటానండి. బహుశా నా మాటలు మీకు తలనొప్పిని కలిగిస్తాయి. మరో మనవి. ఇది నా ఎడ్రెసు మీరు వీలైతే రండి... నేనే వస్తాను లెండి' అంటూ చిన్న కాగితం ముక్క నాకిచ్చి వెళ్ళిపోయాడు. శారద మళ్ళీ కూర్చుంది.

'ఇంతకీ నీ భావిజీవితంగురించి ఏమిటి నిర్ణయించుకున్నావు?' అనడిగాను ఇద్దరికీ సంధి చేద్దామన్న అభిప్రాయం మనసులో వుంది కాని దాన్ని బహిర్గతంచేస్తే శారద విసుక్కుంటుంది. 'ఇలాగే వుంటాను...' ఏం? మొగుణ్ణొదిలేసిన ఆడది వుందనుకోండి. ఏంచేస్తుంది? చేసుకునేవాళ్లుంటే తిరిగి వివాహం. కోపం వొస్తూందికదూ మీకు? దగ్గర్లో వెలుగున్నా చీకటిని వెతుక్కుంటూ వెళ్ళేవారు సంఘానికి విద్రోహులు...అదీకాక మీరెంత బాధపడుతున్నారో నాకు తెలుసు. నేనిలా మీ దగ్గరుండటం నలుగురిమధ్య మిమ్మల్ని విమర్శకు గురిచేస్తుంది. పోనీ నన్ను తిరిగి శంకరం దగ్గరకువెళ్ళి ఏలుకోమని కాళ్లావేళ్లా పడి బ్రతిమాలుకోమంటారా?'

రెండు వాన చినుకులు మీద పడ్డాయి.

'వర్షం వచ్చేట్టుంది. పోదాంపద. మళ్ళీ బస్సు అందుకోవాలి' అంటూ శారదకు సమాధానం యివ్వకుండా తప్పించుకున్నాను.

శారద నా స్తబ్ధతతో తృప్తిపడేరకంకాదు. ఆమెలో చంద్రగ్రహం, అంగారకగ్రహాల్లో వుండే వింతలు - ఆకాశాన్ని చీల్చే కోరికలు - వున్నాయని

నాకు తెలుసు. కాని అగ్నిపర్వతం బద్దలవటమే ఆలస్యం. దాన్ని అడ్డగించటం అసంభవం-

రెండు రోజులు గడిచాక ఏదో పబ్లిక్ హాలీడే వచ్చింది. శంకరం మా యింటికి రాడని ఎలాగూ తెలుసు. అ ప్రొద్దుటే బయలుదేరి వెళ్లాను

అతను వుండేది కుర్లాస్టేషనుకు దగ్గరగా ఒక్క చోటే గది. చుట్టూ గోడలెంత యిరుకో-నీటి సదుపాయం కూడా లేదు నన్ను చూడగానే చదువుకున్న పుస్తకం మూసేశాడు. ఎలక్ట్రిక్ స్టౌమీద అన్నం గిన్నెలు - ఉడుకుతోంది. బల్లమీది పుస్తకం తీసి చూశాను. శివానంద సరస్వతి రచించిన పుస్తకం. షెల్ఫ్ కేసి చూశాను- ముందు కనిపించింది భగవద్గీత! పదమూడు నెలల క్రితం అతను సినిమాపత్రికలు - సెక్సు పత్రికలూ తెప్పించి మరేవీ చదివేవాడు కాడు. కాలేజీ డిబేట్లలో కూడా వేదాంతం విజ్ఞానాల్ని కప్పిపుచ్చే మత్తు మందని, కంటికి కనిపించని దేవుణ్ణి ఊహించి ఆలోచించటం పొరపాటని వాదించేవాడు. నన్ను కుర్చీలో కూర్చోమని తను కాఫీ పెట్టాడు.

'ఈమధ్య చిక్కిపోతున్నావ్?' అన్నాను అతన్ని గమనిస్తూ.

'అవునండి. రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. అయినా ఈమధ్య నా ఆరోగ్యం బొత్తిగా బాగుంటటం లేదండి.'

"కొంతసేపు భగవద్గీత చూస్తూ కూర్చున్నా. శంకరం కాఫీగ్లాసు ముందు వుంచాడు.

'థాంక్స్...సరేకాని నీవు విజయవాడలో చక్కటి వుద్యోగం వుండగా అది వదులుకుని ఇంత దూరం రావలసిన ఖర్మమొచ్చిందని?'

'మీరన్నీ తెలిసీ అడుగుతారు. సరే—కానీండి. అక్కడ నా జీవితం విషాదగీతంలా పరిణమించింది. ఎందుకో ఆ ప్రదేశాలు—ఆయిళ్లు—అన్నీ చూస్తుంటే గడచిన జ్ఞాపకాలు వచ్చి భరింపరానిబాధ కలిగేది. ఇంక దాన్ని వదిలి దూరంగాపోయి కృత్రిమజీవితాని కలవాటుపడకపోతే నేనో న్యూరోటిక్ పేషంటుగా తయారవుతానన్న భయం కలిగింది. మా మేనమామ కూడా రమ్మన్నాడు. వచ్చేశాను.'

ఓ నిమిషంసేపు నిశ్శబ్దత తాండవించింది.

'అది సరేకాని ఓచిన్నవిషయం అడుగుతాను చెప్తావా?'

శంకరం నవ్వాడు.

'మీరడగబోయే ప్రశ్న నాకు తెలుసు. శారదకూ నాకూ మధ్య జరిగిన ఘర్షణగురించి—అవునా?' అవునన్నట్టు తలూపాను

'క్షమించండి—ఆవిషయం ఇతరులకు తెలియకూడదనుకున్నాం. అందుచేత చెప్పలేను' అన్నాడు తలవంచుకుని—

ఇంక ప్రశ్నించి లాభంలేదనుకున్నా.— అసలు నేను పనికట్టుకువచ్చింది అందుకే!

'నీకు ప్రమాదం జ్వరం వస్తోందికదా!...మా యింటికి రాకూడదూ? నిన్నొక్కణ్ణి చూసేదెవరూ? నీ మేనమామ ఫోర్టులో వుంటాడు నువ్వొక్కడుంటావు. ఎట్లా అడుక్కోగలవు?'

శంకరం రెండు మూడు నిమిషాలు మాట్లాడలేదు నామాటల్లో వుండే అంతరార్థం అతను వూహిస్తున్నాడనుకుంటాను.

'సరే వస్తానండి నాకంటే అనుభవం వున్నవారు. మీ మాటెందుకు కాదనాలి?...రేపు సాయంత్రానికి సామానుతో దిగుతాను.' మరో అరగంట గడిచాక తృప్తిగా తిరిగివచ్చాను. శారదతో ఆమాటలు చెప్పాను. ముఖం పాలిపోయింది. దాన్ని పైకి కనబడనీయకుండా ముఖకవళికలు మార్చుకుని నవ్వింది.

'మీరువెళ్లి చేసుకొచ్చిన ఘనకార్యమిదన్నమాట!...బలంవున్నవాళ్ళదే రాజ్యం—అతనికూడా వంటకు నేబాధ తప్పుతుంది. సుఖపడతాను. మరో పెళ్ళి చేసుకునేదాకా ననుకోండి.'

'ఎవరి పెళ్ళయ్యేదాకా?' అంటూ నవ్వేశాను. శారద కూడా నవ్వింది.

మర్నాడు సాయంత్రం శంకరం సామానుతో దిగాడు. శారద అతనిముందు కాఫీ వుంచింది. ఇద్దరూ గజం దూరంలోవున్నా ఒకరినొకరు చూసుకోటం లేదు. శంకరం పెట్టెలోంచి తన పెళ్ళినాటి ఫొటో తీసి గోడకి తగిలించాడు. అతనెందుకలా చేసిందీ నాకర్థం కాలేదు నా సమస్య యిది. శారద కనక తన తప్పిదానికి (ఆమె తప్పుచేసివుంటే) క్షమాపణ చెప్పుకుంటే శంకరం తిరిగి ఏలుకుంటాడా? శారద

మీద అతని కనురాగం వుందా లేదా? కేవలం పట్టింపు కోసం తన మనోభావాల్ని - ఆత్మను అణచివుంచాడేమో! అందుకే అతన్ని సూక్ష్మంగా పరిశీలించవలసి వచ్చింది. నిజానికి అతనన్న ప్రతీమాటకు - అతని నవ్వుకు - విపరీతార్థాలు కల్పించుకునేవాణ్ని. రాత్రి భోజనందగ్గర వడ్డించేటప్పుడు కూడా శారదను గమనించాను. పొరపాటునైనా అతనికేసి చూడలేదు.

'మేష్టారూ!...ఇంకొంచెం నెయ్యి కావాలి' అన్నాడు నాకేసి తిరిగి. శారద నెయ్యి వడ్డించింది. ఆక్షణంలో శారద చిరునవ్వును బలవంతాన వారించుకుని గంభీరంగా వుండటానికి ప్రయత్నిస్తున్నట్లనిపించింది. నాలో విజయచిహ్నాలు తలెత్తాయి కూడా.

నేనెంత వారించినా అతను వినకుండా బయట పడుకున్నాడు. నాకు చాలా బాధకలిగింది 'శంకరం నన్నవమానిస్తున్నాడా?' అనిపించింది. అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న మొగుడూ, పెళ్ళాం, వేర్వేరుగా వుండటం—పరాయివాణ్ణి నేను మధ్యవుండటం—పోనీ వీధి తలుపు తీసివుంచుదామనుకున్నా - దొంగలభయం ఎక్కువ—అందుకని తలుపు మూయక తప్పింది కాదు. అతను బయట— నేనూ శారదా లోపల—ఛీ...ఛీ...అతనేమనుకుంటాడో! రాత్రి పన్నెండుదాకా నిద్ర పట్టలేదు. శంకరం రెండు మూడుసార్లు కిటికీదగ్గరకు వచ్చి లోపల నేవున్నానో లేదోనని చూసినట్టు అనుమానం కలిగింది. అది భ్రమే కావొచ్చు.

మర్నాడు సాయంత్రం నేను ఆఫీసునుంచి వచ్చేసరికి శంకరం ముసుగు తన్నిపెట్టి పడుకున్నాడు. శారద వోయాల కూర్చుని ఏదో నవలగాబోలు—చదువుతోంది.

'ఏమిటి సంగతి?' అనడిగాను శంకరందగ్గరకు వెళ్ళి.

'మళ్ళీ జ్వరం వచ్చిందండి—అందుకే నేను వంటరిగా వుండటం మంచిదంటాను వృథాగా మీకు బాధ కలిగించి నామీద మీకున్న అభిమానాన్ని చంపుకుంటున్నాను.' అతని కంఠం అప్పుడే ఐస్ టబ్‌లో మునిగినట్టుగా వుంది.

'అబ్బే...అలాంటిదేం లేదు. జ్వరం అందరికీ వస్తుంది. అంతమాత్రంచేత బాధపడి లాభం లేదు. కాఫీ తాగావా?' నుదుటిమీద చెయ్యివేస్తూ అడిగాను.

'ఊ...' అంటూ మూలిగాడు

కిందవాటాలోవున్న డాక్టరును తీసుకువచ్చాను. పరీక్షించి చూశాక మందువీసా తీసుకురమ్మన్నాడు. రేపటికి తగ్గకపోతే ఇంజక్షనివ్వొచ్చన్నాడు.

ఆ మర్నాడు పొద్దున్న జ్వరం తగ్గినట్టే కనిపించింది. కాని సాయంత్రానికి మళ్ళీ ఎక్కువైంది. డాక్టరు ఇంజక్షనిచ్చిపోయాడు. రాత్రి ఏడుదాటినా శారద రాలేదు. నాకు భయమేసింది. నేను శంకరాన్ని తీసుకువచ్చానని ఎక్కడికైనా పోయిందేమో! ...లేక విసుగెత్తి ఆత్మహత్య చేసుకుందా?....ఛీ.... శారద ఎప్పుడూ అలాని చెయ్యదు మరో వందమంది మగాళ్ళను ఏడిపించుకు తింటుంది. అదామెకో సరదా యేమో!...ఓనాడు ఫ్లోరా ఫౌంటెన్‌దగ్గర ఓ పడుచు కుర్రాడితో నవ్వుతూ పోతున్న శారదను చూశాను. మరోనాడు వి. టి లో ఆమెను వీడ్కోలిస్తూ చేతి రుమాలు వూగిస్తున్న మరో యువకుణ్ణి చూశాను. ఇవన్నీ మళ్ళీ కళ్ళయెదుట ప్రత్యక్షమై నన్ను కలవరపరిచాయి.

శారద ఇల్లు చేరుకునేసరికి ఎనిమిదైంది. రాగానే విసుగ్గా హేండ్‌బాగ్ టేబిలుమీద విసిరికొట్టింది.

'ఆలస్యమైందేం?' అనడిగాను. అడగటానికి హక్కు లేకపోయినా—

'ఆ... మేనేజరుకీ నాకూ మధ్య ఘర్షణ— ఫలితం—నా వుద్యోగానికి రాజీనామా యిచ్చేయటం; హాండ్ డెలివరీ-' అంది.

శారద ఇదివరకోమాటు అననే అంది. తను ఉద్యోగం మానేస్తే నేను పోషించకుండా వుంటానా అని—

మరో వెర్రినమ్మకంకూడా కలిగింది. శంకరానికి సపర్యచేసి అతని అనురాగాన్ని తిరిగి పొందటానికోసం—మధ్య అడ్డంకుగా వుంటున్న ఈ నౌకరీని కావాలనే వదుల్చుకుందా?....ఇక్కడ శారదే శంకరంతో పోట్లాడిందని. శంకరం నిరపరాధని నేనెందుకనుకుంటున్నానో తెలియదు బహుశా అది సహజతత్వం కావచ్చు.

'ఏమిటా ఘర్షణ?'

'ఏముంది? పడుచుపిల్ల కనపడగానే నూటికి తొంభైమంది మగవాళ్ళకు ఒక్కటే రకం భావం

స్ఫురిస్తుంది. అంతే—ఇంక దాన్ని వ్యాఖ్యానించమని నన్నడక్కండి'

'అడగను కొని బార్లీ తీసుకువచ్చాను. అతని కొంత జావ కాచివ్వగలవా?'

'నాకంటె ముందు వచ్చారుకదా!...స్టౌ వెలిగించలేకపోయారా?' అంటూ వంటింట్లోకిపోయింది. శారద సమాధానం విన్నాక కొద్దిక్షణాల క్రితం నాకు స్ఫురించిన అభిప్రాయం సరైంది కాదేమో ననిపించింది.

శారద రాజీనామా చేసినందుకు ఒకవంక సంతోషంగా వున్నా మళ్ళీ ఉద్యోగప్రయత్నం చేస్తుందని మరోవంక బాధగావుంది. కొంచెం ఇంచుమించు శారద నాతోపాటే ఆఫీసుకువస్తుంది. నాకంటె పావుగంటముందుగా తిరిగి వస్తుంది. అందుచేత వాళ్ళిద్దరూ తమతమ పొరపాట్లను సరిదిద్దుకోటానికి - ఒకర్నొకరు అర్థంచేసుకోటానికి అవకాశం లేదనుకుంటూ - ఇప్పుడా పరిస్థితులు దైవికంగావచ్చాయి.

మర్నాడు పొద్దున్న పక్కవాటాలో వున్నాయన నన్నుపిలిచి శారదగురించి - శంకరంగురించీ అడిగాడు. మంచివాడు కనక నిజం చెప్పాను. వాళ్ళగురించి ఆ బిల్డింగులో వున్నవాళ్ళు ఏమనుకుంటున్నదీ ఆయన వివరించాడు. నేను వ్యభిచారిణినీ - శారదను నేనే తీసుకువచ్చానని చిలవలుపలవలుగా కథల్లి చెప్పుకుంటున్నారట అయితేనేం?......ఆ చుట్టుపక్కల వున్నవాళ్ళందరిదగ్గరా సత్యనారాయణ పూజకి చందా వసూలు చేసేటప్పుడు నాదగ్గర కూడా వచ్చారు. నేను రూపాయివ్వగానే నన్ను చాలా పొగిడారు. నాకు దైవచింత ఎక్కువని-పూజకూడా వచ్చి దాన్ని విజయవంతంగా నిర్వహించవలసిందని క్రింద వాటాలోవున్న మరాఠీ ఆయన ప్రశంసించాడు.. మానవనైజంమీద అల్లిబిల్లిగా అల్లుకుంటున్న అభిప్రాయాలు ఇప్పుడు సరైనతోవలో పడ్డాయి రూపాయిస్తేచాలు - ఎంతైనా గౌరవాన్ని - ప్రశంసల్ని అందుకోవచ్చు. అయిదు రూపాయలు - కాదు వంద రూపాయలిస్తే? అమ్మో! అప్పుడు పొగడ్తలకు అసలు తట్టుకోలేం.

'నేనుకూడా మిమ్మల్ని నమ్మలేకపోతున్నాను. సుమండి - మానవత్వం అలాంటిది. ఏదీ అనుకోకండి- అంతమాత్రంచేత మీమీద నాకు విరోధంకాని - చెడు అభిప్రాయంకాని లేదుసుమండి.' అన్నాడాయన.

'అది సరేకాని మీరు నాకోచిన్న ఉపకారం చెయ్యాలి. వాళ్ళిద్దరూ ఎడమొహం పెడమొహంగా వున్నారు. నేనులేనప్పుడు ఏమైనా మాట్లాడుకుంటున్నారేమో గమనించండి. నాకూడా యిది మిస్టరీగా వుంది' అన్నాను. ఆయన సరేనన్నాడు.

శంకరానికి వచ్చినజ్వరం మలేరియా అయుంటుందని డాక్టరు సూచించాడు. విపరీతంగా జ్వరం లేనప్పుడు శంకరం సరదాగా మాట్లాడేవాడు.

'జ్వరం వచ్చిందికదా అని నాకేంతమాత్రం భయం లేదండోయ్. అది శరీరాన్ని - ఆత్మను పవిత్రం చేస్తుంది. అందుకే దాన్ని నేనాహ్వానిస్తాను' అంటాడు. అతనికి మందివ్వటం - జావకాచివ్వటం - నారింజరసం పిండివ్వటం - అంతా శారదే చూసుకునేది వాళ్ళిద్దరూ ఎప్పట్లాగే వుంటున్నారని పక్కింటాయనన్నాడు. భవిష్యత్తుమీద నమ్మకం లేకపోతే బతకలేం - మనం తల్చుకున్నది, అనుకునేది జరగదని అసంభవమైనదని తెలిసినా ఆ అభిప్రాయాల్ని వదిలించుకోలేం - నెత్తిమీద పిడుగుపడుతున్నా పడకపోవచ్చునే వెర్రిభ్రమ చివరిదాకా వుంటుంది. నీటిలో మునిగిపోతున్నవాడికి గడ్డిపరక దొరగ్గానే పట్టుకుంటాడు. అది తన్ను రక్షిస్తుందని కొనవూపిరిలాంటి ఆశ. నాపరిస్థితికూడా అలాగే వుంది.

నాలుగు రోజులు గడిచాక జ్వరం తగ్గింది. కొద్దిగా నడవటం మొదలెట్టాడు. డాక్టరు అది మలేరియా కాకపోవచ్చునన్నాడు. మరో మూడురోజులు గడిచాయి

సాయంత్రం నేనురాగానే పక్కింటాయన పరుగెత్తుకొచ్చాడు. తలుపులు మూసివున్నాయి.

'ముందిలారండి...' అంటూ తనవాటాలోకి తీసుకుపోయాడు.

'వాళ్ళిద్దరూ ఇవేళ పోట్లాడుకున్నారు. కారణం సరిగ్గా అర్థంకాలేదు. శంకరం మీగురించి ఏదో అసందర్భంగా పేలాడనుకుంటాను. అదైనా అతను ఇంగ్లీషులో అనటంవలన నాకు తెలిసింది. ఆ అమ్మాయి నతను సాచిపెట్టి కొట్టాడు.' ఆయనకు గుజరాతీ తెలుసు

కాని తెలుసుకోరాదు. ఆయనకు అభినందన చెప్పి తలుపుతట్టాను: శారద తలుపుతీసింది. శంకరం మంచం మీద కూర్చున్నాడు. శారద రెండుకళ్ళూ ఎర్రగా వున్నాయి

'ఏంజరిగింది?' అనడిగాను, దుష్టా పిశాచాలు నృత్యంచేస్తున్నట్టుంది నాకు శారద మాట్లాడలేదు.

'మా యిద్దరిమధ్యా వాదనజరిగింది. నేను ఉద్రేకాన్ని ఆపుకోలేక ఆమెను దవడమీదకొట్టాను.' అన్నాడు.

'దీనికంతా మీరే కారకులు— నేను వదిలించుకు వద్దామనే వచ్చాను ఇంక నేనే ఎవరికీ తెలియనిచోటుకు పోతాను' అంది శారద ఈ అపవాదును ఖండించినా ప్రయోజనం వుండేదు. జరగాల్సిందెలాగూ జరిగింది. దీంతో అటోయిటో తేల్చేయటం మేలనుకున్నాను. నాకున్న అధికారంతో శంకరాన్ని నిందించాను.

శంకరం లేచి నిలబడ్డాడు.

'మేష్టారూ...మీ దారికి నేనడ్డురాను. కాని మీరు వృథాగా అందర్నీ బాధపెట్టడానికంటే మీ మనసులోవున్నట్టు చేయండి. మా యిద్దరిమధ్యా విరోధం ఎందుకు కలిగిందో కూడా చెప్తాను. శారద నన్నెప్పుడూ ప్రేమించలేదు. శారద మిమ్మల్ని ప్రేమించింది. మీకూ ఆమెమీద అనురాగం వుందన్న సంగతి నాకు తెలుసు కాని మా పెళ్లి జరిగేటప్పటిది నాకు తెలియదు. మా పెళ్ళికి పూర్వం మీకూ శారదకూ వున్న సంబంధం నాకు తెలుసు మీరు శారదను కన్యగా వుంచలేదనీ నాకు తెలుసు. అది శారదకూడా ఒప్పుకుంది. అనురాగం లేని యిల్లాలుతో నాకు ప్రమేయంలేదు జరిగినదంతా పీడకల. ఈ మాటు శారదను ఇదివరకటిమల్లే ఉపయోగించుకోకుండా పెళ్ళిచేసుకోండి. రిజిష్టర్ మేరేజీ పెద్దవారు. మీకు నా సలహా అనవసరం—' శంకరం మొహం అటు తిప్పుకున్నాడు.

నా కాళ్ళకింద భూమి కిందికిపోతున్నట్టనిపించింది. అయితే శంకరం నిజం కనుక్కున్నాడన్న మాట... పెళ్ళికాని అమ్మాయిని వంచించిన నన్ను అథముడిగా చూచి మాట్లాడాడు. ఇంకెందుకు? నేను ఎన్నో విధాల దాన్ని అణచివుంచాలని ప్రయత్నించాను. మీరు కూడా శంకరం ఈ రహస్యం బయట పెట్టేవరకూ నామీద సదభిప్రాయం కలిగివుంటారు. నీతికి భయపడేవాణ్ణని, సంఘం నన్ను వృథాగా కష్టపెడుతోందని అనుకునివుంటారు. మొదట్లో నే చెప్పా. గతంలోకి వెళ్ళటం నాకు భయమని. శంకరం నా నెత్తిన ఈ పిడుగుపడ వేయకుండా వుంటే నా కథ—నా సత్ప్రవర్తన మీకు నమ్మివుండును కాని కథ అడ్డం తిరిగింది...శారదవైపే చూశాను. ఏమీ మాట్లాడలేను. గుజరాతీ ఆయన బయట నిలబడి ఏమీ అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు. 'రెబెకా' లోని ఘట్టం జ్ఞాపకమొచ్చింది. ఫేవెల్ 'నువ్వు ఖూనీ చేశావు' అన్నాడు: మాక్సిం ఇరకాటంలో పడ్డాడు.

శంకరం పగలబడి—విరగబడి నవ్వుతున్నట్టనిపించింది. శారద యిదివరకు విసరిన ఛెణుకుల కర్థం ఇప్పుడు సరిగ్గా అవగాహనవుతూంది. నాకు పాత అనుభూతులు పాతబడిపోయినా తనకు కొత్తేనట! ఆ రాత్రి శారద కావాలనే తన చెయ్యి నా ముఖానికి తగిలించిందేమో! తిరిగి నాలో అవినీతిని రగుల్కొల్పటానికి. మైలురాయిలాంటి అభిప్రాయాలనైనా మార్చటానికి పదిహేడు నెలల అవధి చాలు! ఫోర్టులో మల్లెపూలు మంచివి దొరకవు!...అనుకుని నేనే తేవాలి.

ఛటుక్కున నాకో ఆలోచన తట్టింది. అది పారితే అపవాదంతా శంకరంమీదికి తోసేయవచ్చు. నేను నిర్దోషినవుతాను. కాని అది కూడా ఇంకెవరూ నమ్మరు—వృథా ప్రయత్నం

మళ్ళీ శంకరం అట్టహాసంగా నవ్వుతున్నట్టనిపించింది.

"కుక్కపిల్ల దొరికింది"

శ్రీ రావి కొండలరావు

పాత్రలు: చిదంబరం. సీను, అబ్బాయి, కంట్రాక్టరు, కోదండం, చతుర్భుజం.

* * పరిశుభ్రంగా అలంకరించబడిన ఒక గది. ఒకమూల టెలిఫోను వున్నది. గోడకు ఎదురుగా పటాలు, కాలెండర్లూ వున్నై. కాలెండరుకు దిగువగా కుక్క వున్నది జాగ్రత! ("Beware of dog") అనే బల్ల వ్రేలాడుతున్నది. తెర లేచేసరికి స్టేజిమీద మనుష్యులెవరూ లేరు. కాస్సేపటికి టెలిఫోన్ మ్రోగింది. ఇంట్లోంచి నౌకరు 'సీను' అనే కుర్రాడు వచ్చాడు. వచ్చి ఫోనుతీసి:

సీను : ఎవరండీ...ఆఁ...అయ్యా లేరండి...అవునండి....అయ్యగారు లేరు ... తెలీదండి... తెలీదండి... ఏదీ తెలీదండి .... (కాస్సేపు విని, కుక్కపిల్లకు అన్నంపెట్టే ఒక గిన్నె ఒకమూలవుంటే వెళ్ళి దానికేసి దీనంగా చూస్తున్నాడు. ఫోను మళ్లీ మ్రోగింది. (సీనువెళ్లి తీసి) ఎవరండీ?... నే నేనండి ... అయ్యా-అయ్యగారూ తమరా!...ఎక్కడ నుంచి మాట్లాడుతున్నారు? .... ఆ ప్రక్క నుంచే!...చిత్తం దొరకలేదండి...లేదండి తమరు రండి...తమరు రావాలంటూను ... మాటిమాటికీ తమరట్లా 'దొరికిందా దొరికిందా' అంటే ఎట్లా?...ఐదునిమిషాలకిందటేగా అడిగారు—అవును అడిగారు లేవన్నాను...అవునండీ లేదన్నాను ... చిత్తం (విసిగిపోయినట్టు ఠపీమని పెట్టాడు. అటూ ఇటూ చూసి గదంతా సర్దుతున్నాడు. బయటనుంచి కాస్సేపటిలో యింటి యజమాని చిదంబరం హడావుడిగా వచ్చారు. 50 సంవత్సరాల ప్రాయం. సూటు వేసుకున్నాడు. వస్తూనే నెత్తిమీది టోపీ తీసి బల్లమీద విసిరాడు)

చిదం : అబ్బబ్బబ్బ...రామచంద్రా...శ్రీ రామచం...(ఆగి, గోడకు తగిలించివున్న "Beware of dog" బోర్డుకేసి చూసి) ఈ బోర్డు ఇక్కడ తగిలించడంలో నీ వుద్దేశం? (ఆగి, చూస్తూ) ఈ బోర్డు ఇక్కడ తగిలించటంలో ఏమిటి నీ ఉద్దేశమూ అని అడుగుతున్నాను—చెప్పు సమాధానం - చెప్పు!

సీను : ఉద్దేశం ఏముంటుందండీ?

చిదం : ఈ బోర్డు 'ఇక్కడ' ఎందుకు తగిలించావురా వెర్రిసీనుగా?

సీను : ఉండిపోయిందిగదా అని—

చిదం : అంతేనా?

సీను : అంతేనండి!

చిదం : అంతే గద!...ఇంతకూ, దాని అర్థంఏమిటో నీకు తెలుసా? అదే - ఆ బోర్డుమీద వున్న ఇంగ్లీషు అక్షరాలలోని గూఢార్థం? (సీను తెలీదని తల వూపబోగా) 'తెలీదని' తల వూపక్కర్లేదులే—నాకు తెలిసిందిలే నీకు తెలీదని! "ఇక్కడోకుక్కవుందీ-జాగర్త!" అని దాని అర్థం. దాని అర్థం నీకు తెలీదు కాబట్టి—ఆ బోర్డు ఇక్కడ కట్టినందుకు వూరుకుంటున్నాను. వినవాయా "ఇక్క—

డోకుక్క వుంది - జాగర్త" అనే బోర్డు తెచ్చి ఈ గదిలో పెడితే మనిద్దరిలోనా ఆ కుక్క ఎవరం అని నీ అభిప్రాయంరా? ...మాట్లాడవు ... మాట్లాడకుండా దాన్ని అక్కడనుంచి తీసెయ్యి ... అసలెందుకు తెచ్చిపెట్టావు దాన్నిక్కడ?

సీను : అర్థం తెలీక నేనండి... తెలిస్తే లోపల మీ గదిలోనే వుంచేవాడిని కదండీ!

చిదం : నా గదిలో ఉంచేవాడివా—లేక గోడకు వ్రేలాడగట్టేవాడివా?

సీను : రామ రామ! అర్థం తెలిసిన తర్వాత ఇప్పుడెందుకు చేస్తానండీ అపని?

చిదం : ఇంతకుపూర్వం ఐతే అదికూడా చేసేవాడివే నన్నమాట!

సీను : అనుకున్నానండీ మీగదిలో నే పెట్టేస్తే జాగర్తగా వుంటుందిగదా అని—

చిదం : ఏడిశావ్ గాని—దాన్ని తీసి బల్లక్రిందపెట్టు పెద్దమనుషు లెవరన్నా వస్తారు. (సీను తియ్యటానికి పోబోతున్నాడు) ఆబోర్డును అసలు అక్కడనుంచి ఎందుకు కదిలించావ్?

సీను : కుక్కపిల్ల లేదుకదా దాని బోర్డుమాత్రం ఎందుకని?

చిదం : అటువంటప్పుడు తెచ్చి పడెయ్యక గోడకు ఎందుకు తగిలించావ్?

సీను : పోనీ ఏదో పటాలమాదిరి అదీ వుంటుంది కదా అని—దానికీ వేలాడతియ్యటానికి తాడొకటివుంది మరీ—

చిదం : సరే, తీసేయ్. (సీనుతీసి బల్లమీద పెట్టాడు) బోర్లించు. (బోర్లించాడు) దానిమీద ఏదన్నాకప్పు. (అటూయిటూ చూసి సీను కొత్త వార్తాపత్రిక తెచ్చి కప్పబోయాడు) ఉండుండు—అట్లా కప్పితే నే అనుమానం. ఒకటిచెయ్యి—టేబిల్ క్లాత్ క్రింద పెట్టు సరిపోతుంది. (సీను టేబిల్ క్లాత్ క్రింద పెట్టాడు) ఏదో ఎత్తుగాఉన్నట్టు కనుపిస్తోందిరా. నామాట విను. ఇక్కడినుంచి లోపలకు తీసుకుపోయి- నాగదిలో—నాగదిలో వొద్దు—అవతలగదిలో పడేయ్—జాగర్త. దానిఅవసరం ఐపోలేదు. (సీను వెళ్లాడు. చిదంబరం కోటు తీసేసి చిరాగ్గా కూలబడ్డాడు. సీను వచ్చాడు) ఏమయిపోయిందిరా మన కుక్కపిల్ల? దొరకనట్టే? ఇల్లంతా చిన్నబోయిందిరా—ఎంత ముద్దు! నన్ను చూస్తే ఒక్క నిమిషం వదిలేదికాదు. యెంత దూరంలోవున్నా ఇట్టే ఆనవాలుపట్టి, తోక వూపేది... నేను బిస్కట్లు తీసుకురాకపోతే దానికెంత కోపం- పాపం...ఎక్కడుందో ....ఏమయిందో!

సీను : విచారించకండిసార్! మన కుక్కపిల్ల మనకు దొరికితీరుతుంది. కాని—అది లేకపోతే నాకేం తోచటంలేదుసార్! (అమాయకంగా) ఎంత మంచి కుక్కపిల్లసార్ అది! ఎవ్వర్నీ ఏమీ అనేదికాదు. దొంగల్ని చూసినా ఎంతసేపూ అరిచేదేకాని కరవటానికి దానికి నోరే వచ్చేదికాదు సార్... అరిచేకుక్క కరవదంటారని—అరుపు తగ్గిద్దామని ఎంతో ప్రయత్నించాము. అరుపు తగ్గించేది! ఐతే 'ఒకర్నికరిచి బాధిస్తావా' అన్నట్టు నోట్లో చెయ్యిపెట్టినా విదిలించుకుని పారిపోయేః!

చిదం : సీనూ! ఆకుక్కపిల్ల మనకు ఎట్లావచ్చిందో తెలుసురా నీకు?

సీను : తెలీదుసార్!

చిదం : చెబుతావిను. బెంగుళూరునుంచి వస్తూంటే అమ్మన్య ఒకస్నేహితుడు నాకు బహూకరించాడు. అంతకుపూర్వం కుక్కపిల్లకోసం తెగ ప్రయత్నించాను. చిన్నప్పట్నుంచీ కుక్కపాఠాలు తెగచదవటంవల్ల, కుక్కలమీద బాగా మక్కువకలిగింది. ఏంచేస్తాం? మా నాన్నగారికి కుక్కలంటేకోపం-భయం! ఎందుకంటే ఆయన తండ్రిగారు కుక్క కాటువల్ల చచ్చిపోయాట్ట. ఆభయంవల్ల మా నాన్నగారు ఇంట్లో కుక్క 'బొమ్మ' ను కూడా వుంచేవాడుకాదు. గ్రామఫోను పాటలకోసం రికార్డులుకొంటే "వెనకా ఈ 'హిజ్ మాస్టర్స్ వాయిస్' రికార్డులు కొనవద్దని చెప్పానా లేదా" అంటూ అవన్నీ తీసుకెళ్ళి బయట పారేశేవాడు. నీళ్లుపోసి-

ఆబొమ్మను వూడదీసి రికార్డులు ఇంట్లోకి తెచ్చుకునేవాడిని. వీధిలో కుక్క అరుస్తే నౌకర్ని పంపి ఆకుక్కను వూరవతలిదాకా తరుముకుపోయొచ్చి ఇంట్లో కాలుపెట్టమనేవాడు! అంత చాదస్తపుమనిషి! నాకా చాదస్తమూ లేదు. భయమూ లేదు సరికదా—అదేవిటో ఆయన 'వద్దు' అంటున్నకొద్దీ నామనస్సు కుక్కలమీదికేపోయేది! "కుక్క విశ్వాసంగల జంతువు" అనేమాట నా మెదడులో ఎప్పుడూ పనిచేస్తూవుండేది. అంటాల-బెంగుళూరునుంచి వస్తున్నప్పుడు నాస్నేహితుడిని ఆ కుక్కపిల్లను నాకు బహూకరించమన్నాను. ఆ బహూకరణతో పాటు ఓ కాయితం కూడా యిచ్చాడు. "ఆకలి వేస్తున్న కుక్కకు అన్నం పెడితే అది నిన్ను కరవదు—కుక్కకూ మనిషికీ వుండే పెద్ద భేదమల్లా ఇదొక్కటే!" అని 'మార్క్ ట్వేన్' అనే మహానుభావుకి కొటేషన్ ఆ కాయితంమీద రాశాడు. ఎంత మంచివాక్యం అనుకున్నావు...ఆ కాయితం మాత్రం పెట్లో మిగిలిపోయింది

సీను : ప్చ్...ఏం చేస్తామండీ—ఖర్మ!

చిదం : కర్మమిట్టా నీ మొహం! (ఆగి) అసలు నువ్వే కారణం అది పోవటానికి—

సీను : నేనాండీ?

చిదం : అవును నువ్వే. ఆ కుక్కకోసం దానిపోషణకోసం నిన్ను ఏర్పాటు చేశాను—దానికి తల్లీ తండ్రీ అన్నీ నువ్వే అనుకోమని చెప్పాను—'వూఁ వూఁ' అని దాన్ని వొదిలేశావ్!

సీను : నాకు తెలీదు సార్! తెలిసి తెలిసి ఎందుకొదిలేస్తానండీ?

చిదం : పోనీ—ఇరవై నాలుగ్గంటలూ దాన్ని నువ్వు కనిపెట్టుకుని కూచోనక్కర్లా?

సీను : అది మన ఇల్లు కాయాలని వీధిలో వుంచారు. దాన్ని కాస్తూ నేనూ అక్కడే కూచోనా?

చిదం : ఏం—నువ్వు వెధవపనులు చెయ్యకుండానూ పారిపోకుండానూ నేను నిన్ను కాస్తున్నాను కానూ?...ఐనా నిన్ను అనేం లాభం? నీవంటి తెలివితక్కువ దద్దమ్మను నౌకరీగా వుంచుకున్నందుకు నా బుద్ధినవాలి!...... అసలు ఎట్లా పోయిందిరా కుక్కపిల్ల?

సీను : నేను చూడలేదు సార్!—మొన్నరాత్రి మామూలుగానే అన్నం తిన్నది.

చిదం : సరిగ్గానే తినేసిందా?

సీను : మరి కాస్త ఎక్కువపట్టే పట్టింది. ఎట్లాగూ పోతాను కదా అని. అన్నంతిన్నాక గొలుసుతో స్తంభానికట్టాను. మామూలుగా నేను నిద్రపోయాను. సగం రాత్రికే లేదు! గొలుసుమాత్రం వుండిపోయింది.

చిదం : ఆ గొలుసు ఓపారి తీసుకురా. (సీను లోపలికి వెళ్లి గొలుసు తెచ్చాడు. చిదంబరం పరీక్షగా చూసి) గొలుసు కొరుక్కుని పారిపోలేదు...విప్పేసి వుంది. అంటే ఎవరో విప్పేశారన్న మాట! నువ్వసలు మెడకు గట్టిగా కట్టావా?

సీను : గట్టిగానే కట్టానండీ—ఇంకాస్త బిగిస్తే గుటుక్కుమనేటంత గట్టిగా కట్టాను

చిదం : ఐనా పారిపోయింది—ఏ దొంగవెధవో ఎత్తుకుపోయాడు! దాని మానాన అది పోయి ఉంటుందని నేను అనుకోను. నిన్న పత్రికలవాళ్లకు ప్రకటన ఇచ్చాను. పోలీసు స్టేషన్లో గంటసేపు కూచున్నాను-ఊరంతా వెతికాను. కనిపించిన స్నేహితులందర్నీ అడిగాను-మాకు తెలీదంటే మాకు తెలీదనేవాళ్లేగాని 'చూశాం' అని ఒక్కడనలేదు—ఇంకెందుకూ వెధవ స్నేహితులు?

సీను : పోలీసులు ఏమన్నారండి?

చిదం : నీ మొహం అన్నారు. 'మీ కుర్రాడిచాత వెదికించండి' అన్నారు. నువ్వు వెతికి దాన్ని వాళ్లకు అప్పజెప్తే—అప్పుడు నా చేతికిచ్చి 'మేమే పట్టుకున్నాం' అని గొప్పగా చెప్పుకోటానికి కాబోలు! "మీ కుక్క ఏదన్నా దొంగతనం చేసిందా?" అని వో పోలీసు అడిగాడు. 'లేదు' అన్నాను. 'ఐతే మాకేం సంబంధం లేదు—దొంగతనం చేస్తే ప—

కునే శాశ్వత మాది' అంటాడు. ఇంకోడు- 'ఎవర్నైనా చంపి పారిపోయిందా?' అంటాడు. నా మొహం! అది కరవనే కరవ దంటున్నావు నువ్వు! అది దొంగతనం చేసి పారిపోయిందేమో, ఎవర్నైనా హత్యచేసి పారిపోయిందేమో వాళ్లు నిమిషాలమీద ఇళ్ళు పట్టుకుని ఉందురట! "మోసగాళ్ళను కూడా పట్టుకుంటారు కదా మీరు!" అనడిగాను. "ఓ" అన్నారు. ఐతే నా దగ్గర నమ్మకంగా వుంటూ, నన్ను మోసం చేసి ఓ కుక్కపిల్ల పారిపోయింది......పట్టుకోమన్నాను నన్ను చూసి వాళ్లంతా ఒకటే నవ్వు! "కుక్కపిల్లల్ని కూడా మేమెక్కడ వెతిగ్గలం?" అంటాడు ఒకడు. వాడు వళ్లు మండి—"కుక్కపిల్లను వెతికి పట్టుకోడం కూడా మీకు చాతకాదు—పోండి" అని వాళ్ల మొహం మీద అనేసి పారిపోయొచ్చాను.

సీను : మీ వెనకాల పరుగెత్తి రాలేదు సార్ పోలీసులు?

చిదం : ఏమో! గభాలున ఆ పక్కనే ఓ సందుంటే అందులో దూరిపోయాను.

సీను : మంచిపని చేశారు సార్! లేకపోతే ఏమయి పోయారోనని మిమ్మల్ని కూడా వెతుక్కునే స్థితికి వచ్చేవాడిని!

చిదం : నిన్న రాత్రంతా ఒకటే కల! దాన్ని ఎవరో ఎత్తుకు పోయినట్టూ, కొడుతున్నట్టూ! పెద్ద పెద్ద కుక్కలన్నీ దాన్ని కరుస్తున్నట్టూ! అబ్బ—భయం వేసిందిరా!......పాపం... ఇప్పుడెక్కడుందో, ఏం చేస్తోందో... చిన్న వెధవ...ఎవడైనా తిండి పెడుతున్నాడో లేదో—'కుంయ్ కుంయ్' మని మూలుగుతుంది గాని మాటాడలేదు కదా—నోరులేని జీవం!

సీను : సార్! అమ్మయ్య మీ స్నేహితుడొకాయన అడిగారు కదండీ?

చిదం : అవును అడిగాడు—లక్ష మంది అడిగారు. ఏం?

సీను : ఆయనగాని...

చిదం : అచ్చే. కుక్కను ఎవడు ఎత్తుకుపోతాడ్రా? ఈ యింట్లో దానికి స్వతంత్రం లేదనో, ఇక్కడ సుఖం లేదనో అర్ధరాత్రి వేళ పారిపోయుంటుంది. ఎవరికన్నా దొరకదా?... అన్నట్లు పత్రికలో ప్రకటన వేశారా?

సీను : వేశారు సార్—మీరు రాగానే చూపిద్దామనుకున్నాను—మరిచేపోయాను (పత్రిక తెచ్చి యివ్వబోయాడు)

చిదం : నువ్వే చదువు

సీను : (చదువుతూ) "కుక్కపిల్ల కనబడుటలేదు. తెల్లని రంగూ, కోలముఖమూ, కుచ్చు వంటి పొట్టి తోకా గల కుక్కపిల్ల కనబడుటలేదు. మెడలో తోలుపటకా యున్నది. వెతికి తీసుకు వచ్చిన వారికి నూటపదహారు రూపాయల బహుమాన మిచ్చెదను జి. డి. యస్. చిదంబరం..."

చిదం : (ఆపుతూ) ఏమిటేమి టేమిటి......మళ్ళీ చదువు (సీను మళ్ళీ చదివాడు. చిదంబరం జాగ్రత్తగా విన్నాడు). 'కుక్కపిల్ల కనబడుటలేదు—'మళ్లీ చదువు—(సీను గడగడా చదివి, చిదంబరంకేసి చూసి మళ్లీ మొదలెట్టబోయాడు.) చాలుచాలు—మరి చదవఖర్లేదు—ఆ ప్రకటన చాలు. నూటపదహారురూపాయల బహుమతికోసం ఎవడైనా వెతుకుతాడు!

సీను : కుక్కపిల్ల ఖరీదు అందులో పావువంతు వుంటుందా సార్?—

చిదం : పోరా వెర్రిమొహం—నూటపదహారు కాదు-రెండు నూటపదహార్లిస్తే మాత్రం అటువంటి కుక్కపిల్ల మనకు మళ్లీ ఎక్కడ దొరుకుతుంది?—మన అడ్రసంతా 'క్లియర్'గా వుందా పేపర్లో?

సీను : వుంది సార్.

చిదం : చూదాం—నాలుగు రోజులు ఓపిక పడదాం......కాస్త కాఫీ తీసుకొచ్చి యిస్తావూ?

[సీను లోపలకుపోయి ఫ్లాస్కూ, గ్లాసు తెచ్చి కాఫీ పోస్తున్నాడు.]

సీను : నిన్నట్నుంచీ కాఫీమాటే మరిచిపోయారు సార్ మీరు.

చిదం : నిన్నట్నుంచీ ఆ కాఫీ అందులో నే అట్లా వుందా యేమిటి?

సీను : అచ్చే.....నిన్నటిది అప్పుడే ఐపోయింది సార్. అహా... చెబుతున్నాను—మీకు ఎంత మన స్తిమితం లేకుండా పోయిందో అని!

చిదం : కాదురా వెరీ—కుక్కపిల్ల ఐతేమాత్రం—మనింట్లో ఓ పిల్లగా వుంటూ మన చెంత తిరుగుతూ—మనం అంటే ప్రాణం పెట్టే పిల్ల - కనిపించకపోతే మన స్తిమితం వుండక పోవటం యేమిటి—పిచ్చెత్తాలి! (కాఫీ తాగుతున్నాడు.)

సీను : (సంశయిస్తూ) సార్....

చిదం : ఏమిట్రా?....

సీను : ఏంలేదుసార్—చిన్న కోరిక...

చిదం : కోరికా! కోరిక అడిగితే తీర్చే దేవుణ్ణి అనుకుంటున్నావేమిట్రా—తీరా ఎదుట ప్రత్యక్షమయితే దేవుడే తీర్చడు!... అసలు—

సీను : ఏంలేదుసార్...మా నాన్న రెండో పెళ్లి చేసుకుంటాడట—వో వందరూపాయ లిప్పించాలి సార్—

చిదం : ఏమిటీ!—మీ నాన్న రెండో పెళ్లి చేసుకుంటే నేను వందరూపాయ లివ్వాలా? మీ నాన్నకు రెండో పెళ్ళేం—అఖర్లేదు వూరుకోమను!

సీను : అది కాదుసార్—నా జీతంలో విరక్కోసుకుంటానండి!

చిదం : నాన్ సెన్సు—మీ నాన్నకు రెండో పెళ్లి నువ్వు డబ్బిచ్చి చేయిస్తావా—మతి లేదురా నీకు? డబ్బులోసి సవతితల్లిని కొనుక్కుంటావురా వెధవా?

సీను : పోనీండిసార్—మా అన్నయ్య చేసుకుంటాడు ఇవ్వండి సార్!

చిదం : పోరా ఇడియట్-తమాషాలు! ఐనా-కుక్కపిల్ల పోయి నే నేడుస్తూ వుంటే, నీవల్లో వందరూపాయలు ఖర్చరించటానికి నేనే మన్నా 'బ్యాంకి' అనుకున్నావా-వెళ్ళు అవతలకు వెళ్లు!

సీను : పోనీండి-కుక్కపిల్ల దొరికిన తర్వాతైనా...

చిదం : ఆలోచిస్తాలే—

[సీను నెమ్మదిగా బయటకు వెళ్లాడు. పత్రిక తీసి చిదంబరం ప్రకటన చూశాడు ఏదో ఆలోచిస్తున్నాడు. సీను బయటనుంచి వచ్చి]

సీను : ఎవరో ఒక అబ్బాయి వచ్చాడుసార్!

చిదం : మనింటికా?

సీను : అవునుసార్.

చిదం : మనింట్లో కుర్రాళ్లెవరూ లేరు పొమ్మను.

సీను : కుర్రాళ్లకోసం కాదుసార్—తమకోసం!

చిదం : (ఆలోచిస్తూ) నాకోసం?...కుర్రాడు?... రమ్మను!

[సీను బయటకువెళ్లి ఓ కుర్రాడిని తీసుకొచ్చాడు. ఆ అబ్బాయికి 14, 15 ఏళ్లుంటాయి అబ్బాయి వచ్చి కూచున్నాడు. పత్రిక అడ్డుపెట్టుకుని చదువుకుంటున్న చిదంబరాన్ని గమనించలేదు.]

అబ్బా : (సీనుతో) పిలవ్వోయ్-పిలువ్—

సీను : ఎవర్నండీ?

అబ్బా : చిదంబరం గార్ని.

చిదం : (పత్రిక పక్కకుపెట్టి చూసి) నేనే-నేనే చిదంబరాన్ని. ఏంకావాలి?

అబ్బా : మీరేనా చిదంబరంగారు!

చిదం : నేనేనయ్యా-ఎప్పుడూ నా ఫోటోఅన్నా పేపర్లో చూడలేదా నువ్వు?

అబ్బా : మీ ఫోటోనా-చూడలేదే. మీరు బ్రతికే వున్నారుగా-ఎవరి ఫోటోలన్నా చచ్చిపోయిన తర్వాతే పేపర్లో పడతాయట. మా నాన్నగారంటారు.

చిదం : మీనాన్నగారి పేరు?

అబ్బా : అదెందుకుగాని—నేను మీతో పనుండి వచ్చాను.

చిదం : (ఆయోమయంగా అబ్బాయికేసి చూసి) చదువుకుంటున్నావా?

అబ్బా : స్కూలు ఫైనల్.

చిదం : అబ్బో-సరే ఐతే. పాస్ఐనతర్వాత వస్తే కాలేజీలో చేరటానికి ఒకటో రెండో సాయం చేస్తాలే. పో (తిరిగి పత్రిక చూడటంలో పడబోయాడు!)

అబ్బా : (బల్లమీద చేత్తో చరిచి) నాన్సెన్స్! ఒకటో రెండో సాయం చేస్తారా? ముష్టెత్తుకోడానికి రాలేదు. నాసొమ్ము నాకివతల పారెయ్యండి.

చిదం : (ఆశ్చర్యంగా చూసి) అబ్బాయ్—నీకేమన్నా పిచ్చా...?...

అబ్బా : పిచ్చయితే నేం – కాకపోతే నేం - అదంతా మీ కనవసరం నా డబ్బు నాకిచ్చి తూట్లాడండి.

చిదం : నీడబ్బేమిటి – అది నా దగ్గరవుండటమేమిటి? నువ్వెవరో చూస్తే తెలెను లేవు 'డబ్బు డబ్బు' అని ఒకటే పోరేస్తున్నావు. నాకేం అర్థం కావటం లేదు!

అబ్బా : నేను తెలెను లేకపోయినంతమాత్రాన నా డబ్బు నాకివ్వరటండీ?... నేను ఎవర్ననుకున్నారు? అన్యాయంగా నన్ను మోసగిస్తున్నారని పోలీస్ కు ఫోన్ చేస్తాను. (ఫోన్ దగ్గిరికి వెళ్లబోయాడు)

చిదం : అబ్బాయ్...అబ్బాయ్ ... వుండుండు... ఆ ఫోను పనిచెయ్యదు.

అబ్బా : పనిచెయ్యదా?...పనిచెయ్యనప్పుడు మీ కెందుకండీ అంత ఆదుర్దా? (ఫోనుతీశాడు)

చిదం : వినూ వినూ ... (వెళ్లి ఫోన్ తీసుకుని) నీ డబ్బిస్తాను. రా-కూచో.

అబ్బా : (కూచున్నాడు)

చిదం : చూడూ, నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. సమాధానం చెప్పావా-నీ డబ్బు నీకిచ్చేస్తాను.

అబ్బా : లేకపోతే ఇవ్వరా?

చిదం : ఇస్తాలే-చెప్పు. మీ యిల్లెక్కడ?...తొప్పడకు–చెప్పు-ఫరవాలేదు. మీ యిల్లు ఆసుపత్రిలా ఉంటుందికదూ-అక్కడ కొందరు మనుషులు కేకలు వేస్తూ అరుస్తూ వుంటారు కదూ?

అబ్బా : అర్థమయింది. పిచ్చాసుపత్రి మా యిల్లా? (ఆలోచిస్తూ) అంటే పిచ్చాసుపత్రినుంచి నేను వచ్చేనని మీరు అనుకుంటున్నారా - (గట్టిగా) నేను పిచ్చివాణ్నా?

చిదం : కాదు కాదు-కూచో!

అబ్బా : ఆఖరుసారి అడుగుతున్నాను. డబ్బిస్తారా ఇవ్వరా?

చిదం : ఎంతివ్వాలి?

అబ్బా : ఎంత యివ్వాలీ? ఏమని వేశారు పేపర్లో?

చిదం : పేపర్లో వేశావా?

అబ్బా : అహా! తెలిసింది. మీకే పిచ్చి. ఈ రోజు పేపర్లో వెయ్యలేదటండీ నూట పదహార్లు ఇస్తావని-

చిదం : అవునవును. మా కుక్కపిల్లను వెతికి తీసుకొచ్చినవారికి నూటపదహారు రూపాయలు బహుమానరూపంగా ఇస్తానని ప్రకటించాను గాని వూరికి నే కాదు.

అబ్బా : వూరికినే ఇమ్మనటానికి నే నేం పిచ్చివాణ్ని కాదు. నానా శ్రమలూ పడ్డాను—మీ కుక్కపిల్లను వెతికాను—తీసుకొచ్చాను.

చిదం : తెచ్చావా—ఏదీ—ఆ మాట మొట్టమొదటే చెప్పలేకేం? ఏదీ—ఏదీ నా కుక్కపిల్ల?

అబ్బా : తెస్తాను. ముందు నాకుమాటివ్వండి.

చిదం : ఏమని?

అబ్బా : నా డబ్బు నాకు అణా పైసలతో సహా వెంటనే ఇచ్చేస్తానని!

చిదం : ఎందుకివ్వను బాబూ! తప్పకుండా ఇచ్చేస్తాను. కుక్కపిల్లను తీసుకురా.

[అబ్బాయి అదోకలాగా చూసి బయటకు వెళ్లాడు. నల్లగావున్న కుక్కపిల్ల మెడకు తాడొకటి కట్టి బరబరా లాక్కొచ్చాడు.]

అబ్బా : (వస్తూనే) ఇదిగో—ఇదిగో మీకుక్కపిల్ల!

చిదం : (తెల్లబోయి చూస్తూ) ఇదా!...ఇది నా కుక్కపిల్ల కాదు...!

అబ్బా : కాదూ (కూచుని బుర్బీకి తాడుకట్టాడు) ఆ మాట అనొద్దని మొదటే చెప్పాను. తప్పించుకోటానికి ఎత్తులు వెయ్యకండి. నన్ను ఫ్రాడిని చేసి నాటకం ఆడారంటే జాగ్రత్త! ఎంత కష్టపడ్డాను దీన్ని వెతకటం కోసం! తిండి, నిద్ర, చదువూ అన్నీ మానేశాను. మా నాన్న గారు తిడుతున్నా సరే, యెండలో బయల్దేరి పూరంతా తిరిగి పట్టుకున్నాను. ఇది మీది కాకుండా యెట్లా వుంటుంది? తీసుకుని డబ్బివ్వండి. నేను త్వరగా వెళ్ళాలి!

చిదం : అబ్బాయ్—కుక్కపిల్ల ఏదో ఒకటి తీసుకొస్తే డబ్బిస్తానని నేనేం రాయలేదు. నా కుక్కపిల్ల రంగు వేరు - జాతి వేరు - ఎబ్బె అది ఇట్లా ఇంత అసహ్యంగా వుండదు!

అబ్బా : మరి తిండీ తిప్పలూ లేక ఎండలో మాడితే అసహ్యంగా కాక ఎట్లా వుంటుంది! నేను ఎండలో తిరిగి యింటికి పోగానే మా నాన్నగారూ ఆ మాటే అన్నారు- కొట్టబోయారు కూడా!

చిదం : దాని మాటకేంగాని—ఈ కుక్కపిల్ల నాది కాదు - తీసుకుపో.

అబ్బా : తీసుకుపోనా? ఏం మాట!...సరే - డబ్బివ్వక్కరలేదులెండి. మీ కుక్కపిల్లను మీరే వుంచుకోండి- వెళుతున్నాను.

చిదం : బాబూ! నువ్వు మాస్తే భూమికి జానెడు లేవు నీ మాటలూ నీ చేష్టలూ మాస్తూంటే నాకు మతిపోతోంది. నువ్వు వెళ్ళు. కుక్కపిల్లను కూడా తీసుకువెళ్ళు. ఎక్కడ తెచ్చావో అక్కడే వొదిలెయ్యి

అబ్బా : సరేనండీ! ఐతే ఈమాత్రం దానికి ప్రకటన వేసి మోసంకూడా ఎందుకు చేశారు? వెళ్తున్నాను. (కోపంగా కుక్కను తీసుకుపోతూ, మళ్ళీ తిరిగివచ్చి) ఈ కుక్కపిల్లను దాని తల్లి దగ్గిర ఒదిలిపెట్టాలంటే నేను నానా శ్రమపడాలి. మంచి బాగా చేశారు...'థాంక్స్'...పోనీండి—కాలేజిలో చేరాక వస్తే ఒకటో రెండో సహాయం చేస్తానన్నారు—అప్పుడొస్తే అదన్నా యిస్తారా—ఇట్లాగే పొమ్మంటారా?

చిదం : లేదులేదు—తప్పకుండా యిస్తాను. ఇప్పుడు వెళ్ళు. (అబ్బాయి సీరియస్ గా చూసి, పళ్ళు కొర్కుంటూ బరబరమని కుక్కపిల్లను లాగుతూ బయటకుపోతాడు. బయట కుక్కపిల్ల 'కంయ్' మనే అరుపు వినిపించింది. చిదంబరం 'వ్' అని కూలబడి, లేచి)

చిదం : ఒరే సీనూ... సీనూ...వెధవ ఎక్కడ చస్తున్నాడో—సీనూ!... (ఫ్లాస్కులో కాఫీ పోసుకుని తాగుతున్నాడు. ఇంకో వ్యక్తి ప్రవేశించాడు ఆధునిక పద్ధతిలో వున్నాడు)

వ్యక్తి : (నమస్కారం చేసికుంటూ) ఈ యింటికి యజ మీరేనా—

చిదం : ఆహా! పాశ్చాత్తా ఈ యింటికి యజమానిని నేనే, ఏం సెలవు

వ్యక్తి : (కూచున్నాడు) ఎబ్బే—ఓ చిన్న పనిమీద వచ్చాను.

చిదం : చెబుదురుగాని వుండండి. (కాఫీ పూర్తిగా తాగేసి, గ్లాసు వుంచేస్తూ) ఏం పనిమీద వచ్చానంటారు?

వ్యక్తి : ఈ యిల్లు ఏ సంవత్సరంలో కట్టారండి—బయట చాలా 'హోప్లెస్'గా వుంది. (పైకి చూసి) అరే, సీలింగ్ అంతా పూర్తిగా పాడయిపోయింది!

చిదం : పాడయితే పాడవనివ్వండి ఈ యింటిని మీకు నేనేం ధారాదత్తం చేసెయ్యటం లేదు!

వ్యక్తి : అందుకొక్కటండి—ఇంట్లో కాలు పెట్టిన తర్వాత ఇల్లు కళకళ్లాడకపోతే ఎందుకు చెప్పండి! ఈ వూళ్ళో చాలా ఇళ్ళు చూశాను. వట్టి మురికికూపాలు. మళ్ళీ మహా మహా ఎంజినీర్లు కట్టినయిళ్ళు, వేలూ లక్షలూ పోసి కట్టించిన ఇళ్ళు!...ఇల్లు—కట్టించిన మర్నాటికే ఇంటికి పూసిన రంగంతా వెలా తెలాపోటం ప్రారంభిస్తుంది—ఇంట్లో ఎక్కడ చూసినా సున్నం రాలిపోతూ వుంటుంది—అనువన అంతా బీటలువారిపోతూవుంటుంది. అదంతా కట్టేవాళ్ళల్లో వుంటుందండీ—ఎంజి

వీళ్లు ఏంచేస్తారు పాపం! వాళ్ళంతా జాగ్రత్తగానే ప్లాన్ వేసి కట్టిస్తారు. ఏంలాభం! కట్టిన తాపీపనివాళ్లు సరిగ్గా పనిచెయ్యరు. అసంతా వీళ్ల చేతుల్లోనే వుంటుంది. వీళ్లు సరిగ్గా కట్టాలిగాని ఎంజినీర్ ఏం చేస్తాడు? "ఇల్లు కట్టిన ఇంజనీరు కాదోయ్—దానికి ఇటుకలు పేర్చి, తాపీ చేసిన పనివాడెవ్వడు?" అని మా స్నేహితుడొకరు గేయాలు రాశారు అంచాత— చెప్పొద్దూ—'పనివాడిలో' పసవుండాలి. లేకపోతే మీ యిల్లులాగానే తయారవుతుంది!

చిదం: ఇంతకూ మీరెవరో ఏంపనిమీదవచ్చారో చెప్పారుకాదు.

వ్యక్తి: నేను ఇళ్లకు మైనర్ రిపేర్స (Minor repairs) చేయించే కంట్రాక్టర్నండి నాకింద అమోఘమయిన పని చెయ్యగల్గిన పనివాళ్లు నలభైమందివున్నారు. ఆ రోజుల్లో శ్రీరామచంద్రుడు సేతు కట్టించాడండీ. వారధి?...ఐను విమహిల్లో మావాళ్లు అటువంటివి తొంభై తొమ్మిది కడతారు చూస్తారా!......ఐతే మేము ప్రస్తుతం అంతా మైనర్ రిపేర్స మీదే ఎక్కువగా కృషిచేస్తున్నాం ఊరికే పెద్దయిళ్లు కడతామని ఎగబ్రాకటం-చెయ్యలేకపోవటం-సరే, అసంతా ఎందుకు-ప్రతీ యింటికీ మరమ్మతులు చేయించటం ఎంతో అవసరం. ఆ పనివల్ల యింటికి గట్టితనం, ఓ హుందా అవన్నీ వస్తాయి.

చిదం: ఐతే ఏమంటారు మీరు?

కంట్రా: అనటానికేముందండి! మీ యింటికి అవతల వీధిలోవున్న రేణుకమ్మగారి యింటిని మరమ్మత్తుచేశాం వాళ్లింటిప్రక్కనవున్న రాజారావుగారి యిల్లూ చేశాం. తర్వాత...... చైర్మన్ గారూ వారిల్లు ఆర్డరుఇచ్చారు. (సంచిలోంచి 'ఆర్డర్ బుక్' తీసి చూపుతున్నాడు.)

చిదం: చైర్మన్ గారు తనయింటికే యిచ్చి వూరుకున్నారన్నమాట! ఆ స్కూలు పడిపోటానికి సిద్ధంగావుందికదా - దానికో ఆర్డరు వేయించుకోలేకపోయారా?

కంట్రా: ఇస్తారు పాస్ అదీ యిస్తారు. ఎల్లాకియుండు తన యిల్లు చక్కబెట్టుకునికదా రెండో యింటికి వెళ్లాలి! (పుస్తకం చూపుతూ) చూడండి-ప్రస్తుతం ఎనిమిదిళ్లు కాంట్రాక్టు తీసుకున్నాను. చక్కా జరుగుతున్నది నాలుగిళ్లు. లోగడ చేసిన చక్కాకూడా...(కాయితాలు వెనక్కు తిప్పుతున్నాడు).

చిదం: అఖర్లేదులెండి..ఆఁ...మీరు కేవలం ఇళ్లే మరమ్మత్తుచేస్తారా ఇంకేమన్నాకూడా మరమ్మత్తుచేస్తారా?

కంట్రా: (గడగడా) ఇళ్లూ భవనాలూ, వంతెనలు, రోడ్లూ సైడుకాలవలు......

చిదం: ప్రస్తుతం నా మెదడు చాలా ఒడిదుడుకుల్లో వుంది. దాన్నేమన్నా మరమ్మత్తు చెయ్యగలరా?

కంట్రా: (తెల్లబోయి, సర్దుకుని నవ్వి) దం పేశారు. మీరట్లా అడిగితే నేనేం చెప్పేది? దాన్ని 'రిపేర్' చెయ్యటానికి ప్రత్యేకం హాస్పిటలూ, డాక్టర్లూ వుంటారుగాని...

చిదం: ఐతే ఓ గొడ్డలి తీసుకుని ముందు నాయిల్లంతా ఇవాళే పగలగొడతాను. మీరు రేపురండి — మరమ్మత్తు చెయ్యొచ్చు.

కంట్రా: మీరు చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు. మీ ఇల్లు మరమ్మతు కోరుతోంది కదా అని అన్నాను. ఒక్కసారి వీధిలోకి వెళ్లి చూడండి. గోడలన్నీ ఎంత పాలిపోయి వున్నాయో! ఎంతో అవసరం - చాలా చిన్న మొత్తం! రోజుకు మీకయే కాఫీ ఖర్చు.

చిదం: నాకు రోజుకయే కాఫీ ఖర్చు రెండణాలు. ఇదిగో (ఇస్తూ) తీసుకుని, చెయ్యవలసిన మరమ్మత్తేదో చేసుకోండి.

కంట్రా: (చాలా విచిత్రంగా చూశాడు).

చిదం: క్షమించండి - నేను చాలా చిక్కుల్లో వున్నాను. అసెయ్యాక రిపేర్ విషయం ఆలోచిద్దాం. ఇప్పుడు నన్ను కురి కొరుక్కుని తినేయకండి!

కంట్రా: ఏమిటి - అంత మనోవ్యధలో వున్నారా?

చిదం: మీకు పత్రికలు చదివే అలవాటు లేదా?

కంట్రా : చంపారు! న్యూస్ పేపర్ చదవటం నాకో వ్యసనంలాంటిది. ఏరోజు పేపర్ లేక పోయినా మరి నాకు నిద్రపట్టదు.

చిదం : చూడండి - పేపర్ చదివితే కేవలం మీ రాజకీయాలే కాదు - ఇతర ప్రకటనలు కూడా చూడాలి. ఈ రోజు పేపర్లో ఓ ప్రకటన ఇచ్చాను. మాయింట్లో ఓ పిల్లలాగా తిరుగుతూ నా ప్రేమకు పాత్రురాలయిన ఓ కుక్కపిల్ల 'రోజా' కనిపించకుండ పోయింది. నాకు మతికూడా పోయింది. అది దొరికేదాకా నాకు తోచదు. వెతికి తీసుకు వచ్చినవారికి నూటపదిహేను రూపాయల బహుమానం యిస్తానని ప్రకటన వేశాను (పత్రిక చూపాడు)

కంట్రా : (చూసి) అలాగా - చిదంబరం గారంటే మీరే అన్నమాట! పాపం! ఎంత కష్టం అండీ - నిజమేనండీ - ఇంట్లో తిరుగుతువ్న కుక్కపిల్లే కాదు - నాలుగురోజుల్నుంచీ యింట్లోవున్న ఓ చిన్న చీపురు కనిపించక పోయినా అదేమిటో మనసు బాధపడు తుంది - మీరెట్లా తమాయించుకోగలిగారో ఏమిటో!

చిదం : ఏం చెయ్యమంటారు - వచ్చినట్టు బాధపడు తున్నాను. నిన్నటంతా తిరిగాను - ఇవాళ తిరిగాను - ఎక్కడా కనిపించలేదు. ఏమయిందో ఏమిటో!... సీనూ!... పాపం - నా నౌకరు కూడా దానికోసం బెంగపెట్టు కొని కృశించిపోతున్నాడు. వాడే దానికి తల్లీ తండ్రీ!

కంట్రా : బహుమానంకోసం కాదు కానీండి — నేనూ ప్రయత్నిస్తానండి. ఎక్కడ కనిపించినా తీసుకొచ్చి మీకు అప్పచెబుతాను. వర్తలన్నీ తెలిశాయి కదా — ఆ మధ్య ఇట్లాగే మా అబ్బాయి తప్పిపోయాడు. పేపర్లో ప్రకటన వెయ్యలేదుగాని — దొరికాడు. దొరుకుతుం దండీ — మనసొమ్ము వివరీర్యాత మనకు దక్కకుండాపోతుందా!

చిదం : సొమ్ము అంటారేమిటి? అది నా ప్రాణంతో సమానం. మీకు కనిపిస్తేమాత్రం తీసుకొచ్చి అప్పచెప్పండి — మీ మేలు మరిచిపోను.

కంట్రా : ఎంతమాటన్నారండీ — ఇందులో పెద్దమేలు ఏముంది? పనికట్టుకుని కూడా వెతుకుతాను ...నన్ను...వెళ్లమంటారా?

చిదం : చిత్తం - మీరు వెళ్లిరండి. కుక్కపిల్ల దొరికిందనగానే ఎట్లాగూ పండుగ చేస్తాను — ఇంటి రిపేర్ చేయించక తప్పదు. అంతవరకూ మాత్రం నన్ను బాధపెట్టకండి. ఇన్నాళ్లా లేనిది ఈ రెండు రోజుల్లోనూ ఈ కొంపకూలి పోతుందనే భయం నాకేం లేదు!

కంట్రా : సరే, వస్తానండి. కాని 'రిపేర్స్' చేయించటంవల్ల లాభం మీరే తెలుసుకుంటారు. ఎంతో అవసరం మీకు! ఒక వేళ కర్మంచాలక మీకుక్కపిల్ల దొరక్కపోయినా ఇల్లు మరమ్మత్తు చేయించటంమాత్రం మరిచిపోకండి. అది కాకపోతే మరోకుక్కను కొను క్కుంటాం గాని — కలకాలం నిలబడాల్సింది 'ఇల్లు'!

చిదం : చేయిస్తానని చెప్పానుగదండీ! మీరు మరీ ఇన్నూరెన్నూరాళ్లాగా నా ప్రాణాలుతీసేస్తే నాకేక్యమా? చేయిస్తాను. ఈ ఒక్క ఇల్లేనా మరో నాలుగయిళ్లు చేయిద్దాం!

కంట్రా : సెలవు (వెళ్లి మళ్లీ వచ్చి) మీ రోజా డీటైల్స్ చెప్పండీ కొద్దిగా!

[చిదంబరం పత్రిక ఇచ్చాడు. కంట్రాక్టరు చూసుకొని, 'రైట్' అని వెళ్ళాడు]

చిదం : (అటూయిటూ చూసి ఫోన్ తీసి) హలో... ఆఁ... నేను చిదంబరాన్ని మాటాడు తున్నాను...ఆఁ? ... దొరకలేదు...నీకూ దొరకలేదా...ప్రయత్నించమని చెప్పు... ప్రయత్నించమనీ ... చెప్పూ —...దాని ఫోటో లేదయ్యా - నేనూ అదీ కలిసి తీయించుకున్నది ఒకటుందిగాని నా మొహం కనిపిస్తున్నంతబాగా అది కనుపించటంలేదు. ...అది పనికిరాదులే.. ఐనా ఫోటో ప్రకటించాలిసిన అవసరంలేదులే. వివరాలన్నీ పూర్తిగా ఇచ్చాంగా — ఆఁ...అందుకే పిల్చాను...ఏం భోజనం నా మొహం!... వుంటాను మరి! (రిసీవర్ పెట్టి సీనును పిలి చాడు. సీనువచ్చాడు) దొరికిందిరా సీనూ?

సీను : వీధిలో పోతున్న కుక్కపిల్లలన్నిటినీ పట్టి పట్టి మరీ చూశాను సార్—దేనికీ మన రోజా పోలికలన్నా లేవు!

చిదం : ఏం—అదెందుకు?

సీను : పోనీ అందాకా దాంతోనన్నా కాలక్షేపం చెయ్యొచ్చుగదా అని. అదీగాక, కుక్కపిల్ల లేకపోతే నాకీ యింట్లో పని వుండదు. అది లేదని నా వుద్యోగం లాగేసి పొమ్మంటారని నా భయం!

చిదం : నీకా భయం ఏమీ అక్కర్లేదు. ఏం— ఇవాళ కాకపోతే రేపటికన్నా దొరకదా?

సీను : దొరక్కపోతే మాత్రం నాకోసమన్నా ఓ పిల్లను కొనాలి సార్!

చిదం : నోరుముయ్యరా. మన పిల్ల మనకు దొరక్క ఏమవుతుంది?

సీను : దొరుకుతుందండీ—దొరికేదాకా నాకు మరి మతి బాగుపడదు ఏదో వాగేస్తుంటాను ఆ మతిమరుపువల్ల — కోప్పడకండి సార్ !

చిదం : అవునురా—అ ప్రేమ అట్లా అనిపిస్తుంది... అన్నట్టు ఇందాక ఓ కుర్రాడొచ్చాడు చూశావా—వాడో నల్లటిపిల్లను లాక్కొచ్చి, నా యెదాన్ని కొట్టి "ఇదే నీకుక్కపిల్ల తీసుకో—తీసుకొని నాడబ్బు నాకివ్వు" అని ఒకటే గోలపెట్టాడు.

సీను : పోనీ—అందాకా దాన్నన్నా తీసుకోన్నారు కారు!

చిదం : నీ మొహం, దాన్ని చూస్తే డోకొచ్చింది. అసహ్యంగా వుంది. వాడెవడో దేవాంతకుడులాగా వున్నాడు. చూట్టానికి పదిహేనేళ్లన్నా లేవు—కబుర్లు మాత్రం ఆకాశానికంటేటట్టు. చెప్పాడు! తను చాలా శ్రమపడి వెతికి తీసుకొచ్చాట్ట—పో పొమ్మన్నాను.

సీను : మంచిపని చేశారు. నాతో చెప్పారు కారు—ఒకటిచ్చుకుని బయటకు తోసేదును.

చిదం : పోనీ పోయాడులే— నేను మరొక్కసారి, అట్లా బయటకుపోయి చూసివస్తాను. నువ్వు జాగ్రత్తగా—కుక్క కాసేంత జాగర్తగా—ఇల్లు చూస్తూవుండు వస్తాను. ఎవరన్నా నాకోసం వస్తే వుండమని చెప్పు. (కోటు వేసుకుని బయటకు పోబోతూ వుండగా, సన్నగా పొడుగ్గా వున్న ఓ వ్యక్తి (ప్రవేశించాడు)

వచ్చిన మనిషి : మీరేనండీ చిదంబరంగారు?

చిదం : నేనే.

ఆయన : నమస్కారం, నా పేరు కోదండం. నేను తమతో పని వుండివచ్చాను.

చిదం : తమరు ఇళ్లకు మేజర్ రిపేర్లు చేయించే కంట్రాక్టరా — లేక ఏ కంపెనీకన్నా ఏజెంటా?

ఆయన : క్షమించండి, నేను ఒకాసుపత్రిలో కాంపౌండరు ఉద్యోగం చేస్తున్నాను.

చిదం : ఏ ఆసుపత్రిలో? (షాక్ తిన్నట్టు).

కోదం : ప్రయివేట్ హాస్పిటల్ లెండి డాక్టర్ రమేశ్ గారికి కుడిభుజంవంటివాడిని.

చిదం : నేను మీ డాక్టరు దగ్గిర ఎప్పుడూ మందు తీసుకోలేదు—మీ బిల్లులు నేనేం ఇవ్వక్కర్లేదు. నాకు పనుండి వస్తా (వెళ్లబోయాడు)

కోదం : ఆవుండండీ. కాంపౌండర్లంతసేపూ బిల్లుల వసూలు చెయ్యటానికే వస్తారనుకుంటున్నారేమిటి?—ఐనా, నా రాక వేరు. నేను వేరే పనిమీద వచ్చాను. వూరికే మీకు తెలియాలని నా ఉద్యోగం చెప్పాను.

చిదం : ఆ పనేమిటో త్వరగా చెల్పండి. అవతల నాకో అర్జంటుపని వుంది.

కోదం : ఇటువంటి పరిస్థితులలో అర్జంటు పనేమిటండీ? ఓమూల కుక్కపిల్ల పోయిందని ప్రకటన యిచ్చారుగదా — ఇంకోమూల విచారంతో క్రుంగిపోవలసిన సమయంలో మీకు అర్జంటుపనా?

చిదం : నా ప్రకటన చూశారా యేమిటి? నిజమే. విచారంతో బాధపడుతున్నాను. ఏం చెయ్యను? ఇప్పుడు అర్జంటుపనంటే అదే. ఆపనిమీదే వెళ్తున్నాను.

కోదం : శుభకార్యవచనే విన్నమాట! అక్కర్లేదు. మీరింక బయటకు పోనక్కర్లేదు. మీ కుక్కపిల్ల మీకు లభిస్తోంది.

చిదం : యేమిటి—(కూలబడుతూ) మీకు జ్యోతిషం కూడా తెలిసినట్టుంది. దయచెయ్యండి. కూచోండి. (కుర్చీ చూపాడు)

కోదం : (కూచుని) జ్యోతిషం కాదండీ—యథార్థమే! మీ కుక్కపిల్లను అతి శ్రమపడి—

వెతికి—వెదికి వేసారి— తిరిగి వెతికి వెతికి- పట్టుకుని, తీసుకొచ్చాను.

చిదం : ఏదీ?—

కోదం : కుక్కపిల్ల ఇంట్లో ఎందుకుంటుందీ— బయట—నానిచోటులో అది కట్టబడివుంది.

చిదం : నిజంగా! సీనూ—వెళ్ళి తీసుకురా. (సీను పరుగెత్తాడు) చాలా థాంక్స్. మీ ఋణం తీర్చుకోలేను పాపం — ఎంత శ్రమ పడ్డారో—అసలది కులాసాగా వుందా?

కోదం : నిక్షేపమల్లేవుంది. దానికేం — ఐతే మొదట కొద్దిగా డీలా ఐపోయినట్లు కనిపించింది. కాంపౌండర్ను కదా—దాని వ్యాధి కనిపెట్టి—ప్రథమ చికిత్స చేసి కొద్దిగా మందిచ్చి—పాలుపట్టి జాగ్రత్తగా తీసుకొచ్చాను అయినా—ఆ పాలఖర్చు మందుఖర్చు మీ కేం ఇవ్వఖర్లేదనుకోండి!

చిదం : ఎంతమాట! మీ ఋణం వుంచుకుంటానా చెప్పండి మాళారా అదంటే నాకు ప్రాణం. దాన్ని పోగొట్టుకున్నాక నా మనస్సు ఎంత బాధపడిందో తెలుసా?

కోదం : పాపం—ఆఁ...నాకు చెక్కిస్తారా— కాష్ ఇస్తారా?

చిదం : దేనికి? ఓహో—మీ బహుమానం సంగతా! చెక్కు యిమ్మంటారా?

కోదం : వద్దండీ. అర్జంటుగా సొమ్ము అవసరంకూడా వుంది. ఇప్పుడు బ్యాంకీ మూసేసివుంటారు. రొక్కంగా యిప్పించారంటే ఉచితంగా ఇచ్చినట్టుంటుంది. రేపటిదాకా ఆ చెక్కు మార్చుకునే దాకా ఆగటం కష్టం—కొన్ని అర్జంటు ఖర్చులున్నయ్.

చిదం : చంపారే—అంత మొత్తం రొక్కం నా దగ్గిర లేదు. మీ పని చక్కబెట్టుకోటానికి 50 ఇస్తాను—మిగిలింది చెక్కు రాస్తాను.

కోదం : అట్లా అంటారా...మీ యిష్టం...

చిదం : (చెక్కు పుస్తకంతీసి) మీ పేరు...?

కోదం : యం. కోదండం—

చిదం : యం. కోదండం (రాసుకోబోతాడు)

సీను : (చివాలున కుక్కపిల్లతో వస్తూ) సార్ సార్ మన రోజా కాదు సార్ ఇది!

చిదం : (షాక్ తిని) ఆఁ!

సీను : చూడండి—ఇదేదో చవట కుక్క. వీథిలో తిరిగే బట్ట చెత్త రకం.

చిదం : (చూసి) ఎంత పని!.. ఇది నాది కాదండి!

కోదం : ఏమన్నారు మీరు పేపర్లో? తెల్లనిరంగూ కుచ్చులాంటి పొట్టితోకా గల కుక్కపిల్ల అన్నారు. ముఖం కోలగా వుంటుందన్నారు. దీని మొహం ఏమన్నా సుంద్రంగా వుందా? తెల్లనిరంగు అన్నారు. కుక్కపిల తప్పిపోయిన సమయానికి అది తెల్లగానే వుండేది. ఈ ఎండల్లో తిరిగితిరిగి నల్లబడి పోయింది. కుచ్చులాంటి పొట్టితోక అన్నారు. పొట్టితోక కాక ఇదేమన్నా పాముల తోకా?...కుచ్చు అంటారా—అది నా తప్పేలెండి ఏమిటో నాకు నచ్చక కత్తెరతో కత్తిరించి పారేశాను కావాలంటే ఆ...(జేబులు తడుముకున్నాడు)

సీను : మనరోజా మెళ్ళో బెల్టువుండాలి

కోదం : బెల్టు వుంటుందనుకుంటున్నారండీ వీథిలో దొరికిన కుక్క మెడలో? అదెవడు కొట్టేశాడో! పోనీండి—బెల్టు ధర ఆరణాలు. ఆ ఆరణాలూ కొట్టేసుకుని, నూట పదిహేను రూపాయల పది అణాలూ ఇప్పించండి—ఏం చేస్తాం!... దానికోసం నేను పెట్టిన ఖర్చు ఎట్లాగూ అడగలేదు!

చిదం : చూడండి కోదండంగారూ—నా కుక్కపిల్ల కోసం నేను నానా శ్రమాపడుతున్నాను. అది దొరికిందంటే నాకు పరమానందమవుతుంది. నేను ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇది నా కుక్కపిల్ల కాదు. మీరు లక్ష చెప్పండి, కోటి చెప్పండి. దాన్ని పెంచి పెద్దచేస్తున్న మా సీనుగాడు-వీడే సాక్ష్యం!

కోదం : అయ్యా-మీరు 'కాదు' అని కొట్టిపారేస్తే నే నేం చేసేది? మీరు పత్రికలో ప్రకటన వెయ్యగానే చూశాను. ఆసుపత్రీ, డాక్టరు గారూ, పేషెంట్లూ అందర్నీ వొదిలి వూరి మీద పడ్డాను. ప్రతీచోటా చూశాను. తోటలూ, పేటలూ, పార్కులూ, రోడ్లూ- అవీ-ఇవీ-ఒక టేమిటి! ఇంటింటికీ తిరిగాను. ఆ తిరగటంలో ఎంత శ్రమపడ్డానో మీకు నోటితో చెబితే తెలీదు అంత శ్రమపడాను. అక్కడ డాక్టరు గారు తిడుతున్నా, పేషెంట్సు ఏడుస్తున్నా, నా యింట్లో నా భార్యా పిల్లలు నాకోసం కలవరిస్తున్నా అవన్నీ లక్ష్యపెట్టక పరోపకారబుద్ధితో - కేవలం పరోపకారబుద్ధితో - ఎండనక వాననక తిరిగాను. మీరే ఆలోచించండి. దారిలో ఓ లక్షపిల్లలు కనిపించినై, అవేవీ మీవికావు.

అమాంత్రం పోలికపట్టలేనా-ఎంత కొంపాంచే ర్నాయితే మాత్రం! ఆఖరుకు పట్టుకున్నాను.

చిదం : బాగా పోలికపట్టారు! నా కుక్కపిల్లకోసం మీరు పడిన శ్రమను నేను మరిచిపోను. ఈ కుక్కపిలను తీసుకువెళ్ళండి (సీను బయటకు కుక్కతో వెళ్ళాడు) ఇది మాత్రం నాదికాదు! నా కుక్కపిల్లను తీసుకురండి - నిమిషాలమీద సొమ్మిచ్చేస్తాను.

కోదం : మంచి పెద్దమనిషేనండోయ్ మీరు! నిన్నట్నుంచీ శ్రమపడి వెతికి తీసుకొస్తే కాదు పొమ్మని-పైగా మళ్ళీ వెదకాలా? బావుంది బావుంది. నా కలతల పనీ పాటూ లేదనుకున్నారా - నే నేమన్నా కేవలం కుక్కల్ని వెదకే వెధవ ఉద్యోగంలో పని చేస్తున్నాననుకున్నారా?

చిదం : అదంతా నాకేం తెలీదు మీ కలతల పనీపాటూ లేదని నే నేం అనలేదు. ఆ పదంతో మూనుకుని కుక్క పిలను వెతికి తీసుకొస్తేనేగా, మాటపడవలసొస్తున్నది!

కోదం : బాగా ఇచ్చారు. ఇంతమోసం ఎక్కడా చూడలేదండి. ఆరునెల్లక్రిందట పిల్లవాడొకడు తప్పిపోతే, వెతికి పట్టిచ్చి రెండు వందల రూపాయలు పుచ్చుకున్నాను. ఆయన ఏమన్నా ఇటువంటి పేచీమనిషయితే చచ్చిపోదును. 'నా కుర్రాడు కాదు పొమ్మన్నాడా?' ఎంత మర్యాద చేశాడు - ఎంత ఆదరించాడు! కుర్రాడు నాకు ఏలూరు ప్లాటుఫారం మీద దొరికాడు. ఏలూరు నుంచి సెకండుక్లాసులో తీసుకొస్తే ఆ ఖర్చు కూడా యిచ్చి వాళ్ళింట్లో నాలుగు రోజులుండమని మరీ బతిమాలాడు, ప్చ్!- మనకెందుకు మన ధర్మం ఏదో మనం నిర్వర్తించాం. వాళ్ళ అబ్బాయిని వాళ్ళకు వప్పగించాం. అంతే!

చిదం : ఆ అబ్బాయి వాళ్ళవాడు కాబట్టే ఆయన మీ ఋణం వుంచుకోలేదు. ఈ కుక్కపిల నాదికాదు. ఇదేదో ఊరిమీద తిరిగేరకం. మీరు డబ్బుకోసం ఆశపడి తీసుకొచ్చి ఇస్తున్నారు - దయచేసి వెళ్ళండి!

కోదం : (ఉగ్రుడై) ఏమండోయ్! ఇదేం మర్యాదగా లేదు. మిమ్మల్ని మోసగించి మీ దగ్గర డబ్బేత్తుకు పోవాలనే దురుద్దేశంతో వచ్చాననుకుంటున్నారా? కావలిస్తే మీకు కావలసినంత డబ్బు గుమ్మరిస్తాను. పోనీగదా అని పనీపాటూ మాని, ప్రాణం పోతున్నా లక్ష్యపెట్టక కుక్కను వెతికి తీసుకొస్తే కాదు పొమ్మని కొట్టిపారేస్తారా? ఇదేనా పెద్దమనిషితరహా?

చిదం : (విసిగి, కోపంగా) ఇది నా కుక్కపిల్ల కాదు మహాప్రభో — నీకు శతసహస్ర వందనాలు. వెళ్ళు కుక్కపిల్ల దొరక్క నానాబాధా పడిపోతున్నాను. నా సోల ఐతే తీసుకోటానికి తెరులా? నిక్షేపంగా తీసుకొంటాను. వెళ్ళు-పోయితే నా రోజాను తీసుకురా!

కోదం : ఏమండోయ్ ఇక లాభంలేదు అంతొదగా. మోసం! మీ మీద పోలీసు రిపోర్టు ఇస్తాను.

చిదం : ఏమని ఇస్తారు రిపోర్టు?

కోదం : ఏమని యిస్తాను? ఫలానా చిదంబరం అనే ఆసామీ కుక్కపిలను వెతికి తీసుకొస్తే మాటపకార్లు ఇస్తానని ఎక్కపెట్టి తీరా తీసుకొచ్చాక డబ్బివ్వక అల్లరి పెట్టాడని. తెలిసిందా?

చిదం : (చిరాగ్గా చూసి) ఇవ్వక కూర్చో ఇవ్వు-రిపోర్టు ఇచ్చుకో. అదిగో ఫోన్-వూ... చెయ్యి ఫోన్ చెయ్యి!

కోదం : (తెల్లబోయి, సర్దుకుని) అంతేనన్నమాట! అనవసరంగా చిక్కుల్లోపడిపోతారు ఫోన్ చెయ్యలేక పూరుకోటంకాదు. బావుంటను- మీ పెద్దమనిషితరహాకు మర్యాదబటం నా కిష్టంలేక పూరుకుంటున్నాను.

చిదం : మంచి పని చేశావ్—'నా కుక్కపిల్ల కాదూ' అని తెరిపోతూ వుంటే ఆ దిక్కుమాలిన వెధవ కుక్కను నా నెత్తిన రుద్దాలనుకుంటున్నావు గదా - నువ్వేమన్నా పెద్దమనిషివి? నీమీద నేను మాత్రం పోలీస్ రిపోర్టు ఇవ్వలేనూ? ఇస్తే నువ్వేమవుతావో తెలుసా? డబ్బుకోసం మోసం చెసి, నన్ను పీకిస్తున్నావంటే పోలీసులు వాయువేగ మనోవేగాలలో వస్తారు. సబ్ఇన్స్పెక్టర్ నాకు దగ్గర స్నేహితుడు కూడానూ!

కోదం : అయ్యో! మనకూ, మనకూ భేదాభిప్రాయాలెందుకు? ఈ వెధవ కుక్కతిక పోలీసుల దాకా ఎందుకు? నిజం చెప్పండి...నిజంగా ఇది మీ కుక్కపిల్ల కాదా?

చిదం : ఇంతసేపూ చెప్పినదంతా విని మళ్ళీ మొదటికొస్తారేం—
మూడుసార్లు చెబుతున్నాను వినండి మరి ప్రశ్న వెయ్యకండి. మీకు నమ్మకం లేక

లాగే ఇదిగో ప్రమాణం కూడా చేస్తున్నాను. (తలమీద చెయ్యి పెట్టుకుని) ఇది నా కుక్కపిల్ల కాదు—ఇది నా కుక్కపిల్ల కాదు—ఇది—నా—కుక్క పిల్ల—కాదు (చెయ్యితీసి) సరా?

కోదం : మీరింతగా చెబుతూ వుంటే నేనేం చెయ్యను? కాని మీ ప్రకటన చూసిన దగ్గర్నుంచీ నేనెంత కష్టపడ్డానో—ఎంత బాధ పడ్డానో మీ రెరుగరు!

చిదం : ఎంక్కం—ఇంతసేపూ పాడుతూ నేవున్నావుగా.

కోదం : క్షమించండి. బీదవాణ్ణి. దీన్ని వెతకటం కోసం నాకెంత డబ్బు ఖర్చయింది. శ్రమమాటకేం—తమరా ఖర్చులు యిప్పించా రంటే....

చిదం : బావుందయ్యా—ఒక వేళ అది నా కుక్క పిల్ల ఐనప్పటికీ నేనా ఖర్చు ఇవ్వను గదా—కాకుండా ఖర్చు కూడా ఇవ్వాలా? వెళ్ళు వెళ్ళు—నన్ను మరి విసిగించకు!

కోదం : మీకో నమస్కారం పెడతాను! పిల్లలుగల వాణ్ణి. ఎదిగిన పిల్లకు పెళ్ళి చెయ్యాలి—రెండో వాడు చదువుకుంటున్నాడు.—మూడో పిల్ల...

చిదం : ఉద్ధరిస్తోంది! నా దగ్గిర 'పంచ'ప్రాణా లున్నాయ్. నీక్కావాలంటే ఒకటో రెండో పట్టుకుపో గాని-నన్ను వేధించకు!

కోదం : అమ్మమ్మమ్మ...ఎంత మాట- ఎంత మాట! వెధవడబ్బుకోసం మీ ప్రాణం తీస్తానా?

చిదం : ఇంకా ఏం తియ్యాలయ్యా రామచంద్ర ప్రభో! ప్రాణం పట్టుకుపోయేందుకు యమ కింకరులన్నా 'ఇంత' బాధ పెట్టరా బాబూ! ముక్కకు ముక్క వొప్పజెప్పి కొరుక్కు తినేస్తున్నావ్.

కోదం : మీకు ఇంత బాధ కలిగిస్తున్నానని నేను అనుకోలేదు. ఆఖరుసారిగా మనవి చేస్తున్నాను...ఒక్క పాతిక రూపాయలిప్పించారంటే...

చిదం : అబ్బబ్బబ్బ...సీనూ...సీనూ...!...వెళ్ళవయ్యా వెళ్లు పాతిక రూపాయలు కావాలా ఎక్కడైనా ఎత్తుకొచ్చి యిస్తాను. వెళ్ళు. నమ్మకం చాలకపోతే ఈరాత్రి నాతో కూడా రా.

కోదం : పోనీ ఇరవై రూపాయలన్నా ఇప్పించండి.

చిదం : ఇదేం ఖర్మం వచ్చిందిరా ఇవాళ భగవంతుడా?...వెళ్తావా పోలీసుకు ఫోన్ చెయ్యమన్నావా? చెప్పు!

కోదం : (కాళ్ళమీద వాలుతూ) నన్ను దయచెయ్యకండి. మీ సహాయం మరిచిపోను. పిల్లలుగల వాడిని. మీ కెంతోస్తే అదిప్పించండి. మీకు జన్మజన్మలు బానిసనై పడివుంటాను. అనవసరంగా నాకు ఖర్చయిపోయింది. ఎల్లా చెప్పండి. అది నేను మళ్ళీ సంపాయించాలంటే నాతరం కాదు. కటాక్షించండి మీ కెంతోస్తే అదిప్పించండి. వెంటనే వెళ్ళిపోతాను.

చిదం : (ఆలోచించి) వెంటనే పోతావుగదా!

కోదం : ఒక్క నిముషంకూడా మరి నిలబడను!

చిదం : (పర్సుతీసి 5 రూ. నోటుయిస్తూ) మాట్లాడకుండా ఇది తీసుకుపో...మరింకేమీ వేధించకు ... వెళ్లు ... మరేం వేసం పారం చెయ్యకు...వెళ్లు వెళ్లు....

కోదం : (నోటు జేబులో పెట్టుకుంటూ, నీరసంగా) కానీండి- ఏంచేస్తాం తమదయ అట్లావుంది. ఏం చేస్తాం...సెలవు (వెళ్తున్నాడు)

చిదం : నీ కుక్కపిల్లను కూడా తీసుకుపో. మరిచిపోయి ఇక్కడే వదిలిపెట్టేవు గనక!

కోదం : అదెక్కడైతే దొరికిందో అక్కడే వొదిలి పెట్టాలంటే నాకు మళ్లీ పదిరూపాయల ఖర్చు...ఈ ప్రక్క వీధిలో పారేస్తాను! (వెళ్ళాడు)

చిదం : ఏదో ఏడుపు — (కూలబడి) ఏ..రాము రాము ... ఒరే సీనూ ... సీనూ ... (సీను వచ్చాడు) వాడు పోయాడా?

సీను : పోయాడు సార్ - కుక్కపిల్లను తీసుకు నే పోయాడు సార్.

చిదం : ఇంతసేపూ నువ్వెక్కడ చస్తున్నావ్?

సీను : చావటం ఖర్మం ఏమిటండీ - అవతల కూడుని కుక్కపిల్లను ఆడిస్తున్నాను.

చిదం : ఆ వెధవ కుక్కనే!

సీను : ఏదో ఒకటి అలవాటయిపోయిందిసార్ - కుక్కతో ఆడుకోటం!

చిదం : చూశావా- వూరిమీద తిరిగి తిరిగి, అదికుక్క మాలిన కుక్కపిల్లను తీసుకొచ్చి మనదే నంటాడు ఆ వెధవ! 'కాదురా పోరా యమధర్మరాజా' అంటే ప్రాణాలు పీక్కుని తిని ఐదురూపాయలు పట్టుకుపోయాడు!

సీను : వీడు మరీనండీ! ఆ మాత్రం దానికి 5 రూపాయ లిచ్చేశారా! పెళ్లికోసం అడిగితే లేదన్నారు!

చిదం : (చిరాగ్గా) ఇస్తానన్నాను కాదురా...ఇస్తానులే...(తలుపు తోసుకుని భీకరంగావున్న మనిషి ఒకడు వచ్చాడు. అతని పేరు చతుర్భుజం. చేతిలో కుక్కపిల్ల వుంది. దాని తోకకు గుడ్డముక్క చుట్టబడివుంది రక్తం కారిన మరకలు ఆ గుడ్డమీద కనిపిస్తున్నై).

చతు : (కుక్కపిల్లను బల్లమీద పారేసి, సీరియస్ గా) ఇదిగో మీకుక్కపిల్ల-ఇవ్వండి... నా నూట పదహారు రూపాయలూ. వెంటనే ఇవ్వండి. (రుమాలుతో ముఖం వొత్తుకున్నాడు)

చిదం : (తెల్లబోయి చూశాడు)

చతు : అట్లా చూస్తారేం—తీసుకోండి మీ పిల్లను.

సీను : (కుక్కను తీసి) ఇదీ మన రోజా కాదు సార్!

చతు : నువ్వూరుకోవయ్యా — నీ కెందుకూ—ఇది మీ రోజా కాదూ? రోజా కాకపోతే దాని 'బాబు'!...త్వరగా యివ్వండి—వెళ్లాలి!

సీను : ఈ తోకకు రక్తం యేమిటి?

చతు : ఏమిటో ఎవరికెరుకలే.ఏమండీ చిదంబరం గారూ-ఇవ్వండి పోవాలి!

చిదం : ఎక్కడికి పోతారు?

చతు : మా యింటికి — (సేవను చూపుకుంటూ) చతుర్భుజం గారిల్లు అంటే అందరికీ తెలిసిందే!....కపపడి మీ కుక్కను వెతికి తీసుకొస్తే మర్యాదా మంచీ లేకుండా మాట్లాడతారేం—కమాన్—నా డబ్బు!

చిదం : మీ కుక్కపిల్లను తీసుకెళ్ళండి. ఇది నాది కాదు.

చతు : ఏమిటీ — కాదూ! మీ గుర్తుల ప్రకారం పొట్టితోకా—ఇదిగో పొట్టితోక!

సీను : పొడుగుతోకుంటే కత్తితో తెగేసి పొట్టి చేశాడు సార్!

చతు : నోరుముయ్యి! మనకొంగతిపట్లలేదు. తిండిలేక ఆకలితో మాడిపోతూ, ఏమీ దొరక్కపోతే, అదే దాని తోకలో చిన్న ముక్క కొరుక్కు తినేసి వుంటుంది! ఇంకా నయం. నేను గనక కట్టుకట్టాను ఆ తిర్యాక - తెల్లరంగు అన్నారు మొదట్లో ఇది తెల్లగానే వుండొచ్చు బురదలో మట్టి కొట్టుకుని ఇట్లా తయారయింది.

చిదం : అసలిది నా కుక్కపిల్లే కాదు. తీసుకెళ్ళండి!

చతు : వాహ్వారె ఎత్తూ! మంచి ఎత్తువేశారు! ఏదీ (కుక్కను తీసుకుని, చూడండి) ఆ ఎత్తులేం మనదగ్గిర పనిచెయ్యవు. మర్యాదగా కుక్కను తెచ్చి యిస్తున్నాను మర్యాదగా నా డబ్బివ్వండి.

చిదం : (కోపంగా) ఇవ్వకపోతే ఏం చేస్తావయ్యా-తంతావా-కొడతావా-నరుకుతావా?

చతు : ఎందుకవన్నీ! నోటితో పోయే వ్యవహారం! ... మీ కుక్కపిల్లను జాగ్రత్తగా వుంచాలి. ఎక్కడ దానితోటు? (బయటకు పోయి కుక్కను వుంచేసి, వచ్చి సీనుతో) గొలుసుతో కట్టేసి రావయ్యా - అట్లా చూస్తావేం దొంగవెధవను చూసినట్టు!... పో...(సీను భయంగా వెళ్లాడు) ఏమండీ-మాట్లాడరేం?...

చిదం : కుక్కపిల్ల పోయినమాట వాస్తవమే - దాని కోసం నేను బెంగపెట్టుకున్న మాటా వాస్తవమే-అది దొరికేదాకా నేను భోజనం ముట్టుకోనన్నదీ వాస్తవమే! ఐతే ఇది నా కుక్కపిల్ల కాదు. ఇంతకు పూర్వం ఇట్లాగే ఇద్దరొచ్చారు అవి నా కుక్కపిల్లలు కాకంటే వెళ్ళిపోయారు!

చతు : నేనట్లా పోవాల్సినవాడిని కానండీ! ఈ కుక్కపిల్ల మీది కానప్పుడు నాకు ఒక్క దమ్మిడీ ఇవ్వకండి. 'మీది' అని నిదర్శనాలు చూపించాను అన్నీ సరిపోయినై...మీరు నాక్కేసు వుంచుకుంటే అనుభవిస్తారు!

చిదం : ఇంకా ఎప్పుడో అనుభవించటం దాకా ఎందుకు—అనుభవిస్తూనే వున్నాను. (ఫోన్ మోగింది. చిదంబరం తీసి) ఎవరు?...ఆఁ...ఏఁనయ్యా—లేదయ్యా!...ఇద్దరు ముగ్గురొచ్చి చూపారు గాని, వాటిల్లో మనది లేదు...నీకూ దొరకలేదా......చేస్తానులే భోజనం మాటకేం—ఎట్లాగన్నా వెతికి పట్టుకో!...కొద్దిగా శ్రమపడు...అది లేకపోతే నాకు నిమిషం తోచదు...దొరికిన వెంటనే పిలిచి చెప్పు! ..ఆఁ...(ఫోన్ వుంచి, ఏదో గుర్తొచ్చినట్టు చరచరా లోపలకు పోయాడు. బయటనుంచి ఇళ్ళకంట్రాక్టరు వచ్చాడు. వేషం మారివుంది. మీసాలు, తలపాగా వున్నయ్ భుజాన సంచీ వున్నది)

కంట్రా : చిదంబరంగారు లేరా?

చతు : లేనట్టే—

కంట్రా: అంటే?

చటు : ఉన్నా అరుణ ఎవరితో నూ ఇప్పుడు మాటా డరు. చాలా నిరుత్సాహంగా వున్నారు!

కంట్రా: కుక్కపిల్ల దొరక్కనా?

చటు : దొరక్కం - దొరికింది!

కంట్రా: దొరికిందా?

చటు : దొరికింది!

కంట్రా: ఎట్లా దొరుకుతుంది! అదేదో ఇంకో పిల్ల ఐవుంటుంది. అసలు కుక్క మాత్రం అది కాదు

చటు : ఎవరయ్యా మీరు - వూరికే అట్లా మాట్లాడ తారు! అసలుకుక్క అది కాదంటే మీ రేమన్నా చూశారా!...అసలు యింతకూ మీరేం పనిమీద వచ్చారు?

కంట్రా: వారితో వ్యక్తిగతంగా పనుండి వచ్చాను — మీ రెవరో తెలుసుకోవచ్చా?

చటు : నేనా! నేనూ ఓ పని మీద వచ్చాను. నా పని ఐతే రావ్గారొస్తే గావుంటుంది అందాకా ఆవతల బెంచీ వుంది చూశారా- దానిమీద కూచోవచ్చు. ఏమీ అనరు!

[చిదంబరం వచ్చాడు]

చిదం : (వస్తూనే కంట్రాక్టరును చూచి) ఎవరది?... ఏమిటయ్యా...నువ్వేనా కుక్కపిల్లను తీసుకొచ్చావా — ఏదీ - నాకేం చూపించవు!

చటు : అతను కుక్కపిల్లను తీసుకురాలేదండీ!

కంట్రా: తీసుకురాలేదూ — ఇంకా నయం!

చిదం : తెచ్చావూ — వద్దు లే పో...కుక్కపిల్లను నాకు చూపించకుండా నే వెళ్ళు.

కంట్రా: మీ కుక్క పార్ ఇది! (సంచిలోంచి తియ్య బోయాడు.)

చిదం : సంచిలో కూడా పెట్టావూ? తియ్యకు నీ పుణ్యం వుంటుంది. నామాట వినండి మిమ్మల్ని బతిమాలుకుంటాను - వెళ్ళండి!

కంట్రా: కుక్కపిల్లను చూడనన్నా చూడకుండా వెళ్ళ మంటా రేమిటండీ! ఇది మీ కుక్కపిల్లేనండి!

చిదం : అవును నాకుక్కపిల్లే......కొలత ప్రక్కను పారుతూవుంటే ప్రతీ వాడికుక్కా నా రోజా నే! నా రోజా కాదంటే మీకు కోపం కూడా వస్తుంది. అదంతా ఎందుకు...మీరు ముందు దయచెయ్యండి!...వెళ్ళండి!...... (ముందుకొచ్చి తరుమబోయాడు.)

కంట్రా: చూపించి పార్-ఇది మీ దేనండి.... (వెనక్కు నడుస్తూ) మీ కుక్క...పాటితో కా-అవును తెల్లని గంగూ-

చిదం : (ముందుకునడుస్తూ) కోలముఖమూ, కుచ్చు తోకా — అవును-అదే! అదే నాకక్కర్లేదు వెళ్ళండి!

కంట్రా: వినిపించుకోండి- చూడండీ!

చటు : వెళ్ళండయ్యా — వద్దో అంటూవుంటే వినిపించదూ? అది కాదు వారి కుక్కపిల్ల. అవతల గుమ్మంలో వుంది చూసుకో!

కంట్రా: (బయటకుపోయి వచ్చాడు)

చిదం : (కుర్చీలో కూలబడ్డాడు)

చటు : చెబుతూవుంటే వినిపించుకోకుండా ఒకటే గోల! కుక్కపిల్ల దొరికినాకూడా 'మీ కే మీ దే ఆట! ఎక్కడ వూడిపడ్డాడో దయ్యం లాగా-పాపం! చాలా బాధపెట్టాడు మిమ్మల్ని! (విసనకర్ర తీసుకొని విసురు తున్నాడు)

కంట్రా: (బయటనుంచి వచ్చాడు. చేతిలో అతను తెచ్చిన కుక్కపిల్ల వుంది. తెలపాగా జారి పోయివుంది. మీసం వూడిపోయివుంది. వెనక నుంచి సీనుకూడా వచ్చాడు) అది మీకుక్క పిల కాదు సార్. ఇదిగో ఇదీ మీది!

చిదం : ఇదేమిటి-మిమ్మల్ని చూసినట్టుంది. ఇప్పుడు రిపేర్స్ చేసే వ్యక్తి ఎవరన్నా మీకు అన్న దమ్ముడా?

కంట్రా: కాదండి- నే నే ఆవ్యక్తిని!

చిదం : ఇదొకటి-ఇదో మోసం!

కంట్రా: కాదండి. నే నేం కి ఆకంట్రాక్టరును. ఇంతకు ముందే మీదగ్గరకొచ్చానుగా — గుర్తించా రా-ఇదిగో 'ఆర్డర్ బుక్' (సంచిలో చెయ్యిపెట్టి తియ్యబోయాడు)

చిదం : మిమ్మల్ని కంట్రాక్టరు కాదని నే నేం అన లేదు. మీరు కంట్రాక్టరే కాని మీరు మరో వేషంలో వచ్చినందుకు మోసం అంటు న్నాను.

కంట్రా: అది వూళ్ళోవాళ్ళు ఏమన్నా అనుకుంటా రేమో అనిగాని!...సరే. ఇదిగో మీ కుక్క పిల్ల!

చిదం : (చూసి) ఇందాకే చెప్పాను వెళ్ళమని! ఇది నాదికాదు అన్నా మరి వేధించకండి!

కంట్రా: మీదే సార్, జాగ్రత్తగా చూడండి! ఇదిగో తెల్లనిరంగూ - ఇదిగో కోలముఖమూ- (సీనుతో) నువ్వు మాట్లాడబ్బాయ్!

సీను : (తీసుకుని వేలితో తాకి) ఇది తెల్లని కుక్క కాదుసార్ - నల్లకుక్క మీదే సున్నం పూశారు

కం(ట్రా : సున్నం పూశారా-నువ్వు నన్ను దగ్గిర పెట్టుకునే మాటాడుతున్నావా-సున్నం పూశారట సున్నం... ఇది మీదేనండి! ఇందాకా మీ దగ్గిర గుర్తులన్నీ తీసుకున్నాను-నా పాయింట్లుగా ఇతికి తీసుకొస్తానని చెప్పాను- తీసుకొచ్చాను-మీ కుక్కపిల్లను మీరు తీసుకుని నా డబ్బు నాకివ్వండి!

దసు : ఇంకా ఏం కుక్కపిల్లయ్యా-ఎక్కడ ఎత్తుకొచ్చావ్ దాన్ని-ఒరే అబ్బాయ్-దాన్ని తీసుకెళ్ళి బయటపారేయ్... పూఁ- చూస్తావేం-పో (సీను కుక్కను తీసుకుని పోయాడు!)

కం(ట్రా : ఒరే-అబ్బాయ్! పారేశావంటే పుర్రోగం పూడింది నే లెక్క వేసుకో. అది మీదేసార్ - నేను అబద్ధం చెప్పటం లేదు.

చిదం : మీరు నిజమే చెబుతున్నారు- నేనే అబద్ధం ఆడుతున్నాను నేను కట్టి మోసగాడిని... దొంగను-సరా-ఇహ దయచెయ్యండి. (చరచరా లోపలికి పోయాడు)

దసు : అవునయ్యా-నీకేం మతీ సుతీ లేదూ - ఊరిమీద తిరిగే ఆ చెత్త కుక్కపిల్లను తీసుకొచ్చి ఆయనదేనంటూ ఇళ్వజాపుతో వాదం-ఛివాడివేనయ్యా!

కం(ట్రా : అసలిల కట్టిపున్న కుక్కను నువ్వు తెచ్చావల్లే వుంది!

దసు : కాక ?

కం(ట్రా : ఏ లేవురి-నువ్వు మోసంచేసి ఏకో కుక్కపిల్లను తెచ్చి ఆయనదే అని అంటగడుతున్నావ్-నిజంగా చెప్పు-అది ఆయన కుక్కా ?

దసు : నువ్వు నిజంగా చెప్పు నువ్వు తెచ్చింది మాత్రం ఆయన కుక్కా ?

కం(ట్రా : నిజంగా నేను తెచ్చింది ఆయన కుక్క పోలికలు చూసుకో.

దసు : నాదయ్యా అసలు కుక్క - నా మాటవిని దాన్ని నువ్వు తీసుకువెళ్లు!... నా మాట వినవా !

కం(ట్రా : బావుంది. నీతో నాకేమిటి మాట్ల!... ఏమండీ చిదంబరంగారూ!... మీ కుక్కపిల్లను తీసుకుని, బాబ్బాబూ! నా డబ్బిచ్చి పంపేస్తురూ !

దసు : అయ్యా చిదంబరంగారూ-నేను వెళ్లాలి. త్వరగా నా డబ్బివ్వండీ!

కం(ట్రా : ఆవతలఅర్జంటు పనులున్నాయండీ - అవన్నీ వదిలి పెట్టివచ్చాను. (దసుకున్నజంలో) ప్రస్తుతం ఎనిమిది తొమ్మిదిళ్లు మరమ్మత్తు చేయించాలి. చిదంబరంగారు కుక్కను తీసుకుంటే ఈయిల్లుకూడా చెయ్యాలి. (పైకి చూస్తూ) నా డబ్బిచ్చేసి ఎంతిహా పంపరు !

దసు : (దురదుర చూసి) నోట్లు లెక్కపెడుతున్నారేమో — కాస్సేపాగూ!... లేకపో లేనూ—నా డబ్బట—"నా డబ్బు!"

కం(ట్రా : నాది డబ్బుకాదు—నీదే డబ్బు! నువ్వే తెచ్చావు కుక్కపిల్లను. (లేస్తూ లోపలకు చూస్తూ) చిదంబరంగారూ—

దసు : చిదంబరంగారూ ... (చరచర లోపలకు వెళ్ళారు. కం(ట్రాక్టరుకూడా వెనకాలే వెళ్ళారు.)

చిదం : (ఆ(తుతిగా లోపల్నుంచి వచ్చి కూర్చున్నారు)

దసు : (వస్తూ) ఏమండిసార్! ఏమిటిది ?

కం(ట్రా : మీరు జా(గత్తగా పరీక్షించి మీ కుక్కను నిర్ణయించుకోండి సార్ !

దసు : నిర్ణయిస్తారంటవయ్యా—ఏమండీ...

చిదం : ఏమిటి— ఏమిటి మీ వుద్దేశం .... (మండిపోతూ) పోలీస్‌కు ఫోన్ చేస్తాను (లేవబోయాడు)

దసు : (కూచో పెడుతూ) అఁ—ఎందుకండీ అంత పని-ఈమాత్రంవానికి వాళ్లదాకా ఎందుకు !

చిదం : ఎందుకేమిటి — లేకపోతే ఏమిటీ అల్లరి! ఇంకాస్సేపుపోతే పిల్లిపిల్లల్ని కూడా తెచ్చి "మీ కుక్కేనండీ" అంటారు పోతారా? పోలీసును పిలవమంటారా?

కం(ట్రా : క్షమించండిసార్! (ఫోన్ పక్కకి జరిపి, పత్రిక కప్పాడు.)

దసు : అయ్యా క్షమించండి. ఇది మీ కుక్కపిల్ల కాదని మీ నోటిమాటతో కొట్టిపారేస్తే మేమెట్లా బాగ్గలం! మేం దొంగలం కాము- దోచుకోము..చాలా కష్టపడి వెతికి తెచ్చాను.

కం(ట్రా: నేనూ చాలా కష్టపడ్డాను. మీరు కనిపెట్టండి—ఎవరిదెంత కష్టమో!

చిదం : మీ కష్టాలమాట చెప్పకండి. నన్ను నానా కష్టాలు పెట్టి—ఇంతా అంతా డబ్బు పీకుతున్నారా మీరు!...ప్...ఏం గోలవచ్చిందిరా భగవంతుడా! చిన్నకుక్క చేరక తప్పింది....సీనూ...సీనూ...పోతేపోయింది కుక్కపిల్ల—నాకు మరి అక్కర్లేదు. మీరిద్దరూ వెళ్తారా వెళ్ళరా? (లేచాడు)

చతు : తనుకు ఒక కంట చూడాలి!...లేకపోతే చచ్చిపోతాను.

చిదం : ఏమంటావయితే?

కం(ట్రా: అనటానికేముందండీ—ఏదో మా (శమకుతగ్గ (పతిఫలం...

చిదం : (సీరియస్ గా, విసుగ్గామూసి పర్సుతీసి చెరో 5 రూపాయల నోటు యిస్తూ) వెళ్ళండి...మాట్లాడకండి...(ఇద్దరూ సంశయిస్తూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు చిదంబరం ఈపాటికే పూర్తిగా విసిగిపోయి వున్నాడు. ఆయాసపడుతున్నాడు. విసుగూ, కోపం హెచ్చిపోయినై) చాలదూ! తీసుకోండి...పర్సులో వున్నది ఇదే!—గుల్ల చెయ్యండి పొండి. (రెండయిదులూ ఒకడికిచ్చి, 10 రూ॥ల నోటు ఇంకోడికిచ్చి పర్సు దులిపాడు) పొండి...మీ కుక్కలూ వద్దు-నక్కలూ వద్దు - వెళ్లి రం!

[ఇద్దరూ వెడుతున్నారు. కం(ట్రాక్టరు ఆగి, వెనక్కు తిరిగి ఇంటికప్పుకేసి చూస్తూ జాలిగా చిదంబరాన్ని చూశాడు. చిదంబరం కూడా చూసి, నుదుటిమీద కొట్టుకుని కూలబడ్డాడు. ఇద్దరూ పోయారు.]

చిదం : (తేరుకుని) సీనూ...(గట్టిగా) సీనూ—(చూస్తూ) దిక్కుమాలిన వెధవ—దిక్కుమాలిన వెధవా అని!

సీను : (రొప్పుతూ వచ్చి) ఆదెవడో సార్ అవతల నించున్నాడు. కాదంటే వినడు, పెద్ద కుక్కను తీసుకొచ్చి మనదేనంటాడు—ఎంత పొమ్మన్నా పోడు!

చిదం : (ఛటుక్కున లేచి, ఆతృతగా) చంపావ్ రా ఏడీ! వస్తున్నాడా కొంపతీసి! నువ్వు త్వరగా ఆ తలుపు వెయ్... గడియ వేసెయ్ (నమస్కరిస్తూ) అక్కర్లేదు—కుక్కపిల్ల అక్కర్లేదు—(ప్రాణాలతో మరి వుంచనిచ్చేట్టు లేదు. (సీను తలుపు వేసివచ్చాడు) చూడూ—కాస్సేపు పోయినతర్వాత వెళ్ళి "కుక్కపిల్ల దొరికింది" అనిరాసి—బోర్డు గుమ్మానికి కట్టు!

సీను : దొరికిందా సార్ (సంతోషంగా)

చిదం : కట్టరా వెర్రిపీనుగా—బాగాదొరికావ్!

సీను : (ఇంట్లోకి పోయాడు.)

చిదం : (ఫోను తీసి విసుగ్గానే) హలో...ఆఁ...ఎడిటర్ గారున్నారా — మీరేనా...సరే చూడండి..."కుక్కపిల్ల కనబడుట లేదు" అని ఈరోజు మీపత్రికలో (ప్రకటన వేశారు. ఆఁ అఁ....ఆ (ప్రకటన నేనే ఇచ్చాను—అవును చిదంబరాన్నే...ఈరోజు పేపర్లో ఆ 'కనబడుట లేదు' అన్న "కుక్కపిల్ల "దొరికింది" అని వెయ్యండి!...అవును దొరికింది...చమత్కారం...ఎవరో తెచ్చియిచ్చారు ధర్మాత్ములు...బాబ్బాబూ...వెంటనే వేసి పెట్టండి! "కుక్కపిల్ల దొరికినది" అని పెద్దక్షరాలలో వేసి—'ఫలానా చిదంబరంగారి పోయిన కుక్కపిల్ల దొరికింది' అని వెయ్యండి—దొరికిందని వెయ్యటం ఎందుకంటారా?—వెయ్యండి — నా స్నేహితులు చాలామంది ఆతురతపడుతున్నారు...దొరికిందంటే సంతోషిస్తారు. ఎంత డబ్బయినా సరే—పంపిస్తున్నాను...దొరికిందని మాత్రం వెంటనే వెయ్యండి—థాంక్స్

[ఫోను (క్రిందపెట్టి, నిస్సారంగా కుర్చీలో కూలబడ్డాడు. సీను ఈలోగానే లోపల్నుంచి ఒక బల్లా సుద్దముక్కా తెచ్చాడు. పెద్ద అక్షరాలలో "కుక్కపిల్ల దొరికింది" అని రాయటం (ప్రారంభిస్తారు.

[తెర]

కలగూరగంప

శాతవాహనులు ఆంధ్రులేనా?

"తంగిరాల"

"శాతవాహనులు ఆంధ్రులేనా? వారు మొట్ట మొదట ఆంధ్రదేశంనుండే అధికారంలోకి వచ్చారా? వారి రాజధాని ఏది?"— ఈ మూడు విషయాల్లోనూ చరిత్రకారుల మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలున్నాయి. వివిధ అభిప్రాయాలను వివరించి, చర్చించి, శాతవాహనులు ఆంధ్రులేననీ, వారు ఆంధ్రదేశంనుండే అధికారంలోకి వచ్చారనీ, వారి రాజధాని 'ప్రతిష్ఠానపురం' అనీ సిద్ధాంతీకరించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం!

శాతవాహనులు ఆంధ్రులేనని కొందరు చరిత్రకారులు, శాతవాహనులు వేరు, ఆంధ్రులు వేరు అని మరికొందరు చరిత్రకారులు భావిస్తున్నారు పశ్చిమ దక్కనులో లభించిన 'నానఘాట్ శాసనాలు' 'నాసిక్ శాసనాలు' శాతవాహన రాజుల పేర్లను కొన్నిటిని సూచిస్తున్నాయి. ఈ రాజుల పేర్లు, వారు సింహాసనానికి వచ్చిన క్రమం, వాయుపురాణం మత్స్యపురాణాల్లో పేర్కొనబడిన ఆంధ్రరాజుల పేరతో ఎక్కువగా ఏకీభవిస్తున్నాయి దీనినిబట్టి కొందరు చరిత్రకారులు శాసనాల్లోని 'శాతవాహనులు', పురాణాల్లోని 'ఆంధ్రులు' ఒక్కరేనని వాదిస్తున్నారు. కాని మరికొందరు చరిత్ర పండితులు ఈ వాదాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఏ శాసనంలోనూ, ఏ నాణెంమీదా శాతవాహనులు 'ఆంధ్రులు' గా పేర్కొనబడియుండలేదు. అట్లే ఏ పురాణంలోనూ ఆంధ్రులు 'శాతవాహనులు' గా పేర్కొనబడియుండలేదు. ప్రతీ శాసనంలోను, ప్రతీ నాణెంమీద "శాతవాహనులు" అనిమాత్రమే వ్రాయబడిఉంది ప్రతి పురాణంలోనూ "ఆంధ్రులు", "ఆంధ్రభృత్యులు", అని మాత్రమే వ్రాయబడిఉంది కాబట్టి శాతవాహనులు వేరు, ఆంధ్రులు వేరు అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు.

శాతవాహనులు - ఆంధ్రులు ఒక్కరే అని అభిప్రాయపడేవారు:—

(1) శ్రీ "ఆర్. జి. భండార్కర్": — ఈయన శాతవాహనులనుగూర్చి పరిశోధించిన వారిలో ప్రథములు. పురాణాలలో పేర్కొనబడిన 'ఆంధ్రభృత్య వంశము', శాసనాల్లోని "శాతవాహన వంశము" ఒక్కటే అని ఈయన అభిప్రాయము. "ఆంధ్రభృత్యులు" అనే శబ్దానికి "ఒకప్పుడు భృత్యులుగా ఉండిన ఆంధ్రులు" అని ఈయన అర్థం చెప్పారు. శాతవాహనులు మొదట మౌర్యచక్రవర్తులకు సామంతులుగా ఉండేవారు. "శ్రీముఖు"ని నాయకత్వాన వీరు స్వతంత్రులయ్యారు భండార్కర్ ఉద్దేశ్యంలో "ధాన్యకటకము" (లేక ధరణికోట) శాతవాహనుల తూర్పు రాజధాని.

(2) డాక్టర్ బర్గెస్: — శాతవాహనులు ఆంధ్రులేనని, వారి రాజధాని మొదట మచిలీపట్టా దగ్గరఉన్న "శ్రీకాకుళము"ని, తర్వాత 'ధాన్యకటకా'నికి మార్చుకున్నారని, ఇతని అభిప్రాయం.

(3) వి. ఏ స్మిత్: శాతవాహనులు ఆంధ్రులేనని, వారి రాజధాని శ్రీకాకుళమని ఇతని అభిప్రాయం. "ఇ. జె. రాప్సన్" కూడా ఇదే ఉద్దేశ్యంతో ఉన్నాడు.

(4) డాక్టర్ ఎల్. డి. బార్నెట్: శాతవాహనుల రాజధాని మొట్టమొదట "శ్రీకాకుళము," తర్వాత "ధాన్యకటకము," క్రీ॥ శ॥ 2వ శతాబ్ది నాటికి పశ్చిమరాష్ట్రములవున్న "ప్రతిష్ఠానపురము"— అని ఇతడు భావిస్తున్నాడు.

(5) ప్రొఫెసర్ పి. టి. శ్రీనివాసఅయ్యంగార్: ఈయన, శాతవాహనులు ఆంధ్రులేనని ఒప్పుకున్నారు కాని శాతవాహనులు తూర్పు ప్రాంతంనుండే (అంటే ఆంధ్రదేశం నుండే) అధికారంలోకి వచ్చారనే విషయాన్ని అనుమానిస్తున్నారు.

ఇక శాతవాహనులు వేరు ఆంధ్రులు వేరు-అనే అభిప్రాయం కలవారు:—

(1) డాక్టర్ సూక్తాంకర్: శాతవాహనులు-ఆంధ్రులు భిన్నులని వాదించేవారిలో ఈయన ప్రథములు. ఈ వాదానికి కారణాలు: (ఎ) ఆకాలపు శాసనాల్లో ఎక్కడా కూడా శాతవాహనులు ఆంధ్రులని పిలవబడలేదు. (బి) ఆకాలపు సమకాలీన శాసనాలైన "హాతిగుంఫ" "గిర్నార్" "భిలసంఫ" మొదలైన శాసనాల్లో కూడా "శాతవాహనులు" అనే పేర్కొనబడ్డారుగాని, "ఆంధ్రులు" అని ఎక్కడా వ్రాయబడలేదు. (సి) శాతవాహనుల ప్రాచీన శాసనాలు, నాణెములు పశ్చిమ దిక్కునలోనే లభించాయి.

కాబట్టి శాతవాహనులు ఆంధ్రులై ఉండరనీ, వారు పశ్చిమాన్నుండి తూర్పుకు వచ్చి ఆంధ్రులతో కలిసి నివసించారని "సుక్తాంకర్" యొక్క అభిప్రాయము, ఇతను "ఆంధ్ర భృత్యులు" అనే శబ్దాన్ని "ఆంధ్రుల యొక్క భృత్యులు (సామంతులు)" అని షష్ఠీ తత్పురుషలో అర్థం చేసుకున్నాడు. కాబట్టి ఆంధ్రులయొక్క సామంతులు, ఆంధ్రులే అయిఉండ నక్కరలేదు! ఏజాతివారైనా కావచ్చు!!

(2) కె. పి. జయస్వాల్: ఆంధ్ర-శాతవాహన ఏకత్వాన్ని ఈయన ఒప్పుకోలేదు శాతవాహనులు అశోకుని శాసనాల్లో పేర్కొనబడిన "శాతేయపుత్రులు" అని ఈయన వాదన.

(3) ప్రొఫెసర్ రాయ్‌చౌదరి: ఇతను కూడా సూక్తాంకర్ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాడు. "ఆంధ్ర" అనే పేరు శాతవాహన వంశంలో ఆఖరి రాజులకు వచ్చి ఉంటుందని ఇతని అభిప్రాయం.

(4) డాక్టర్ కె. గోపాలాచారి: పడమటి ప్రాంతం (అంటే మహారాష్ట్రప్రాంతం) నుండి శాతవాహనులు అధికారానికి వచ్చి క్రమంగా ఆంధ్ర దేశాన్ని కూడా ఆక్రమించుకున్నారనే వాదాన్ని ఈయన బలపరుస్తున్నారు. కాని శాతవాహనులు జాతి సాంకర్యముపొంది ఆంధ్రులయ్యారని నమ్ముతున్నారు.

ఏ శాసనంగాని, ఏ నాణెముగాని శాతవాహనులను ఆంధ్రులుగా పేర్కొనని మాట వాస్తవమే! శాసనాలలో కుటుంబం పేరు వ్రాయడం అనాటి ఆచారము. శాలంకాయనులు, బృహత్ఫలాయనులు, విష్ణుకుండినులు మొదలయినవారంతా ఈ విధంగానే తమ తమ కుటుంబాల పేర్లనే శాసనములలో వ్రాయించారు. పురాణాలలో "ఆంధ్రులు" అని వ్రాయబడిందంటే అది వారి జాతి పేరుగా గ్రహించాలి. కాబట్టి ఆ చక్రవర్తులు శాతవాహన కుటుంబానికి చెందిన ఆంధ్ర జాతివారు అంటే వారింటిపేరు (Family name) "శాతవాహనులు" జాతి పేరు (Name of the tribe) "ఆంధ్రులు". పురాణాలలో వ్రాయబడిన "ఆంధ్ర భృత్యులు" అనే శబ్దం ఒకప్పుడు భృత్యులుగా ఉండిన ఆంధ్రులు" అనే అర్థాన్ని సూచిస్తోందనడమే సముచితము కాబట్టి శాతవాహన కుటుంబీకులు ఆంధ్ర జాతికి చెందినవారని సిద్ధాంతీకరింపవచ్చును

అయితే శాతవాహనలు మొట్టమొదట ఏ ప్రాంతంనుండి అధికారంలోకి వచ్చారన్నది వేరొక ప్రశ్న! ఆంధ్రదేశంనుండే తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారని కొందరు చరిత్రకారులు, పశ్చిమ ప్రాంతం (మహారాష్ట్రదేశం) నుండి అధికారానికి వచ్చారని మరికొందరు చరిత్రకారులు భిన్నాభిప్రాయాల్ని వెలిబుచ్చుతున్నారు.

శాతవాహనులు పశ్చిమ దిక్కునుండి అధికారం లోకి వచ్చారనడానికి ఆధారాలు:—

(1) శాతవాహనుల శాసనాలు పడమటదిక్కునున్న "నానఘట్", "నాసిక్" ప్రాంతాల్లోనే లభిస్తున్నాయి గాని, ఆంధ్రదేశంలో లభించడం లేదు.

(2) కళింగదేశాన్ని పాలించిన "ఖారవేలుడు" అనే రాజుయొక్క శాసనంలో అతని సమకాలికుడైన శాతకర్ణి రాజ్యం కళింగకు పడమటి దిక్కుగా ఉన్నట్లు సూచింపబడింది. ఆంధ్రదేశం కళింగదేశానికి దక్షిణదిశగా ఉంది కాని పశ్చిమ దిశను లేదు.

(3) గౌతమీపుత్ర శాతకర్ణి తల్లియైన "గౌతమీ బాలసిరి" వ్రాయించిన శాసనాల్లో ఆమె కుమారుని రాజ్య పరిహద్దులు పేర్కొనబడ్డాయి. అవి ఆంధ్ర దేశంలోని ఒక్క ప్రాంతాన్ని కూడా సూచించడం లేదు.

(4) ఆంధ్రదేశంలో లభించిన మొదటి శాసనాలు గౌతమీపుత్రుని తరువాతి రాజైన వసిష్ఠీపుత్ర శ్రీపులుమాని" పాలననే సూచిస్తున్నాయి. కాబట్టి

మొట్టమొదట శాతవాహనులు పశ్చిమ దిక్కునుంచే అధికారంలోకి వచ్చి క్రమంగా ఆంధ్రదేశాన్ని కూడా ఆక్రమించుకున్నారు.

కాని పై వాదనంతా ఏవో కొన్ని శాసనా లిచ్చే అసంపూర్తి అంశాలమీదే ఆధారపడిఉంది. ఆ వాదనంతా పూర్వపక్షం చేసే అంశా లెన్నో ఉన్నాయి.

(1) శాతవాహనుల ప్రాచీన శాసనాలు పడమటి దిక్కునుంచే లభించినవన్నమాట నిజమే కాని లభించిన శాసనాలు రెండు మాత్రమే! గౌతమీ పుత్ర శాతకర్ణికి పూర్వం పాలించిన శాతవాహన రాజులు ఇరవైమంది అయితే రెండు శాసనాలమీదే ఆధారపడి వాదించడం శోచనీయం. మిగిలిన శాసనా లేవైనా మనుముందు ఆంధ్రదేశంలో లభించవచ్చునేమో!

(2) ఖారవేలుని శాసనం, శాతకర్ణి రాజ్యము కళింగకు పడమటి దిక్కున ఉన్నట్టు మాత్రమే సూచిస్తోంది కాని, శాతకర్ణి రాజ్యానికి ఆంధ్రదేశానికి ఏవిధమైన సంబంధం లేదని తెల్పడంలేదు

(3) ప్రాచీన చక్రవర్తియైన శాతకర్ణి యజ్ఞయాగాదు లనేకం చేసినట్టుగాను, "దక్షిణాపథపతి" అనే బిరుదాన్ని గలిగియున్నట్టుగాను 'నానాఘట్' శాసనాన్ని బట్టి తెలియవస్తోంది ప్రాచీన శాతవాహన రాజులు (అంటే గౌతమీపుత్ర శాతకర్ణికి పూర్వ రాజులు) ఆంధ్రదేశాన్ని పాలించి ఉండకపోతే "దక్షిణాపథపతి" అనే బిరుదు ఎలా సార్థకమౌతుంది?

(4) "పెరిప్లస్" గ్రంథకర్త "దచ్చినబైడ్స్" (Dachinabides), "లిమిరైక్" (Limyrike) ప్రదేశాల్లో ఉన్న వర్తక పట్టణాలనుగురించి వ్రాశాడు. 'దచ్చినబైడ్స్' అంటే దక్షిణాపథము 'లిమిరైక్' అంటే అమరదేశము. ప్రాచీనాంధ్ర దేశంలో వర్తకానికి ప్రసిద్ధికెక్కిన పట్టణా లెన్నో ఉన్నాయి!

(5) శాతవాహన చక్రవర్తియైన 'హాలుడు' "గాథాసప్తశతి" అనే గ్రంథాన్ని రచించాడు. ఆ గ్రంథంలోని ఒక గాథలో ఈవిధంగా పేర్కొనబడింది: "సిరిసంపదలలోను, నీతిలోను శాతవాహనుల రాజధానితో తులదూగే మరొక రాజధానం, గోదావరినది పుట్టి, ప్రవహించి, సాగరంలో కలిసిపోయే విశాలదేశంలో ఎక్కడాలేదు!" అఖండ గోదావరి పరవళ్లు త్రొక్కే దేశం ఆంధ్రదేశం కాక మరేదేశం?

(6) "లీలావతీ పరిణయము" అనే ప్రాకృత గ్రంథంలో "సప్తగోదావరి" తీరాన "హాలుడు" 'లీలావతిని' వివాహం చేసుకున్నట్లు ఒక కథ ఉంది. "సప్తగోదావరి" అనేది నేడు తూర్పుగోదావరి జిల్లాలోని దాక్షారామందగ్గర ఉన్న ఒక చెరువుతో పోలుస్తున్నారు.

కాబట్టి శాతవాహనులు ఆంధ్రదేశంనుండి అధికారంలోకి రాలేదనడం మిక్కిలి సత్యదూరం! ఆంధ్రదేశానికి శాతవాహనులకీ సంబంధమే లేదనడం కేవలం పొరపాటని వేరే చెప్పనక్కరలేదు!! పడమటను క్షాత్రపులు బలవంతులై నప్పుడు, శాతవాహనులు పశ్చిమతీర ప్రాంతాన్ని కోల్పోయారు. కాని గౌతమీపుత్రుడు క్షాత్రపుల నోడించి పశ్చిమప్రాంతాన్ని తిరిగి సంపాదించాడు. అందుచే అతని పుత్రుడు "పులమావి" తిరిగి "దక్షిణాపథేశ్వరుడు" అనే బిరుదాన్ని వహించాడు. అందుచేత, శాతవాహనులు ఆంధ్రదేశంతోసహా దక్షిణదేశాన్నంతటినీ పాలించిన చక్రవర్తుల నేది నిస్సందేహమైన విషయం!

ఇక మిగిలిన వివాదాంశ విషయం శాతవాహనుల రాజధానిని గురించినది. శాతవాహనుల ముఖ్యపట్టణం "శ్రీకాకుళము" అని కొందరు, "ధాన్యకటకము" (లేక 'ధరణికోట') అని మరికొందరు, "ప్రతిష్ఠాన పురము" (లేక 'పైఠాన్') అని కొందరు భావిస్తున్నారు. 'శ్రీకాకుళము' రాజధాని అనడానికి కేవలం కథలే ఆధారం కాబట్టి దానిని నమ్మలేము. బహుశా, 'ధాన్యకటకము' మొదటి రాజధానిగా ఉండిఉండేది శాతవాహన రాజులు మహారాష్ట్ర దేశాన్ని జయించిన తర్వాత, విశాలదేశాన్ని పాలించడానికి తూర్పున ధాన్యకటకం ఒక్కటే చాలదు కాబట్టి, మరొక రాజధాని కూడా అవశ్యకమై ఉండిఉంటుంది. అప్పుడు ప్రతిష్ఠానపురాన్ని పశ్చిమ రాజధానిగా చేసుకుని ఉంటారు. విదేశీయుల దండయాత్రలు, ముఖ్యంగా గ్రీకుల దండయాత్రలను అరికట్టడానికి, శాతవాహనులు ప్రతిష్ఠానపురాన్ని శాశ్వతరాజధానిగా చేసుకుని ఉంటారు.

పురాణాల్లో పేర్కొనబడిన "ఆంధ్ర భృత్యులు" అనే శబ్దానికి "ఒకప్పుడు భృత్యులుగా ఉండిన ఆంధ్రులు" అనే అర్థమే సముచితం. దీనినిబట్టి శాతవాహనులు మొదట మౌర్యులకు సామంతులుగా ఉండేవారని తెలుస్తోంది! అశోకుని ఒక శిలాశాసనంలో (Asokas Rock edict—13) శాతవాహనులు మౌర్యులకు సామంతులుగా పేర్కొనబడ్డారు. అశోకుని నిర్యాణానంతరం, శాతవాహనులు "శ్రీముఖుడు" అనే వాని నాయకత్వాన స్వతంత్రులయ్యారు!! ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్రకు నాందీ ప్రస్తావన జరిగింది!!

కుమారసంభవ సంస్కరణము

శ్రీ నే. వెంకటరమణయ్య

శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రిలవారు నన్నెచోడుని కుమారసంభవములోని పద్యములను కొన్నిటిని సంస్కరించి వెంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ త్రైమాసిక, సం 8 సంచిక 1 (తెనుఁగు పు ౯౯-౧౩) లోఁ బ్రకటించియున్నారు. అందు కొన్ని సంస్కారములు ఆవశ్యకములే యను సంశయము పొడమినది. కలిగిన సంశయములను నివృత్తి చేసికొనుటకై వాని నిచ్చట తెలియఁబఱచుకొనుచున్నాఁడను.

శ్రీ శాస్త్రిలవా రిట్లు వ్రాసియున్నారు: "కవి హృదయము...గోచరింపఁగా నాకది నాకుఁ గలకౌతుకము చేసినాఁడన్న సంతోషమునఁ దోఁగినాఁడను. మఱికొన్ని;

ఆయవనీరుహోద్గతి ల
తాంతవివర్తిత సౌంధ్రప్రవా
హాయతి పాంద్రమై ఫలిత
మై యొగి బర్వఁగ డాయఁబోవనం
బాయమురాక చుట్టి మధు
పవ్రజమాలికలుం డెనొప్పి పు
ష్పాయుధుకోలఁజొట్టు మఱు
డాయసవ్రపము పెట్టినట్టిదై.

ని (?) కుమారసంభవము 298 ప

"దీనికి నా సంస్కరణము:

ఆయవనీరుహోద్గతి ల
తాంతవిసర్గత సౌంధ్రప్రవా
హాయతి పాంద్రమై ఫలిత
మై యొగిఁబర్వఁగ డాయఁబోవనం
బాయమురాక చుట్టి మధు
పవ్రజమాలికలుం డెనొప్పి పు
ష్పాయుధశాలఁజొట్టు మధుఁ
డాయసవ్రపము పెట్టినట్టులై.

"పుష్పాయుధశాల కధికారియైన వసంతుఁడా యాయుధశాలలోని కెవరికిని రాకపోకలు వీలు లేకుండుటకు చుట్టును నిమునకోట పెట్టినట్లు భృంగమాలికలు పూలచెట్లను జుట్టియున్నవి—పూచినచెట్లు పుష్పాయుధశాలలు—మధుఁడు ఆదధి వేత — ఇందులోఁ బుష్పాయుధుకోల, మఱఁదు ఉండుట యసంగతము."

సంస్కరించుటకై శ్రీ శాస్త్రిలవా రుదహరించిన పద్యము శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి ముద్రిత ప్రతినుండి గ్రహింపఁబడినది. కాని కవిగారి ముద్రిత ప్రతిలో నీ పద్యముయొక్క రెండవపాదము 'హాయతి పాంద్రమై ఫలితమై మొగిఁబర్వఁగ' అని ముద్రితమై యుండఁగా దానిని 'యొగిఁబర్వఁగ' అని శాస్త్రిలవా రేలయుదాహరించిరో తెలియదు. వ్రాతప్రతియందును? మొగింబర్వఁగ' అని యే కానవచ్చుచున్నది. 'యొగిం బర్వఁగ అనుపాఠము శ్రీ శాస్త్రిలగారి కెచట లభ్యపడెనో? ఇది 'నా సంస్కరణము' జేరదుకదా. పుష్పాయుధుకోల' యసంగతమని 'పుష్పాయుధశాల' అని సవరించినారు. 'పుష్పాయుధుకోల' పుష్పాయుధుని యొక్క అనఁగా మన్మథునియొక్క కోలయని గ్రహింపవలసియుండును, కాని ఈ సంస్కరణముల కవి యొక్క భావము తెల్లముగాదు. ఈ సంస్కరణము పైని వ్యాఖ్యయందు శ్రీ శాస్త్రిలవారు చెప్పినట్లు 'పుష్పాయుధశాల' (అనఁగా పుష్పములనెడు ఆయుధములను నిక్షిప్తము జేసియుంచిన శాల) అని సవరింప వలయును. మఱియు, 'మఱఁదు' ఉండుట యసంగతమని చెప్పి 'మఱఁదాయసవ్రపమును', 'మధుఁడాయసవ్రపము' అని మార్చి, ఈ మార్పును సమంజసమని రాజసీయుట కిట్లు వాదించియున్నారు. పుష్పాయుధశాల కధికారి మధుఁడు, 'పూచినచెట్లు పుష్పాయుధశాలలు, 'మధుఁడు ఆదధికేవత' కావున యతఁడాయసవ్రపము పెట్టినటుల యుక్తము అని. మధుఁడు మరుని దళవాయి కాని యాయుధాగారాధ్యక్షుఁడు గాఁడు అట్లని యనుటకు ప్రమాణమేమియును గానరాదు. సేనాపతిత్వమును నాయుధాగారాధ్యక్షత్వమును వేర్వేఱు పనులు గాని యొక్కటి కావు. ఇట్లని యర్థశాస్త్రగ్రంథములవల్ల తెలియవచ్చుచున్నది. 'పుష్పములను' ఆయుధములుగ బ్రయోగించువాఁడు మరుఁడు—వానిని సంరక్షించుకొనవలసినవాఁడు వాఁడే. కావున తన యాయుధశాలకు మఱఁదాయసవ్రపము పెట్టినటుల సుసంగతముగుఁ గాని యసంగతము గాదు.

ఈ పద్యమును సంస్కరించి సవ్యాఖ్యానముగఁ బ్రకటించిన శాస్త్రిలవారు దీని ద్వితీయపాదమందలి 'ఫలితమై' యను మాటయొక్క సందర్భోచితిని విశదీకరించి యుండిన పాఠకుల కృతజ్ఞతకు తోధికముగ పాత్రులయ్యుండెడివారు. ఫలితమెవ రెట్టి? 'ఆ యవనీరుహోద్గత లతాంత విసర్గత సౌంధ్రప్రవాహాయతి'యా? సౌంధ్రప్రవాహాయతి సాంద్రమగుట యొప్పును? ఫలితమగుట యెట్లు? ఒకవేళ అనువదించినను అర్థమేమి? సాంద్రమగుటచే డాయఁబోవ సాధ్యపడదయ్యె—ఫలితమగుటచే బాయఁజాలక పోయెనని కదా చెప్పవలయును. ఇది యెట్లు పొసఁగును? మధు

పములు గంధలుబ్ధలనియు మధుగ్రహణమునకై వి-
వృత లతాంతములకు మూలవనియు సుప్రసిద్ధి—ఫల
ముల నారగించుట కొండె రసాస్వాదనము కొండె
చెట్లకరి మూలవరి యొంగును గావరాదు. ఇఁక 'ఫలి
తమై' యను మాట వినట నెట్లర్థము చేసికొన
వలెయును?

మఱియొక పద్యమునందు గూడ శ్రీ శాస్త్రిల
వారి సంస్కరణ మనాకర్షణముగఁ దోఁచుచున్నది.
కుమారసంభవ ప్రథమాశ్వాసము 2 వ పద్యమున
వినాయక వర్ణన ఇట్లు కానవచ్చుచున్నది.

తను నసితాంబుదంబు సిత
దంతి యుగం బచిరాంశు లాత్మగ
ర్జన మురు గర్జనంబు గరి
స్రుచి శక్రశరాసనంబునై
చనమునివారి వృష్టిహిత
సస్య సమృద్ధిగ నర్థి వేలనాఁ
జనుగణనాథుఁ గొల్తునవి
తంబు నభీష్ట ఫలప్రసిద్ధి గాన్.

ఇది సరికాదని శ్రీ ప్రభాకరశాస్త్రిగారి యభి
ప్రాయము—తమ యభిప్రాయమునకు గారణము నిట్లు
వివరించియున్నారు. "విఘ్నేశ్వరుఁ డేకదంతుఁడు.
కాన 'సితదంతియుగం' బనియుండరాదు. అచిరాం
శువు=మెఱుపు. అది ఉపమానము కాన యప్పుడప్పుడు
మాత్రమే కన్పడునదిగా నుండవలెను 'సితదంతముఖం
బనుటలో నోరు తెఱచినప్పు డగపడుట మూసినప్పు
డగపడకుండుట దంతాగ్రమునకు కలిగి యచిరాంశు
సామ్యము సిద్ధించును" కావున. "దీనికి నా సంస్క
రణము.

తను నసితాంబుదంబు సిత
దంతిముఖం బచిరాంశువాత్మగ
ర్జన మురుగర్జనంబు గరి
స్రుచి శక్రశరాసనంబునై
చన మదివారి వృష్టిహిత
సస్య సమృద్ధిగ నర్థి వేలనాఁ
జను గణనాథు గొల్తునవి
తంబు నభీష్ట ఫలప్రదాతగాన్.

'కవి హృదయము' నెఱింగి 'తెలుఁగు కావ్య
ములు'ను దెలిసి శ్రీ శాస్త్రిలవారు చేసిన మార్పు
లనాకర్షకములని చెప్ప సాహసించుచున్నాఁడ.
మొదట విచారింపఁదగినది "దంతిముఖము". 'దంతి
ముఖం బనుటలో నోరు తెఱచినప్పు డగపడుట మూసి
నప్పు డగపడకుండుట దంతాగ్రమునకు కలిగి యచి
రాంశు సామ్యము సిద్ధించును" అని వచించిరిగదా
శ్రీ శాస్త్రిలవారు. విఘ్నేశ్వరుఁడు గజాననుఁడుగదా
ఏనుఁగు నోరు తెఱచిన జేమి మూసిన నేమి? దంతము లెప్పు
డును గనఁబడకుండుట ఎల్లరు నెఱింగినవిషయమే.
ఇఁక దంతిముఖమున కచిరాంశుసామ్యమెట్లు సిద్ధించును?
రెండవది ఏకదంత విచారణ: విఘ్నేశ్వరున కేకదంతుఁ
డని పేరుండుట నిశ్చయమే. ఎవ్వరును కాదనలేరు.
అజన్మప్రభృతి యెల్లప్పుడు నితఁ డేకదంతుఁడుగనే
యుండెనా? లేక కారణాంతరములవలన నేకదంతి
త్వము మధ్య సిద్ధించెనా యనుట విచారణీయాంశము.
పౌరాణిక గాథలను పరిశోధించి చూడఁగా గజాననుని
కన్నియెడల మొదట రెండు దంతములుండె
ననియు కాలక్రమమున నొకటి భగ్నముకాగా
తత్కారణమున నేకదంతుఁడను పేరు వచ్చెననియు
దెలియుచున్నది. ఒకానొకప్పుడు పార్వతీ పరమేశ్వ
రులు రహస్యక్రీడ సల్పుచుండ విఘ్నేశ్వరుని నెవ్వరిని
లోనికి రానీయకుండుటకై ద్వారమున కాపరిగ
నియమించిరట. అప్పుడు పరమేశ్వరుని దర్శించుటకై
పరశురాముఁడు వచ్చి విఘ్నేశ్వరుఁడు ద్వారము
నరికట్టఁగా కోపించి తన పరశువుచే నతనిదంతము
భేదించెననియు నాటినుండియు నతఁ డేకదంతుఁ
డాయెననియు బ్రహ్మాండపురాణమునందు జెప్పి
యున్నది ఇంతకంటె సుప్రసిద్ధమైన కథ మఱియొకటి
యున్నది కానవచ్చుచున్నది ఒకానొకప్పుడు
వినాయకుఁడు పొట్టనిండ మోదకాదులను భుజించి
పోవుచుండఁగా మార్గమధ్యమున కాలుతప్పి డెవనియు
తత్కారణమున మోదకభరితమైన పొట్టపగులగా
కుడుములను పోనీయక చేతితో పిసికిన పొటమట్టుకుని
తండ్రికై తిరుగుచుండఁగా చూచి చంద్రుఁడు నవ్వె
ననియు నందులకు గినిసి విఘ్నేశ్వరుఁడు దనదంతముల
యం దొకదాని గొనమునితిచి చంద్రునిపై వేసెననియు
దెలియుచున్నది. ఈ రెండవ యైతిహ్యమును బట్టి
చూడఁగా ఏకదంతుఁడను పేరు కలిగినను నతనికి
రెండుదంతములు లేక పోలేదనియు రెండవది
భగ్నమైనను సంపూర్ణముగ విలుగ లేదనియు
దెల్లమగుచున్నది. ఈ కథయే భారతదేశమునం దెల్ల
యెడలను ప్రాచీనకాలమునుండియు వాడుకయం
దుండెనని మన దేవాలయములయందును అన్యస్థలముల
యందును గానవచ్చెడు విఘ్నేశ్వర ప్రతిమలు రుజువు
చేయుచున్నవి. ఏకదంతిముగల విఘ్నేశ్వర ప్రతిమ

యెంగున గానరాదు. అన్నియు దంతయుగళము తోడనే చెక్కఁబడియున్నవి; కాని యందొకటి సంపూర్ణమైనది; మరియొకటి చివర తునిసినది. కావున నన్నెచోడదేవ్రుఁడు 'సితదంతియుగం' బని చెప్పుట తప్పుకాదు. దీనిని సంస్కరింపవలసిన యవసరము లేదు

మఱియొక సంస్కరణము. కుమారసంభవము ఆ ౧ ప ౪౧ వ్రాతప్రతియందిట్లు కానవచ్చుచున్నది

మదమున .... కావ్యము
నదిరంగ విలుకాని పట్టినమ్ములుం బరహృ
ద్భిదమై తిలయూపింపని
యది కావ్యమె మరి పట్టిందియుఁ గరమే

శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారీపద్యము నిట్లు సంస్కరించి ముద్రించిరి.

మదమున సత్కవి కావ్యము
నదరంగ విలుకాని పట్టినమ్ములును బరహృ
ద్భిదమై తల యూపింపని
యది కావ్యమె మలరిపట్టినది యుంగరమే.

ఈ సంస్కరణము శ్రీ ప్రభాకరశాస్త్రిలవారికి నచ్చలేదు. "దీనికి నా (అనఁగా, ప్రభాకర శాస్త్రిల వారి) సంస్కరణము" ఇట్లు:

మదమునఁ గవికృతి కావ్యము
నదరున విలుకాని పట్టినమ్ములును బరహృ
ద్భిదమై తలయూపును, బెఱ
యది కావ్యమె చెప్పఁ, బట్టనదియుం గరమే

మొదటి చరణములోని లుప్తభాగమును 'కవి కృతి' యనుమాటలను జేర్చి 'కవికృతి కావ్యము' అని చరణమును బూర్తి చేసిరి — 'కృతి' యనుమాటకు గావ్యమను నర్థము గలదని యందఱు నెఱింగిన విషయమే — 'కవికృతి కావ్యము' ఇందుకలన పునరుక్తి దోషదూషితము గుచున్నది — 'సత్కవి' యను రామకృష్ణకవిగారి సంస్కరణమె సమంజసమని తోఁచుచున్నది — మఱియు నన్నెచోడుఁడు ౧. ౩౪ వ పద్యములో

"పరఁగ సువర్ణ బంధమ్మును
భావముగల్గియు లోనుమాసఁగా
బొదవు చిత్రరూపమును
బోలెను సత్కవి కావ్య మిమ్మహిన్
బరఁగు సువర్ణ బంధమ్మును
భావవిశేష......లన్
పరితుల రత్నపు
త్రికయు సత్కవికావ్యము నొక్కరూపమై.

"అసత్కవికావ్యము" "సత్కవికావ్యము" అని ప్రయోగించియున్నాఁడు. కావున "మదమున...... కావ్యము" అను కందపాదములోని గ్రంథపాతమును "మదమున సత్కవికావ్యము" అను రామకృష్ణకవిగారి సవరణ నన్నెచోడుని రచనాపద్ధతి ననుసరించి చేయఁబడినదగుటచే యుక్తమని తోఁచుచున్నది. మఱియు శ్రీ శాస్త్రిలవారు సంస్కరణ వ్యాజమున నీ కంద పద్యముయొక్క ఉత్తరార్థము నన్నెచోడుని రచనను దొలగించి తమ కవిత్వమును జొప్పించిరి — వ్రాతప్రతిని బట్టి ముద్రితమైన పద్యము చక్కఁగనే యన్వయముగు చున్నదే — ఇందు "పరహృద్భిదమై తల యూపింపని యది" అను వాక్యము కావ్యమునకును శరమునకును సామాన్యము — "మదమున సత్కవికావ్యము, పరహృద్భిదమై తల యూపింపని యది, కావ్యమె!" "అదరంగ విలుకాని పట్టినమ్ము, పరహృద్భిదమై తల యూపింపని యది, శరమే (అమ్మే)?" సంగ్రహీకరణము అనఁగా చెప్పఁదలఁచిన విషయమును కొద్దిమాటలతో జెప్పుట చోడనికి గరము ప్రియము. కావున శ్రీ శాస్త్రిలవారి సంస్కరణ యనావశ్యకమని చెప్పవలసి వచ్చినది. కాని ఈ కందపద్య చతుర్థపాదము ముద్రితగ్రంథమున నిట్లు కలదు: "యది కావ్యమె అలరిపట్టినది యుంగరమే" వ్రాతప్రతియందీ పంక్తి 'యదిగావ్యమె మరిపట్టినది యుంగరమే' అని యున్నది. ఇది 'మరి' మధ్య 'ల' కారమును జొప్పించి 'మలరిపట్టినది యుంగరమే' అని శ్రీ రామకృష్ణ కవిగారు సంస్కరించి ముద్రించిరి. "మలరు" శబ్దమున కీ సందర్భమున నేమి యర్థమో వారు తెలుపరైరి — 'మలరు' అను క్రియాపదము కలదేమో తెలియదు — అట్టి ప్రయోగము లెవ్వటను గానరావు — నిఘంటువులయందు చెప్పటను లేదు-'మరి' అను మాటను 'మలరి' అని సంస్కరించుటకంటె 'మఱియు' అని సంస్కరించుట యుక్తము-'కరమే' యనుటకంటె 'శరమే' యనుట సాధ్యము — ఈ సవరణను ఇంతకుముందు కొందఱు పండితులు చేసియున్నారు. ఇప్పుడు శ్రీ శాస్త్రిలవారి యాదరణకది పాత్రమైనది.

గ్రంథ విమర్శనము

ఆంధ్ర తులసీరామాయణము

[బాలకాండము]

రచన: శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తి, ప్రాప్తిస్థానము: రచయిత, కృష్ణంపాలెం, ఎర్నగూడెం పోస్టు, పశ్చిమగోదావరి జిల్లా, మూల్యం రు. 2-8-0.

"హిందీ భాషలో వున్న సాహిత్య మేమిటి?" అని హిందీ ప్రచారవ్యతిరేకులు యెవరేనా ప్రశ్నించగానే వెంటనే ప్రచారకులనుంచి వచ్చే తుపాకి గుండులాంటి సమాధానం—"తులసీదాసు రామాయణం చదివావా?"—ఆ ఒక్క సమాధానంతో హిందీ భాషకు మహత్తరమైన సాహిత్య సంప్రదాయముందని ఒప్పుకు తీరవలసివస్తుంది. ఉత్తర హిందూస్థానంలో వాల్మీకి రామాయణాని కంటే తులసీ రామాయణానికి ఎక్కువ వ్యాప్తివుంది. హిందీ మాతృభాష గాగల ప్రతి ఒక్కరూ తులసీరామాయణం తమదని చెప్పుకుని గర్వపడతారు. ఇంటింటా యీ గ్రంథాన్ని నిక్షేపించుకొని పూజించి పఠించుతారు. తెలుగు జాతిలో పోతనగారి పద్యాలు ఎలా ఆబాలగోపాలంలోనూ వ్యాపించి వున్నాయో, హిందీ ప్రజానీకంలో తులసీదాసు రామాయణ కీర్తనలు అలా వ్యాపించి వున్నాయి. ఈ సామ్యాన్ని గమనించే శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తి గారు పోతన గొంతుతో పద్యానువాదంగా తెలుగు ప్రజలకు అందజేయ ప్రయత్నించారా అనిపిస్తుంది. నిజానికి ఈ పద్యరచన పోతన గొంతు వలెనే వినిపించుతోంది. అందుకు శ్రీ సూర్యనారాయణమూర్తి గారిని అభినందించవలసివుంది. కాని తులసీదాసు గారు 'రామచరిత మానసము'ను సోరఠా, చౌపాయి, దోహా మొదలైన గేయఛందస్సులలో, స్త్రీ బాలవృద్ధులు కలసి రామచరితను బృందగానం చేసి ఆనందపరవశులు కావటానికి అనువుగా రచించారు. అలాంటి అవకాశంవుండేలాగు శ్రీ సూర్యనారాయణమూర్తి గారు ఈ గ్రంథాన్ని అలాంటి గేయఛందస్సులలో ఎందుకు అందించారుకాదా అని ఒకింత కొరత కలుగుతోంది. శ్రీ సూర్యనారాయణమూర్తిగారు ప్రతిభాసంపన్నులనే విషయం ఈ గ్రంథమే విస్పష్టం చేస్తోంది. అందుచేత వారు గేయరచనగా దీన్ని రచించ దలచివుంటే అది వారికి కష్టసాధ్యమైన పనిగాదు ఏది యేమైనా మూర్తిగారికి అట్టిసంకల్పమేలనో కలుగలేదు. దానికి తగచి ప్రయోజనంలేదు. వారు అందజేసిన అనువాదంయొక్క గుణాగుణాలనే పరిశీలించి మనం సంతృప్తులం కావలసివుంది.

వాల్మీకి రామాయణానికీ, తులసీ రామాయణానికీ చాలా వ్యత్యాసముంది. రామచరితను సృష్టించటంలో వాల్మీకి దృష్టి వేరు. శ్రీరాముని వాల్మీకి ఆదర్శప్రాయుడైన అర్షప్రభువుగా వ్యక్తీకరించటానికి ప్రయత్నించినంతగా, భగవదవతారంగా వ్యక్తీ

కరించటానికి ప్రయత్నించలేదు. దర్శనీయానికి యిచ్చినంత ప్రాధాన్యత భక్తిసంప్రదాయానికి యివ్వలేదు. గుహుడు, శబరి మొదలైన ఘట్టాలలో తప్ప భక్తిరసం మనస్సును ముంచెత్తదు. వాల్మీకిరచన మానవహృదయాన్ని ధర్మాచరణ సంపన్నము చేయటానికి ప్రయత్నించుతుంది. వాల్మీకి ఆర్ష ధర్మప్రచారకుడు. తులసీదాసు గారు పరమభక్తుడు. ఆయన హృదయం భక్తిరసాన్ని మధురవాహినులుగా వెలార్చుతుంది. అందుచేతనే తులసీదాసుగారు 'రామచరితమానసము' వాల్మీకి శ్లోకము గాక అధ్యాత్మరామాయణపంథాలో నడిపారు. ఆంధ్ర వాఙ్మయంలో తులసీదాసుతో పోల్చదగిన భక్తిరసపరవశుడు పోతన. రచనలో జీవితానికి కూడా పోతనను లక్ష్యప్రాయునిగా ఎంచుకున్నవారు శ్రీ సూర్యనారాయణమూర్తిగారు పోతనవలెనే చిన్న పల్లెటూరులో కర్షకవృత్తి నవలంబించి నిరాడంబరంగా జీవించుచున్నారు. పూర్వజన్మసంస్కారంగా లభించిన కవితాప్రతిభను భగవచ్చరితమును గానంచేయ్యటానికి వినియోగించి, రామచరితమానసము ఏడుకాండలనూ 8 వేల పద్యాలలో సంఘటించి చరితార్థులయారు. 14 వందల పద్యాలకు పైబడిన ఈ బాలకాండ ఇప్పుడు ప్రకటించి అందజేశారు. ఆంధ్ర ప్రజల ఆదరాభిమానాలతో మిగతా కాండలు కూడా త్వరలో వెలువడగలవని ఆశించుచున్నాము.

ఇప్పటికి 30 సం॥ రాలకు పూర్వం శ్రీ భాగవతుల నరసింహశర్మగారు ఈ తులసీ రామాయణానికి స్వేచ్ఛానువాదం చేసి ప్రకటించారు. ఆ గ్రంథానికి పీఠిక వ్రాస్తూ కీ. శే. నాగేశ్వరరావు పంతులుగారు: 'మూలానుసారముగ గూడ ననువదించిన తులసీదాసుని యభిప్రాయములను యథాతథముగ దెలిసికొనుటకు వీలుండెడిది' అన్నారు. శ్రీ సూర్యనారాయణ మూర్తిగారి అనువాదం పూర్తిగా మూలాన్ని అనుసరించుతూ వుండటంచేత ఆ కొరత తీర్చుతున్నది.

ఉ॥ చల్లని తండ్రి కూతురకు
చల్లనితల్లి నోకర్త సామెయిం
జల్లనివల్లి నింకొకతె
సమ్మతి నౌదలదాల్చి, భూమిగా
జల్లనకెల్ల యెల్లయగు
చంగున దాల్చి, కృపారసంబు పై
జల్లెడు జల్లునల్ల పర
మేశుడు చల్లనికంట జూచుతన్.

ఉ॥ జల్లనివాడు నాభినళి
నమ్మున బమ్మను గన్నవాడు, జా
బిల్లియనుంగు జెల్లెలిని
జేర్చి యురమ్మున గొన్నవాడు, నా
పెల్లగు పాలవెల్లిపయి
వేయిమొగంబుల పాపపాన్పునం
జల్లగ బండి లోకముల
సాకెడు నా హరి మమ్ము బ్రోవుతన్.

ఉ॥ అమ్మకునమ్మ, యమ్మకుని
యమ్మ జగమ్ముల బ్రోచుకొమ్మ, లో
కమ్ముల పట్టుకొమ్మ రఘు
కాంతుని కూరిమి ముద్దుగుమ్మ, నీ
తిమ్మ హితమ్మ గూర్చి యన
యమ్మనయమ్ము లడించి బ్రోవుతన్.

ఇష్టదేవతాస్తుత్యాదికములోని పైమూడు పద్యాలనూ తిలకించితే శ్రీ సూర్యనారాయణ మూర్తిగారు పోతన రచనావిధానాన్ని ఎలా పుణికిపుచ్చుకున్నారో బోధపడిపోతుంది.

"నా శిష్టాడంబరలాలస యొక్కకతో మానసామృత శివాసుల రసాస్వాదనయున కడ్డు తగిలి, వారి స్వాంతప్రశాంతికి భంగము కలుగును. అట్టి నా యవభిజ్ఞతాదోషములు మూలకారున కోపాదింపక నాకే వినుచెదరు గాక యని మానసాభిజ్ఞుల వేడికొందును' అని శ్రీ సూర్యనారాయణమూర్తిగారు విన్నపములో తెలిపారు. ఈ వాక్యాలు రచయిత వినయ శీలత్వానికి తార్కాణములుగా గ్రహించదగినవే గాని వేరు కాదు.

శబ్దార్థములనుబంధించుటలో రచయిత సిద్ధహస్తుడు రస దర్శి గుడైనవాని శబ్దాడంబరలాలస వెకిలితనంగా పరిణమించుతుంది గాని రసద్రష్టయైన కవి వాక్కు శబ్ద జాలంగా వెల్లివిరిస్తే అందుకు ఆక్షేపణ ఏముంది? ఒక్క సంస్కృతి శబ్దజాలాన్ని చాలనం చెయ్యటంలో నేగాదు, తెలుగు నుడికారాన్ని కూడా ముత్యాల పేరులుగా సంతరించుకురాగలరు. పరమేశ్వరుణ్ణి ప్రేమించుచున్న పర్వతరాజపుత్రికి మహర్షులు ఎక పక్క చూడుతున్న ఈపద్యమెంత ముచ్చటగావుంది!

"ఉండ కొంపలేదు, పండ పాన్పును లేదు
బంచె తోలు చట్టుబంచకొని
బుస్సకొట్టు విషపుబుసవు సొమ్ములవాడు
దిసమొలాడు, కాట దిరుగువాడు."

తులసీరామాయణం భక్తిభావ ప్రచారానికి ఉద్దేశింపబడిన గ్రంథం గనుక భాగవతంలోని భగవల్లీలల వర్ణనాలలో దీల్లోకూడా అలాంటివి అనేకం ఉల్లేఖించారు. బాలకృష్ణుడు యశోదకు చూపినట్లే శ్రీరాముడు కౌసల్యకు విశ్వరూపం చూపిన ఘట్టం వుంది. పోతన విశ్వరూపవర్ణన చదివిజూచి ఆనందించిన పాఠకులకు మూర్తిగారి విశ్వరూప వర్ణనకూడా చదివి చూపాలని ఉత్సాహంగా వున్నది:

'అంతం గన్గొనె గోపలేశసుత పు
త్రాస్యంబునన్ భూమి భృత్
కాంతార క్షితి సింధులన్ రవిశశాం
క బ్రహ్మ శర్వాళి సం
తతిన్ భీతిని జేతులోగుకొను మా
యన్ మాయకాధీనుడౌ
భ్రాంతాత్ముం జెడు జీవునిన్ భ్రమము జి
త్రం బొత్తరింపగ మదిన్'

కాంచెను కాలకర్మముల
గాంచె గుణంబు స్వభావమందునన్
గాంచెను జీవమాయలను
గాంచెను గాంధర్వ గర్భ ముఖ్యులం
గాంచెను జీవు మాయయను
కట్టెడిబాపుదు శ్రోమ భక్తినిం
గాంచెను ముస్నెవండు బోష
గాంచి రోలుంగని చిత్రజాలమున్.'

ఆంధ్ర తులసీరామాయణం పోతన భాగవతం వలెనే ఆంధ్ర ప్రజల ఆదరాభిమానాలను చూరగొన గలదని విశ్వసించుతున్నాము. తె. నూ.

యాత్రా మార్గదర్శి
[ద్వితీయ భాగము]

రచన: శ్రీ రాగం వెంకటేశ్వరు; ప్రకాశకులు: శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘము, గుంటూరు, అనుబంధములతో సహా 500 ల పుటలుగల గ్రంథం; వెల 4.0.0.

లోగడ వారు ప్రకటించిన యాత్రామార్గదర్శి (దక్షిణ భారత యాత్రికుల పరిమితమైన ప్రథమ భాగం, ఆంధ్ర ప్రజల ప్రశంసల నందుకున్నది. ఇప్పుడు ఉత్తర భారత యాత్రలకు సంబంధించిన విషయాదికాలుగల ఈ ద్వితీయభాగాన్ని కూడా ప్రకటించి యావద్భారత పుణ్య, చారిత్రక ప్రదేశాల వివరాల నన్నిటినీ అందజేసి కృతకృత్యులైనారు. ఈ గ్రంథములను రచయిత కేవలం యాత్రామార్గదర్శిగా గాక, యావద్భారత సాంఘిక చరిత్రవలె వివరించారు. అనేక కష్ట నష్టాలకు ఓర్చి సేకరించిన విషయ ప్రాముఖ్యం గల ఉద్గ్రంథం. ఆ సేతుహిమాచలపర్యంతము భారత దేశ సమగ్రమైన స్వరూపాన్ని అవగతం చేసుకోవటానికి ఈ రెండుభాగాలనూ ప్రతి ఒక్కరూ చదివి తీరాలి ప్రతి గ్రంథాలయంలోనూ భద్రపరుప వలసిన ఉపయోగకరమైన గ్రంథం.

గేయ మంజరి

ఖండకావ్యసంపుటి; రచన: శ్రీ కందుకూరి రామభద్రరావు; ప్రాప్తిస్థానం: కందుకూరి పుండరీకాక్షుడు, లెక్చరర్, యస్. కె. బి. ఆర్. కాలేజ్ అమలాపురం. తూర్పు గోదావరిజిల్లా; మూల్యం: రు. 0-12-0.

ఈ సంపుటికి పరిచయ వాక్యాలు రచించిన శ్రీ జిల్లెళ్ల వెంకటభానోజీరావుగారు, ఈ ఖండకావ్యము లలో, జీవితంలో ఎదుర్కొనే వివిధ సంఘర్షణలు, సమస్యలూ వీటి అనుభూతుల వల్ల కలిగిన వేదన యిలాంటి వేవో వున్నట్లు వ్రాశారు. రచయితకు అలాంటి వేవీ వున్నట్లు కనుపించవు. రచయిత హృదయం జగత్తులో నిమిత్తం లేకుండా తనయిష్టం వచ్చిన రంగురంగుల పూలు పూసే అమాయికమైన పూల మొక్కల్లా పసందైన పదాలతో జిలిబిలి పోకడలు పోతారు.

మావికొమ్మల్లార
ఏవి తెచ్చిర చివురుల్?
కట్టండి తోరణాల్
కమ్మతావులు చిమ్మ.

మాలతీ తీగలార!
మల్లితీవల్లార!
పూలమాలలు గ్రుచ్చి
వ్రేలాడగట్టండి.

వేపపూ దేరియలు
తీపి చెరకులు కలిపి
ఆమెతలు పండంగ
లేవలారా రండి!'

ఇదీ ఈ రచయితధోరణి. ఈ సంపుటిలో, కులాసాగా పాఠకుని ఆనందింపటానికి తగిన పాటలు: 'విరియ నిమ్మ' 'తెలుగుతోట' 'ఉగాది', కళాసుందరి, జీవితవల్లి, గంగమ్మ, శరత్తు, తెప్పతిరునాళ్లు, పాట, మల్లెపూవు, మాలతి, కోర్కె, పాపాయి, మొదలైన శీర్షికలలో 15 వరకూ వున్నాయి ముఖ్యపు 'కృష్ణమ్మ' పాట.

'నా చిన్నికృష్ణమ్మ నడిపించు ముచ్చట్లు
లోకమ్ము మరిపించు నాకమ్ము తలపించు

ఎత్తుకొన కృష్ణమ్మ ఎలనగవు నవ్వినా
పడిన ముత్యాలతో ఒడినిండి నిండించు

అలకచాలులలోన ఒలుకునీలాలెల్ల
దరిహోవ చంద్రికల తళతళని మెరపించు.'

విజ్ఞప్తి

ప్రకటింపబడని రచనలను తిరిగి తెప్పించుకోన గోరువారు రచనలతోపాటే తగిన పోస్టేజి స్టాంపులు పంపవలసివుంటుంది. అనంతరం ఎప్పుడో స్టాంపులు పంపి అరచనలకొరకై ఉత్తరములు వ్రాసి ప్రయోజనం వుండదు. రచయితలు గమనింప ప్రార్థన.

సంపా.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.